వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 19 సంచిక : 6 హైదరాబాద్ 236 జూన్ 2021 పేజీలు : 68 రు. 25

- తెలంగాణలో ప్రజా సంఘాల నిషేధం
- ఆంధ్రప్రదేశ్ 2021-22 బడ్జెట్
- కరోనా వాక్సిన్ రాజకీయార్థికాంశాలు
- కరోనా మారణహోమంపై ఎనిమిది వ్యాసాలు
- ముగిసిన మినీ ఎన్నికల ప్రహసనం
- సిల్గేర్ పోలీసు క్యాంపు - ఆదివాసుల వ్యతిరేకత
- అఫ్ఘన్ నుంచి అమెరికా నిష్క్రమణ

వీక్షణం పాఠకులు, అభిమానులు క్షమించాలి

ఈ నెల సంచిక అచ్చులో లేదు!

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక మామూలుగానైతే ప్రతి నెలా 29, 30 తేదీల్లో మరుసటి నెల సంచిక పోస్ట్ చేయాలనేది పోస్టల్ శాఖ పెట్టిన షరతు. పదిహేను సంవత్సరాలుగా అది ఎప్పుడూ మారలేదు. గత సంవత్సరం లాక్ డౌన్ సందర్భంలో రెండు నెలల సంచికలు వెలువరించలేకపోవడం మాత్రమే మినహాయింపు. మళ్లీ ఇప్పుడు కూడ లాక్ డౌన్ వల్ల, నాలుగు గంటల రిలాక్సేషన్ సమయంలో ఆఫీసు, ప్రింటింగ్, పోస్టింగ్ సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం వల్ల జూన్ 2021 సంచిక అచ్చు ప్రతి ఇవ్వలేకపోతున్నాం. ఈ సంచిక సాఫ్ట్ కాపీ ఆన్‌లైన్‌లో, సోషల్ మీడియాలో మాత్రమే జూన్ 1న పెట్టగలుగుతాం. బహుశా ఈ పద్ధతిలో ఇచ్చు ప్రతి చదివే మా పాఠకులందరికీ చేరలేకపోవచ్చు. వారిలో కొందరు అసలు ఈ సోషల్ మీడియాలోనే ఉండకపోవచ్చు. వీక్షణం పాఠకులూ, అభిమానులూ మా ఇబ్బందిని అర్థం చేసుకోవాలని కోరుతున్నాం. పరిస్థితులు చక్కబడితే జూలై 2021 సంచిక యథావిధిగా వెలువడుతుంది.

– **వీక్షణం** కలెక్టివ్

236

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జూన్ 2021
సంపుటి : 19
సంచిక : 06

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన జికెఎస్ రాజా, హైదరాబాద్- రు.5000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

మే నెల సంపాదకీయం 'మూర్ఖత్వానికి పరాకాష్ట' చాలా చక్కగా విశ్లేషించారు. కరోనా మీద విజయం సాధించేశాం అని ప్రధాని మోడీ గొప్పలు చెప్పుకున్న కొద్ది రోజుల్లోనే కరోనా సెకెండ్ వేవ్ ఇండియాను చుట్టిముట్టి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. దీనికంతటికి కారణం మీరన్నట్లు కుంభమేళా, ఎన్నికలు. దీనికంతటికి బాధ్యత వహించవలసినది ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమే. తన అనాలోచిత చర్యలతో, మూర్ఖత్వంతో ఇండియాను సర్వనాశనం చేస్తున్నారు. అలాగే ఎ. నరసింహారెడ్డి గారి వ్యాసం కూడా నరేంద్ర మోడీ నిరంకుశ పరిపాలనను తెలియజేస్తోంది. రాజ్యాంగ వ్యవస్థలైన సి.బి.ఐ, ఇడి, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం ప్రభుత్వ జేబు సంస్థలుగా మారాయనేది అక్షర సత్యం. లక్ష్మణ్ గద్దం గారి వ్యాసం 'ఆపరేషన్ ప్రహార్ ఒక్కటే సమాధానమా'లో నక్సల్స్ సమస్య మీద చక్కని విశ్లేషణ. ప్రభుత్వం నక్సల్స్‌ని పట్టుకోడానికి సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్ హంట్ , ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ ప్రహార్ ఇలా ఎన్ని ఆపరేషన్లు పెట్టినా మైదాన ప్రాంతంలో పేదరికం, ఆకలి సమస్య ఉన్నంతవరకు, అడవిలో ఆదివాసులు ఉన్నంతవరకు నక్సలిజం ఉంటుందనేది అనుభవంలోకి వచ్చిన అంశం. కేవలం 3 వ్యవసాయ చట్టాలను మాత్రమే ఉపసంహరించుకోవాలని కోరుతున్న రైతులతోనే మాట్లాడేది లేదన్న మోడీ ప్రభుత్వం అసలు మావోయిస్టులతో మంతనాలకు సిద్ధమవుతుందనుకోగలమా అని జహంగీర్ గారు చేసిన విశ్లేషణ బావుంది. ఒక కలం వీరునికి ఇన్ని కష్టాలా చదువుతుంటే అసలు ఈ దేశంలో రాజ్యాంగం అనేది ఉందా అని ప్రతి ఒక్కరికి అనుమానం వస్తుంది. జర్నలిస్ట్ కప్పన్‌పై దాడి, పౌర హక్కుల సంఘాలపై దాడి, విరసం సభ్యులపై దాడి, ప్రొఫెసర్ సాయిబాబాను జైల్లో పెట్టడం, ఈ మధ్యనే ఆయనను పోస్ట్ నుండి తొలగించడం ఇవన్నీ చూస్తుంటే రానున్న రోజుల్లో ఇండియా పెద్ద ప్రమాదంలో పడబోతోందని అర్థమవుతోంది. వీక్షణంలో అన్ని సమస్యల మీద వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు, మాకు తెలియని విషయాలు తెలియజేస్తున్నందుకు పత్రికా యాజమాన్యానికి, రచయితలకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

- మద్రి సూర్యనారాయణ
నరసింహనగర్
విశాఖపట్నం

వీక్షణం ఏప్రిల్ సంచికలో వచ్చిన వ్యాసాలు బాగున్నాయి. కరోనా కాలంలో తెలంగాణలోని హాస్పిటల్స్‌లో సరైన పడకలు లేకుండా, సరైన వైద్య సదుపాయాలు లేకుండా ఉన్న ఇలాంటి సమయంలో టిఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి ప్రాజెక్ట్ కొరకు కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం చూస్తుంటే కరోనా రోగుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థం అవుతుంది. అలాగే 'వెట్టి బతుకులకు వెలుగు దొరికేనా' వ్యాసంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వలస కార్మికులను తెలంగాణకు చెందిన వివిధ ప్రాంతాల ఏజెంట్లు తీసుకువచ్చి, వారితో వెట్టి చాకిరి చేయించి వారి శ్రమను ఎలా దోపిడీ చేస్తున్నారో చక్కగా వివరించారు. వారి శ్రమను దోపిడీ చేయడమే కాదు, వారు చెప్పినట్లు వినకుంటే చిత్రహింసలకు గురిచేయడం, మహిళలను మానసికంగా, లైంగికంగా వేధించడం, అత్యాచారాలు చేసినా ఎవరు పట్టించుకోకపోవడం చూస్తుంటే అక్కడి అధికారులు బాధితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉండి, అక్కడి ఏజెంట్లను శిక్షించడంలో ఎలా విఫలమవుతున్నారో ఈ వ్యాసంలో చక్కగా వివరించారు. అలాగే ఎపిలో జరిగిన మునిసిపల్ ఎన్నికల విషయంలో అక్కడ అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి, ప్రతిపక్ష టిడిపి పార్టీ తమ గెలుపే లక్ష్యంగా ఎలాంటి ఎన్నికల నిబంధనలు పాటించకుండా డబ్బు, మద్యం, దుస్తులు లాంటి ప్రలోభాలకు ప్రజలను ఎలా గురిచేశాయో, ఎన్నికల విషయంలో రాజ్యాంగం కల్పించిన ఎలాంటి అంశాలను పాటించకుండా రాజకీయ దుర్వినియోగం చేశాయో బర్నబాస్ గారు తన వ్యాసంలో చక్కగా వివరించారు. అలాగే మే సంచికలో వచ్చిన అన్ని వ్యాసాలు బాగున్నాయి. ప్రస్తుతం కరోనా అధికంగా ఉన్న ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఓట్ల రాజకీయాల కోసం ఎలాంటి నిబంధనలు పాటించకుండా తమ ఎన్నికల ప్రచారాల కోసం సభలు, ర్యాలీలు నిర్వహించి కరోనా ఇంకా వ్యాపించడానికి కారణమయ్యాయి. తమ ఎన్నికలు ముగియగానే కరోనా తీవ్రంగా వ్యాపించిందనే సాకుతో లాక్‌డౌన్ ప్రకటించి సామాన్య జనం పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో ఇటీవలి పరిణామాలు చూస్తుంటే అర్థమవుతుంది. ఇలాంటి రాజకీయ నాయకుల తప్పుడు విధానాల పట్ల వీక్షణంలో ఇంకా మెరుగైన వ్యాసాలు రావాలి. అలాగే మేడే (కార్మిక దినోత్సవం) సందర్భంగా మే సంచికలో ఒక్క వ్యాసం కూడా రాలేదు. వచ్చే సంచికలోనైనా మేడే గురించి ఒకటి, రెండు వ్యాసాలు వచ్చేలా చూస్తారని ఆశిస్తున్నాను.

- కృష్ణహరి
మహబూబ్‌నగర్

మే వీక్షణం సంచికలో ప్రచురించిన వ్యాసాలు ఇప్పుడు జరుగుతున్న సామాజిక పరిణామాల మీద లోతైన విశ్లేషణలతో ఉన్నాయి. దేశంలో ఎక్కడైనా ప్రభుత్వాలు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ఏ ఒక్కరు ప్రశ్నించినా వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేయడం, అణచివేయడం, కేసులు పెట్టడం, అసలు ప్రశ్నించడమే నేరమనే విధంగా భయభ్రాంతులకు గురిచేయడం చూస్తుంటే రాబోయే కాలంలో అసలు ప్రశ్నించాలనే ఆలోచన వచ్చినా శిక్షించే రోజులు రాబోతున్నాయనేది అర్థం అవుతున్నది. కార్మిక దినోత్సవం సందర్భంగా వీక్షణం మే సంచికలో ఎందువల్లనో ఒక్క వ్యాసం కూడా ప్రచురించలేదు. కాని రావాల్సిన అవసరం ఉన్నది. అలాగే వైద్యులు,

(మిగతా 32వ పేజీలో...)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

ఈ అసాధారణ మరణాలన్నీ వ్యవస్థ చేసిన హత్యలే

కరోనా రెండో అల పేరుతో రెండు నెలలుగా సాగుతున్న అసంఖ్యాక అసాధారణ అసహజ మరణాలన్నీ ఆసుపత్రుల లెక్కల్లో కోవిడ్ మరణాలుగా నమోదవుతున్నాయో, గుండె ఆగిపోయిన మరణాలుగా నమోదవుతున్నాయో, అసలు నమోదు కాకుండానే పోతున్నాయో గాని వాస్తవానికి అవన్నీ వ్యవస్థ చేస్తున్న హత్యలే. ఇక్కడ వ్యవస్థ అన్నప్పుడు అది ఒక అనిర్దిష్ట, అస్పష్ట భావన కాదు. అందులో పాలక ప్రభుత్వం, అధికారంలో ఉన్న పాలకవర్గ ముఠా ఈ మహా విపత్తు పట్ల చూపుతున్న నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం ఉన్నాయి. ప్రతిపక్షాలుగా నటిస్తున్న ఇతర పాలకవర్గ ముఠాల అలసత్వం ఉంది. ఏడాదిన్నరగా సమస్య మూలాలను అర్థం చేసుకోలేని, చికిత్సా విధానాలను రూపొందించలేని విజ్ఞానశాస్త్ర పరిశోధనల వైఫల్యం ఉంది. ఆ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలపై గుత్తాధిపత్యం వహిస్తున్న బహుళ జాతి సంస్థల, కార్పొరేట్ల హంతక లాభాపేక్ష ఉంది. విస్తారమైన ప్రజల సమస్యను అవకాశంగా తీసుకుని తమ బొక్కసాలు నింపుకోవాలనుకుంటున్న వైద్య, ఆరోగ్య వ్యాపారస్తుల స్వార్థం ఉంది. సమస్యను వాస్తవికంగా ప్రతిఫలించి పరిష్కార అన్వేషణలో భాగం కావలిసిన ప్రచార సాధనాలు తమ బాధ్యత మరిచిపోయి సంచలనాత్మకతలో, లాభాల వేటలో కూరుకుపోయిన దుస్థితి ఉంది. ఇంత పెద్ద ప్రజా సమస్యను పట్టించుకుని పరిష్కారాల కోసం అన్వేషించలేని, సంఘటిత పోరాటాలు చేపట్టలేని నిజమైన ప్రజాశక్తుల బలహీనత ఉంది. దిక్కుతోచనివ్వని మృత్యు జడివానలో, సమాజాన్ని శవాల కుప్పగా మారుస్తున్న ఉధృతమైన వరదలో చిక్కి ఏ గడ్డిపోచ దొరికినా ఆశపడుతున్న ప్రజల నిస్సహాయత ఉంది. ఇవన్నీ ఇవాళ ఉన్న వ్యవస్థ అవ్యవస్థకు చిహ్నాలు.

ఈ అవ్యవస్థలో ఇవన్నీ భాగాలే, అన్నీ ప్రశ్నించవలసినవే, మార్చవలసినవే. వీటిలో ప్రధానమైనవేవో, అప్రధానమైనవేవో గుర్తించలేని మధ్యతరగతి సాధారణంగా తమకు కనబడిన, తమకు దగ్గరివైన, ప్రశ్నిస్తే ప్రమాదం లేని ఏదో ఒక కోణాన్ని ఎంచుకుని దాని మీద ప్రశ్నలు ఎక్కుపెడుతుంటుంది. ఇవాళ కూడా అటువంటి పాక్షిక ప్రశ్నలూ వివాదాలూ యుద్ధాలూ చెలరేగుతూనే ఉన్నాయి. ఈ అవ్యవస్థకు మౌలికాంశాలేవో గుర్తించి వాటి మీద ఎక్కువ పెట్టేవరకూ, వాటి గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేవరకూ ఈ అవ్యవస్థ పెరుగుతూనే ఉంటుంది గాని మారదు. ప్రస్తుత మహావిపత్తు విజృంభణకు, అసంఖ్యాక మరణాలకు, లక్షలాది కుటుంబాల వేదనకు, వందల కోట్ల రూపాయల కార్పొరేట్ ఆస్పత్రుల అక్రమ వ్యాపార సంపాదనకు, ఫలితం ఉంటుందో లేదో తెలియకపోయినా ప్రజలు దిక్కులేక ఆశ్రయించవలసి వస్తున్న నాటు వైద్యాలకు, వాక్సిన్ పేరిట వేల కోట్ల రూపాయల వ్యాపారానికి, అటువంటి లెక్కలేనన్ని గందరగోళపు పరిస్థితులకు అత్యంత ప్రధానమైన మూలకారణం కొనసాగుతున్న రాజకీయార్థిక వ్యవస్థ, దాన్ని నడుపుతున్న రాజకీయ ఆధిపత్యం. ఈ రాజకీయార్థిక వ్యవస్థకు మనిషి కన్నా లాభమే ప్రధానం గనుకనే శాస్త్ర విజ్ఞాన పరిశోధనలూ అన్వేషణలూ ఇలా ఉన్నాయి. ఈ రాజకీయార్థిక వ్యవస్థలో మనిషి కన్నా సంపదే ముఖ్యం గనుక వైద్యారోగ్యాలు సంపన్నుల కొనుగోలు సరుకులుగా ఉన్నాయి. ఈ రాజకీయార్థిక వ్యవస్థలో, ప్రత్యేకించి హిందూ బ్రాహ్మణీయ ఆధిపత్యంలో కర్మ సిద్ధాంతమే, పూర్వజన్మ సుకృతమే ప్రధానం గనుక మనిషి ప్రాణాలకు విలువలేదు, ప్రాణాలనూ ఆరోగ్యాన్ని రక్షించాలనే శ్రద్ధ లేదు. ఇవాళ్టి అసాధారణ సందర్భంలో మాత్రమే కాదు, అత్యంత సాధారణ సందర్భాలలో కూడా రాజకీయార్థిక అర్థంలో ఇది అమానుష వ్యవస్థ, మానవ వ్యతిరేక వ్యవస్థ, మారవలసిన వ్యవస్థ, మార్చవలసిన వ్యవస్థ. కరోనా మహావిపత్తు ఆ అవసరాన్ని మరింతగా నొక్కి చెపుతున్నది.

రాజకీయార్థిక వ్యవస్థ ఎంతగా దోపిడీ పీడనల మీద ఆధారపడి ఉన్నప్పటికీ, వ్యవస్థను నిర్వహించే రాజకీయ, సామాజిక శక్తులు కనీస మానవత్వాన్ని, స్పందనను, తోటి మనిషి పట్ల సానుభూతిని చూపడానికి ప్రయత్నిస్తే ఇంత అవ్యవస్థ ఉండదు. కాని ఇవాళ రాజకీయాధికారంలో ఉన్న శక్తులు అమానవీయ, క్రూర శక్తులు, బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం రంగరించుకున్న సంఘ పరివారానికి చెందిన వ్యక్తులూ శక్తులూ. వారికి అసమానతా దోపిడీ పీడనా సహజమైన అంశాలు. మానవ అస్తిత్వ వేదన వారిని ఎంతమాత్రం కదిలించదు. సానుభూతి, దయ, జాలి వంటి మానవ సహజమైన స్పందనలను రద్దుచేసి, మత, దైవిక, మానవాతీత శక్తుల మీద విశ్వాసం పెంచడమే వారి శిక్షణ. వారికి మనిషి అంటే ఇతర మతస్తులను చంపడానికీ వేధించడానికీ ఉపయోగపడే సాధనమూ ఆయుధమూ మాత్రమే. ఆ భావజాలం తలకెక్కినవారిని మనుషుల దుఃఖం, అనారోగ్యం, మృత్యువు బాధించవు, స్పందింపజేయవు. ఆ విష విద్వేష భావజాలాన్ని నిలువెల్లా నింపుకున్న మనిషి ఇవాళ భారత ప్రధాని. ఏలికగా తనమీద కరోనా విజృంభణను అరికట్టవలసిన బాధ్యత ఉన్నదనే స్పృహకన్నా తన భావజాలాన్ని ఎన్నికల్లో గెలిపించడమెట్లా, మరొక రాష్ట్రంలో అధికారం సంపాదించడం ఎట్లా, మూఢవిశ్వాసాల మహా కుంభమేళాలను మరింత పెద్ద ఎత్తున నిర్వహించి ప్రజల మెదళ్లలో మరింత అజ్ఞానం కూరడం ఎట్లా, ప్రత్యర్థులను అణచివేయడానికి ఇంకా ఏయే కుట్రలు చేయాలి అనేవే ప్రధానంగా ఉంటాయి.

భారత సామాజిక స్థితి కూడ ఈ రాజకీయార్థిక వ్యవస్థ లక్ష్యాలకు, ఈ రాజకీయ ఆధిపత్య భావజాలపు లక్ష్యాలకు సరిగ్గా సరిపోయేలా ఉంది. మన సమాజంలో శాస్త్రం, హేతుబుద్ధి, ప్రయోగం, పరీక్ష, అన్వేషణలకు స్థానం తక్కువ. మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు, వదంతులు, ఉద్దేశపూర్వక అబద్ధ ప్రచారాలు సాగే సామాజిక వ్యవస్థ మనది. పాలకులకు కావలసింది ఇదే. బహుళజాతి సంస్థల లాభాపేక్షకు బందీ అయిపోయిన శాస్త్ర విజ్ఞానానికీ కావలసింది శాస్త్ర విజ్ఞానాన్ని మాయగా మార్చడమే. ఈ సామాజిక రాజకీయార్థిక స్థితి ఇవాళ దేశంలో విలయతాండవం చేస్తున్నది, లక్షలాది ప్రాణాల్ని బలిగొంటున్నది, కోట్లాది కుటుంబాల్ని అతలాకుతలం చేస్తున్నది. ఈ విలయంలో మృతులందరూ, బాధితులందరూ, దుష్పరిణామాలన్నీ ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ వేనోళ్ల ప్రకటిస్తున్న ఆకాంక్ష ఒకటే. ఈ వ్యవస్థ ఇంకెంత మాత్రం మానవ జీవిత యోగ్యమైనది కాదు. ఈ వ్యవస్థను మార్చక తప్పదు. ఆ మార్పు స్వరూప స్వభావాలు, అది జరిగే పద్ధతులు ఏమిటనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. కాని కొనసాగుతున్న వ్యవస్థకు కాలం చెల్లిపోయిందనీ, దీన్ని చరిత్ర చెత్తబుట్టలోకి విసిరేయక తప్పదనీ వర్తమానం సూచిస్తున్నది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

పీనుగల మీద ప్యాలాలు ఏర్క బుక్కుడంటే గిదే...

శెవ్వా, గంత అన్నాలం ఉంటదా, ఏడ్సన్న మనిషన్నోడు పీనుగ మీది ప్యాలాలు ఏర్క బుక్కుతడా అని ఎవలకన్న అనుమానం ఉంటే ఇయాళ తెలంగాణ దిక్కు జూడాలె. దేశం మొత్తం గట్లనే పాడయిందనుకో గని మనింటి ముచ్చట మనం జెప్పుకోవాలె గద. ఒగదిక్కు మన్సులు పిట్టల తీర్గ రాలిపోతాంఁడ్రు. ఏ ఊరికి బో, చావులు లేని ఊరు లేదు. ఎవరిని మందలిచ్చినా సావు ముచ్చటే జెప్తాంఁడ్రు. చుట్టాల్ల, పక్కాల్ల, దోస్తుల్ల, తెల్సినోల్లల్ల, నౌకరి జేసేకాడ, వాడకట్టుల ఒకరో ఇద్దరో సచ్చిపోయిండ్రని చెప్పని మనిషి లేడు. ఇంకొగదిక్కు గింత అగ్గులం అయితాందని సోయే లేకుంట సర్కారున్నది, సర్కారు పెద్దలున్నరు, దందాలు జేసెటోల్లున్నారు. కారోబార్ మునుపటి లెక్కనే నడుస్తాంది. పోలీసుల రాజ్జెం మునుపటి కన్న ఎక్కువ నడుస్తాంది. ఆఖిరికి నీ అసొంటి నా అసొంటోడు గుడ లోకం అంత సున్ సాన్ ఉన్నట్టుగ సారా దుకాన్ల ముందర క్యూలల్ల నిలబడతాండు, సీసల మీద సీసలు ఎక్కిస్తాండు. ముసలోల్లు జెప్పినట్టు కలియుగం అంతానికొచ్చిందా ఏంది? గింత అన్నాలం ఉంటదా ఏడ్సన్న? ఊరా అడివా? మన్సులమా ఆలోశెన లేని పసురాలమా?ఇంట్ల పీనుగ, వాడకట్టుల పీనుగ, ఊరంత పీనుగలు, బొందలగడ్డ కాడ చాంతాడంత క్యూ. కనబడ్త లేదా తండ్రీ. గింత గోరం జరుగుతాంటే సర్కారు ఎన్ని పనులు జెయ్యాలె? సర్కారు దవాఖాన్లల్ల సౌలతులు బెంచాలె. అప్పటికప్పుడు కొత్త దవాఖాన్లు తెరువాలె. ఎంతమంది రోగులు వచ్చినా సరిపోయేటట్టు జూడాలె. అంతమందికి సరిపోయేటంత మంది డాక్టర్లను, నర్సులను, ఆయాలను, తోటీలను కొలువులకు దీసుకోవాలె. ప్రైవేటు దవాఖాన్లల్ల సరిగ్గా వైద్యం జేస్తాంఁడ్రా లేదా జూడాలె. వాండ్లు ఎంత ఫీజులు గుంజుతాంఁడ్రో నిగరాని ఎయ్యాలె. ఎవడన్న ఎక్కువ గుంజుతాండంటే వాణ్ని సక్తు జెయ్యాలె. సందుల సందని సూది మందుకు, మాత్రలకు రూపాయికి పది రూపాయలు జెప్తాంఁడ్రట, గా దోపిడీని అరికట్టాలె. మన్సులు బజాట్ల తిరిగితెనే కరోనా పెరుగుతాంది గనుక చల్, ఎవ్వడు దిరుగొద్దు అనుడు మంచిదే గాని, గట్ల మొత్తం బందు బెడితే కూలీనాలీ పేద జనం ఎట్ల బతుకాలె? ఏ రోజు పొట్టకు ఆ రోజు కమాయించేటోండ్ల గతి ఏం గావాలె? సర్కారు అన్నోడు గివన్ని జర్రంత సోంచాయించాల్నా వద్దా? బంద్ అనంగానె సరిపోదు, బందు రోజుల్ల కూలి నాలి అంబాద జనానికి తిండిబెట్టే సంగతి జూడాలె. కాని మన అవ్వల్ దర్జా దొరవారి రాజ్జెంల గివన్ని ఆలోశించుడంటే, ఎహే తియ్యి అనిపిస్తాందట గద. దావఖానలు బాగున్నయా లేదా చూసుడు కన్న మాట ఇననోన్ని ఎట్లా పీకెయ్యాలె అని ఇక్మతులు జేసుడు ఎక్కువైందట గద. ఒగదిక్కు మన్సులు పిడాత జస్తాంటే, ఆ మన్సుల కోసం మాట్లాడేటోల్ల నోరు ఎట్లా ముయ్యాలె అని ఉపాయాలు మొదలుబెట్టిండ్రట గద. మొత్తం బందే గని, నాలుగు గంటల ఇరాముల సారా ఎంత ఎక్కువ అమ్మాలె, ఎంత ఎక్కువ ఆందాని సంపాయించాలె అని లెక్కలు దీస్తాంఁడ్రట గదా. అబ్బా ఏమి రాజ్జెమొచ్చింది నాయనా, మా శిన్నప్పుడు పీనుగ బోతాంటే జల్లిన ప్యాలాలు, పైసలు బాటల కనబడ్డా గని ఎవడు ముట్టకపోతుండే. లోకం శానా ముందటికొచ్చినట్టున్నది. రాజ్జెమేలేటోని నుంచి నీ అసోంటి నా అసోంటోని దాకా పీనుగల మీద ప్యాలాలు ఏరుకొని బుక్కుడే మోపు జేసిండ్రు. ఎట్ల బోతదో ఈ గోస. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

మహా విపత్తు సమయంలో ప్రభుత్వ బాధ్యత

కరోనా మహా విపత్తును ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వమూ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలూ అనుసరిస్తున్న నిర్లక్ష్య, బాధ్యతా రహిత పద్ధతినే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుసరిస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత విభక్త ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాలలో కూడా మంచి ప్రభుత్వాసుపత్రులు లేకపోవడం, జిల్లా కేంద్రాల ఆస్పత్రుల పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడం, గ్రామీణ ప్రాంతాలలోనైతే అసలు వైద్య ఆరోగ్య సౌకర్యాలు లేకపోవడం అనే దుస్థితి కొనసాగుతున్నది. కరోనా మొదటి అల గడిచిపోయిన తర్వాత దాదాపు ఏడాది సమయం దొరికినప్పటికీ రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమమూ తీసుకోలేదు. తనను ఎన్నుకుని అధికారం ఇచ్చిన ప్రజల సంక్షేమం, కనీస ప్రాథమిక విద్యా, వైద్య ఆరోగ్య సౌకర్యాలు కల్పించడం తన బాధ్యత అని గుర్తించకపోవడంలో వై ఎస్ ఆర్ సి పి అన్ని పాలకపార్టీల లాగానే ప్రవర్తించింది. రాజకీయ ఎత్తుగడలకు, ప్రత్యర్థుల స్వరం వినిపించకుండా చేయడానికి, ఆశ్రితులకు దోచిపెట్టడానికి వెచ్చించిన సమయంలో కొంత భాగమైనా ప్రజల అవసరాల గురించి ఆలోచించడానికి వెచ్చించలేదు. ఒక్క ఈ ప్రభుత్వమనే కాదు, అన్ని ప్రభుత్వాలూ ప్రజారోగ్య వ్యవస్థ గురించి చేయవలసిన పనులు చేయకపోవడానికి, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు చెప్పిన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో వ్యాపింపజేయక పోవడానికి పర్యవసానమే నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఆనందయ్య పసరు మందు వివాదం. ఆధునిక ఆలోపతి వైద్యం కార్పొరేటీకరణ చెంది, ఆరోగ్య సేవలు లాభాపేక్షకు బలి అయి ఖరీదైపోయిన నేపథ్యంలో ఇటువంటి చిట్కా వైద్యాలను, ప్రత్యామ్నాయ చౌక వైద్య విధానాలను ప్రజలు ఆదరించక తప్పడం లేదు. అలా ప్రజల ఆరోగ్య అవసరాలను తీరుస్తున్న ఈ ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం శాస్త్రీయ పరీక్షలకు గురిచేసి వాటి నిజానిజాలను నిగ్గు తేల్చడం ఒక పద్ధతి. కాని ఆ మార్గాలను కూడా రాజకీయం చేసి, ఉప రాష్ట్రపతి నుంచి స్థానిక రాజకీయ నాయకుల దాకా అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి, అసలు విషయాన్ని పక్కదారి పట్టించారు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని ప్రశ్నించవలసిన ప్రతిపక్షాలు, ప్రచార సాధనాలు, పౌరసమాజం కూడా ఈ మాయాజాలంలో పడిపోయి ఆనందయ్య అనుకూల, వ్యతిరేక శిబిరాలుగా చీలిపోయారు. ప్రజలు విపరీతంగా కరోనా బారిన పడుతుంటే, తగినన్ని పరీక్షలు చేయకుండా, ఆస్పత్రుల సౌకర్యాలు పెంచకుండా, లెక్కలేకుండా మరణాలు సంభవిస్తున్నా తప్పుడులెక్కలతో మసిపూసి మారేడుకాయ చేస్తున్న ప్రభుత్వాలను నిలదీయవలసిన, బాధ్యత గుర్తుచేయవలసిన వారందరూ అనవసరమైన వివాదంలో మునిగిపోయారు. ఇలా అసలు సమస్య నుంచి పక్కదారి పట్టించే చర్యలు ఆంధ్రప్రదేశ్ లో నగ్నంగా బైటపడ్డాయి గాని కేంద్రప్రభుత్వ స్థాయిలోనూ అన్ని రాష్ట్రప్రభుత్వాల స్థాయిలోనూ జరిగిన, జరుగుతున్న తతంగం అదే. ఇప్పటికైనా ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రశ్నించే దిశగా ప్రజా చైతన్యం పదునెక్కవలసి ఉంది. వీ

గాజాలో ఇజ్రాయిల్ ఆటవిక దాడులు

- నర్సింహారెడ్డి

పాలస్తీనా అంటే నిత్య యుద్ధం. బాంబుల మోత, ముగింపులేని నిత్య హింస. 1948లో లక్షలాది మందిని బలవంతంగా బయటకు నెట్టి పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు తన సంకుచిత స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పాలస్తీనాపై దాడులకు పాల్పడుతున్నాడు. 1948 యుద్ధంలో పశ్చిమ జెరూసలేంను, 1967 యుద్ధంలో తూర్పు జెరూసలేంను ఇజ్రాయిల్ ఆక్రమించింది. జెరూసలేంపై పూర్తి సార్వభౌమత్వాన్ని ప్రకటించుకుంది. ప్రతి సంవత్సరం మే 10న యూదులు జెరూసలేం దినంగా ఉత్సవం జరుపుకుంటారు. ఆ రోజున జరిగే ప్రదర్శన అల్ అక్స్ మసీదు గుండా సాగుతుంది. ఆ మసీదులో పాలస్తీనా మిలిటెంట్లు ఆయుధాలతో ఉన్నారన్న అనుమానంతో యూదులు దానిపై దాడి చేశారు. మే 12 రాత్రి టెల్ అవివ్ శివారు ప్రాంతమైన బాట్‌యమ్‌లో కారులో ప్రయాణిస్తున్న పాలస్తీనాకు చెందిన వ్యక్తిని యూదు మితవాదులు కొట్టారు. అదే రోజు ఇజ్రాయిల్‌కు చెందిన అరబ్ జాతీయుడు ప్రయాణిస్తున్న కారుపై హమాస్ మిలిటెంట్లు రాకెట్ దాడి చేయగా తండ్రి, కూతురు మరణించారు. ఈ కారుపై దాడి ఉద్రిక్తతలకు తక్షణ కారణంగా కనిపిస్తున్నా, ఇజ్రాయిల్–పాలస్తీనా మధ్య జరుగుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. జెరూసలేం పాత నగరంలోని పాలస్తీనియన్లు ద్వితీయ శ్రేణి పౌరులుగా బతుకుతున్నారు. అక్కడ నివాసముంటున్న ఇజ్రాయిలీలు అన్ని పౌరహక్కులు అనుభవిస్తుండగా పాలస్తీనియన్లు మాత్రం చాలా దయనీయ స్థితిలో బతుకుతున్నారు. జెరూసలేం పాలస్తీనియన్లకు పవిత్ర స్థలం. రక్త పిపాసి నెతన్యాహు గాజాలో నెత్తుటేరులు పారిస్తున్నాడు. బాంబులతో నిప్పుల వాన కురిపిస్తున్నాడు. ఇటీవలనే షేక్ జారా ప్రాంతంలోని వ్యాపార సముదాయమైన 12 అంతస్తుల అల్ జవారా టవర్ నుంచి అరబ్బులను తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. మరోవైపు తూర్పు జెరూసలేంలోని అల్ అక్సా మసీదుపై ఇజ్రాయిల్ సేనలు చేసిన దాడులకు ప్రతికారంగా హమాస్ రాకెట్ దాడులు చేసింది. ఇజ్రాయిల్ హమాస్ మిలిటెంట్లు లక్ష్యంగా వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో 200కు పైగా పౌరులు, 50 వరకు చిన్నారులు మరణించారు. 1200 మంది గాయపడ్డారు. పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమిస్తూ తమ మనుగడకే ముప్పు కలిగిస్తున్నదనే భావన అరబ్బులలో గూడుకట్టుకొని ఉంది. ఈ అసంతృప్తులు, ఆక్రమణల నేపథ్యమే తాజా యుద్ధ వాతావరణం. మరోవైపు ఇటీవల జరిగిన ఎన్నికల్లో నెతన్యాహు లికుడ్ పార్టీకి మెజారిటీ స్థానాలు రాలేదు. ఆయనపై గల అవినీతి ఆరోపణలపై ఒకవైపు ప్రజా ఆందోళన, మరోవైపు న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. ఈ యుద్ధం ద్వారా యూదుల మెప్పు పొంది ప్రజల దృష్టి మరల్చడం అనే లక్ష్యం ఇమిడి ఉంది. 1967కి ముందున్న సరిహద్దులలో తూర్పు జెరూసలేం రాజధానిగా పాలస్తీనా ఏర్పాటు చేయాలన్నది ఐ.రా.స తీర్మానం. ఐరాస తీర్మానాలను నెతన్యాహు ఖాతరు చేయడం లేదు. అమెరికా అధ్యక్షుడు శాంతి వచనాలతో కాలం వెళ్లబుచ్చుతున్నాడు. అంతర్జాతీయ సంస్థలు ఇజ్రాయిల్‌ను అదుపు చేయనంతవరకు పరిస్థితిలో మార్పు రాదు. ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న క్రూరమైన దాడులను ప్రపంచ దేశాలు ఖండించాలి.

వీ



చిత్రకారుడు చంద్ర మృతి

దిన, వార, మాస పత్రికల్లో చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా పనిచేసిన చంద్ర(75) మృతిచెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు కరోనా సోకడంతో సికింద్రాబాద్‌లోని ఆర్.కె మదర్ థెరిస్సా రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతూ ఏప్రిల్ 29 మరణించారు. చంద్రగా గుర్తింపు పొందిన ఆయన అసలు పేరు మైదం చంద్రశేఖర్. వరంగల్ జిల్లాలో 1946, ఆగస్టు 28న జన్మించారు. సర్వశ్రీ శేషగిరిరావు, బాపు, సత్యమూర్తి స్ఫూర్తితో చిత్రలేఖనం ఎంచుకున్నారు. బాపు తర్వాత విరివిగా ఆ స్థాయిలో వార, మాస పత్రికలకు బొమ్మలు గీసిన ఖ్యాతి గడించారు. మాభూమి చిత్రంతోపాటు పలు చిత్రాల్లోనూ నటించారు. ప్రముఖ రచయితల పుస్తకాలకు ముఖ చిత్రాలను తనదైన ప్రత్యేక శైలిలో వేశారు. చిత్రకారుడే కాదు, చంద్ర మంచి కథకుడు కూడా. ఆయన చేపట్టిన అన్ని ప్రక్రియల్లోనూ అభ్యుదయ భావాలు కనిపించేవి.

సోలి సొరాబ్జీ మృతి

ప్రఖ్యాత న్యాయకోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ సోలీ జహంగీర్ సొరాబ్జీ (91) మృతి చెందారు. కొవిడ్ బారిన పడిన ఆయన ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఏప్రిల్ 30న మరణించారు. భావప్రకటనా స్వేచ్ఛ వాక్ స్వాతంత్ర్యం, మానవ హక్కులకు సంబంధించిన ఎన్నో కేసుల్లో ఆయన గట్టి వాదనలు వినిపించి హక్కుల న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. 1989-90, 1998-2004 మధ్య అటార్నీ జనరల్ గానూ పనిచేశారు. 1971లో బాంబే హైకోర్టు ఆయన్ను సీనియర్ న్యాయవాదిగా గుర్తించింది. కేశవానంద భారతి, ఎస్.ఆర్. బొమ్మై తదితర కేసుల్లో ఆయన చారిత్రాత్మక వాదనలు వినిపించారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి వాదనలు వినిపించడమే కాకుండా, ఎన్నో ప్రచురణలపై నిషేధాన్ని ఎత్తివేయించారు. ఈ క్రమంలో 'లా ఆఫ్ ప్రెస్ సెన్సార్‌షిప్ ఇన్ ఇండియా', 'ది ఎమర్జెన్సీ, సెన్సార్‌షిప్ అండ్ ది ప్రెస్ ఇన్ ఇండియా' తదితర పుస్తకాలను రచించారు.

ప్రొ. బాలస్వామి మృతి

ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో అధ్యాపకుడిగా పనిచేసిన ప్రొ. బి. బాలస్వామి(47) కరోనాతో మృతి చెందారు. గత 20 రోజులుగా కరోనాతో పోరాడుతున్న ఆయన కాచిగూడలోని ప్రైవేటు హాస్పత్రిలో చికిత్స పొందుతూ మే 7న మృతిచెందారు. గుంటూరు జిల్లాకు చెందిన బాలస్వామి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పిజి చేసి డాక్టరేట్ సాధించారు. తొలుత అసోంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2004లో ఉస్మానియా జర్నలిజం విభాగంలో అధ్యాపకుడిగా చేరారు. విభాగం అధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పనిచేశారు. ఎంతో మంది విద్యార్థులకు పిహెచ్‌డి పూర్తిచేయడంలో సహాయ సహకారాలు అందించేవారు.

యలవర్తి రాజేంద్రప్రసాద్ మృతి

సాహితి సాంస్కృతిక సంస్థ శంకరం వేదిక నిర్వాహకుడు యలవర్తి రాజేంద్రప్రసాద్ (66) ఇకలేరు. కొంత కాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ హాస్పత్రిలో చికిత్సపొందుతూ మే 13న మరణించారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా అప్పికట్ల. ఆయన హైదరాబాద్ మాసబ్ట్యాంక్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో రష్యన్ ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేశారు. విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులై పిడిఎస్‌యులో తొలితరం విద్యార్థి నాయకునిగా పనిచేశారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు. ఈ రంగం పట్ల మమకారంతో 15 ఏళ్ల క్రితం శంకరం వేదికను నెలకొల్పి పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందించారు.

శెట్టి కొమ్మాలు మృతి

నిజాం నిరంకుశ పాలన, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడిన శెట్టి కొమ్మాలు (105) మే 15న అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన 1916లో మహబూబ్‌నగర్ జిల్లా దోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీసలో జన్మించారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో నడిచిన సాయుధ పోరాటంలో తుమ్మ శేషయ్య నాయకత్వంలో పనిచేశారు. ఆంధ్ర మహాసభ బలోపేతానికి కృషి చేశారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను వివిధ కళారూపాల ద్వారా చైతన్యపరిచారు.

కెకె రంగనాథాచార్యులు మృతి

ప్రఖ్యాత సాహితీవేత్త, మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడు ఆచార్య కొవెల్ కందాళై రంగనాథాచార్యులు (80) ఇకలేరు. కొవిడ్ బారిన పడిన ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మే 15న కన్నుమూశారు. 1941 జూన్ 14న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జన్మించారు. హైదరాబాద్‌లోని సీతారాం బాగ్ సంస్కృత కళాశాలలో బిఓఎల్ కోర్స్ అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, తమిళ, ఆంగ్ల భాషల్లో అపార జ్ఞానాన్ని సంపాదించారు. నాంపల్లి హైస్కూల్, మదర్సా ఏ ఆలియా పాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూనే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తెలుగు, సంస్కృతం, భాషా శాస్త్రాలలో ఎంఏలు చేశారు. 'ప్రాచీన తెలుగు శాసన భాష' మీద పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందారు. బొగ్గులకుంటలోని ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల అధ్యాపకునిగా, ప్రధానాచార్యుడిగా 1967 నుంచి 1987 వరకు సేవలందించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యుడిగా, విభాగాధిపతిగా ప్రాధాన్యత పొందారు. అదే వర్సిటీలో హ్యూమానిటీస్ డీన్‌గా 2003లో పదవీ విరమణ చేశారు. ఆయన విద్యార్థి దశ నుంచి విప్లవ రాజకీయాలతో మమేకమయ్యారు. ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వేదికగా ఆధునిక సాహిత్య ప్రక్రియలపై సాహితీ ప్రముఖులతో ప్రసంగాలు చేయించారు. ఆయన రచించిన, సంపాదకత్వం వహించిన పుస్తకాల్లో తెలుగు సాహిత్యం - చారిత్రక భూమిక, 'ఆధునిక కవిత్వం భిన్న ధోరణులు', 'తెలుగు సాహిత్యం మరోచూపు', 'తెలుగులో తొలి సమాజ కవులు' తదితర పుస్తకాలను వెలువరించి, సంపాదకత్వం వహించి, అనువాదం చేశారు.

ప్రజా సంఘాల నిషేధ లక్ష్యం శ్మశాన శాంతి స్థాపన

పదహారు ప్రజా సంఘాలను చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అప్రజాస్వామికతనూ రాజ్యాంగ వ్యతిరేకతనూ విశ్లేషిస్తున్నారు ఎన్. వేణుగోపాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేస్తున్న పదహారు ప్రజాసంఘాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఏప్రిల్ 24 పత్రికల్లో వార్తలు వెలువడ్డాయి. ఆ వార్తలకు మూలం అప్పటికి 24 రోజుల కింద విడుదలైనప్పటికీ, ఆ ముందు రోజే పత్రికలకు అందిన ప్రభుత్వ ఉత్తర్వులు. మార్చ్ 30 తేదీతో సాధారణ పరిపాలనా శాఖ విడుదల చేసిన జి. ఓ. నం. 73 అనే ఆ ఉత్తర్వులు, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 కింద "నిషిద్ధ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనుబంధ సంస్థలైన పదహారు కొత్త ప్రజా సంఘాలను 2021 మార్చ్ 30 నుంచి ఏడాది పాటు చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు" చెప్పాయి.

"తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్), తెలంగాణ అసంఘటిత కార్మిక సమాఖ్య (టిఎకెఎస్), తెలంగాణ విద్యార్థి వేదిక (టివివి), డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (డిఎస్‌యు), తెలంగాణ విద్యార్థి సంఘం (టివిఎస్), ఆదివాసి విద్యార్థి సంఘం (ఎఎస్‌యు), కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి), తెలంగాణ రైతాంగ సమితి (టిఆర్‌ఎస్), తుడుం దెబ్బ (టిడి), ప్రజా కళా మండలి (పికెఎం), తెలంగాణ డెమొక్రటిక్ ఫ్రంట్ (టిడిఎఫ్), ఫోరం అగెనెస్ట్ హిందుత్వ ఫాసిస్ట్ అఫెన్సివ్ (ఎఫ్ఎఎచ్ఎఫ్ఓ), సివిల్ లిబర్టీస్ కమిటీ (సిఎల్‌సి), అమరుల బంధు మిత్రుల సంఘం (ఎబిఎంఎస్), చైతన్య మహిళా సంఘం (సిఎంఎస్), విప్లవ రచయితల సంఘం (విరసం) అనే నిషిద్ధ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనుబంధ సంస్థలైన పదహారు కొత్త సంస్థలు ప్రజలను హింసాత్మక, బెదిరింపు చర్యలకు ప్రోత్సహిస్తున్నాయి, సహకరిస్తున్నాయి. ఈ కింద పేర్కొన్న హింసా చర్యలకు పదేపదే పాల్పడుతున్నాయి" అని ఈ జి. ఓ. లో మొదటి పేరాలో ఉపోద్ఘాతం చెప్పింది.

ఆ తర్వాత వరుసగా ఐదు రకాల "హింసా చర్యల" జాబితా రాశారు. ఆ జాబితాలో,

"1. రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధం చేయాలనే వ్యూహం – ఎత్తుగడలు డాక్యుమెంట్ ప్రకారం ఈ అనుబంధ సంస్థల కార్యకర్తలు పట్టణ గెరిల్లా చర్యల ఎత్తుగడలను చేపట్టి, వేరు వేరు ముసుగులతో పట్టణ ప్రాంతాలలో తిరుగుతున్నారు.

2. కొత్త ఎత్తుగడలను చేపట్టి తమ కార్యకలాపాలను మరింతగా పెంచుతూ, వివిధ సంస్థలతో చేతులు కలుపుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వేరువేరు సమస్యలను లేవనెత్తుతూ రెచ్చగొట్టే ప్రకటనలు, సభలు, ప్రదర్శనల ద్వారా సభ్యులను తమ వైపు ఆకర్షిస్తున్నారు.

3. ఈ అనుబంధ సంస్థల కార్యకర్తలు ఛత్తీస్ గడ్ అటవీ ప్రాంతాలలోని మావోయిస్టు నాయకత్వంతో నిరంతర సంబంధాలలో ఉన్నారు, కలుస్తున్నారు. సిపిఐ (మావోయిస్టు) ఆదేశాల మేరకు వీరు బీడు భూముల సమస్యల మీద, అనుబంధ సంఘాల కార్యకర్తలపై రాజ్య నిర్బంధం అనబడే సమస్య మీద వేరువేరు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటితోపాటు భీమా కోరేగాం కేసులో అరెస్టు చేయబడిన విరసం స్థాపకుడు వరవరరావు, ప్రొ. జి ఎన్ సాయిబాబా (శిక్షపడిన తీవ్రవాది), రోనా విల్సన్, తదితర వివిధ అనుబంధ సంఘాల నాయకులను విడుదల చేయాలనీ, ఊపా చట్టాన్ని, వ్యవసాయ చట్టాలను, సిఎఎ/ఎన్ ఆర్ సి వగైరాలను రద్దు చేయాలనీ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

4. ఈ అనుబంధ సంఘాల కార్యకర్తలలో కొందరు చట్టబద్ధంగా స్థాపించబడిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు సిపిఐ (మావోయిస్టు) అజ్ఞాత కార్యకర్తలుగా మారుతున్నారు.

5. పైన చెప్పిన పదహారు అనుబంధ సంఘాలు తమ లక్ష్యాలు, ఆశయాలు, సభ్యులు, పనితీరులతో, సిపిఐ (మావోయిస్టు) ఆదేశాల మేరకే ఏర్పడ్డాయి."

ఈ పదహారు సంఘాలూ ప్రజా పాలనలో జోక్యం చేసుకునే ఉద్దేశంతో పని చేస్తున్నాయనీ, సామాజిక జీవనానికి అవసరమైన సరఫరాలనూ సేవలనూ అందించడానికి ఆటంకంగా ఉన్నాయనీ, శాంతిభద్రతలకు భంగకరంగా ఉన్నాయనీ, తద్వారా ప్రజాశాంతికి ప్రమాదకరంగా ఉన్నాయనీ, అందువల్ల వీటిని చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రభుత్వం భావిస్తున్నదనీ రెండో పేరా చెప్పింది.

ఈ పదహారు సంఘాల కార్యకలాపాల రీత్యా వీటిని తక్షణమే చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నదని మూడో పేరా చెప్పింది.

అందువల్ల, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం, 1992 సెక్షన్ 3 లోని సబ్ సెక్షన్లు 1, 4 ప్రకారం ఒనగూరిన అధికారాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ పదహారు సంస్థలనూ రాష్ట్రంలోని 33 జిల్లాలలో చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు నాలుగో పేరా చెప్పింది.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు, గవర్నర్ పేరు మీద ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ సంతకం చేశారు.

ఈ ఉత్తర్వులు ఏ చట్టం కింద వెలువడ్డాయో కనీసం ఆ చట్ట

నిబంధనలను కూడా పాటించకుండా వెలువడినందువల్ల చట్టవ్యతిరేకమైనవి. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల నేపథ్యంలో చూసినప్పుడు అనైతికమైనవి. వెలువడిన సమయం రీత్యా అసందర్భమైనవి. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయి గనుక రాజ్యాంగ వ్యతిరేకమైనవి. మౌలికమైన మానవ నైసర్గిక హక్కులకు, సంఘ జీవితానికి వ్యతిరేకమైన చర్యలను ప్రతిపాదిస్తున్నందువల్ల అప్రజాస్వామికమైనవి.

ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడానికి ప్రభుత్వానికి తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 ప్రకారం పూర్తి అధికారం ఉంది గాని, ఉత్తర్వులు జారీ చేయడంలో, వాటిని విడుదల చేయడంలో, ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత పాటించవలసిన పద్ధతులలో ఏ ఒక్క విషయంలోనూ ప్రభుత్వం తాను చెప్తున్న చట్టాన్ని కూడా పాటించలేదు. ఆ చట్టం లోని సెక్షన్ 3 ప్రకారమే ప్రభుత్వం ఏదైనా సంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించ దలచుకున్నప్పుడు ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ పని చేయవచ్చు. ఆ సంస్థ రిజిస్టర్డ్ సంస్థ అయితే ఆ సంస్థ రిజిస్టర్డ్ కార్యాలయానికి రిజిస్టర్డ్ పోస్టులో ఆ నోటిఫికేషన్ పంపాలి. లేదా ఆ సంస్థ బాధ్యుల చేతికి అందించాలి. వారు లేకపోయినా, అది తీసుకోవడానికి నిరాకరించినా, ఆ రిజిస్టర్డ్ కార్యాలయ గోడకో, తలుపుకో అంటించాలి. ఆ సంస్థ రిజిస్టర్డ్ సంస్థ కాకపోతే, దాని దృష్టికి తేవడానికి ఒక స్థానిక దినపత్రికలో ఆ నోటిఫికేషన్ ను ప్రచురించాలి. అంటే నోటిఫికేషన్ ను పత్రిక రాసిన వార్తగా కాదు, నోటిఫికేషన్ ను యథాతథంగా వాణిజ్య ప్రకటనగా ఇవ్వాలి.

ఆ నోటిఫికేషన్ తమ కార్యాలయానికి అందిన రోజు నుంచి, లేదా తమ కార్యాలయ గోడకు అంటించబడిన రోజు నుంచి లేదా పత్రికలో ప్రకటన అచ్చయిన రోజు నుంచి, ఏది చివరిదైతే ఆరోజు నుంచి రెండు వారాలలోగా ఆ సంస్థ తమ అభ్యంతరాలు తెలియజేస్తూ ప్రభుత్వానికి లేఖ పంపుకోవచ్చు. ఇదే చట్టం సెక్షన్ 5 ప్రకారం ప్రభుత్వం వెంటనే ముగ్గురు న్యాయమూర్తులతో ఒక సలహా మండలిని కూడా ప్రకటించాలి. చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించిన నోటిఫికేషన్ ను, ప్రభుత్వ వాదనలను, సంస్థ వాదనలను విని, విచారణ జరిపే అధికారం ఈ న్యాయమూర్తుల సలహా మండలికి ఉంటుంది. నోటిఫికేషన్ నుంచి ఆరు వారాలలోగా ప్రభుత్వం ఆ సలహా మండలిని నియమించి, సంబంధిత పత్రాలను దాని ముందు ఉంచాలి. ఆ సలహా మండలి అవసరమైతే ప్రభుత్వ పక్షంతో, సంస్థతో మౌఖిక విచారణ కూడా జరిపి తన తుదితీర్పు ప్రకటిస్తుంది. ఈ ప్రక్రియను చట్టమే నిర్దేశించినందువల్ల తుదితీర్పు వెలువడే వరకూ నిషేధం అమలు లోకి రావడానికి అధికారం లేదని అనుకోవచ్చు. కాకపోతే చట్టం ఈ మధ్యంతర కాలం గురించి స్పష్టత ఇవ్వలేదు గనుక ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచే అమలు లోకి వస్తుందని వాదిస్తున్నది.

ఇప్పుడు పదహారు సంఘాల నిషేధం విషయంలో నోటిఫికేషన్ లేదు. ఒకవేళ జి. ఓ. నే నోటిఫికేషన్ అనుకుంటే దాన్ని ఆయా సంఘాల బాధ్యులకు ఇవ్వలేదు. ఈ పదహారు సంఘాలలో రెండు మూడు రిజిస్టర్డ్ సంస్థలు కూడా ఉన్నాయి. వాటి కార్యాలయాలకు రిజిస్టర్డ్ పోస్ట్ లో పంపించడమో, గోడకు అతికించడమో చేయలేదు. అన్నిటికన్నా ఘోరంగా పత్రికలో వెంటనే ప్రకటన ఇవ్వలేదు. జి.ఓ. విడుదల అయిన 23 రోజుల తర్వాత, ఒక వార్త లాగా పత్రికలకు లీక్ చేశారు. సలహా మండలి నియామకం గురించి ఇది రాస్తున్న సమయం వరకూ ప్రకటన లేదు. (ఇప్పటికి జి.ఓ. వెలువడి ఏడు వారాలు దాటింది, పత్రికల్లో వార్త వెలువడి నాలుగు వారాలు దాటింది). అంటే ఏ రకంగానూ ప్రభుత్వం కనీస చట్టబద్ధతను పాటించలేదు.

నిషేధం విధించడంలో, దాన్ని ప్రకటించడంలో జరిగిన చట్ట ఉల్లంఘనను అలా ఉంచి, అసలు తెలంగాణలో ఈ చట్టానికి నైతికత ఉన్నదా అనే ప్రశ్న కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉనికిలోకి వచ్చిన ఈ చట్టపు చరిత్రే హాస్యాస్పదమైనది. రాజీవ్ గాంధీ మొదటి వర్ధంతి రోజున ఏదైనా సంచలనాత్మక ప్రకటన చేయదలచిన అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి విశాఖపట్నంలో బహిరంగసభలో సిపిఐ ఎం ఎల్ పీపుల్స్ వార్ మీద, రాడికల్ విద్యార్థి సంఘం, రాడికల్ యువజన సంఘం, రైతు కూలీ సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్య, విప్లవ కార్మిక సమాఖ్య, ఆల్ ఇండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ల మీద నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిషేధం క్రిమినల్ లా అమెండ్ మెంట్ ఆక్ట్ 1908 కింద ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో, ప్రజా రక్షణ చట్టం 1348 ఫసలీ కింద తెలంగాణ ప్రాంతంలో అమలవుతుందని అన్నారు. ఆ రెండు చట్టాలూ అసలు ఉనికిలోనే లేవని, వాటిని సుప్రీంకోర్టు ఎప్పుడో కొట్టివేసిందని, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు, న్యాయవాది కె జి కన్నబిరాన్ ముఖ్యమంత్రి ప్రకటనలోని అసంగతాన్ని వెంటనే బహిర్గతం చేశారు. దానితో మల్లగుల్లాలు పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలు, పోలీసు పెద్దలు హడావిడిగా తయారుచేసి జూన్ 21న అమలు లోకి తెచ్చిన కొత్త చట్టమే ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం 1992.

అప్పటి నుంచి 2014 వరకూ తెలంగాణలో వేలాది మంది ఈ అక్రమ చట్టం కింద నిర్బంధానికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమ క్రమంలో మొత్తంగా రాజ్య నిర్బంధం మీద వచ్చిన వ్యతిరేకతలో ఈ చట్టం పట్ల వ్యతిరేకత కూడా భాగమే. అంటే ఈ చట్టాన్ని కొనసాగించకపోవడం తెలంగాణ ప్రజల ఆకాంక్ష. అదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యం అయి ఉండవలసింది. కాని 2016 జూన్ 1న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన జి. ఓ. నం. 45 (తెలంగాణ అడాప్టేషన్ ఆఫ్ లాస్ ఆర్డర్ 2016) లో అంతకు ముందరి ఆంధ్రప్రదేశ్ లోని 177 చట్టాలనూ, 12 రెగ్యులేషన్లనూ అక్షరం కూడ మార్చకుండా, పేరులో ఆంధ్రప్రదేశ్ తీసేసి తెలంగాణ అని పెట్టినప్పుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం 1992, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 అయిపోయింది! ఇది తెలంగాణ ప్రజా ఆకాంక్షల ప్రకారం, ఉద్యమ క్రమంలో వెల్లువెత్తిన నినాదాల ప్రకారం, "అంతర్గత వలసవాద పాలన అవశేషాలను తొలగించి స్వపరిపాలనను ఏర్పరుస్తాము"ని తెలంగాణ రాష్ట్ర సమితి చేసిన వాగ్దానాల ప్రకారం అనైతికం, అర్థరహితం.

ఇక ప్రస్తుత నిషేధ ఉత్తర్వులు వెలువడిన సమయం చూస్తే, అది మార్చ్ 30 అయినా, ఏప్రిల్ 24 అయినా, దేశమంతటిలోనూ, ప్రత్యేకించి తెలంగాణలోనూ కరోనా వైరస్ రెండో అల భయానకంగా విజృంభిస్తున్న సమయం. ఆస్పత్రుల్లో పడకలు లేక, ఆరోగ్య సౌకర్యాలు లేక, ఆక్సిజన్

అందక, ఆరోగ్య వ్యాపారుల మితిమీరిన లాభాపేక్షతో మనుషులు పిట్టల్లా రాలిపోతున్న సమయం. ఈ భయానక స్థితిలో ప్రజల ఆరోగ్య సంరక్షణ తప్ప మరేదీ ప్రభుత్వానికి ప్రాధాన్యతాంశంగా ఉండడానికి వీలు లేదు. కాని మహా ఘనత వహించిన తెలంగాణ పోలీసు పాలకులు కరోనా బారి నుంచి ప్రజలను కాపాడే పని కన్న భిన్నస్వరాల, ప్రత్యామ్నాయ ఆలోచనల ప్రచారాన్ని అడ్డుకోవడమే తమ ప్రధాన కర్తవ్యంగా భావించారు. తెలంగాణ ప్రజల హక్కులు కాపాడతామనే వాగ్దానాలతో అధికారం లోకి వచ్చిన పాలకులకు ఇంతకన్నా సిగ్గు చేటు పని మరొకటి ఉండదు.

అభిప్రాయాలు కలిగి ఉండడం, వాటిని వ్యక్తీకరించడం, తమ లాంటి అభిప్రాయాలున్నవారితో సమష్టిగా ఆలోచనలు పంచుకోవడానికీ, కార్యాచరణలోకి దిగడానికీ సంఘటిత నిర్మాణాలు రూపొందించుకోవడం మనిషి నైసర్గిక లక్షణాలు, అంటే జన్మహక్కులు. ఆ జన్మహక్కులను రాజ్యం గాని, ఆధిపత్య శక్తులు గాని కొల్లగొట్టకుండా, ఉల్లంఘించకుండా హామీ ఇస్తున్నానని రాజ్యాంగం ప్రకటించింది. భారత రాజ్యాంగ అధికరణం 19 ఈ వాక్సభా స్వాతంత్ర్యాలను, భావ ప్రకటనా స్వేచ్ఛను, సంఘాలు పెట్టుకునే హక్కును, ఎక్కడికైనా ప్రయాణించే హక్కును హామీ ఇచ్చింది. అధికరణం 19 హామీ ఇచ్చిన హక్కుల మీద "సకారణమైన, హేతుబద్ధమైన పరిమితులు, ఆంక్షలు" విధించడానికి మాత్రమే ప్రభుత్వానికి అధికారం ఉంది గాని, మొత్తంగా ఆ హక్కులను రద్దు చేసే అధికారం లేదు. అందువల్ల అసలు తెలంగాణ ప్రజా భద్రతా చట్టమే రాజ్యాంగ వ్యతిరేకమైనది. రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులను ఆ చట్టాన్ని ఉపయోగించి రద్దు చేయడం రాజ్యాంగ వ్యతిరేకం.

మనిషి సహజంగా సంఘ జీవి. తప్పనిసరిగా సంఘ జీవితంలో మానవ సంబంధాలు ఆలోచనల వినిమయంలో, సంఘర్షణలో అభివృద్ధి చెందుతాయి. ఆట, పాట, మాట, కలయిక నిషేధం అని నిరంకుశ ప్రభుత్వాలు శాసనాలు చేయవచ్చు గాని ఆట, పాట, మాట, కలయిక లేకుండా మనిషి ఉనికే అసాధ్యం. తోటి మనుషులతో ఆట, పాట, మాట పంచుకునే క్రమంలో తప్పనిసరిగా మనుషులు కలుసుకుంటారు, బృందాలవుతారు, సంఘటితమవుతారు, సంఘంగా ఒక నిర్మాణంలోకి వస్తారు. అందుకే రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛతో పాటే సంఘాలు నిర్మించుకునే హక్కుకు కూడా హామీ ఇచ్చింది. సంఘాలను నిషేధించడం, వారి ఆట, పాట, మాటలను, రచనను, కార్యాచరణను నిషేధించడం అంటే మనుషులను మనుషులు కాకుండా చేయడమే. అది ఒక అమానవీయ ప్రయత్నం. అప్రజాస్వామిక ప్రయత్నం. నిరంకుశ ప్రయత్నం. అది చట్టబద్ధమైనదిగా, తాత్కాలికంగా సాధ్యమైనట్టుగా, బలప్రయోగంతో, భయోత్పాతంతో అమలైనట్టుగా కనబడ వచ్చు గాని వాస్తవంగా అది ఎక్కువ కాలం సాగదు. సత్యాన్ని చాటే పుస్తకాన్ని నిషేధించగలవు గాని సాక్ష్యంగా బతికే ప్రపంచాన్ని ఏం చేస్తావు అన్న కవి వాక్కు ఐదు దశాబ్దాలుగా గడిచినా అక్షర సత్యంగానే ఉంది.

ఈ స్థూల, తాత్విక, సామాజిక, రాజకీయ, చట్టపరమైన వాదనలు అలా ఉంచి, అసలు జి.ఓ. నం. 73 ఎంత తప్పుల తడకగా తయారయిందో, ఎన్ని అబద్ధాలను వాదనలుగా, ఎన్ని అపోహలను వాస్తవాలుగా ప్రచారం లోకి తెచ్చిందో కూడా చూడాలి.

తాము నిషేధించదలచుకున్న పదహారు సంస్థలను పాలకులు ఏ తేడాలు లేని ఒకే కుప్పగా, అదీ ఒక సాయుధ, అజ్ఞాతవాస, నిషిద్ధ పార్టీ ఆదేశాల ప్రకారం నడిచే సంఘాలుగా చూశారు గాని ఆ ఆలోచనే హాస్యాస్పదం, అవాస్తవం. ఆ పదహారు సంఘాల నిర్మాణాలలో, ఆశయాలలో, కార్యక్షేత్రాలలో, పనితీరులో ఎంతో వైవిధ్యం ఉంది. తమకు భిన్నాభిప్రాయాలు ప్రకటించేవాళ్లూ, తమ రాజకీయ విధానాలను విమర్శించేవాళ్లూ అందరూ ఒకటే అనే జార్జి బుష్ తరహా అజ్ఞానం, అహంకారం ఉన్నవాళ్లు మాత్రమే ఇటువంటి వాదన చేయగలరు. ఈ పదహారు సంఘాల్లో విద్యార్థి సంఘాలు నాలుగున్నాయి. విద్యార్థి రంగం అనే ఒకే కార్యక్షేత్రంలో నాలుగు సంఘాలు ఉన్నాయంటేనే వాటి ఆశయాలలో, పనితీరులో తేడాలున్నాయని అర్థం. అటువంటప్పుడు ఆ నాలుగు సంఘాలూ ఒకే పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తున్నాయని ఊహించడానికి అతి తెలివో, అజ్ఞానమో ఉండాలి.

ఈ పదహారు సంఘాలలో ప్రతి ఒక్క దానికీ విభిన్నమైన, విశిష్టమైన స్వభావం ఉంది. ఒకటి ఆదివాసుల సంఘం, ఒకటి మహిళల సంఘం, ఒకటి రైతు కూలీల సంఘం. ఒకటి అసంఘటిత కార్మికుల సంఘం. నాలుగు విద్యార్థి సంఘాలు. ఒకటి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా పుట్టిన సంఘం. ఒకటి తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అనేక సంఘాలతో కలిసి ఏర్పడిన సమాఖ్య. ఒకటి రచయితల సంఘం, ఒకటి సాంస్కృతిక కార్యకర్తల సంఘం, రెండు రాజ్యాంగ బద్ధమైన హక్కులు సాధించడం కోసం ఏర్పడిన సంఘాలు, ఒకటి హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేక ప్రచారం కోసం ఏర్పడిన సంఘం, ఒకటి రాజ్యహింసలో అమరులైన వారిని స్మరించుకోవడానికి బంధువులూ మిత్రులూ పెట్టుకున్న సంఘం. ఈ వైవిధ్యమే వాటి మధ్య ప్రభుత్వం చెపుతున్న ఏకసూత్రత, ఎవరో ఒకరి ఆదేశాల మేరకు ఏర్పడి పనిచేస్తున్న స్వభావం లేదని చూపుతుంది. ఈ సంఘాలన్నీ వేర్వేరు కాలాల్లో ఏర్పడ్డాయి. వీటన్నిటికీ వేరువేరు ప్రణాళికలున్నాయి. వీటన్నిటికీ ఉమ్మడి స్వభావం ఉండే అవకాశం పాలకుల బుర్రలో తప్ప వాస్తవంలో లేదు.

1970లో పుట్టిన నాటి నుంచీ నక్సల్బరీ రాజకీయాలను, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం అనే భావజాలాన్ని మార్గదర్శకంగా పెట్టుకున్నానని విప్లవ రచయితల సంఘం బహిరంగంగానే ప్రకటిస్తున్నది. ఆ సంఘ సభ్యులు తమ రచనల్లో, ఉపన్యాసాల్లో ఆ భావజాలాన్ని వ్యక్తీకరిస్తూనే ఉన్నారు. ఇక 2002 లో పుట్టిన అమరుల బంధు మిత్రుల సంఘం నక్సల్బరీ పంథాలో అమరులైన తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను సంస్మరించుకోవడమే తన లక్ష్యమని ప్రకటించుకుంటున్నది. ఈ భావజాలాన్ని కలిగి ఉండడం, సమర్థించడం, వ్యక్తీకరించడం నేరాలు కావు. అసలు నిషిద్ధ మావోయిస్టు పార్టీ సభ్యులు కావడం కూడా దానికదిగా నేరం కాదని, ఏదైనా ప్రత్యేక చర్యలో పాల్గొన్నట్టు సాక్ష్యాధారాలు చూపవలసిందేనని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. కనుక ఆ ఆరోపణతో ఈ సంఘాలను నిషేధించడం అర్థరహితం, చట్టవ్యతిరేకం. ఇక మిగిలిన పద్నాలుగు సంఘాల ఆశయాలు, లక్ష్యాలు, ప్రణాళికలు, పనితీరు చూస్తే వారి మీద ఆ ఆరోపణ బట్ట కాల్చి మీద

వేయడం మాత్రమే.

వీటిలో రెండు సంస్థలు కేవలం రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కుల కొరకు, చట్టబద్ధ పాలన కొరకు, 'చట్టం ఎదుట అందరూ సమానమే', 'బెయిల్ సాధారణం, జైలు అసాధారణం', విచారణలో తేలేవరకూ నిందితులను నిర్దోషులుగా చూడాలి' వంటి న్యాయసూత్రాల కొరకు పని చేస్తున్న సంస్థలు. నిజానికి ఈ అన్ని సంస్థలూ కూడా బహిరంగంగా, ఈ వ్యవస్థలోపల పని చేస్తున్నవే. ఈ వ్యవస్థ పట్ల, ఈ వ్యవస్థలో అమలవుతున్న "ప్రజాస్వామ్యం" పట్ల, రావలసిన మార్పుల పట్ల ఆయా సంఘాలకు ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉండవచ్చు. అవే అభిప్రాయాలు ఉన్న సంస్థలూ పార్టీలూ దేశంలోనో రాష్ట్రం లోనో మరెన్నో ఉన్నాయి. అభిప్రాయాలు ఒకటైనంత మాత్రాన ఒక సంస్థకు మరొక సంస్థ అనుబంధ సంస్థ అయిపోదు. ఆ మాటకొస్తే నక్సల్బరీ రాజకీయాలను సమర్థించే, నక్సల్బరీ రాజకీయాలకు తామే వారసులమని చెప్పుకునే పార్టీలూ సంస్థలూ దేశంలో వందకు పైనే ఉన్నాయి. అవన్నీ ఏదో ఒకానొక సంస్థకు అనుబంధ సంస్థలే అని ఏ ఆధారంతో నిర్ణయిస్తారు? ఒకే భావజాలంతో నడిచే, ఒకే భావజాలాన్ని తమ మార్గదర్శకంగా చెప్పుకునే సంస్థలు, పార్టీలు అనేకం ఉన్నాయని సమకాలీన సమాజాన్ని చూస్తే ఎవరికైనా అర్థం అవుతుంది. వాటిలో దేన్ని మాతృసంస్థ అంటారు, వేటిని అనుబంధ సంస్థలని అంటారు? ఆ సంబంధాన్ని ఎలా నిర్ణయిస్తారు? ఇక్కడ ప్రభుత్వం, పోలీసులు ఏది అనుకుంటే అదే చెల్లుతుందని అనడానికి వీలు లేదు. కచ్చితమైన, నిస్సందేహమైన సాక్ష్యాధారాలు అవసరం అవుతుంది. మరీ ముఖ్యంగా ఆ ఆరోపణతో ఒక సంఘాన్ని నిషేధానికి గురి చేస్తున్నప్పుడు, ఆ ఆరోపణను నిరూపించవలసి ఉంటుంది.

చివరిగా, ఈ చట్టం అమలులో ఒక హాస్యాస్పదమైన పరిస్థితి కూడా తలెత్తుతుంది. ముప్పై సంవత్సరాల కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించిన సంస్థలలో ఆల్ ఇండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కూడ ఉండింది. అది అప్పటికే ఒక్క ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే కాక అనేక రాష్ట్రాలలో ఉన్న సంస్థ. 1992 జూన్ లో ఆ సంస్థ మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధిస్తే, 1993 జనవరిలో ఆ సంస్థ జాతీయ మహాసభలను బొంబాయిలో జరుపుకుంది. ఒక రాష్ట్ర సరిహద్దులోపల నిషిద్ధమైన సంస్థ, సరిహద్దు అవతల తన కార్యకలాపాలు జరుపుకోవచ్చునన్నమాట. సరిగ్గా అలాగే, ప్రస్తుత నిషేధంలో కూడా ఈ సంఘాలలో కొన్ని రెండు రాష్ట్రాలలోనూ, దేశవ్యాప్తంగానూ ఉన్నవి. అటువంటి సంఘాలను రాష్ట్రంలో నిషేధించడం, చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించడం అసమంజసం, దాన్ని అమలు చేయడం అసాధ్యం.

ప్రస్తుత నిషేధంలో మరొక తెలివితక్కువ అసమంజసత్వం కూడా ఉంది. విప్లవ రచయితల సంఘం మీద ఇదే చట్టం లోని ఇదే సెక్షన్ కింద 2005 ఆగస్ట్ లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. చట్ట ప్రకారం ఏర్పాటయిన ముగ్గురు న్యాయమూర్తుల సలహా మండలి (జస్టిస్ టి ఎల్ ఎన్ రెడ్డి, జస్టిస్ ఎస్ నీలాద్రి రావు, జస్టిస్ ఎ గోపాల్ రావు) ఇరుపక్షాల వాదనలనూ విని, విచారణ జరిపి నిషేధం చెల్లదని ప్రకటించింది. దానితో ప్రభుత్వం నవంబర్‌లో మరొక జి.ఓ. జారీ చేసి నిషేధాన్ని ఉపసంహరించుకోవలసి వచ్చింది. పదహారు సంవత్సరాల తర్వాత అదే చట్టం లోని అదే సెక్షన్ కింద అదే సంఘాన్ని నిషేధించడం అర్థరహితం, చట్టవ్యతిరేకం. సహజ న్యాయ సూత్రాల ప్రకారమైనా, భారతదేశంలో అమలవుతున్న న్యాయశాస్త్రం రీత్యానైనా ఒకే నేరానికి రెండు సార్లు విచారించడం చెల్లదు. ఒకసారి రుజువు కాని నేరాన్ని రెండోసారి విచారించడం చెల్లదు. అసాధారణ సందర్భంలో అలా విచారణకు తీసుకున్నప్పటికీ కొత్త సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడం అవసరం అవుతుంది. ప్రస్తుత నిషేధపుటుత్తర్వులు ఒక్కటంటే ఒక్కటైనా కొత్త సాక్ష్యాధారాలను చూపలేదు.

ఈ సాధారణ ప్రశ్నలు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 3 (2) ప్రకారం "ఒక సంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించడానికి తగిన కారణాలు చూపాలి". అందువల్ల జి.ఓ. లో కొన్ని కారణాలు చెప్పారు గాని అవన్నీ పచ్చి అబద్ధాలు, అర్ధసత్యాలు, ప్రభుత్వపు సొంత అపోహలు, పోలీసుల కట్టుకథలు. పదహారు సంఘాలకూ కలిపి ఉమ్మడిగా ఐదు కారణాలు చూపడమే పెద్ద అసంగతం. కాగా, ఆ ఐదు కారణాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా వాస్తవం కాదు. ఈ సంస్థలను చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించడానికి అవి కారణాలనడం హాస్యాస్పదం. ఈ సంఘాలు "ఈ క్రింద తెలిపిన హింసాచర్యలకు పాల్పడుతున్నాయి" అని ఆ ఐదు "చర్యల" జాబితా రాశారు గాని, కనీసస్థాయిలో భాష వచ్చిన ఎవరికైనా వాటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా "హింసా చర్య" కాదని అర్థమవుతుంది. మామూలు అర్థంలో చర్య అంటే క్రియ. హింసా చర్య అంటే శారీరకంగానో, ఆయుధ సహాయంతోనో గాయపరచడం, ధ్వంసం చేయడం, చంపివేయడం, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వంటి క్రియలు. ఈ ఐదు కారణాలలోనూ ఎక్కడా ఒక్క చోటనైనా ఒక క్రియ లేదు, భావ ప్రచారం మాత్రమే ఉంది. అది "హింసా చర్య" ఎలా అవుతుంది?

ఈ జి.ఓ. లో రాసిన ప్రకారమే మొదటి "హింసా చర్య" పట్టణ ప్రాంతాలలో తిరుగుతుండడం. తిరగడం హింసా చర్య ఎలా అవుతుందో ఈ జి.ఓ. రచయితల మహా మేధావిత్వానికే తెలియాలి. ఈ సంఘాల కార్యకర్తలు పట్టణ గెరిల్లా చర్యల ఎత్తుగడలను చేపట్టారని ఈ పేరా ఆరోపిస్తుంది. ఈ జి.ఓ. రాసిన వారికి "పట్టణ గెరిల్లా చర్యలు" అనే మాటకు అర్థం తెలిసినట్టు లేదు. ఐరిష్ జాతి విముక్తి ఉద్యమంలో ఇరవయో శతాబ్ది తొలిరోజుల్లో ప్రారంభమై లాటిన్ అమెరికన్ ప్రజా పోరాటాల్లో 1960ల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చిన ఈ మాటకు చాలా చరిత్ర ఉంది. పట్టణ గెరిల్లా చర్యలు అనే మాటలో బాంబు దాడులు, విధ్వంసాలు, కీలక వ్యక్తుల అపహరణలు, ఆయుధ స్వాధీనాలు, బ్యాంకులపై దాడులు, హత్యలు వంటివి ఉంటాయి. అటువంటి పట్టణ గెరిల్లా చర్యలు 1969-70ల్లో కలకత్తాలో మినహా దేశంలో ఎక్కడా ఎప్పుడూ జరగలేదు. జరిగే అవకాశం కూడా లేదు. ఈ పదహారు సంఘాలలో ఏ ఒక్కటైనా అటువంటి చర్యలకు పాల్పడిన ఉదాహరణ గత ఐదు దశాబ్దాల చరిత్రలో ఒక్కటి కూడ లేదు.

జి. ఓ. చెప్పిన రెండో "హింసా చర్య" "రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వేరు వేరు సమస్యలు లేవనెత్తుతూ రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, సభలు, ప్రదర్శనలు జరపడం." వీటిలో రెచ్చగొట్టే అనే మాటను పక్కనపెట్టి, మిగిలిన పనులన్నీ రాజ్యాంగబద్ధమైనవి,

చట్టబద్ధమైనవి. ప్రతి పౌరుడూ, పౌరురాలూ చేయదానికి హక్కు ఉన్నవి, చేయవలసినవి. పౌరుల సంగతి అలా ఉంచి, కేంద్ర ప్రభుత్వ విధానాలనూ చర్యలనూ ఖండిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలనూ, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలనూ చర్యలనూ ఖండిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్నీ మనం చూస్తూనే ఉన్నాం. అటువంటప్పుడు ప్రజలకు, పౌరులకు ఆ హక్కు ఇంకా ఎక్కువ ఉంటుంది. ప్రకటనలు, సభలు, ప్రదర్శనలు ప్రజల హక్కు. రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కు. ఆ హక్కును వినియోగించుకుంటున్నందుకు నిషేధం విధిస్తామని నిస్సిగ్గుగా చెప్పడం దుర్మార్గం, నియంతృత్వం. ఒకవేళ ఆ ప్రకటనల్లో, సభల్లో, ప్రదర్శనల్లో ఈ జి. ఓ. చెపుతున్నట్టు "రెచ్చగొట్టే" అంశాలుంటే భారత శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి కింద విచారించడానికి ప్రభుత్వానికి అన్ని అవకాశాలూ ఉన్నాయి. అందుకోసం నిషేధం విధించనక్కర లేదు.

జి. ఓ. చెప్పిన మూడో "హింసా చర్య" ఈ సంఘాల కార్యకర్తలు మావోయిస్టు పార్టీ నాయకత్వంతో సంబంధంలో ఉండడం, కలుస్తూ ఉండడం. వారి ఆదేశాల మేరకు బీడు భూముల సమస్య మీద పని చేయడం. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా, ప్రత్యేకించి భీమా కోరేగాం కేసులో అరెస్టయినవారిని విడుదల చేయాలని ప్రదర్శనలు జరపడం, ఊపా చట్టాన్ని, వ్యవసాయ చట్టాలను, సిఎఎ/ఎన్ ఆర్ సి లను రద్దు చేయాలని నిరసన కార్యక్రమాలు చేపట్టడం. ఇలా ఇంత బహిరంగంగా ఈ కారణం చెపితే ప్రజలు నవ్వుకుంటారనే కనీస ఇంగితం కూడా ఈ జి. ఓ. రాసినవారికి లేనట్టుంది. బీడు భూముల వంటి ప్రజా సమస్యల మీద పోరాడడం రాజకీయ పార్టీలూ, సామాజిక సంస్థలూ, కార్యకర్తలూ దశాబ్దాలుగా చేస్తున్నారు. అదేమీ నేరం కాదు. అందుకు ఏదో ఒక పార్టీ ఆదేశించనక్కర లేదు. ఇక అరెస్టులకు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాడడం న్యాయస్థానం లోపలా, బైటా జరగడానికి రాజ్యాంగమే అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలో దేశంలో వేలాది కేసుల విషయంలో అవి అక్రమ కేసులు అంటూ న్యాయస్థానం లోపల డిఫెన్స్ న్యాయవాదులు వాదిస్తారు. అవి తప్పుడు కేసులు అంటూ బాధిత సమూహాలు బైట నిరసన ప్రదర్శనలు జరుపుతాయి. పోలీసులు చేసిన ఆరోపణలనూ పెట్టిన కేసులనూ ఎన్నో స్థాయిలలో కోర్టులు కొట్టి వేశాయి. కనుక కేసులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరపడం నేరమూ కాదు, కొత్త విషయమూ కాదు. నిషేధించడానికి కారణమూ కాదు.

అంతకన్నా హాస్యాస్పదం ఊపా, వ్యవసాయ చట్టాలు, సిఎఎ/ఎన్ ఆర్ సి వంటి చట్టాల రద్దును కోరుతూ ప్రదర్శనలు జరపడాన్ని "హింసా చర్య"గా అభివర్ణించడం. ప్రభుత్వాలు చేసే ఏ చట్టాన్నయినా వ్యతిరేకించే, నిరసన తెలిపే అధికారం ప్రజలకు ఉంటుంది. ప్రజల నిరసనల వల్ల ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను రద్దు చేసుకున్న చరిత్ర కూడ ఉంది. సరిగ్గా ఊపాతో సమానమైన టాడా, పోటాల మీద కూడా పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. నిరసనల వల్లనే పది సంవత్సరాల తర్వాత టాడాను కొనసాగించకుండా సహజ మరణానికి వదిలేశారు. తాము అధికారంలోకి వస్తే పోటాను రద్దు చేస్తామని యుపిఎ 2004 ఎన్నికల వాగ్దానంగా ప్రకటించి గెలిచాక నిజంగానే రద్దు చేసింది. కాకపోతే, అదే ప్రభుత్వం 1967 నాటి ఊపాను తవ్వి తీసి, టాడా, పోటాలలోని దుర్మార్గ అంశాలు కూడ జోడించి, ప్రస్తుత ఊపా తయారు చేసింది. అటువంటి చట్టాన్ని వ్యతిరేకించే, నిరసన ప్రదర్శనలు జరిపే, రద్దు చేయమని కోరే అధికారం ప్రజలకు తప్పనిసరిగా ఉంటుంది. ఇక వ్యవసాయ చట్టాల విషయంలోనైతే, ఆ చట్టాలను ఎన్నో రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి, నిరసనలు తెలిపాయి. ఆ చట్టాలను వ్యతిరేకిస్తూ జరిగిన భారత్ బంద్ కు ఈ నిషేధం విధించిన ప్రభుత్వాన్ని నడిపే తెలంగాణ రాష్ట్ర సమితి కూడా మద్దతు తెలిపింది. తర్వాత మాట మార్చినప్పటికీ కొన్నాళ్లు ఆ చట్టాలను రద్దు చేయాలని కోరింది. ఇవాళ్టికీ ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నో రాజకీయ పార్టీలు ఆ వ్యవసాయ చట్టాల రద్దు కోరుతున్నాయి. ఆ మూడు వ్యవసాయ చట్టాలు తప్పనిసరిగా వ్యతిరేకించవలసినవే. వాటిని వ్యతిరేకించడం నిషేధించవలసిన విషయం కాదు. ఇక సిఎఎ – ఎన్ ఆర్ సి లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విస్తారమైన ఆందోళన జరిగింది. ఈ నిరసన "హింసా చర్య" కాకపోవడం మాత్రమే కాదు, పౌరుల తప్పనిసరి కర్తవ్యం. ఆ కర్తవ్యం నెరవేర్చడమే నిషేధించడానికి కారణమని ప్రభుత్వం అంటున్నదంటే ఇది ఎటువంటి నిరంకుశ, అసహన, అప్రజాస్వామిక ప్రభుత్వమో ఎవరికి వాళ్లు అంచనా వేసుకోవలసిందే.

ఇక జి. ఓ. చెప్పిన నాలుగో "హింసా చర్య" ఈ సంఘాల కార్యకర్తలలో కొందరు మావోయిస్టు పార్టీ అజ్ఞాత కార్యకర్తలుగా మారుతున్నారనేది. ఎవరైనా తమకు నచ్చిన సంస్థలో చేరితే అది "హింసా చర్య" ఎలా అవుతుంది? అలా ఒకరో, ఇద్దరో, కొందరో సభ్యులు ఒక సంస్థను వదిలి మరొక సంస్థలో చేరితే అందుకు మొదటి సంస్థ ఎలా బాధ్యురాలవుతుంది? ఈ వ్యక్తిగత ఎంపికను సంఘానికి ముడిపెట్టి దాన్ని ఒక కారణంగా, "హింసా చర్య" గా చూపే చౌకబారు ఆరోపణను చేసినందుకు పాలకులు సిగ్గు పడాలి.

ఇక జి.వో. చెప్పిన ఐదో "హింసా చర్య" ఈ సంఘాలు మావోయిస్టు పార్టీ ఆదేశాల మేరకే ఏర్పడ్డాయనేది, ఈ సంఘాల లక్ష్యాలు, ఆశయాలు, సభ్యులు, పనితీరు ఆ పార్టీ ఆదేశాల మేరకే ఉన్నాయనేది. ఇది మరింత హాస్యాస్పద అంశం. ఎందుకంటే ఈ సంఘాలలో కనీసం సగం మావోయిస్టు పార్టీ పుట్టడానికి దశాబ్దాల ముందు నుంచీ, ఎన్నో సంవత్సరాల ముందు నుంచీ ఉనికిలో ఉన్నాయి. 1970లో పుట్టిన విప్లవ రచయితల సంఘం, 1974లో పుట్టిన పౌరహక్కుల సంఘం, 1995లో పుట్టిన చైతన్య మహిళా సంఘం, 1996 లో పుట్టిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి –తుడుం దెబ్బ, 1997లో పుట్టిన ప్రజా కళా మండలి వంటి సంస్థలు 2004 లో ఏర్పడిన సిపిఐ మావోయిస్టు ఆదేశాల మేరకు ఏర్పడ్డాయని ఈ జి. ఓ. చెపుతున్నదంటే పాలకుల హాస్యాస్పదమైన కాలక్రమ అవగాహనకు ఆశ్చర్యపోవడం కన్న చేయగలిగింది లేదు.

మరొకసారి చెప్పాలంటే ఈ కారణాలన్నీ నిజమైన కారణాలే అని వాదన కోసం అంగీకరించినా ఇవేవీ "హింసా చర్యలు" కావు. నిషేధం విధించడానికి కారణాలు కాజాలవు. ఈ సంఘాలు పాల్గొన్న హింసా చర్యలు ఏవైనా ఉంటే, వాటిని నిర్దిష్టంగా పేర్కొంటే, భారత శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి కింద కేసులు పెట్టడానికి, విచారణ జరపడానికి ప్రభుత్వానికి అధికారమూ అవకాశమూ ఉన్నాయి. అంటే ఇవేవీ నిషేధానికి, చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించడానికి సరిపోయేవి కావు.

అధికార క్రీడలో ఈటెల అవుట్

పాలక వర్గ రాజకీయాలలో ఒకరి ప్రయోజనాలకు మరొకరు అడ్డు రావడం వల్ల అంతర్గత ఘర్షణలు మొదలై బహిర్గతం అవుతుంటాయని అంటున్నారు బి. రామకృష్ణ

ప్రతి మనిషికి ఒకే విలువ, గౌరవం, సమానత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు అనేవి ప్రజాస్వామ్యానికి చిహ్నాలు అనుకుంటే దేశంలో గాని, రాష్ట్రంలో గాని ప్రజాస్వామ్యానికి చిరునామా ప్రశ్నార్థకమే. ఎన్నికలు, ఓట్లు, సీట్లు అధికారానికి సోపానాలు అయ్యాయి. డబ్బు, పలుకుబడి, వర్గం, కులం అనేవి అధికారాన్ని, సామాజిక హోదాలను ఇస్తుంటాయి. ఉన్న ఆస్తులు, అంతస్తులను కాపాడుకోవడానికి, వాటిని పెంచుకోవడానికి మార్గంగా రాజకీయాలు నడుస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు, మద్యం, కులం, మతం, ప్రాంతం, బెదిరింపులు, ప్రలోభాలు మామూలు విషయాలుగా మారాయి. ఈ ఎన్నికలే ప్రజాస్వామ్యం అనబడుతుంటాయి.

ఎన్నికల్లో కోట్లకు కోట్లు కుమ్మరిస్తున్నారు. అధికారం అందాక అవకాశాన్ని బట్టి వందల, వేల రెట్లు ఆస్తులు పెంచుకోవడం ఒక దుర్మార్గపు ఆటగా తయారయ్యింది. ఈ ఆటలో ఏ తొండి చేసైనా సరే గెలవడమే ప్రధానంగా మారింది. నీతి నియమం, రాజ్యాంగ విలువలు అనేవి వెక్కిరింతలకు గురవుతుంటాయి. డబ్బులు ఇవ్వడం, తాగబోయించడం ప్రజలకు అలవాటు చేశారు. పోలీసులు, వివిధ ప్రభుత్వ అధికారులు మొదలైన సమస్త రాజ్య యంత్రాంగం తమ చెప్పుచేతల్లో ఉండాలంటే చట్టసభల్లో అధికారం కావలసి వస్తున్నది. అందుకు ఎన్నికల్లో గెలవాల్సి వస్తున్నది. ఇది ఒక రాజకీయ క్రీడగా తయారయింది. ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలుగా ఉన్నవారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీలోకి సులభంగా వెళ్లగలుగుతారు. వైరి వర్గాలుగా ఉన్నవారు పాలు నీళ్లలా కలిసిపోతారు. అంతకు ముందటి వారి విమర్శలన్నీ కూడా ఎండుగడ్డి మండి చప్పున చల్లారి పోయినట్లు అవుతుంటాయి. ప్రజలు ఎవరికి ఓటు వేస్తేనేమి అధికారం కోసం అందరూ ఒకటేనన్నది పార్టీ ఫిరాయింపులు స్పష్టం చేస్తుంటాయి. మొత్తంగా చూసినప్పుడు ప్రజల కనీస అవసరాలైన కూడు, గూడు, విద్య, వైద్యం సమంగా అందింది లేదు. ఎన్నో వివక్షలు, అసమానతలు కళ్లముందు కదులుతుంటాయి. రాజకీయాలు సమాజాన్ని సమున్నతంగా సమానత్వం దిశలో నడిపించడానికి చోదక శక్తిగా ఉండాలి. ప్రతి మనిషికి సమాన విలువ, గౌరవం ఉండే వైపు నడిపించడానికి రాజకీయాలు దోహదం పడాలి. ప్రకృతి సంపదలు, సామాజిక వనరులు అందరికీ చెందేలా చేయడానికి రాజ్య యంత్రాంగాన్ని ఒక పరికరంగా మలిచేందుకు రాజకీయాలు ఉండాల్సింది పోయి, కొద్దిమందికి సంపదలు దోచి పెట్టడానికి, వారి సుఖలాలసతల కోసం అత్యధిక ప్రజానీక శ్రమను, సహజ సంపదలను కొల్లగొట్టే అణచివేత సాధనంగా మారాయి.

మరి ఇంత స్పష్టంగా నిషేధం చెల్లదని తేటతెల్లమవుతున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పాలకవర్గాలు ఈ పనికి ఎందుకు పూనుకున్నాయి? తెలంగాణ ప్రజా ఆకాంక్షలనూ, ఉద్యమ ఆకాంక్షలనూ నెరవేర్చలేకపోయిన తెలంగాణ పాలకులు తమ వైఫల్యాలను ప్రజలకు వివరించే స్వరాలన్నిటినీ మూసివేయదలచారు. తమ నిరంకుశ పాలన గురించి ప్రజలకు నిజాలు చెప్పే గొంతులేవీ ఉండగూడదనుకున్నారు. పార్లమెంటరీ ప్రతిపక్షాల నుంచి ఎంతో మందిని ఆకర్షించి, కొనివేసి, వాటిని బలహీనం చేసి, వాటికి గొంతు లేకుండా చేశారు. ప్రచార సాధనాలన్నిటినీ తమ కుటుంబ పెట్టుబడులతో, తమ సన్నిహితుల పెట్టుబడులతో కొనివేసి పత్రికల్లో, టీవీలో భిన్నస్వరాలు, వాస్తవాలు వినిపించకుండా చేశారు. ఈ నేపథ్యంలోనే ఇక ప్రజలలో పనిచేస్తున్న వివిధ ప్రజా సంఘాలను, ముఖ్యంగా పాలక పార్టీ దుర్మార్గాల గురించి ప్రజలకు వివరించే శక్తి ఉన్న సంఘాలను పని చేయకుండా చేయాలనేది పాలక పార్టీ లక్ష్యం. ఈ సంఘాల మీద, వాటి నాయకత్వం మీద, కార్యకర్తల మీద ఎంత నిర్బంధం ప్రయోగించినా ఎక్కడో ఒకచోట ఏదో ఒక కార్యక్రమం, ఏదో ఒక సభ, ఏదో ఒక ప్రదర్శన, ఏదో ఒక పత్రిక, ఏదో ఒక కరపత్రం ఇంకా సాగుతూనే ఉన్నాయి. అది సాగకుండా చేయాలంటే ప్రత్యామ్నాయ, ప్రజా రాజకీయాల స్వరం వినిపించకుండా చేయాలంటే, కేవలం ప్రభుత్వ బాకా మాత్రమే వినిపించేలా చేయాలంటే ఆ భిన్నస్వరాల ఉనికినే నిషేధించాలి. తెలంగాణలో నిశ్శబ్దం నింపాలి, శ్మశాన శాంతి వ్యాపింపజేయాలి. ఆ శ్మశాన శాంతి నెలకొల్పే ప్రయత్నమే ఈ నిషేధపుటుత్తర్వులు.

అయితే నిజాం ప్రభువుల నుంచి భారత ప్రభుత్వ సైనిక పాలన నుంచి, వెల్లోడి పాలన నుంచి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన దాకా తెలంగాణ సమాజం ఇటువంటి నిషేధాలనూ నిర్బంధాలనూ ఆంక్షలనూ ఎన్నిటినో చూసింది. ఎదిరించి పోరాడింది. అదునుకోసం వేచిచూస్తూ మౌనంగా భరించింది. అవకాశం వచ్చినప్పుడు లేచి నిలిచింది. తెలంగాణ చరిత్ర నేర్పుతున్న పాఠమిదే. ఆ చరిత్రను పరిశీలించి చూస్తే, ఆ నిరంకుశ పాలకులూ వారి శాసనాలూ మిగలలేదు గాని, తెలంగాణ మిగిలింది. తెలంగాణ ప్రజలు మిగిలారు. ప్రజల ఉద్యమాలు మిగిలాయి. ఇది చరిత్ర చెప్పిన సత్యం. ఇదే చరిత్ర చెప్పనున్న సత్యం. వీ

(రచయిత వీక్షణం సంపాదకులు)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నుండే తెలంగాణ కోసం ప్రజాస్వామిక ఉద్యమాలు పడుతూ లేస్తూ, చస్తూ బతుకుతూ, నివురు కప్పిన నిప్పులా ప్రజల మధ్య ఉంటూ వచ్చాయి. ఎన్నో అణచివేతలు, నిర్బంధాలు, ఎన్నెన్నో త్యాగాల మధ్య తెలంగాణ వచ్చింది. ఉద్యమ పార్టీగా ముందుకు వచ్చి ఎన్నికల రాజకీయాలతో అధికారాన్ని చేజిక్కించుకున్న టిఆర్ఎస్ ఇక ఫక్తు రాజకీయ పార్టీగా ఉంటుందని టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ప్రకటించాడు. దీంతో ఉద్యమ ఆకాంక్షలు, ఆశలు లెక్కలోనివి కావని కెసిఆర్ తన వర్గ రాజకీయాలను ప్రకటించాడు. తస్మదీయుల ప్రయోజనాలే ముఖ్యమని, అందుకోసం ఏమైనా చేస్తాం అని చెప్పకనే చెప్పాడు. టిఆర్ఎస్ లోని జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకులు చాలావరకు తెలంగాణలోని ఆదివాసీ, దళిత, వెనుకబడిన బడుగుల ప్రయోజనాల కోసం నిజాయితీగా, త్యాగాలతో ముందుకు వచ్చినవారు కాదని తెలుస్తుంది. తెలంగాణ పేరుతో ప్రజల బలీయమైన ఆకాంక్షలను, పోరాటాలను సొమ్ము చేసుకుని ఉద్యమ ప్రయోజనాలను లబ్ధి పొందడం కోసం పనిచేస్తూ వచ్చారు.

తెలంగాణలోని వనరులను కేవలం సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర పెత్తందారీ ఫ్యూడల్, పెట్టుబడిదారీ శక్తులు మాత్రమే కొల్లగొట్ట లేదు. అందులో తెలంగాణ ప్రాంత పెట్టుబడిదారీ, భూస్వామ్య, అగ్రకుల ఆధిపత్య శక్తులు కూడా ఉన్నాయి. ఈ శక్తులే ఇవ్వాళ ఎన్నికల రాజకీయాల్లో ఉంటూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయి. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక టిఆర్ఎస్‌లోని ఏ ఒక్కరూ కూడా విద్య, వైద్యానికి బడ్జెట్ పెంచమని ఆందోళనలు చేసింది లేదు. ఎంతో కొంత మేరకైనా ఒత్తిడిని పెంచింది కూడా లేదు. గత పాలకులకంటే కూడా తక్కువ కేటాయింపులు జరిగాయి. విద్య, వైద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడింది లేదు. సరికదా ఈ ప్రైవేట్ శక్తులే విధాన నిర్ణయాల్లో భాగస్వాములవుతున్నాయి. వీరందరికీ వెన్నుదన్నుగా కెసిఆర్ ఉంటున్నాడు. సీమాంధ్ర దోపిడీ వర్గాలతో పాటుగా సంపదలను తమ బొక్కసాల్లోకి వంపుకున్న తెలంగాణా వారిని, చంద్రబాబు, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డితో జతకట్టి మంత్రులుగా ఉండి ప్రత్యేక తెలంగాణను తీవ్రంగా వ్యతిరేకించిన వారిని టిఆర్ఎస్‌లో చేర్చుకున్నాడు కెసిఆర్.

వీరందరికీ కావాల్సింది ఆస్తులను, అంతస్తులను పెంచుకోవడం, అధికార దాహాన్ని తీర్చుకోవడమే తప్పించి తెలంగాణ ఉద్యమ డిమాండ్ లైన నీళ్లు, నిధులు, నియామకాలు కావని ఏడేళ్ల టిఆర్ఎస్ పాలన నిరూపిస్తున్నది. ఎంతో మంది నిరుద్యోగులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. నియామకాలు చాలా తక్కువగా జరిగాయి. ఖాళీలు లక్షల్లో, నియామకాలు పదుల వందల్లో. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల వేలాది మంది నిరాశ్రయులయ్యారు. భూసేకరణ చట్టం 2013ను అనుసరించి అందించాల్సిన నష్టపరిహారం, పునరావాసం వంటివి గాలికి వదిలేశారు. తూతూ మంత్రంగా ఏవో కొన్ని నాసిరకం ఇళ్లు కట్టించి, నామమాత్రపు డబ్బులు చెల్లించి చేతులు దులుపుకున్నారు. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల్లో భారీగానే కమీషన్లు ముడతాయనేది బహిరంగ రహస్యమే.

ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను వ్యతిరేకించిన అనేక గ్రామాల ప్రజలపై ఎంతటి నిర్బంధాన్ని ప్రయోగించారో అప్పట్లో మీడియాలో వచ్చింది. గల్లీ నుండి రాష్ట్ర స్థాయి వరకు అనేక కాంట్రాక్టుల్లో జరిగే అవినీతి వల్ల ప్రజాధనం కొందరి బొక్కసాల్లోకి చేరుతుంది. అలాంటి మరెన్నో అక్రమ సంపాదనల్లోంచి నీటి తుంపర్లుగా వారి వారి స్థాయిలను బట్టి ఎన్నికల్లో గెలవడం కోసం ఖర్చు పెడుతుంటారు. గెలిచిన తర్వాత ప్రజలకు చెందవలసిన వందల, వేల, లక్షల కోట్లు వారి బొక్కసాల్లోకి వెళుతుంటాయి. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేయవలసిన నిధులు దారిమళ్లుతుంటాయి. తూతూ మంత్రంగా మభ్యపెట్టే పథకాలను ముందుకు తెస్తూ ఉంటారు. వాటిని గురించి డాంబికాలు చెబుతుంటారు. గుణాత్మకమైన విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అందించి భూ పంపిణీ కదా చేయవలసింది. అందుకోసం ఏ ఒక్క ఎన్నికల పార్టీ పోటీ పడడం లేదు. అందులో ఒకటి టిఆర్ఎస్.

పౌరహక్కుల సంఘం 2008లో ఏర్పాటు చేసిన సమావేశంలో కెసిఆర్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాల నిరసన కలాలకు, గళాలకు గౌరవం ఉంటుందని అన్నాడు. ప్రభుత్వ పరంగా గుణాత్మక విద్య, వైద్యం అందుబాటులోకి వస్తుందని అన్నాడు. నియామకాలు జరుగుతాయని, హక్కులకు గ్యారంటీ ఉంటుందని అన్నాడు. ఎన్‌కౌంటర్‌లు లేని పచ్చని తెలంగాణ ఉంటుందని ఘంటాపథంగా చెప్పాడు. ముఖ్యమంత్రి పదవి కన్నా పౌరహక్కుల సంఘం అధ్యక్ష పదవే గొప్పదని చెప్పాడు. ఈ సమావేశంలో పాల్గొన్న మేధావులను ఉద్దేశిస్తూ మీలాంటి మేధావులచే విధానాల రూపకల్పన జరుగుతుందని, వాటిని ప్రభుత్వం అమలు చేస్తుందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. ఆ సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శేషయ్య, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ రేవతి మరెంతో మంది పౌరహక్కుల సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజా ప్రత్యామ్నాయ వేదిక సభను భగ్నం చేశారు. దీని ద్వారా తన నిజస్వరూపం బయట పెట్టాడు. ఇదేనన్నమాట కెసిఆర్ చెప్పినటువంటి ఫక్తు రాజకీయ పార్టీ అంటే.

గతంలో విద్యార్థి దశలో నక్సలైట్ ఉద్యమంలో భాగస్వాములైన వారు లేదా ఆ రాజకీయాలకు దగ్గరగా మెలిగిన కొందరు టిఆర్ఎస్‌లో చేరి వివిధ రకాల పదవులు పొందారు. కొందరు మంత్రులు కూడా అయ్యారు. అందులో ఒకరు ఈటెల రాజేందర్. ఒక టివి ఛానల్లో 1986 వరకు పిడిఎస్‌యు, వామపక్ష రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని ఆయనే చెప్పాడు. ఈ ఉద్యమాలలో చిత్తశుద్ధితో, నిజాయితీగా భాగస్వాములైనవారు టిఆర్ఎస్‌లో మనగలగడం కష్టమే. అయినా ఈటెల రాజేందర్ 20 ఏళ్లుగా టిఆర్ఎస్‌లో ఉండగలిగాడు. రెండుసార్లు మంత్రి కాగలిగాడు. తన తొలి సిద్ధాంతాలకు భిన్నమైన దారిలో ప్రయాణం సాగించాడు. అంతర్గత చర్చలతో నిమిత్తం లేకుండా ఒకవేళ ఉన్నా ఒక వ్యక్తి నిర్ణయాల చుట్టూ తిరిగే రాజకీయ పార్టీలో కీలకమైన స్థాయిలో నిన్నమొన్నటి వరకు కలిసి నడిచాడు. ఆ నాయకుడు ఏ వర్గ ప్రయోజనాల కోసం పని చేస్తున్నాడు లేదా పని చేస్తాడు అనేది ఏ కొంచెం తార్కిక వివేచన ఉన్నా తెలుసుకోగలిగేదే. కెసిఆర్ చర్చించే

కొంతమంది ముఖ్యులలో ఈటెల కూడా ఒకరని, ఆ చర్చల తర్వాతే పోలిట్ బ్యూరోలోకి విషయాలను తీసుకెళ్లేవారని ఈటెల చెబుతాడు. అలా టిఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని చెప్పకనే చెబుతాడు.

దేశంలో చాలా వరకు పార్టీలు వ్యక్తి లేదా ప్రధాన నాయకుని చుట్టే తిరుగుతున్నాయని కరుణానిధి, జయలలిత, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇలా ఎన్నో ఉదాహరణలు ఇచ్చాడు. కెసిఆర్ తిరుగులేని నాయకుడని, అతని మాటే చెల్లుబాటు అవుతుందని ప్రస్తుతం ఉన్న రాజకీయ వ్యవస్థలో ఇది అనివార్యమని రాజేందర్ చెప్పాడు. చివరకు కెసిఆర్ కొడుకు కెటిఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికి మద్దతు ఇచ్చాడు. అనుభవం, ఆలోచన, జ్ఞానం, విధానాలపై అవగాహనతో సంబంధం లేకుండా కెసిఆర్ అనుకుంటే చాలు ఎవరంటే వారికి ఏ పదవి అంటే అది వరిస్తుందన్న దానికి ఈటెల రాజేందర్ కూడా సమర్థకుడేనని ఈ విషయం ద్వారా స్పష్టమవుతుంది.

హరీష్‌రావు కానీ, ఈటెల రాజేందర్ కానీ అన్ని విషయాల్లో కెటిఆర్ కంటే ఎక్కువే. కానీ టిఆర్ఎస్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ముఖ్యమంత్రిగా కాని వీరు పనికిరారు. దీన్ని ప్రశ్నించే పరిస్థితి వీరిద్దరికే కాదు టిఆర్ఎస్‌లో ఎవరికీ లేదంటే ఆ పార్టీ ఒక నియంత కింద పనిచేస్తున్నట్లే కదా. స్వామి కార్యం, స్వకార్యం నెరవేర్చుకోడానికి, ప్రజాస్వామ్యం పేరుతో అధికారాన్ని అనుభవించడానికి ముఠాగా తయారయ్యారు అంటే తప్పేమి.

మార్చిలో జిఒ తెచ్చి ఏప్రిల్‌లో వెలుగులోకి తేబడినటువంటి 16 ప్రజా సంఘాల నిషేధంపై టిఆర్ఎస్‌లోని గతంలో వామపక్ష భావజాలంతో ఉన్న ఏ ఒక్క ఎంఎల్ఎ గాని, మంత్రి గాని, ఇతర కిందిస్థాయి వారెవరూ కూడా నోరు విప్పింది లేదు. అందుకు ఈటెల రాజేందర్ మినహాయింపు కాదు. ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు విద్యా, వైద్యాలకు కేటాయించినది గత ప్రభుత్వాల కంటే కూడా తక్కువే. బడ్జెట్‌లో ఈ రంగాలకు అధిక కేటాయింపుల గురించి నోరు విప్పింది లేదు. అంతగా నాయకునికి అణిగిమణిగి ఉండే స్వభావాన్ని సంతరించుకున్నారన్నమాట.

పాలకవర్గాలలో వారిలో వారికి పడక ఒకరి ప్రయోజనాలకు మరొకరు అడ్డు రావడం వంటి వాటివల్ల అంతర్గతంగా ఘర్షణలు మొదలై బహిరంగం అవుతుంటాయి. అధికారం ఎక్కువగా ఉన్నవారు తమకు అడ్డు వచ్చే తమ తానులోని ముక్కను, లేదా గుడ్డిలో మెల్లలా కొద్దో గొప్పో మంచి అనుకునే వారిని అణచి వేస్తుంటారు. ప్రశ్నించే వారన్నా, వారి భాగోతాల గుట్టు విప్పిచెప్పే వారన్నా వారికి సహించదు. అధికారం, అంగబలం చేతిలో ఉన్నప్పుడు వారి అహంకారాలకు, అధికారాలకు ఏమాత్రం అడ్డంకి ఎదురైనా భరించలేరు. తమకు వందిమాగదులుగా, తానా అంటే తందానా అనే భజనపరులనే కోరుకుంటారు. టిఆర్ఎస్‌లో హరీష్‌రావు, రాజేందర్‌లకు ప్రజల్లో సానుకూలత వస్తున్నదని అనుకున్న కెసిఆర్ వారి మంత్రిత్వ శాఖలను మార్చివేశాడు. వారిని పక్కకు పెట్టడం మొదలు పెట్టాడు. వారికి ప్రాధాన్యతను తగ్గించే పనిలో పడ్డాడు. కెసిఆర్ ఆంతరంగికుల్లో ముఖ్యులుగా ఉన్న రాజేందర్‌కు గాని, హరీష్‌రావుకు గాని రానురాను ప్రాధాన్యత తగ్గుతూ వస్తున్నది. 2014కు ముందు కెసిఆర్ వేరు, 2014లో అధికారంలోకి వచ్చాక కెసిఆర్ వేరని రాజేందర్ అంటున్నాడు. కెసిఆర్‌ను కలవడానికి ఏడెనిమిది మంది ఎంఎల్ఎలతో అతను వెళితే లోపలికి పంపించలేదని, ప్రగతి భవన్ గేటు వద్ద నుండే పంపించివేశారని అన్నాడు. కెసిఆర్‌ను కలవకున్నా సరే కానీ కనీసం లోపల నుండి బయటకు వచ్చాక కెసిఆర్‌తో మాట్లాడి వచ్చామని చెప్పుకుంటామని చెప్పినా కూడా అవకాశం ఇవ్వలేదని రాజేందర్ బాధపడ్డాడు. కెసిఆర్ తమని కలవడానికి నిరాకరించడంపై హరీష్‌రావు, రాజేందర్‌లు గంటసేపు ఏడ్చారని రాజేందర్ చెబుతున్నాడు.

2014లో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనతికాలంలోనే ఆరోగ్య శాఖ మంత్రి రాజయ్యపై అవినీతి ఆరోపణలు వచ్చాయని మంత్రి పదవి నుండి తొలగించబడ్డాడు. దాంతో కెసిఆర్ అనుకుంటే ఎవరినైనా తీసి అవతల పెట్టగలడని స్పష్టత వచ్చింది. ఎవరైనా సరే కెసిఆర్‌కు కోపం తెప్పించకుండా జాగ్రత్తగా మసలుకోవాలనే సంకేతాన్ని పంపించాడు. అధికారంలో ఉన్న చాలా మందికి ఏదో ఒక మకిలి అంటుకునే ఉంటుంది. ఏదో ఒక చట్ట వ్యతిరేక చరిత్ర ఉండనే ఉంటుంది. వారి ప్రయోజనాలు నెరవేరాలంటే అధిష్టానానికి, దాని అధికారానికి, అహంకారానికి లోబడి ఉండవలసిందే. లేదంటే తామే అధికారాన్ని చేజిక్కించుకోవాల్సి ఉంటుంది.

నిస్వార్థంగా, ఉన్నత ఆశయాలతో, ప్రత్యామ్నాయ రాజకీయాలతో ప్రజలలో పనిచేస్తున్న మేధావులను, విద్యార్థులను, మహిళలను, హక్కుల కార్యకర్తలను, మరెందరో ప్రజా సంఘాల కార్యకర్తలను, నాయకులను అక్రమంగా నిర్బంధాల పాల్జేయడంలో, అక్రమ కేసుల్లో ఇరికించడంలో అధికారంలోకి వచ్చిన సత్వర కాలంలోనే టిఆర్ఎస్ ప్రభుత్వం ఆరితేరింది. ప్రభుత్వంలో ఉంటూ లేదా దానికి సహకరిస్తున్న ఒకప్పటి ప్రజల పక్షంగా ఉన్న బుద్ధిజీవులు ఈ అణచివేతలపై పెదవి విప్పడం లేదు. దానికి రాజేందర్ మినహాయింపేమి కాదు. కుట్రపన్ని మంత్రి పదవి లాగేసిన కెసిఆర్‌ను ఇప్పటికీ ఎంతో గౌరవంగా, మర్యాదగా మా సార్ అని సంబోధించడం చూస్తుంటే తన ఆత్మగౌరవాన్ని ఎంతలా కోల్పోతున్నాడో తెలుస్తుంది. కానీ దీన్ని ఈటెల తన సంస్కారం అని అంటున్నాడు.

తమ్మి మాట్లాడుకుందాం అంటే కరిగిపోయే వాడిని అని రాజేందర్ అంటాడు. ఇదంతా కూడా ఇప్పటివరకు వారిద్దరి మధ్య వ్యవహారంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ ప్రజల ఆకాంక్షలను, ఆశలను సాధించుకోవడం కోసం అయితే కనిపించదు. ఇక ముందు ఎలా ఉంటుందో మరి. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి బలమైన ఉద్యమానికి నాంది పలుకుతాడా అన్నది ఈటెల రాజేందర్ చెప్పవలసిందే. దాన్ని తన ఉద్యమ ఆచరణ ద్వారా నిరూపించు కోవల్సిందే. ప్రొఫెసర్ జయశంకర్ ఎప్పుడు అనేది తెలంగాణ కోసం ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యు దాకా అందరినీ కలుపుకొని పోవాలి. అలాంటి మాటలే ఆత్మగౌరవం పేరుతో సిద్ధాంతాల పట్టింపులేమీ లేకుండా చెబుతున్నాడు. తన మంత్రి పదవి పోయినందున తన నాయకుడు కెసిఆర్ తనను తక్కువ చేసినందుకు నిరసనగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి అవమానం జరిగిందని, ఆత్మగౌరవ పోరాటం చేస్తామని ప్రకటిస్తున్నాడు.

ఒకవేళ కెసిఆర్ తన మంత్రి పదవిని తొలగించకుండా తనకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే ఎవరి ఆత్మగౌరవానికి భంగం జరిగేది కాదేమో అని అనిపించకమానదు. కెసిఆర్ తన మాటకు ఎదురు లేకుండా అప్రజాస్వామిక పాలన చేస్తున్నాడు. దాన్ని ఎదుర్కోవడానికి ఈటెల రాజేందర్ అంతర్గతంగా పోరాటం చేయడం టిఆర్ఎస్ కార్యకర్తలను సమీకరించడమో చేసిన దాఖలాలు ఇప్పటికైతే లేవు. కాకుంటే గత రెండు, మూడేళ్లుగా నర్మగర్భంగానైతే మాట్లాడుతున్నాడు. పార్టీ జెండా మోసే వాళ్లం మాత్రమే కాదు దానికి ఓనర్లమని అన్నాడు. అధికారం ఉంటుంది పోతుంది, పార్టీలు ఉండొచ్చు పోవచ్చు అని కూడా అన్నాడు. ఇది పరోక్షంగా కెసిఆర్‌ను నిందించడం, ధిక్కరించడం కూడా. దీన్ని కెసిఆర్ భరిస్తాడా. అదును కోసం చూసి శాసనసభ ఉప ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు అయ్యేదాకా ఆగి ఎన్నికలు లేవని నిర్ధారించుకుని ఉన్నపళంగా ఏప్రిల్ 30న భూకబ్జా వార్తలు ప్రసారం చేయడం, అదేరోజు రాజేందర్‌పై విచారణకు ఆదేశించడం వెంటవెంటనే జరిగిపోయాయి.

మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామవాసులు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాయడమే ఆలస్యం వెంటనే అది ముఖ్యమంత్రికి చేరిపోతుంది. వెంటనే విచారణకు ఆదేశించడమూ జరిగిపోతుంది. ఈలోగా కెసిఆర్‌కు అనుకూలంగా ఉన్నాయనుకునే టివి ఛానళ్లలో ప్రముఖంగా ప్రసారాలు కావడం, నమస్తే తెలంగాణ పత్రికలో భూకబ్జాపై మొదటి పేజీ నుండి పేజీలకు పేజీలు ప్రచురించడం జరుగుతుంది. గ్రామస్థులు రాసిన లేఖను ఒరిజినల్‌ది కాదు కానీ దాన్ని ప్రింట్ అక్షరాల్లో ముద్రించారు. ఏప్రిల్ 30న ఈ విషయం వెలుగులోకి వచ్చిందని నమస్తే తెలంగాణ మే 1న పత్రికలో రాసింది. మే 2న రాజేందర్‌ను ముఖ్యమంత్రి సలహా మేరకు మంత్రి పదవి నుండి తొలగిస్తూ గవర్నర్ ప్రకటించారు.

ముఖ్యమంత్రి అనుకుంటే ఉన్నతాధికారులు వాయు మేఘాల మీద స్పందిస్తారని, ప్రభుత్వం అనుకూల రిపోర్టులు ఇవ్వగలరని స్పష్టమవుతుంది. రాజేందర్ భూ కబ్జాదారుగా, దోషిగా గుర్తించబడతాడు. ఆగమేఘాల మీద మంత్రి పదవి నుండి తొలగించడం అంటే ముఖ్యమంత్రి చర్యలపై అనుమాన పడాల్సిందే. దీన్ని ఒక కుట్రగానే చూడాల్సి ఉంటుంది. ఇదంతా కూడా చంపేటప్పుడు పిచ్చికుక్క అని ప్రచారం చేసినట్లు అనిపించకమానదు. రాజు అనుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు ముఖ్యమంత్రి అనుకుంటే ఒక్క రోజులోనే అన్ని అయిపోతాయి.

మంత్రి మల్లారెడ్డిపై, తిరిగి ఎంఎల్‌సిగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూ కబ్జాలు, అక్రమాలపై ఆధారాలతో కూడిన ప్రసారాలు వచ్చాయి. అక్కడ ఎలాంటి విచారణ ఉండదు. కానీ రాజేందర్ విషయంలో ఒక్క రోజులోనే అన్ని జరిగిపోతాయి. ఇది ఒక్క రోజులో జరిగిన వ్యవహారం కాదని రాజేందర్ సున్నితంగా అయినా సరే ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నప్పటి నుండి దాన్ని సహించలేక పథకంతో చేసిన కుట్రగా అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న రాజేందర్‌కు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వ విధానాల నిర్ణయాలలో కలుపుకోకపోవడం వంటి వాటితో పొమ్మనలేక పొగపెట్టి అదేదీ కుదరకపోవడంతో ఈ పన్నాగం పన్నారని అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ ఈటెల రాజేందర్ తప్పు చేసి ఉంటే దానిని చట్ట ప్రకారం నిరూపించవచ్చు. అలాగే కెసిఆర్ తనతో సహా తన మంత్రివర్గంలో కానీ, తన పార్టీలోని వివిధ నాయకత్వాలపై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరిపి నిజా నిజాల నిగ్గు తేల్చవచ్చు.

ఈటెల రాజేందర్‌ను మంత్రి పదవి నుండి తొలగించిన వెంటనే రాజేందర్ నియోజకవర్గం హుజూరాబాద్‌లో మరో మంత్రిచే రాజేందర్‌కు వ్యతిరేకంగా క్యాంపెయిన్ ప్రారంభించారు. రాజేందర్‌కు మద్దతు పలికిన వారితో తిరిగి కెసిఆర్ వెంటే మేముంటామని అనిపిస్తున్నారు. ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే గవర్నర్‌కు రాజేందర్‌ను మంత్రి పదవి నుండి తొలగించమని సిఫార్సు చేయడం తప్పితే కెసిఆర్ ఇంతవరకూ ఈటెలపై మాట్లాడలేదు. కానీ తాను అనుకున్న ఆపరేషన్‌ను నడిపిస్తుంటాడు. అధికారంలో ఉన్నవారితో అంటకాగితే తమ పనులు సులువుగా చేసుకోవడం అవుతుంది. దీనికి విరుద్ధంగా ఉంటే ప్రతి రోజు సంఘర్షణలతో గడపాల్సి వస్తుంది. దీనికి సిద్ధపడే ఆత్మస్థైర్యం, నిజాయితీ, నిస్వార్థం ఎంత మందికి ఉంటుంది. రాజేందర్‌కు వ్యతిరేకంగా అతడు అవినీతిపరుడని మాట్లాడుతున్న టిఆర్ఎస్ మంత్రులు, ఇతర నాయకులు చేస్తున్న ఆరోపణలు నిజమే అయితే ఇంతకాలం వారంతా తమ అధికారం, పదవులు, స్వప్రయోజనాల కోసం ఎంతలా రాజీ పడ్డారో, ప్రజల సంక్షేమాన్ని ఎంతగా దగా చేశారో అర్థం చేసుకోవచ్చు. అవి నిజం కాకపోతే కనుక కెసిఆర్ పంచన చేరి తమ ప్రాబల్యాన్ని, ప్రయోజనాలను నెరవేర్చు కోవడానికి ఎంతటి కుతర్కానికైనా, నీచానికైనా, అబద్ధాలకైనా తెగబడతారని తెలుసుకోవచ్చు.

ఇదంతా అధికారం కోసం ఆటలా కాకుండా నిజంగానే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటంగా ఎదిగి ప్రజల న్యాయమైన డిమాండ్లైన ఉచిత గుణాత్మక విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలు, భూముల పంపకాలు, తాగునీరు, సాగునీరు మొదలగు సమస్యల పరిష్కార దిశలో నడిస్తే సంతోషపడవల్సిందే. అలాంటి ఉద్యమానికి నడుం బిగిస్తే ఈటెల రాజేందర్‌ను అభినందించాల్సిందే. తెలంగాణలో కెసిఆర్ పాలనకు వ్యతిరేకంగా, హక్కుల గ్యారెంటీ కోసం, మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమం రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

రఘురామ కృష్ణరాజుపై 'రాజద్రోహం' కేసు

***తమకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్‌లోని జగన్ ప్రభుత్వం హెచ్చరిస్తోందని అంటున్నారు* చిమ్మె. జాన్ బర్నబాస్**

మే 14న హైదరాబాద్‌లో గల గచ్చిబౌలిలోని నివాసంలో తన పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలో ఉండగా ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎం.పి రఘురామ కృష్ణరాజును ఆంధ్రప్రదేశ్ సిఐడి పోలీసులు దాదాపు 35 మంది ఇంట్లోకి చొరబడి అరెస్ట్ చేసి గుంటూరుకు తీసుకువచ్చారు. అతనిపై 'రాజద్రోహం' – 124ఎ ఐపిసి సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. వాటితో పాటు ఐపిసి సెక్షన్ 505, సెక్షన్ 120బి, సెక్షన్ 153ఎ కూడా కలిసి క్రైం నెం. 12/2021 సిఐడి రీజినల్ పోలీస్ స్టేషన్, మంగళగిరిగా నమోదు చేశారు. ఒక లోక్‌సభ సభ్యునిపై రాజద్రోహం కేసు నమోదు కావడం చేత ఇది మొత్తం దేశంలోనే పెద్ద చర్చనీయాంశమైంది.

ఒక సంవత్సరం కాలంగా ఆయన ఢిల్లీలోనే ఉంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై అనేక విమర్శనాస్త్రాలు సంధిస్తూ వార్తల్లో నిలిచారు. అంతేకాకుండా అదే పార్టీ నుంచి లోక్‌సభకు ఎంపికైనప్పటికీ, రాష్ట్ర ముఖ్యమంత్రిపై గతంలో ఉన్న కేసులలో ఇచ్చిన 'బెయిల్'ను రద్దు చేయాలని కోరుతూ సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను సాక్ష్యులను ప్రభావితం చేస్తాడని, కాబట్టి జగన్‌మోహన్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సిబిఐ కోర్టులో తానే పిటిషనర్‌గా పిటిషన్ దాఖలు చేశారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల ఆగ్రహానికి గురైనారు రఘురామకృష్ణరాజు. అయితే ఇక్కడ ఐపిసి సెక్షన్ 124ఎ 'రాజద్రోహం' వర్తిస్తుందా? అనేది చర్చనీయాంశమైంది. అసలు రాజద్రోహమంటే ఏమిటి? 'రాజకీయ వ్యవస్థ అమలులో ఉన్నప్పుడు రాజులకు, చక్రవర్తులకు వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, వారితో పోరాడడానికి పెద్ద సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని లేదా బయటి శక్తులతో కుట్రపన్ని, ప్రస్తుతం ఉన్న వ్యవస్థను కూలదోయడానికి కుట్రపన్ని, దానికి ప్రయత్నించడంలో భాగస్వామయిన వ్యక్తిగా తాను ప్రత్యక్షంగా పాల్గొనడం రాజద్రోహమౌతుంది'. కాని ఇక్కడ తాను ప్రయోగించిన భాష, మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువై ప్రజలలో తిరుగుబాటు బావుటా ఎగరవేయడానికి, ప్రజలను ప్రేరేపించడానికి కారకులయ్యారనేది ప్రధాన ఆరోపణ. ఇక్కడ కేసు నిలబడుతుందా లేదా అనేది తర్వాత విషయం. ఒక ప్రభుత్వం 'రాజద్రోహం' అనే సెక్షన్ – 124ఎ ఐపిసిను కేవలం 'పద ప్రయోగం' వాడిన దానికి కేసు నమోదు చేయొచ్చా అనేది ప్రధాన చర్చనీయాంశం. ఆ వ్యక్తి పార్లమెంట్ సభ్యుడు అయినా కాకున్నా, సామాన్య పౌరుడైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడు, లేదా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినప్పుడు, తమ భేదాభిప్రాయాన్ని తెలియజేసినప్పుడు అధికారంలో ఉన్నావారు తట్టుకోలేక 'రాజద్రోహం' నేరం మోపడం ఇప్పుడున్న ప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యవస్థలో సమంజసమేనా? అనేది ప్రధాన చర్చ. పూర్తిగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్న భారత రాజకీయ వ్యవస్థలో ఈ సెక్షన్ అనేక సార్లు వివాదాస్పదంగా మారి, ప్రతిపక్ష పార్టీల నాయకుల నోర్లు కట్టివేయడానికి ప్రయోగించబడింది. ప్రస్తుతం ఈ సెక్షన్‌ను తొలగించే ప్రక్రియలో భాగంగా కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది.

ఇండియన్ పీనల్ కోడ్ ఐపిసి సెక్షన్ 124ఎ ప్రకారం – 'చట్టబద్ధమైన ప్రభుత్వంపై ఏదో ఒక విధంగా ద్వేషాన్ని, నిరసనను, భేద భావాన్ని కలిగించే ప్రయత్నాన్ని మాట ద్వారా కానీ, రాత ద్వారా కానీ, సైగల ప్రదర్శన ఇతరత్రా కానీ చేస్తే జీవితకాలం జైలుశిక్ష, జరిమానా లేదా మూడేళ్లు జైలు, జరిమానా విధించవచ్చు అనేది నిర్వచనం. దీనిని మెకాలే రచించారు. భారతదేశంలోని విద్యా వ్యవస్థను బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ఊడిగంచేసే గుమాస్తాలను తయారు చేసే విధంగా రూపొందించిన రూపకర్త మెకాలే. ప్రభుత్వంపై ఏదో ఒక రకమైన అసమ్మతి, లేదా నిరసన తెలిపే అవకాశం ప్రజలకు లేకపోతే అది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? భారతదేశం తమ వలసదేశం కాబట్టి బ్రిటిష్ పాలకులు 1870లో ఈ సెక్షన్‌ను అమలులోకి తీసుకొచ్చారు. అప్పుడు దేశంలో జరుగుతున్న చిన్నా, పెద్ద ప్రజా తిరుగుబాట్లను అణిచివేయడానికి దీనిని ఉపయోగించారు. 124ఎను ప్రయోగించి బ్రిటిష్ పాలకులు మలబార్, అండమాన్ జైళ్లలో ప్రజలను నిర్బంధించేవారు. ఇప్పుడు కూడా పాలకులు తాము దైవాంశ సంభూతులుగా భావిస్తూ, నియంతలుగా భావిస్తూ ఈ 'రాజద్రోహ' నేరాలను మోపాలని చూస్తున్నారు. ఇప్పుడున్న ప్రజాస్వామిక వ్యవస్థలో ఇది ఎంతవరకు సమంజసం? కనీసం నేరం మోపబోయే ముందు దానికున్న పరిధి, వాస్తవిక ఆధారాలు, సాక్ష్యాలు, ఆవశ్యకత కూడా పరిగణలోకి తీసుకోలేదు.

ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో ధూషించాడనే నేరంపై రఘురామకృష్ణరాజు అరెస్ట్‌ను చూపుతూ మొత్తం భవిష్యత్తులో అందరికీ ఇది వర్తిస్తుందనే హెచ్చరికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఇదే ప్రామాణికం అయితే గతంలో ఇప్పుడున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అనేక వ్యాఖ్యానాలకు ఎంతకాలం శిక్ష అనుభవించాల్సి వచ్చేదో నిజంగా గత ప్రభుత్వాలు తనపై సెక్షన్ 124ఎ ఐపిసి నమోదు చేసి ఉండి ఉండింటే. చరిత్రలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకోవలసి ఉంది. రఘురామకృష్ణరాజు మాట్లాడిన మాటలు సమర్థించవలసిన అవసరం లేదు. అతనిపై పరువు నష్టం కేసు వేసుకోవచ్చు లేదా తమ పార్టీ నుంచి బహిష్కరించవచ్చు లేదా అతని నుంచి సంజాయిషీని కోరవచ్చు. కనీసం ఐపిసి సెక్షన్ 41ఎ నోటీసు

కూడా ఇవ్వలేదు. మొత్తం అరెస్ట్ సందర్భంగా పోలీసులు వ్యవహరించవలసిన తీరు గురించి 'డి.కె. బసు వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్' కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఏమీ పాటించలేదు. అరెస్ట్ చేసిన తర్వాత నోటీసును తిరస్కరించినట్లు ఇంటి కాంపౌండ్ గోడకు అంటించారు. పోలీసులు తాము ఏమి చేయదలచుకున్నారో అదంతా చేసి చూపించారు. ఎవరో చెపితే చేసినట్లు చేసి నాటకీయతను చాటుకున్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిఐడి, రాష్ట్ర జైలు అధికారులు, హైకోర్టు ఏర్పాటు చేసిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలోని ముగ్గురు డాక్టర్ల బృందం అందరూ సుప్రీంకోర్టు దృష్టిలో దోషులుగా చూడబడుతూ, నిందితునికి సరైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని మిలిటరీ ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు.

ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం దోషిగా నిలబడింది. సుప్రీంకోర్టు దృష్టిలో రాష్ట్ర ప్రభుత్వం ఏదో తప్పు చేసినట్లు, న్యాయ వ్యవస్థ ప్రమాణాలు రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించినట్లు స్పష్టపరచబడింది. అంతేకాకుండా రాఘురామ కృష్ణరాజుతో పాటు ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి5 ఛానళ్ల మీద కూడా (ఐపిసి 120బి) కుట్ర కేసు, రాజద్రోహం (ఐపిసి 124ఎ) నేరం నమోదు చేసినట్లు తెలిసింది. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరీ తప్పు చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ రెండు ఛానళ్లను గ్రామీణ ప్రాంత డిష్ కనెక్షన్‌లలో తొలగించింది. కేవలం శాటిలైట్ నెట్‌వర్క్ ఉన్న వారికి మాత్రమే ఈ రెండు ఛానళ్లు అందుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో ఈ రెండు ఛానళ్ల వారిపై కూడా రఘురామకృష్ణరాజుతో సఖ్యతతో ఉన్నారనే కారణాన్ని చూపించి వారిపై కేసులు నమోదు చేయడం ప్రజలలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. అంతేకాకుండా రఘురామ కృష్ణరాజు ప్రెస్‌మీట్‌లను ఈ రెండు ఛానళ్లు మాత్రమే ప్రసారం చేశాయనేది ప్రధాన ఆరోపణ. ఢిల్లీలో ఉన్న ఎంపికి అనేక న్యూస్ ఛానళ్లతో సంబంధాలుంటాయి. సహజంగా పార్లమెంట్ సభ్యులకు అధికారికంగా దేశవ్యాప్తమైన జ్యుడిస్‌డిక్షన్, ప్రొటోకాల్ వర్తిస్తాయి. దేశంలోని ఏ మూల సమస్యనైనా వారు ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావచ్చు. దానిని ఫోకస్ చేసే అధికారం వారికి రాజ్యాంగం ఇచ్చింది. దానిపై దేశవ్యాప్తమైన ప్రాచుర్యం లభిస్తుంది. ప్రధాన మంత్రి, రాష్ట్రపతి దృష్టికి కూడా ఆ సమస్య వెళుతుంది. చాలా మట్టుకు స్థానిక సమస్యల పైననే వారు దృష్టి పెడుతూ ఉంటారు.

భారత రాజ్యాంగం ఇచ్చిన ఆర్టికల్ 19 – 'భావ ప్రకటనా స్వేచ్ఛ'ను అడ్డుకోవడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. అంతే కాకుండా తమకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడంలో భాగమే మీడియా ఛానళ్లపై కేసు నమోదు. ఎలాంటి వ్యక్తినైనా మేం ఉపేక్షించబోం అనే హెచ్చరికను ప్రజలకు తెలియజేయడంలో భాగంగానే ఈ రాజద్రోహం కేసు నమోదు కాబడింది. ప్రభుత్వం అనుకుంటే ఎన్ని రోజులైనా జైలులో పెట్టి వేధించగలదు అనే హెచ్చరికలను ప్రశ్నించే వారికి, ప్రజా సంఘాల నాయకులకు తెలియజేయడంలో భాగంగానే ఈ కేసు నమోదు ప్రక్రియ.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ ఇంతవరకూ 25 శాతం కూడా కాలేదు. వ్యాక్సిన్‌ల కొరత ఎక్కువగా ఉంది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెరుగుతున్న కోవిడ్ మరణాలు, ఆక్సిజన్ కొరత, డాక్టర్లు, ఆసుపత్రుల సిబ్బంది దురాగతాలు, అనేక సమస్యలపై ప్రజలలో ఆందోళన ఉంది. అయితే దానిని పక్కతోవ పట్టించడానికి, ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మరల్చడానికి 'రాఘురామ కృష్ణరాజు అరెస్ట్'ను ప్రభుత్వం ఒక సాకుగా చూస్తున్నది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పూర్తిగా 'కరోనా'తో ప్రజలు భయాందోళనలలో ఉంటే, వారి ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నది. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ప్రభుత్వ ఉన్నతాధికారికే సరైన వైద్యం సకాలంలో అందక మరణించాడు. దాదాపుగా ప్రభుత్వ ఆసుపత్రులన్నీ కరోనా రోగులతో నిండిపోయాయి. తిరుపతి రుయా ఆసుపత్రిలో ఒకే రోజు 44 మంది ఆక్సిజన్ అందక చనిపోతే దానిని రాష్ట్ర ప్రభుత్వం తక్కువ చేసే ప్రయత్నం చేసింది. అనంతపురంలో ఒకే రోజు 10 మంది మరణించారు. ప్రజలలో 'కుల వైషమ్యం' రెచ్చగొట్టడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకన్నా మించినవారు ఎవరూ లేరు. ఎందుకనగా భారత్ బయోటిక్ సంస్థకే వారు కులాన్ని ఆపాదించినారు. అంతేకాకుండా ప్రాణాధార మందులను, వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేసే కంపెనీల యాజమాన్యాలకు 'కులం' అంటగట్టడం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికే చెల్లింది. మరి ఆయనపై ప్రజలలో సామాజిక వర్గాల వారీగా విభేదాలను సృష్టించినందుకు కేసు నమోదు చేయాలి కదా! రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక నియంత మాదిరి వ్యవహరిస్తున్నాడు.

రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో దీనిని ఛాలెంజ్ చేశారు కాబట్టి మొత్తం కేసంతా సుప్రీంకోర్టులో నడుస్తోంది. అక్రమ కేసు, అరెస్ట్, వైద్య సదుపాయం, కేసును కొనసాగించాలా వద్దా అన్నది ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నది. అదే ఒక సామాన్య పౌరునిపైన ఇలాంటి సెక్షన్ 124ఎ ఐపిసి నమోదు చేస్తే దీనికి ఇంత ప్రాధాన్యత ఉంటుందా? కేవలం ప్రజల అసమ్మతిని, అణిచివేయడానికి గతంలో బ్రిటిష్ వారు ప్రయోగించిన ఈ చట్టాన్ని ఇప్పుడున్న ఎన్నికల ద్వారా 5 సంవత్సరాలకొకసారి అధికారం చేపట్టే రాజకీయ పార్టీలకు ప్రజలపై 124ఎ ప్రయోగించడం ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందా? ఇది పూర్తిగా ప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేకం. అయినప్పటికీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలకు విలువనివ్వకుండా, కేవలం పోలీసుల ద్వారా అక్రమ నిర్బంధాలను, అక్రమ కేసులను నమోదు చేయడం ద్వారా పాలన కొనసాగించాలని అనుకుంటున్నారు. చరిత్రలో ఎన్నో రాజకీయ పార్టీలు అధికారాన్ని అనుభవించి, ప్రస్తుతం తెరమరుగైనాయి. భారత రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులకు నిరంతరం 'అణచివేత' ద్వారా భంగం కలిగించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనిపించుకోదు. అధికారానికి రాక ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా పోలీసులకు అధికారాలిస్తూ వారి ద్వారానే పాలన కొనసాగించాలని చూడడం విచారకరం. అన్ని పోలీసులే చూసుకుంటారు, ప్రతిపక్ష పార్టీల నాయకులను నిర్బంధించడం, అక్రమ కేసులు బనాయించడం అనేది నేడు అధికారంలో ఉన్న ప్రతి రాజకీయ పార్టీ చేస్తున్న ప్రక్రియనే. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అనగా బియ్యం, అమ్మ ఒడి పెన్షన్, ఉచిత వివాహాలు లాంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలను బిచ్చగాళ్లుగా మార్చి, అంతకు నూరంతలు వారిని దోపిడీ చేస్తూ వారిలో ఉన్న పోరాట పటిమనంతా జలగల మాదిరి నేటి పాలకులు పీల్చి పిప్పి చేస్తున్నారు. నోరు తెరిస్తే సంక్షేమ కార్యక్రమాలు నిలిపివేస్తారనే భయాన్ని ప్రజలకు కలిగిస్తున్నారు. ప్రజలలో మార్పుకై 'తెగువ'తో పోరాడడం మినహా మనముందు ఏ ప్రత్యామ్నాయమూ లేదు. ప్రజాస్వామిక పోరాటాలను బలపరచడం ద్వారా రాజ్యాంగ హక్కులను కాపాడుకోగలుగుతాం. ఆ దిశగా మనలను మనం తీర్చిదిద్దుకుందాం.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

ఆంధ్రప్రదేశ్ దాగుడు మూతల బడ్జెట్

***ఇలాంటి బడ్జెట్‌లో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి, అభివృద్ధి కుంటుపడి, ఉపాధి మృగ్యమై భవిష్యత్తులో దివాళతీస్తే ఆస్తులు అమ్ముకోవడం తప్ప మరోమార్గం లేదంటున్నారు* నర్సింహా**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021 - 22 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మే 20న అసెంబ్లీకి సమర్పించారు. ఓ వైపు కరోనా కల్లోలం, మరోవైపు కేంద్ర ప్రభుత్వ నిరాదరణ... అమడ దూరంలో అభివృద్ధి.. వాణిజ్యం అంతంతే. గల్లా పెట్టెలోకి పైసా దూరే అవకాశం లేదు. డోఖా లేదనే బెరుకు లేదు. ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలే ఆధారం. వీటికి పెట్టుబడి పెట్టే స్థోమత లేనప్పుడు ప్రజలే ప్రభుత్వానికి దిక్కు అనే అంశానికి ఎపి ప్రభుత్వ బడ్జెట్ అద్దం పట్టింది. తొలిసారి రు. 47,283 కోట్లతో లింగాధారిత పద్దును ప్రవేశపెట్టింది. బడ్జెట్ మొత్తం రు. 2,29,779.77 కోట్లలో రెవెన్యూ వ్యయం రు. 1,82,196.54 కోట్లు కాగా, పెట్టుబడి వ్యయం రుణాల చెల్లింపుతో కలిపి రు. 47,582.54 కోట్లు ప్రతిపాదించారు. అంటే వడ్డీల చెల్లింపు పోగా మిగిలె పెట్టుబడి వ్యయం రు. 31,198 కోట్లు మాత్రమే. ఇక రెవెన్యూ ఆదాయం రు. 1,77,196.48 కోట్లు కాగా, కేంద్ర పన్నుల్లో వాటా రు. 26,935.32 కోట్లు. కేంద్ర గ్రాంట్ల రూపంలో రు. 57,930.62 కోట్లు వస్తాయని అంచనా వేశారు. రెవెన్యూ లోటు రు. 5,000.05 కోట్లు కాగా, ద్రవ్యలోటు రు. 37,029.79 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఆశించినంత ఆదాయం రాని క్రమంలో అప్పులే ప్రధాన ఆలంబనగా గత సంవత్సరం కన్నా కొద్దిగా బడ్జెట్ అంచనాలు పెంచారు. గత సంవత్సరం బడ్జెట్ అంచనా రు. 1,61,958.50 కోట్లు కాగా, ఖర్చు చేసింది రు. 1,18,063.09 కోట్లు మాత్రమే. అంటే 82 శాతం మాత్రమే ఖర్చు చేయగలిగారు. ప్రభుత్వానికి ఈ ఏడాది పన్నుల ద్వారా ఖజానాకు రు. 85.280 కోట్లు జమ అవుతాయని అతి అంచనా వేసింది. గత ఏడాది పన్నుల ద్వారా ఆదాయాన్ని రు. 70.629 కోట్లు అంచనా వేయగా రు. 57 వేల కోట్లు ఖజానాకు చేరాయి. పరిస్థితుల్లో ఏ మార్పు వస్తుందని ఊహించారో కానీ దాదాపు రు. 28 వేల కోట్లు అదనంగా పన్నుల రూపంలో వస్తాయని ఆశించారు. కోవిడ్ కల్లోలం, లాక్‌డౌన్ నేపథ్యంలో మరింత అంచనాలు పెరిగినా ప్రస్తుత బడ్జెట్ ఏ మేరకు ఖర్చు చేయగలరనేది ప్రభుత్వానికి సవాలే.

ఆదాయాలు ఆశించే మార్గాలు	**2020-21 అంచనాలు**	**2020-21లో వాస్తవంగా సాధించింది**	**2021-22లో అంచనాలు (రు. కోట్లలో)**
కేంద్ర పన్నుల్లో వాటాలు	32,237.68	24,441.40	26,935.32
పన్ను రాబడి	70,679.31	57,377.97	85,280.53
పన్నేతర ఆదాయం	5,866.07	3,309.61	7,050.01
కేంద్ర సాయం	53,175.42	32,934.12	57,930.62
మొత్తం	1,61,958.50	1,18,063.09	1,77,196.48

మూలధన వ్యయం అంతంతే

అభివృద్ధి పనులకు, మౌలిక సౌకర్యాలకు అన్నింటికన్నా ముఖ్యం మూలధన వ్యయమే. గత సంవత్సరం మూలధన వ్యయం కింద రు. 29,907.62 కోట్లు వ్యయంగా ప్రతిపాదిస్తే ఖర్చు చేసింది మాత్రం రు. 18,797.39 కోట్లే. అంటే గత ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన దాంట్లో సగం కన్నా కాస్త ఎక్కువ ఖర్చు చేయగలిగారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో సాకారం కావాలంటే ఆదాయ సముపార్జన అన్నింటికంటే ముఖ్యం. గత అనుభవాలు గమనిస్తే అంచనాలు చేరుకోవడం అసాధ్యమనిపిస్తుంది. అందుకే ఇది ఆశల బడ్జెట్. వాస్తవాలు వచ్చే మార్చ్ నాటికి తెలుస్తాయి. రాష్ట్ర అప్పులు నానాటికి పెరిగి పోతున్నాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దిగిపోయే నాటికి గల అప్పు రు. 2,57,509 కోట్లు కాగా, 2022 మార్చ్ నాటికి రాష్ట్ర అప్పు రు. 3.87 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రతి ఏటా రు. 40 నుంచి 50 వేల కోట్లు ప్రభుత్వం అప్పులు చేస్తుంది. అప్పులు పెరిగినా వృద్ధిరేటు పెరగడం లేదు. సమగ్రాభివృద్ధి, ఆస్తుల కల్పనపై దృష్టిలేదు. అమూలాగ్రం సంక్షేమం మాత్రమే. ప్రభుత్వం చేసిన రుణాలు, బడ్జెట్‌లో పేర్కొన్న ద్రవ్యలోటు తీరాలంటే మద్యం రేట్లు నాలుగు రెట్లు పెరిగినా, మందు బాబులు బారులు తీరినా వడ్డీలకే సరిపోతుందంటే అతిశయోక్తి కానే కాదు. ఎప్పుడైనా ప్రభుత్వ రుణాలు తీర్చాల్సింది ప్రజలే కాబట్టి పన్నుల భారాన్ని మోయక తప్పదు.

అంకెల్లో బడ్జెట్ (రు. కోట్లలో)

వివరాలు	2020-21 (అంచనా)	2020-21 (స. అంచనా)	2021-22 (అంచనా)
ప్రారంభ విద్యా	-43.52	485.35	153.86
రెవెన్యూ ఆదాయం	1,61,958.50	1,18,063.09	1,77,196.48
పెట్టుబడి ఆదాయం	62,830.68	67,073.01	52,582.79
మొత్తం ఆదాయం	2,24,789.18	1,85,136.10	2,29,779.27
రెవెన్యూ వ్యయం	1,80,392.65	1,52,989.89	1,82,196.54
పెట్టుబడి వ్యయం	29,907.62	18,979.39	31,198.38
మొత్తం వ్యయం	2,24,789.15	1,85,467.59	2,29,779.27
రెవెన్యూ లోటు	-18,434.14	-34,926.80	-5,000.05
ద్రవ్యలోటు	-48,296.58	-54,369.18	-37,029.79

కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు అన్నీ కలుపుకొని రు. 85 వేల కోట్లు వస్తాయని ఆశించడం అత్యాశే. కేంద్రం నుండి 2019-20లో రు. 28,224 కోట్లు వస్తాయని ఆశించగా రు. 2187 కోట్లు జమ అయ్యాయి. 2020-21లో రు. 32,297 కోట్లు వస్తాయని అంచనా వేస్తే, రు. 24,441 కోట్లు వచ్చాయి. 2021-22లో రు. 26,935 కోట్లు వస్తాయంటున్నారు. ఇక గ్రాంట్ల పరంగా 2019-20లో రు. 21,875 కోట్లు. 2020-21లో రు. 53,175 కోట్లు అంచనా వేస్తే,

ముగిసిన మినీ ఎన్నికల ప్రహసనం

ఈ ఎన్నికల ఫలితాలు కుల, మత, భావోద్వేగాల కంటే స్థానిక సమస్యలకే ప్రాధాన్యతనిచ్చి మోడీ-అమిత్ షా ద్వయానికి తీవ్ర శృంగభంగాన్ని మిగిల్చాయని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలు కరోనా రెండవ దశ తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న దశలో, మార్చ్ 27 నుంచి ఏప్రిల్ 29 వరకు జరిగాయి. ఐదు రాష్ట్రాల్లో విభిన్న రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. మే 2న వెల్లడైన ఎన్నికల ఫలితాలు ఊహించని అద్భుతాలేవి ఆవిష్కరించలేదు. బిజెపి బెంగాల్‌లో మమతను ఎలాగైనా గద్దె దింపాలన్న ఆశలపై బెంగాలీలు నీళ్లు చల్లారు. అలాగే తమిళనాడులో ఎఐడిఎంకె పొత్తుతో అధికార పీఠం ఎక్కాలన్న కోరిక కూడా నెరవేరలేదు. హిందూత్వ ట్రంప్ ఈసారి పనిచేయలేదు. మూడు రాష్ట్రాల్లో బెంగాల్, కేరళ, అసోంలో అధికార పార్టీకి పగ్గాలు దక్కగా, రెండు రాష్ట్రాలో తమిళనాడు, పుదుచ్చేరిలో అధికార పార్టీలను ఓటర్లు తిరస్కరించారు. సంప్రదాయానికి భిన్నంగా 40 సంవత్సరాలుగా ప్రతి ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల మధ్య అధికార మార్పిడి చేస్తున్న కేరళ ఓటర్లు ఈ పర్యాయం అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్‌కు తిరిగి పట్టం కట్టడం విశేషం. దశాబ్దం తర్వాత తమిళనాట డిఎంకె స్టాలిన్ నేతృత్వంలో ఘన విజయం సాధించింది. గత ఏడు సంవత్సరాలుగా దేశ రాజకీయ యవనికపై బిజెపి చేస్తున్న దూకుడుకు ఈ ఎన్నికల ఫలితాలు కళ్లెం వేశాయి.

మన దేశంలో ఎన్నికలు ఒక ప్రహసనం:

1947 ఆగస్టులో అధికార బదిలీ జరిగిన తొలి రోజుల్లో రాజకీయ నాయకులంటే కొంత గౌరవం, అభిమానం ఉండేవి. నేడు రాజకీయాలు ఖరీదైన జీవన విధానంతో, హుందాతనం కోల్పోతున్న ప్రవర్తన, ఆహార్యంలో ఆర్భాటం, మాట్లాడే ప్రతి మాటలో ధర్పం, అసత్యాలు, అహంకార ధోరణులు మనకు కన్పిస్తున్నాయి. ఈ దేశంలో పారిశ్రామిక వేత్తల, బ్యూరోక్రాట్ల, రాజకీయ నాయకుల ఆస్తులు తరాలు తిన్నా తరగని సంపద పోగు చేసుకుంటున్నారు. నేటి నాయకులకు దేశాభివృద్ధి పట్ల, ప్రజల సమస్యల పట్ల, ప్రజాస్వామిక విలువల పట్ల అవగాహన శూన్యమనే చెప్పాలి. ఒకప్పుడు రాజకీయాల్లో చేరడానికి సామాజిక సమస్యలు, ఆర్థిక అసమానతలు, వివక్షతలను రూపుమాపడానికి, బలహీన వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు సమన్యాయం చేయాలనే ఉద్దేశాలు కారణాలుగా ఉండేవి. కాని నేడు కేవలం డబ్బు సంపాదన, అధికార దుర్వినియోగం అనే రెండు లక్ష్యాలతో రాజకీయాల్లోకి వస్తున్నారు. గత రెండు, మూడు ఎన్నికలను పరిశీలిస్తే వివిధ రంగాలలో పేరుమోసిన వారు కూడా ఎక్కువగా రాజకీయాల్లో అడుగు పెడుతున్నారంటే వారికున్న పేరు ప్రఖ్యాతులతో తేలికగా విజయాన్ని

రు. 32,934 కోట్లు వచ్చాయి. అయినా సరే 2021-22లో రు. 57,930 కోట్లు వస్తాయని ఎలా ఆశిస్తున్నారో ఏలికలకే తెలియాలి. రాష్ట్రంలో పన్నుల వసూలు కూడా ఏమంత ఆశ జనకంగా లేదు. 2019-20లో రు. 57,616 కోట్లు వచ్చాయి. 2020-21లో 70,679 కోట్లు వస్తాయని ఆశిస్తే, రు. 57,377 కోట్లు వచ్చాయి. ఇక 2021-22లో పన్నుల ద్వారా రు. 85 వేల కోట్లు వస్తుందంటున్నారు. రెవెన్యూ లోటు 2019-20లో రు. 26 వేల కోట్లు, 2020-21లో రు. 34 వేల కోట్లు కాగా, ఈ సంవత్సరం 5,000 కోట్లు అని చూపడం వింతగా ఉంది. అలాగే ద్రవ్యలోట్లు 2019-20లో 40 వేల కోట్లు, 2020-21లో 54 వేల కోట్లు కాగా, 2021-2022లో 37 వేల కోట్లకు తగ్గించి చూపడం విచిత్రంగా ఉంది. మొత్తంగా ఏపి బడ్జెట్ ఊహల పల్లకిలో విహరిస్తుంది. ప్రజలతో దాగుడుమూతలు ఆడుతుంది.

విద్యా రంగానికి గతం కంటే కేటాయింపులు తగ్గాయి. విద్యకు. రు. 24,624 కోట్లు కేటాయించింది. అంటే గత సంవత్సరం కంటే 560 కోట్లు కుదించారు. వైద్య రంగానికి రు. 13,830 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం కంటే 21 శాతం పెరుగుదల ఉంది. కరోనా నివారణకు రు. 1,000 కోట్లు కేటాయించారు. నూతనంగా 16 వైద్య కళాశాలలు స్థాపించనున్నారు. దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులున్నప్పటికీ రు. 50 వేల కోట్లు తప్పుగా సేకరిస్తామని దీమాగా చెప్పారు. ఆశించిన స్థాయిలో నిధులు సమకూరకపోతే పన్నుపోటు తప్పనిస్థితి నెలకొంది. ఇదే జరిగితే కరోన కష్టకాలంలో ప్రజల నెత్తిన పిడుగులు పడ్డట్టే.

వ్యవసాయంలో భారీ యాంత్రీకరణకు ప్రోత్సాహం కంటే కార్పొరేట్ వ్యవసాయం దిశగా అడుగులు పడుతున్నాయి. వ్యవసాయ రంగంలో కీలకమైన మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకానికి నిధుల కోత పెట్టింది. వ్యవసాయానికి నీటిపారుదల ప్రాజెక్టులు జీవాదారం. 2019-2020లో 5300 కోట్లు ఖర్చుచేసింది. 2020-21లో రు. 5239 కోట్లకు అంచనాలు సవరించింది. ఈ సంవత్సరానికి రు. 13 వేల కోట్లు కేటాయించినా ఖర్చు చేస్తుందన్న నమ్మకం లేదు. మొత్తంగా వ్యవసాయ రంగానికి రు. 31,256.36 కోట్లు ప్రతిపాదించారు. మొత్తం బడ్జెట్‌లో రు. 48.083 కోట్లు 22 సంక్షేమ పతకాలకు కేటాయించారు. మొత్తంగా బడ్జెట్‌ను పరిశీలిస్తే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి అభివృద్ధి కుంటుబడి యువతకు ఉపాధి మృగ్యమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. అభివృద్ధి లేప్పుడు అప్పులు తీర్చడానికి ఆస్తులు కార్పొరేట్లకు అమ్ముకోవాలి లేదా ప్రజలపై పన్నుల భారం వేయకతప్పని పరిస్థితి ఏర్పడుతుంది. మొత్తంగా బడ్జెట్ ఓటు బ్యాంకు కాపాడుకునే విధంగా ఉంది. కాని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేది కాదని విధితమవుతుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

పొంది, అధికారంలోకి వచ్చి తమ స్వప్రయోజనాలను నెరవేర్చుకోవాలనే ఉద్దేశం తప్ప మరొకటి కాదు. బూర్జువా పార్టీలన్నీ ఒకే తానులోని ముక్కలే. పార్టీల జెండాలే వేరు కానీ భావాలు ఒక్కటే. అవి జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా దోచు కోవడంలో, దాచుకోవడంలో తేడా లేదు. వీరంతా ఉత్పత్తిలో పాల్గొనకుండానే వందల, వేల కోట్లు సంపాదిస్తున్నారు.

ప్రస్తుత రాజకీయాల విలువలు పాతాళానికి పడిపోయాయి. మీడియా వారితో జతకలిసిపోయింది. ప్రభుత్వం మార్కెట్ ఒక్కటయ్యాయి. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రతను కోల్పోయి అధినాయకుడి జేబు సంస్థలుగా మారాయి. మన దేశంలో నేరాలు చేసిన వారికి శిక్షలు ఉండవు, నేరాలను ప్రశ్నించే వారికి శిక్షలు పడుతాయి. ఇది మన మేడిపండు ప్రజాస్వామ్యాన్ని వెల్లడిస్తుంది. అధికారంలో ఉన్న పార్టీలే హింసను ప్రోత్సహిస్తున్నాయి. ఏడు దశాబ్దాల తర్వాత అవిద్య, అనారోగ్యం, పేదరికం, అభద్రత, పీడన కొనసాగడం శోచనీయం. నిజానికి ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయవల్సిన అంశాలు ప్రభుత్వ విధానాలు, హామీల అమలు, ప్రజా సమస్యలు. కానీ వాటి ఊసే ఎత్తకుండా భావోద్వేగాలను రెచ్చగొట్టడం, మద్యం పోయడం, డబ్బులు పంచడం, ఎన్నికల కమిషన్‌ను అధికార పార్టీ తమకు అనుకూలంగా వాడుకోవడం, అధికార దుర్వినియోగానికి పాల్పడడం, మీడియాలో తప్పుడు ప్రచారం చేయించడం సాధారణ అంశాలు మారాయి.

2019 సార్వత్రిక ఎన్నికల్లో పోటి చేసిన వారిలో బిజెపి నుంచి 363 మంది కోటీశ్వరులు, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన 349 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. అలాగే ప్రాంతీయ పార్టీలైన టిడిపి, వైసిపి, టిఆర్ఎస్, ఎన్‌సిపి, ఎఐఎడిఎంకె అభ్యర్థులంతా కోటీశ్వరులే. కార్మికులకు, కర్షకులకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేదు. మహిళల ప్రాతినిధ్యం పది శాతం లోపే ఉంది. అంటే దేశంలో అత్యంత సంపన్నులు దేశంలోని అత్యంత పేద ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే అభ్యర్థుల నేరస్థుల చిట్టా కూడా పెదద్దే. డబ్బుతో పాటు కండబలం అదనపు క్వాలిఫికేషన్. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడిఆర్) విడుదల చేసిన సర్వేలో 88 శాతం మంది ఎంపిల ఆస్తులు రు. ఒక కోటీ కంటే ఎక్కువగా ఉన్నాయని, దాదాపు సగం మంది ఎంపిలపై క్రిమినల్ కేసులున్నాయని తేటతెల్లం చేసింది. గత కొన్ని సంవత్సరాల నుంచి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయం అయిపోయాయి. 2020 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టుకు అండగా పనిచేస్తున్న అమికస్క్యూరి ఒక నివేదికలో దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలపై వివిధ కోర్టుల్లో ఉన్న మొత్తం 4,442 కేసులు కొనసాగుతున్నాయని పేర్కొంది. చాలా కేసులు పలు కోర్టుల్లో నత్తనడకన కొనసాగుతున్నాయి. అత్యంత పాత కేసు విషయానికి వస్తే 1983లో స్పెషల్ కోర్టులో ఇంకా కేసు కొనసాగుతోంది. అలాగే 1991, 1993, 1994లో రిజిస్టర్ అయిన మూడు కేసులు ఇప్పటివరకు ట్రయల్ కోర్టుకు కూడా రాలేకపోయాయి. ఇప్పటివరకు ప్రత్యేక కోర్టుల్లో ఎవరికి శిక్షపడిన దాఖలాల్లేవు.

ఇక సాధారణ ఎన్నికల వ్యయ గణాంకాలను ఒకసారి చూస్తే ఎవరికైనా కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 1952లో నిర్వహించిన సాధారణ ఎన్నికలు ప్రభుత్వ ఖజానాపై కేవలం రు. 10.5 కోట్ల భారం పడింది. అదే 2019 సాధారణ ఎన్నికల విషయానికి వస్తే రు. 10 వేల కోట్లకు చేరింది. గతంలో ప్రజలు ఎన్నికల్లో నిలబడ్డ వ్యక్తి నిజాయితీపరుడా లేదా అని ఆలోచించి ఓటు వేసేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థి ఓట్లను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అన్ని పార్టీల వారు డబ్బులు, మద్యం ఇస్తున్నారు. ఎన్నికల నిఘా సంస్థ అన్ని రాజకీయ పార్టీలు కలిసి 2019 ఎన్నికల్లో సుమారు రు. 60 వేల కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేశాయని కుండబద్దలు కొట్టినట్లు తేల్చి చెప్పింది.

పోటీ చేయడానికి అభ్యర్థికి గరిష్టంగా రు. 70 లక్షలు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతిస్తోంది. ఇవాళ రు. 20 నుంచి 25 కోట్ల వరకు అభ్యర్థులు ప్రచారం కోసం ఖర్చు చేస్తే.. రు. 12 నుంచి 15 కోట్ల వరకు నేరుగా ఓటర్లకు డబ్బు పంచుతున్నారు. ఎన్నికల్లో పట్టుబడ్డ డబ్బు, మద్యం, నగలు, తదితర విలువైన వస్తువుల గురించి ఎన్నికలు ముగిసిన తర్వాత ఎన్నికల కమిషన్ వెల్లడించింది. 2019 ఎన్నికల్లో మొత్తం రు. 3,500 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకోగా.. వాటిలో రు. 1,300 కోట్లు మాదక ద్రవ్యాలు, రు. 839 కోట్ల నగదు, రు. 294 కోట్ల మద్యం, రు. 986 కోట్ల బంగారం, వెండితో పాటు ఇతర విలువైన వస్తువులు రు. 58 కోట్ల వరకు స్వాధీనం చేసుకుంది. ఇక పలు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు పార్టీలు మారడం సర్వసాధారణ మైపోయింది. అధికారంలోకి తమ పార్టీ రాదనుకుంటే రాత్రికి రాత్రే కండువాలు మార్చుకుంటున్నారు. దీనికంతటికి అధికార కాంక్ష అని చెప్పుకోవచ్చు. కొన్ని రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున పార్టీలు మారడంతో స్థానిక ప్రభుత్వాలు కుప్పకూలిన వైనం మనం చూస్తూనే ఉన్నాం.

ఏ రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్నిసీట్లు

బెంగాల్	మొత్తం సీట్లు 292	టిఎంసి 214	బిజెపి 76	లెఫ్ట్ 1	ఇతరులు 1
తమిళనాడు	మొత్తం సీట్లు 234	డిఎంకె 160	అన్నాడిఎంకె 74		ఇతరులు 0
కేరళ	మొత్తం సీట్లు 140	ఎల్‌డిఎఫ్ 99	యుడిఎఫ్ 41		ఇతరులు 0
అస్సాం	మొత్తం సీట్లు 126	ఎన్‌డిఎ 77	కాంగ్రెస్ 45		ఇతరులు 4
పుదుచ్చేరి	మొత్తం సీట్లు 30	ఎన్‌డిఎ 16	కాంగ్రెస్ 9		ఇతరులు 5

పశ్చిమ బెంగాల్‌లో మమత హ్యాట్రిక్:

ఎన్నికల ప్రచారం ప్రారంభమైన కాలం నుంచీ దేశవ్యాప్తంగా అందరి దృష్టి బెంగాల్ పైనే ఉన్నది. ఆ సేతు హిమాచలం తమ పట్టును నిరూపించుకునేందుకు బిజెపి బెంగాల్‌ను మొదటి మెట్టుగా భావించింది. దేశంపై ఎక పార్టీ పాలన రుద్దాలని చూసిన బిజెపికి ఈ ఎన్నికల్లో పప్పులుడకలేదు. ఎన్నడూ, ఏ రాష్ట్రంలో లేని తీరులో బిజెపి నేతలు బెంగాల్‌లో దూకుడు ప్రదర్శించారు. సిబిఐ, ఇడి దాడులకు పురమాయించి, ఎంఎల్ఎలను బెదిరించి ఫిరాయింపులను ప్రోత్సహించి తృణమూల్ ముఖ్య నేతలను కమలం పార్టీలో చేర్చుకున్నారు. ఫిరాయింపుదారులను బెంగాల్ ఓటర్లు తిరస్కరించారు. బిజెపి నేతలు వ్యవహరించిన తీరు వ్యతిరేక ఫలితాన్నిచ్చింది. ఎనిమిది దశల్లో ఎన్నికల నిర్వహణ మొదలు, కేంద్ర బలగాల మోహరింపు, భౌతిక దాడులు, పోలీసు కాల్పులు, ఎన్నికల సంఘం వ్యవహరణ ఎంత ప్రతికూలంగా ఉన్నా, అంతా తానై మమతా బెనర్జీ ఒంటరిగా, ఒంటికాలుతో ఒంటరి పోరు సాగించి అద్భుత విజయాన్ని సాధించడం విశేషమే.

మమతను ఏలాగైనా ఓడించాలన్న లక్ష్యంతో బిజెపి అన్ని విధాల ప్రయత్నించింది. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా, 22 మంది క్యాబినెట్ మంత్రులు. 6 రాష్ట్రాల ముఖ్య మంత్రులు, 3 కేంద్ర సంస్థలు, కేంద్ర పారా మిలిటరీ దళాలు, వేలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, మీడియా ప్రచారం, ధన ప్రవాహం, సినీ స్టార్లను రంగంలోకి దింపింది. అంతటితో ఆగకుండా బంగ్లాదేశ్‌కు వెళ్లి బెంగాల్ ఎన్నికల్లో గెలవడానికి మోడీ చేసిన ప్రయత్నాలూ బెడిసికొట్టాయి. భావోద్వేగాలు రెచ్చగొట్టడం కులాల వారిగా, మతాల వారిగా ఓటర్లను చీల్చే ప్రయత్నం, బెంగాల్‌ను సోనార్ బంగ్లాగా చేస్తామని ఊదరగొట్టి బెంగాల్‌లో పాగ వేయాలనుకున్న కమలనాథులకు ఎన్నికల ఫలితాల్లో చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా చేదు అనుభవమే మిగిలింది.

నందిగ్రామ్‌లో వ్యక్తిగత ఓటమి చవిచూసినా, పార్టీని గతంకన్నా ఎక్కువ స్థానాలతో విజయతీరాలకు చేర్చిన తీరు గుర్తించదగిందే. మమత పోటీ చేసిన నందిగ్రాం ఎన్నికల్లో మమత 1200 ఓట్లతో గెలిచిందని సాయంకాలం 4 గంటలకు అన్ని టివి ఛానళ్లు ప్రసారం చేశాయి. ఏం జరిగిందో ఏమో గాని సాయంత్రం 7 గంటలకు మమత ఓటమి చెందారని ప్రకటించారు. 2011 నుంచి మమత బెంగాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతుంది. 2014లో కేంద్రంలో బిజెపి మోడీ అధికారంలోకి రావడంతో దేశ రాజకీయాల్లో ఒక నూతన పరిస్థితి ఏర్పడింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 18 ఎంపి స్థానాలు గెలుచుకుంది. మోడీ విధానాలను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. రాష్ట్రంలో ఒకవైపు బిజెపి, మరోవైపు సిపిఎంల ఆక్రోశం పరోక్షంగా మమతపై ఉంది. ఈ పరిస్థితి బిజెపికి కలిసివచ్చింది. దీంతో బెంగాల్‌లో అధికారానికి రావాలనే దురాశను పెంచుకున్నది. బెంగాల్‌లో ఎన్ని కుతంత్రాలు పన్నినా, ఎంత హంగామా చేసినా బిజెపికి 2019తో పోల్చుకుంటే ఓట్లు సీట్లు తగ్గాయి. 75 అసెంబ్లీ సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. 2019లో బిజెపి 40 శాతం ఓట్లు పొందగా, 2021లో 38 శాతానికి పడిపోయింది. మమత తృణమూల్ పార్టీకి 2019లో 43 శాతం ఓట్లు రాగా, 2021లో 48 శాతం ఓట్లు వచ్చాయి. 30 సంవత్సరాలు పాలించిన సిపిఎంకు ఒక్క సీటు రాకపోవడం గుర్తించవలసిన అంశం. ఇక అధికారం మాదే అని దాంబికాలకు పోయిన బిజెపికి బెంగాల్ ప్రజలు సరైన పరిష్కారమే ఇచ్చారు.

తమిళనాట దశాబ్దం తర్వాత డిఎంకె

తమిళనాడులో కరుణానిధి, జయలలిత మరణం తర్వాత మొదటి సారిగా జరిగిన ఎన్నికలు ఇవి. 2016 ఎన్నికల్లో జయలలిత బిజెపితో పొత్తును నిరాకరించింది. 2016 జనవరిలో జయలలిత మరణించగానే ఎఐడిఎంకె పార్టీ పగ్గాలు చేపట్టి ముఖ్యమంత్రి కాబోతున్న శశికళను రాజకీయ రంగం నుంచి తప్పించడానికి కుట్రలు సాగించారు. అక్రమ ఆస్తుల పేరిట జైలుకు పంపించారు. ఎడప్పాడి పళని స్వామిని రంగంలోకి తెచ్చారు. ముఖ్యమంత్రిని చేశారు. పన్నీరు సెల్వం, పళని స్వామి మధ్య రాజీ కుదిర్చారు. నిన్నటి ఎన్నికల్లో కరుణానిధి కుమారుడు డిఎంకె నేత ఎం.కె. స్టాలిన్ ఫ్రంట్‌ను అధికారంలోకి రానియ్యకుండా చేయడానికి శశికళను జైలు నుండి విడుదల చేశారు. ఆమె నూతన పార్టీ పెట్టడానికి అన్ని విధాల సిద్ధమైంది. అదిరించో బెదిరించో నూతన పార్టీ పెట్టకుండా నిరోదించడంలో బిజెపి సఫలమైంది. పన్నీరు సెల్వం – పళని స్వామి – శశికళ మధ్య రాజీలు కుదుర్చడానికి లోపాయికారి వ్యవహారాలు నడిపారు. ఈ విధంగా ఎఐడిఎంకె నాయకులను తమ అదుపులో పెట్టుకొని తమిళనాట అధికారం చేజిక్కించుకోవాలన్న ప్రణాళిక బిజెపికి బెడిసికొట్టింది. బిజెపి 4 సీట్లకు పరిమితమైంది. డిఎంకె కూటమికి 19 స్థానాలు, ఎఐడిఎంకెకి 75 స్థానాలు దక్కాయి. స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారు. తమిళనాడులో ఈసారి సినీగ్లామర్ పనిచేయలేదు. కమలహాసన్, కుష్బూ, శరత్‌కుమార్‌లు ఓటమి పాలయ్యారు.

కేరళలో మళ్లీ ఎల్‌డిఎఫ్ విజయం

నాలుగు దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయాన్ని కాదని కేరళ ప్రజలు వరుసగా రెండోసారి కూడా వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) కు అధికారాన్ని అప్పగించారు. దీంతో కేరళ కమ్యూనిస్టుల అధికారమున్న ఏకైక రాష్ట్రంగా నిలిచింది. కేరళలో సిపిఎం నాయకుల మధ్యనున్న విభేదాలను, సిపిఎం, కాంగ్రెస్ మధ్యనున్న విభేదాలను ఉపయోగించు కోవడానికి బిజెపి ప్రయత్నించింది. శబరిమలైలో తలెత్తిన వివాదాన్ని తన రాజకీయ ప్రయోజనాల కొరకు వాడుకునే ప్రయత్నం చేసింది. ఎజవా సామాజిక వర్గం కేరళలో ప్రభావం గల వర్గం. ఆ ఓట్లను రాబట్టేందుకు భారత ధర్మ జనసేన పేరుతో ఉన్న పార్టీని బిజెపి తనలో విలీనం చేసుకుంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల ఆ పార్టీ ఘణనీయమైన ఓట్లు సాధించింది. ఈసారి ఘోరంగా విఫలమయింది.

కేరళ రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయలేదు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ పినరయిపై గోల్డ్ స్కాం ఆరోపణ చేసింది. పేరు ప్రతిష్టలున్న మెట్రోమ్యాన్ శ్రీధరన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. సురేష్ గోపిలాంటి ప్రముఖ సినీనటుల్ని తన అభ్యర్థులుగా ఎన్నికల్లో నిలిపింది. ఎన్ని కుతంత్రాలు పన్నినా కేరళ ఓటర్లను ఆకట్టుకోలేక బిజెపి కేరళలో చతికిలపడింది. గతంలో ఉన్న ఒక్క సీటు కూడా ఈసారి కోల్పోయింది. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కోవిడ్ కష్ట కాలంలో, వరదలు వచ్చినప్పుడు ప్రజలను సకాలంలో ఆదుకుంది. విద్యా, వైద్యాన్ని అందించడంలో దేశంలో ఆదర్శంగా నిలిచింది కనుగనే సంప్రదాయానికి భిన్నంగా అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్‌కే ప్రజలు మళ్లీ అధికారాన్ని కట్టబెట్టారు. ఎల్‌డిఎఫ్ 99 స్థానాలు, యుడిఎఫ్ 41 స్థానాల్లో విజయం సాధించాయి.

అసోంలో మరోమారు ఎన్‌డిఏ ప్రభుత్వం

అసోంలో సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పాలన సాగింది. అసోం గణ పరిషత్ (ఎజిపి) ఒక దఫా పరిపాలన చేసింది. 2016 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి 86 స్థానాలు గెలుచుకుంది. 2021 ఎన్నికల్లో 77 స్థానాలు మాత్రమే సాధించింది. కాంగ్రెస్ కూటమి 45, ఇతరులు 4 స్థానాలు గెలిచారు. బిజెపి అసోంలో సిఎఎ, ఎన్ఆర్‌సి ఊసెత్తకుండా ప్రచారం చేసింది. ప్రత్యర్థుల బలహీనతలను తన అస్త్రాలుగా మలుచుకుంది. అయినా గతం కంటే ఓట్ల శాతం తగ్గింది. మహా కూటమి గెలిస్తే ముస్లిమే ముఖ్యమంత్రి అవుతాడని కూడా ప్రచారం చేసి హిందూ ఓట్లను సమీకరించుకునే ప్రయత్నం చేసింది. అసోం ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వకర్మ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో కాంగ్రెస్‌లో ముఖ్య నాయకుడే. రాహుల్ గాంధీతో వైరం కారణంగా బిజెపిలో చేరాడు. ఆయనకు కాంగ్రెస్‌లోని ముఠా తగాదల గురించి బాగా తెలుసు. వాటిని ఆయన ఎన్నికల్లో బాగా ఉపయోగించుకున్నాడు. ఆయన వ్యూహాలు ఫలించడం

సిల్గేర్‌లో పోలీసు క్యాంపు - ఆదివాసుల వ్యతిరేకత

అటవీ ప్రాంతంలోని వనరులను కొల్లగొట్టడంలో భాగంగానే సిల్గేర్‌లో పోలీసు క్యాంపు పెట్టారని, అది ఎత్తివేయాలన్నందుకు పోలీసులు ఆదివాసీలను కాల్చిచంపారని అంటున్నారు **కురుసం శంకర్**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా బీజాపుర్ జిల్లాల సరిహద్దులలోని సుక్మా గ్రామం సిల్గేర్ ఇటీవలి మావోయిస్టు గెరిల్లా దాడితో వార్తలకెక్కిన జీరగూడకు 6 కి.మీ దూరంలో ఉంటుంది. మే 17నాడు సిల్గేర్‌లో పోలీసులు వేలాది స్థానిక మూలవాసీ ప్రజలపై కాల్పులు జరిపి ముగ్గురు ఆదివాసీలను హత్య చేయడంతో పాటు దాదాపు 300 మందిని ఎందుకు గాయపరిచారో తెలుసుకునే ముందు ఏప్రిల్ 3 నాడు బీజాపుర్ జిల్లా జీరగూడ వద్ద జరిగిన గెరిల్లా దాడి గురించి గుర్తు చేసుకోకుంటే మే 17 నాడు సిల్గేర్ మారణకాండలోని వాస్తవాలు అర్థం కావు.

ఏప్రిల్ 3 నాడు జీరగూడ వద్ద పిఎల్‌జిఏ జరిపిన గెరిల్లా దాడిలో మావోయిస్టుల ప్రకటన ప్రకారం 28 మంది పోలీసు, అర్ధసైనిక బలగాలకు (సి.ఆర్.పి.ఎఫ్.) చెందిన జవాన్లు చనిపోగా 31 మంది గాయపడినారు. గాయపడిన వారిలో కూడా మరి కొందరు మరణించినట్లు తర్వాతి వార్తలు తెలపుతున్నాయి. దానిని ఒక 'యుద్ధ' చర్యగానే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ బగేల్ ప్రకటించాడు. ఎవరి మీద ఆ యుద్ధం అనే విషయం చాలా తీవ్రమైనది. ముఖ్యమంత్రి ప్రకటన అత్యంత బాధ్యతా రాహిత్యమైనది. ఆ గెరిల్లా చర్యలో మావోయిస్టు గెరిల్లాలు నలుగురు అసువులు బాయగా కొంత మంది గాయపడినట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఆ దాడి సందర్భంగా తమ చేతికి బందీగా దొరికిన కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను (రాష్ట్ర ముఖ్యమంత్రి మాటలలో చెప్పాలంటే యుద్ధబందీ అవుతాడు) గెరిల్లాలు బేషరతుగా వదిలి ప్రభుత్వ మధ్యవర్తుల ద్వారా క్షేమంగా ఆయన కుటుంబానికి చేర్చారు. జీరగూడ చర్య గురించి, కోబ్రా కమాండో విడుదల గురించిన వివరాలన్నీ అంతర్జాలంలో అందరికీ అందుబాటులో ఉన్నాయి.

జీరగూడలో పోలీసు జవాన్ల మరణం తరువాత దేశ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా భారతీయ జనతా పార్టీకి చెందిన అనేక మంది బడా నాయకులు, సంఘ్ పరివార్‌కు చెందిన వివిధ స్థాయిల ఉగ్ర హిందుత్వ శక్తులు పదే పదే పోలీసు జవాన్ల మరణాలకు 'బదులు తీర్చుకుంటామనీ', 'మృత జవాన్ల త్యాగాలు వృధా పోవనీ' "అడవులలో గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామనీ" ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసుకోకుండా మే 17 సిల్గేర్ మారణకాండ వెనుక హింసోన్మాద ఉత్ప్రేరకాలుగా పని

వల్లనే అసోంలో బిజెపి తిరిగి అధికారంలోకి రాగలిగింది.

పుదుచ్చేరిలో మొదటి సారి ఎన్‌డిఎ గెలుపు

పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి వారం రోజుల ముందే పిరాయింపులను ప్రోత్సహించి అక్కడి కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని పడగొట్టింది. 30 స్థానాలున్న అసెంబ్లీలో ఎన్ఆర్ కాంగ్రెస్ 10 స్థానాలు, బిజెపి 6 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ 2, డిఎంకె 6, ఇతరులు 6 స్థానాలు గెలుచుకున్నారు. పుదుచ్చేరిలో బిజెపి ఫ్రంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి బలపర్చింది. రంగసామి ముఖ్యమంత్రి అయ్యారు.

స్వోత్కర్షలు, భావోద్వేగాలు, ప్రచార పటాటోపాలు ఏ పార్టీని గద్దెనెక్కించలేవు అని ఈ ఎన్నికలు రుజువు చేశాయి – ప్రజల సమస్యలు విస్మరించి, మతం, ఇతర భావోద్వేగాలను రెచ్చగొడితే ఓట్లు రాలవని ఓటర్లు నిరూపించారు. మోడీ ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విజయం సాధించి, ఫాసిస్టు హిందూ రాష్ట్రాన్ని స్థాపించాలని ఉవ్విళ్లూరుతుంది. అందుకు భారత సమాజాన్ని మతపరంగా విభజించి లబ్ధి పొందడానికి బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్. శ్రేణులు శాయశక్తుల కృషి చేస్తున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామిక విలువల్ని, సాంప్రదాయాల్ని, రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్ని తుంగలో తొక్కింది. మీడియాను గుప్పిట్లో పెట్టుకొని అబద్ధాలు ప్రచారం చేస్తోంది. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల విధేయుడుగా, వాళ్లు ఇచ్చే ధన రాసులతో ఎన్నికల్లో విజయం సాధించాలని ప్రయత్నిస్తూనే, ప్రతిపక్షంలో ఎంపిలను, ఎంఎల్‌ఎలను లొంగదీసుకుని పార్టీ పిరాయింపులు ప్రోత్సహిస్తోంది. ప్రత్యర్థులపై అవినీతి ఆరోపణలు చేయడం, సిబిఐ, ఐడి, అవినీతి నిరోధక శాఖలను ప్రయోగించడం సర్వసాధారణమైపోయింది. న్యాయస్థానాలను, జాతీయ నేర పరిశోధనా సంస్థల అధికారాలను దుర్వినియోగం చేయడం చూస్తూనే ఉన్నాం. విమర్శ, వ్యతిరేకత, భిన్నాభిప్రాయం అంటేనే దేశ ద్రోహం అన్నట్లు మోడీ – షాల ఫాసిస్టు పాలన సాగుతోంది.

ఈ ఎన్నికల్లో మోడీ జనాకర్షణ శక్తికి గండిపడింది. తనకు ఏమాత్రం ఉనికిలేని రాష్ట్రాలను ఆక్రమించుకోవాలన్న దురాశకు ఈ ఎన్నికలు హద్దులు చూపించాయి. ఈ నేపథ్యంలో చూసినప్పుడు బిజెపిని ముందుకు సాగన్వివలేదు కానీ, వెనుకకు కూడా నెట్టలేక పోయారు ప్రజలు. ఈసారి అసోంకు తోడు పుదుచ్చేరిలో తన బలాన్ని నిలుపుకో గల్గింది. గెలిచిన పార్టీలను ఎన్ని రోజులు అధికారంలో ఉండనిస్తారు, ఒక పార్టీలో గెలిచిన ఎంఎల్‌ఏలు ఎంతకాలం గెలిచిన పార్టీలో ఉంటారో ఇదమిత్థంగా చెప్పలేని అస్థిర ఎన్నికల వ్యవస్థ దేశంలో నేడున్నది. అందువల్ల సరైన ప్రజా ప్రాతినిధ్యం వహించే ప్రత్యామ్నాయ రాజకీయాలు ప్రజలకు విడమరచి చెప్పవలసిన చారిత్రక బాధ్యత ప్రజాస్వామిక, లౌకికవాద బుద్ధిజీవుల పైనే ఉందని గ్రహించాల్సి ఉంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

చేసిన వాస్తవాలు అర్థం కావు.

మే 12 నాడు సుక్మా బీజాపూర్ జిల్లాల సరిహద్దు గ్రామం సిల్గేర్‌లో నూతనంగా ఒక పోలీసు క్యాంపు ఏర్పాటు కోసం పోలీసులను తరలించారు. తెల్లారేసరికి ఈ వార్త దావానలంలాగ పరిసర అడవి గ్రామాలన్నింటికి చేరిపోయింది. దానితో ప్రజలు మండిపడ్డారు. వివిధ ప్రాంతాలలో మూలవాసీ ప్రజానీకం తమ అడవులలో పోలీసు క్యాంపులు వద్దంటూ ఎక్కడికక్కడే పోరాడుతుంటే, ప్రభుత్వం మాత్రం వినడం లేదని ఆగ్రహించిన ప్రజలు సిల్గేర్ పోలీసు క్యాంపు వ్యతిరేక పోరాటానికి నడుం బిగించారు.

అడవులలో ఆదివాసీ ప్రజల ప్రధాన ఆదాయ వనరు తునికాకు కోత పనులు ఇంకా పూర్తి కానేలేదు. వాస్తవంగా వారికి నగదు రాబడిని సమకూర్చే వనరులలో అదే అతి ప్రధానమైనది. అయినప్పటికీ వారు ఆ పనులను వదులుకొని జీవన్మరణ సమస్యగా ముందుకు వచ్చిన సిల్గేర్ పోలీసు క్యాంపును తక్షణం ఎత్తివేయాలనే డిమాండ్‌తో అక్కడ ఏకమయ్యారు. తమ గ్రామాలలో ఎలాంటి పోలీసు క్యాంపు అవసరం లేదనీ తాము పోలీసు క్యాంపులను కోరుకోవడం లేదనీ, గత 15 సంవత్సరాలుగా తమ అడవులను ఖాకీ వనాలుగా మార్చారనీ, వాటితో తాము చెప్పనలవికాని బాధలనుభవిస్తున్నామనీ ఇపుడు అదనంగా కరోనా ప్రమాదం పొంచి ఉందనీ సిల్గేర్ క్యాంపు ముందు ముక్త కంఠంతో ప్రజలు నినదించారు. మే 13 నుండి రోజు రోజుకూ సిల్గేర్ పోలీసు క్యాంపు ఎత్తివేత కోసం ప్రజలు తమ సంప్రదాయక ఆయుధాలతో జమగావడం పెరుగుతూ పోయింది. దాదాపు పదివేల మంది ప్రజలు సిల్గేర్ క్యాంపును ఎత్తివేయాలనే నినాదాలతో ధర్నా ప్రారంభించారు. ప్రజల ధర్నా వార్త తెలిసిన వెంటనే స్థానిక మీడియా విలేఖరులు ప్రజల మధ్య వాలిపోయారు.

మే 17 నాటికి సిల్గేర్ పోలీసు క్యాంపు వ్యతిరేక ప్రజల సంఖ్య పదివేలు దాటింది. ఇంకా ప్రజలు దూర ప్రాంతాల నుండి కాలి నడకన, ట్రాక్టర్లలో ఆహార పదార్థాలతో వస్తునే ఉన్నారు. అయినప్పటికీ, వారందరికీ తిండి సమకూర్చడానికి స్థానిక ప్రజలు కూడ చాలా కృషి చేశారు. దగ్గరి గ్రామాల ప్రజలు రోజు సాయంత్రం తమ ఇళ్లకు వెళ్లి ఉదయాన్నే మళ్లీ వచ్చి క్యాంపు వ్యతిరేక ధర్నాలో పాల్గొనసాగారు. క్యాంపు ఎత్తివేసేవరకు తాము వెనక్కి వెళ్లేదే లేదనీ ప్రజలు నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పారు. 13వ తేదీ నుండే పోలీసు అధికారులు మంతనాలు ప్రారంభించారు. మరోవైపు మందు పాతర నిరోధక వాహనాలనూ మోహరించారు. అలాగే, ఆకాశంలో ఎడతెరపి లేని మానవ రహిత విమానాల రొద, రోజూ హెలీకాప్టర్ల చక్కర్లు చూస్తుంటే సహజంగానే ఎవరికైనా ఎప్పుడు ఏ విపత్తు ముంచుకు వస్తుందోనన్న ఆందోళన కలిగే ఓ యుద్ధ వాతావరణమే అక్కడ నెలకొంది. ఎందుకంటే, జీరగూడ దాడి తదుపరి కొద్ది రోజులకే తమపై డ్రోన్లతో బాంబుల దాడి జరిగిందనీ, తాము కొద్ది గంటల ముందే ఆ స్థలాన్ని ఖాళీ చేసి ఉన్నందున తమకు ఎలాంటి నష్టాలు జరుగలేదనీ, రెండు డ్రోన్లను తమ గెరిల్లాలు కూల్చారనీ ఆధారాలతో సహా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు వికాస్ విలేకర్లకు వివరించిన వాస్తవాలను గుర్తుచేసుకుంటే పోలీసులు ప్రజలపై డ్రోన్లతో బాంబు దాడులకు పాల్పడరనే హామీ ఏముంది? మూలవాసీ ప్రజలు తమ చేతులలో ఆత్మరక్షణకు అతి సాధారణమైన కర్రలు, గొడ్డళ్లతో నిరసనలో పాల్గొనడం అవేవో ఆధునిక ఆయుధాలతో శత్రు బలగాలు మోహరించబడినట్టుగా దుష్ప్రచారం చేస్తున్న పోలీసులు ఏ కథనాలను సృష్టించి ఏ క్షణాన ఏ దారుణానికి పాల్పడుతారోనన్న భయాలను మే 17నాడు పోలీసులు నిజం చేశారు.

మే 13 నుండి సిల్గేర్ వద్ద జమ అవుతున్న ప్రజలపై ఏదో ఓ సమయంలో, ఏదో ఓ నెపంతో పోలీసులు రోజూ తమ లాఠీలతో విరుచుకుపడుతునే ఉన్నారు. మే 17 నాటికే ఖాకీల లాఠీల దెబ్బలు తిన్న స్త్రీ-పురుషుల సంఖ్య మూడంకెలకు చేరింది. తుదకు మే 17 నాడు ఉదయం పోలీసులు నిరసన తెలియజేస్తున్న ప్రజలను చర్చలు జరుపుదామంటూ తమ వెంట క్యాంపు ఆవరణలోకి తీసుకు వెళ్తుండగానే కాల్పులు ప్రారంభమయ్యాయి. అడవిలో పహారా కాస్తున్న పోలీసులు తాము ఆడదలచుకున్న హై డ్రామాకు అనుగుణంగా కాల్పులకు కొద్ది సెకండ్‌ల ముందు టపాకాయ పేల్చారు. అంతే, ప్రజలపై తూటాల వర్షం కురువసాగింది. అంతా నాటకీయంగా జరిగిపోతున్న తరుణంలో ఆ ప్రమాదకర పరిస్థితులలో ఆత్మరక్షణ చేసుకోవడానికి గుంపులు గుంపులుగా పరుగెత్తేవారు పరుగెత్తు తుండగా చాలా మంది ప్రజలు అక్కడే ప్రోన్ పొజిషన్‌లోకి వెళ్లారు. అలా నేలపై పడుకున్నవారి తలలపై నుండి తూటాలు దూసుకు పోతున్నాయి. అప్పటికే ముగ్గురు ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది గాయపడినారు. తొమ్మిది మంది జాడ తెలియకుండా పోయిందనీ ప్రజలు ఆందోళన చెందసాగారు.

కాల్పులు నిలిచిపోయాక మృతులను పరిశీలించి తిమ్మపురంకు చెందిన 14 సంవత్సరాల మైనర్ బాలుడు ఉయిక పాండుతో పాటు గుండం గ్రామానికి చెందిన ఉర్సం భీమా (30), కోవాసి వాగాలు మృతి చెందినట్టుగా గుర్తించారు. తూటాలతో గాయపడిన 18 మందిలో ఆదివాసీ మహిళ సోండీ కాలు విరిగింది. వాస్తవాలు ఇలా ఉండగా సాయంత్రానికల్లా పోలీసుల అధికార ప్రతినిధి పోలీసు ఐ.జి. సుందర్ రాజు 'ప్రజల మధ్య దూరిన మావోయిస్టులు పోలీసులపై కాల్పులు జరుపగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు గ్రామస్తులు మృతి' చెందినట్టు ప్రకటించడంతో ఆ నేరం యథావిధిగా మావోయిస్టుల జాబితాలో చేరిపోయింది. ఇలాంటి ప్రకటనలు చేయడం పోలీసులకు, వినడం ప్రజలకు కొత్తేమి కాదు.

కాల్పులు నిలిచిపోయిన వెంటనే ప్రజలు మూడు శవాలను తమ మధ్యకు తెచ్చుకున్నారు. కాల్పుల వార్త చేరడంతో హుటాహుటిన స్థానిక విలేకర్లు వచ్చేశారు. వారిలో కోబ్రా కమాండోను మావోయిస్టుల కస్టడీ నుండి జమ్మూ వరకు తీసుకువెళ్లి అతని కుటుంబానికి అప్పగించినవారూ ఉన్నారు. వారంతా ముందుపడి ప్రజలకు హామీ ఇచ్చి పోలీసులతో శవాలను పోస్టుమార్టం కోసం బీజాపూర్ తీసుకెళ్లారు. పోలీసులు శవాలతో పాటు కాల్పులలో గాయపడినవారినీ హెలీకాప్టర్లలో బీజాపూర్ తరలించారు. అక్కడ శవాలకు జరిపే ప్రభుత్వ లాంఛనాలన్నీ పూర్తి అయ్యాక స్థానిక శాసన సభ్యుడి సమక్షంలో కుటుంబీకులకు శవాలను అప్పగించారు. సోండీ మినహా క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం చేసి విలేకర్లకు అప్పగించారు. వేలాది ప్రజల మధ్య తుపాకి కాల్పుల్లో అసువులు బాసిన తమ ఆదివాసీ మృత వీరులకు సిల్గేర్ క్యాంపు ముందే అంతిమ సంస్కారాలు చేయాలని ప్రజలు నిర్ణయం చేశారు. కానీ, పోలీసులు ఆ కుటుంబాల వారిపై అనేక రకాల వత్తిడి చేయడంతో వారు తుదకు శవాలను తమ గ్రామాలకు తీసుకెళ్లి దహన సంస్కారాలు పూర్తి చేసి తిరిగి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. అక్కడే వేలాది ప్రజలు

వాక్సిన్ రాజకీయార్థిక అంశాలు

వాక్సిన్ తయారీలో ప్రైవేటు కార్పొరేట్ సంస్థల, బహుళజాతి సంస్థల లాభాల వేటకు దేశాన్ని అప్పగిస్తున్న ప్రభుత్వ విధానాలను వివరిస్తున్నారు **ఆనంద్ గ్రోవర్**

దేశ రాజధాని నుంచి అన్ని ప్రధాన రాష్ట్రాల దాకా, మొత్తం భారతదేశమే ఆక్సిజన్ కొరతతో అతలాకుతలమవుతూ మానవతా వైద్య సంక్షోభంలో చిక్కుకుని ఉంది. ఈ గందరగోళం మధ్య కనబడకుండా కోరలు విప్పుతున్నది కోవిడ్ – 19 వాక్సిన్ పంపిణీ కార్యక్రమం. ఇది అసమానతలకూ, తీవ్రమైన కొరతలకూ, రాష్ట్ర ప్రభుత్వాల మీద గణనీయమైన ఆర్థిక భారానికీ దారితీయనున్న మహా ఉత్పాతం.

కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే 'త్వరితగతి కోవిడ్ – 19 వాక్సినేషన్ వ్యూహం' అనే పేరుతో సరళీకృత ధరల విధానాన్ని ప్రకటించింది. ఈ వ్యూహం కింద భారతదేశంలో ఉత్పత్తి అయ్యే వాక్సిన్లలో 50 శాతాన్ని తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వానికి కేటాయించారు. మిగిలిన 50 శాతాన్ని ఉత్పత్తిదారులు రాష్ట్ర ప్రభుత్వాలకు గాని, ప్రైవేట్ ఆస్పత్రులకు గాని, ఇతర సంస్థలకు గాని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవచ్చు.

సామాజిక రోగ నిరోధక శక్తిని సాధించాలంటే, దేశ జనాభాలో కనీసం 70–85 శాతానికి రానున్న పన్నెండు నెలల్లో వాక్సినేషన్ పూర్తి చేయడం అవసరం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన వ్యూహం ఆ లక్ష్యాన్ని సాధిస్తుందా, ఆ లక్ష్యానికి తూట్లు పొడుస్తుందా అనేది ప్రశ్న.

వాక్సిన్ల సేకరణ కేంద్ర ప్రభుత్వ బాధ్యత

గత డెబ్బై సంవత్సరాలుగా భారత ప్రభుత్వం సార్వత్రిక రోగ నిరోధక పథకం (యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ – యుఐపి) అనే పద్ధతిని అమలు చేస్తున్నది. దేశం మొత్తానికీ అవసరమైన వాక్సిన్లను ప్రభుత్వ, ప్రైవేట్ ఉత్పత్తిదారుల నుంచి కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇచ్చి సేకరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా దేశంలోని ప్రజలందరికీ ఉచితంగా సరఫరా చేస్తుంది. ఈ పథకం శిశువులలో, చిన్నారులలో మరణాలను, మరణ అవకాశాలను తగ్గించడంలో ఎంత విజయం సాధించిందో ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే.

అంతే కాదు, అవసరమైన వాక్సిన్లన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే సేకరించడం అంటే అటువంటి భారీ పరిమాణపు సేకర్తకు బేరసారాలు ఆడడానికి ఉండే అపారమైన శక్తితో, వాక్సిన్ సరఫరాదారులతో తక్కువ ధర గురించి బేరం ఆడడానికి వీలవుతుంది. కాని ఎటువంటి కారణం చూపకుండానే కేంద్ర ప్రభుత్వం వాక్సిన్లను ఒకేచోట కేంద్రీకృతంగా సేకరించే విధానాన్ని వదిలేసింది. అంటే, ఆ విధానం వల్ల రాగల సదవకాశాలను కేంద్ర ప్రభుత్వం చేజేతులా వదులుకుంది. పైగా వాక్సిన్ సరఫరాదారులతో విడివిడిగా బేరం ఆడేవైపు రాష్ట్ర ప్రభుత్వాలను నెట్టింది. అంటే వేరు వేరు రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు తమలో తాము పోటీ పడేట్టు, మరొకవైపు ప్రైవేట్ రంగ సంస్థలతో పోటీ పడేట్టు చేసింది.

ఇప్పటివరకూ ఉన్న కేంద్రీకృత సేకరణ విధానం వల్ల కొనుగోలుదార్ల మార్కెట్‌గా ఉండిన వాక్సిన్ల మార్కెట్‌ను ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అమ్మకందార్ల మార్కెట్‌గా మార్చివేసింది. ప్రస్తుతం ఉన్న ఇద్దరే అమ్మకందార్లు – సీరం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, భారత బయోటెక్

అమరుల స్మృతిలో సంస్మరణ సభ జరుపుకొని వారి త్యాగానికి వినమ్రంగా తలవంచి జోహార్లు చెప్పారు. పోలీసుల టెర్రరిజానికి వ్యతిరేకంగా మే 21 (ప్రభుత్వం మాజీ ప్రధానీ, రాజీవ్ గాంధీ హత్య నేపథ్యంలో ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తున్నది) నాడు రెండు జిల్లాల బందుకు పిలుపు ఇచ్చారు.

సిల్గేర్‌లో జరిగిన పోలీసు కాల్పులలో ముగ్గురు ఆదివాసులు మరణించిన వార్త తెలిసిన వెంటనే పలు ఆదివాసీ సంఘాల నాయకులు, బేలా భాటియా, సోనీ సోడీలాంటి సామాజిక కార్యకర్తలు, వామపక్షాల నాయకులు కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ విడుదలలో ప్రభుత్వం తరఫున మధ్యవర్తి పాత్ర పోషించిన తెల్లం బొరయ్య లాంటి వాళ్లు అనేక మంది ప్రజలను కలువడానికి బయలుదేరారు. కానీ, వారిలో చాలా మందిని సిల్గేర్ దరిదాపులకైనా చేరకుండా మధ్య దారులలోనే పోలీసులు నిలిపివేశారు. అయినప్పటికీ ప్రజలు మాత్రం ధైర్యం కోల్పోకుండా సిల్గేర్ క్యాంపు ముందు ధర్నా కొనసాగిస్తున్నారు. ఆ ప్రజలకు దేశ వ్యాప్త ఆదివాసీ హితైషీలు, ఆదివాసీ ప్రజా పోరాట సంస్థలు, పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు తమ మద్దతును తెలియజేస్తున్నారు. ఆ ప్రజలు, తమ న్యాయమైన డిమాండ్‌ను సమర్థిస్తూ తమకు అండగా నిలవాలని కోరుతూ యావత్ దండకారణ్యం, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు జూన్ 5 నాడు బంద్ పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఇక్కడ నేను రాసినవి సిల్గేర్ పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు కొనసాగిస్తున్న పోరాట వాస్తవాలు. సిల్గేర్ ప్రజల పోరాటం కేవలం ఆ ఊరికే పరిమితమైంది కాదు. అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, హిందుత్వ శక్తులు మావోయిస్టుల ఏరివేత పేరుతో అడవులలోని అన్ని రకాల వనరుల తరలింపుకై ప్రజలపై తమ యుద్ధ చర్యలను తీవ్రతరం చేయడం తప్ప మరేం కాదు. తాము బదులు తీర్చుకుంటామనీ, జీరగూడ మృత పోలీసు జవాన్ల త్యాగాలు వృధా పోవనీ, అడవులలో మావోయిస్టుల ఏరివేత చర్యలను ముమ్మరం చేస్తామని కేంద్ర, రాష్ట్ర పాలకులు చేసిన ప్రకటనల కొనసాగింపే ఈ పోలీసు క్యాంపులు, హత్యాకాండలు. వీటిని యావత్ దేశ ప్రజలు ఖండించాల్సిందిగా విజ్ఞప్తి.

(రచయిత ఆదివాసి స్వాభిమాన్ మంచ్ కార్యకర్త) వీ

ఈ విధానంతో హేతుబద్ధమైన లాభాల స్థాయి నుంచి విపరీతమైన లాభాల స్థాయికి చేరుతున్నారు.

అలాగే ఈ రెండు సంస్థలూ రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైనంత పరిమాణంలో వాక్సిన్లను అందజేస్తాయనే హామీ కూడా ఏమీ లేదు. కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన కేటాయింపు కోటా తర్వాత వారి దగ్గర మిగిలిన యాభై శాతం వాక్సిన్లను వారు ఎవరు ఎక్కువ ధర ఇస్తే వారికి అనే ప్రాతిపదిక మీద ప్రైవేట్ సంస్థలకు అమ్ముకోవచ్చు. ఇటీవలనే ఒక టివి ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేరళ ఆర్థిక మంత్రి టి.ఎం. థామస్ ఐసాక్ తాము వాక్సిన్లు కొంటామని సీరం ఇన్ స్టిట్యూట్‌కు చేసిన ప్రతిపాదనకు సమాధానమే రాలేదని అన్నారు. మహారాష్ట్ర ఆరోగ్యమంత్రి రాజేష్ తోపే తమ రాష్ట్రానికి మే 25 వరకూ వాక్సిన్ సరఫరా జరిగే అవకాశమే కనబడడం లేదని అన్నారు.

అంతకన్నా ఘోరం, ఈ విధానం తీవ్రమైన అసమానతలకు దారితీస్తుంది. బాగా వనరులున్న రాష్ట్రాలు తమకు అవసరమైన వాక్సిన్లను సంపాదించుకుంటాయి. పేద రాష్ట్రాలు వాక్సిన్లు సంపాదించలేక ఇబ్బంది పడతాయి. సంపన్నులు తమ కుటుంబాలకు సులభంగా వాక్సిన్ వేయించగలుగుతారు. బలహీన వర్గాల ప్రజలు అత్యవసరమైన వాక్సిన్ లేకుండానే గడపవలసి వస్తుంది. అంటే భారత పౌరులలో కొందరికి వాక్సిన్ అందుతుంది, కొందరికి అందదు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దాని రాజ్యాంగ కర్తవ్యానికి వ్యతిరేకం. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని మూడో జాబితాలో 29వ అంశం 'రాష్ట్రాల మధ్య అంటువ్యాధుల వ్యాప్తిని అదుపు చేయడంలో' కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరించాలని నిర్దేశిస్తుంది. అలాగే, అంతర్జాతీయ న్యాయశాస్త్రం ప్రకారమూ, మన రాజ్యాంగంలోని 14, 21 అధికరణాల ప్రకారమూ కూడా అత్యవసరమైన వైద్య ఆరోగ్య వస్తువులను, సేవలను, సౌకర్యాలను ప్రజలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా 'అందుబాటులో సిద్ధంగా ఉంచాలి.' అంటే వాక్సిన్లను సేకరించడం, అన్ని రాష్ట్రాలకూ సమానంగా పంపిణీ చేయడం కేంద్ర ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. కాని అది ఇప్పుడు ప్రకటించిన వ్యూహం దాని రాజ్యాంగ కర్తవ్యాలను ఉల్లంఘిస్తున్నది.

మార్కెట్ శక్తులకు వదిలేసిన ధరల నిర్ణయం

కేంద్ర ప్రభుత్వం సేకరిస్తున్న ధరలు ఒక వాక్సిన్ డోస్‌కు ఇటీవలి నెలల్లో రు. 200 నుంచి రు. 150కి పడిపోయాయి. మరింత కూడా తగ్గవచ్చునని ఊహిస్తున్నారు. కానీ ఈ ప్రయోజనం రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజలకు మాత్రం అందే అవకాశం లేదు. సుప్రీంకోర్టుకు సమర్పించిన పత్రంలో స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ధరలను 'మార్కెట్ శక్తులే' నిర్ణయించాలని వాదించింది. సీరం ఇన్‌స్టిట్యూట్ తయారు చేసిన కొవిషీల్డ్ ఒక డోస్ రు. 300కు, భారత్ బయోటెక్ తయారు చేసిన కోవాక్సిన్ ఒక డోస్ రు. 400కు రాష్ట్ర ప్రభుత్వాలకు అమ్మారు. ప్రైవేట్ సంస్థలకు వీటినే రు. 600కు, రు. 1200కు అమ్మారు. ఈ ధరలన్నీ కూడా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఏ దేశంలోనైనా ఉన్న ధరల కన్నా చాలా ఎక్కువ. సీరం ఇన్‌స్టిట్యూట్ వాక్సిన్ ఒక డోస్ యూరపియన్ మార్కెట్‌లో రు. 160 (2.15 డాలర్లు) కు, అంతర్జాతీయ వాక్సిన్ అలయన్స్ గవికి రు. 210 (2.10 డాలర్లు)కి, యునైటెడ్ కింగ్‌డమ్‌లో రు. 222 (3 డాలర్లు) కు, అమెరికాలో రు. 297 (4 డాలర్లు) కు అమ్ముతున్నారు. కాని భారతదేశంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఎక్కువ ధర చెల్లించాలని ప్రైవేట్ ఉత్పత్తిదారులు నిర్ణయించారు. అది కూడా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న ధర కన్నా 200 శాతం నుంచి 800 శాతం ఎక్కువ. అంటే ప్రజల జీవితాలను పణంగా పెట్టి ఆ కంపెనీలు మితిమీరిన లాభాలు దండుకోవడానికి అవకాశం వచ్చింది.

కొవిషీల్డ్‌కు రు. 300, కోవాక్సిన్‌కు రు. 400 ధర నిర్ణయించడం పూర్తిగా ప్రైవేట్ కంపెనీల పని కూడా కాదు, ఆ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం సంపూర్ణంగా ఉంది. ఒకే వాక్సిన్‌కు కేంద్ర ప్రభుత్వానికి ఒక ధర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరొక ధర వంటి భిన్నమైన ధరల విధానానికి ఎటువంటి సమర్థనా లేదు. ఈ విధానానికి ఉండగల మరొక తీవ్రమైన పర్యవసానం ఏమంటే, రాష్ట్ర ప్రభుత్వాలు గనుక కేంద్ర ప్రభుత్వం చెల్లించే ధర కన్నా రెట్టింపు చెల్లించవలసి వస్తే, ఆ రాష్ట్ర ప్రభుత్వాల విలువైన వనరులను ఇతర అత్యవసరమైన ఆరోగ్య, సామాజిక సంక్షేమ కార్యక్రమాల నుంచి వాక్సిన్ కొనుగోలు వైపు మళ్లించవలసి వస్తుంది. ఇది రాజ్యాంగంలోని 14, 21 అధికరణాలలోని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే.

తన ధరల విధానాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తూ సీరం ఇన్‌స్టిట్యూట్ ఒక ప్రకటన చేసింది. 'మొదట నిర్ణయించిన ధర మేం పెట్టిన ముందస్తు పెట్టుబడి మీద ఆధారపడినది. ఇప్పుడిక మా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికీ, మరిన్ని ఎక్కువ డోసుల వాక్సిన్ తయారు చేయడానికీ మేం మరింత పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది' అని ఆ కంపెనీ చెప్పింది. అయితే ఈ కంపెనీ వాదన పూర్తిగా తప్పు.

సీరం ఇన్ స్టిట్యూట్ మౌలికంగా ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నది. ఆ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి కోసం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికే భారీగా ప్రభుత్వ నిధులు, సామాజిక ధర్మ సంస్థల నిధులు అందాయి. ఇటీవల యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, 'చాడాక్స్ సాంకేతిక పరిజ్ఞాన పరిశోధనలో, అభివృద్ధిలో, ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని సార్స్ – కోవిడ్–2కు అనువర్తింపజేయడంలో ఉపయోగించిన నిధులలో 97.1 శాతం నుంచి 99 శాతం నిధులు ప్రజాధనం నుంచే వచ్చాయి.' ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలు పెట్టిన పెట్టుబడి 2 శాతం కన్నా తక్కువ.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆ సాంకేతిక పరిజ్ఞాన లైసెన్స్ పొందిన ఆస్ట్రా జెనెకా అనే కంపెనీ ఆ పరిజ్ఞానాన్ని బదిలీ చేయడానికి సీరం ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం లక్ష్యం సీరం ఇన్‌స్టిట్యూట్ వంద కోట్ల డోసుల వాక్సిన్ తయారు చేసి అల్పాదాయ దేశాలకు ఉత్పత్తి వ్యయానికే అమ్ముతుందనేది. అంతే కాదు, అంతర్జాతీయ వాక్సిన్ అలయన్స్ గవి ఈ పనిలో సీరం ఇన్‌స్టిట్యూట్‌కు సహకరించేందుకు గాను 300 మిలియన్ డాలర్ల (రు. 22,000 కోట్ల) సహాయం చేసింది. ఈ నిధులను భారతదేశంలోని దాని ఉత్పత్తి కేంద్రాన్ని అంతర్జాతీయ అవసరాలకు తగినట్టుగా విస్తరించడానికి వినియోగించాలని అంది. ఈ విస్తరణ కార్యక్రమం సజావుగా సాగేందుకు గాను రు. 3,000 కోట్ల డోసుల కొనుగోలుకు భారత ప్రభుత్వం ముందస్తు చెల్లింపులు కూడా చేసింది.

అంటే, ఉత్పత్తి వ్యయానికే వాక్సిన్ అమ్మడానికి అవసరమైన గణనీయమైన సహకారం సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు అందింది. రు. 150కి ఒక డోస్ అమ్మినా కంపెనీకి లాభాలు వస్తాయని ఎన్‌డి టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీరం ఇన్‌స్టిట్యూట్ అధిపతి ఆదర్ పూనావాలా చెప్పారు. అయినా, అంతకన్నా ఎక్కువ ధరలకు రాష్ట్ర ప్రభుత్వాలకు, మరింత ఎక్కువ ధరలకు ప్రైవేట్ రంగానికి అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.

ఇక భారత్ బయోటెక్ తాను క్లినికల్ ట్రయల్స్ మీదనే రు. 300 కోట్లు ఖర్చు పెట్టానని చెప్పుకుంటున్నది. అది తయారు చేసిన వాక్సిన్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ఐసిఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవి) వంటి ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో సంయుక్తంగా తయారయింది. భారత్ బయోటెక్ చెప్పుకుంటున్న క్లినికల్ ట్రయల్స్ అన్నీ కూడా ప్రభుత్వ సంస్థల్లోనే జరిగి, మొత్తం ప్రక్రియ త్వరితగతిన పూర్తి అయింది. ఇప్పుడు జూలైకల్లా కేంద్ర ప్రభుత్వానికి 9 కోట్ల డోసుల వాక్సిన్ అందజేయడానికి ముందస్తుగా రు. 1,500 కోట్లు బ్యారత్ బయోటెక్‌కు అందాయి. భారత్ బయోటెక్ ఉత్పత్తి సామర్థ్యం విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ అసాధారణ నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ భారత్ బయోటెక్ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డోసుకు రు. 400 వసూలు చేస్తున్నది.

సాగుతున్న మహా విపత్తును అడ్డం పెట్టుకుని వాక్సిన్ ఉత్పత్తిదారులు ఇలా ఇబ్బడి ముబ్బడి లాభాలు ఆర్జించడానికి అనుమతించే బదులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకే ధరకు అమ్మమనీ, ప్రైవేట్ రంగానికి అమ్మేటప్పుడు ఉత్పత్తి వ్యయం మీద హేతుబద్ధమైన వ్యాపార లాభం (10-15 శాతం) వేసుకుని అమ్మమనీ ఆ ఉత్పత్తిదారులతో కేంద్ర ప్రభుత్వం బేరం ఆడి ఉండవలసింది. అలాగే వాక్సిన్లు వేసేప్పుడు ఆస్పత్రులు ఎంత ధరకు అమ్మాలో గరిష్ట పరిమితిని కూడా ప్రభుత్వం నిర్ణయించాలి. ఉత్పత్తిదారులు, ఆస్పత్రులు ఆ నిబంధనలను పాటించకపోతే న్యాయస్థానాలైనా జోక్యం చేసుకుని ఔషధ ధరల (నియంత్రణ) ఉత్తర్వుల ప్రకారం ధరలు నిర్ణయించమని జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటీ) ని ఆదేశించాలి.

వాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యం పెంచవలసిన అవసరం

మార్చ్ 2021లో రోజుకు 25 లక్షల వాక్సిన్లు వేస్తున్నారని, అది ఏప్రిల్‌లో 42 లక్షలకు చేరిందని, కానీ మే మొదటి వారంలో 18 లక్షలకు దిగిపోయిందని గణాంకాలు చెపుతున్నాయి. నిజానికి ఈ సమయంలోనే భారతదేశం నుంచి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాక్సిన్లు పంపడాన్ని నిషేధించారు. ఆ మేరకు దేశంలో ఎక్కువ వాక్సిన్లు దొరుకుతూ ఉండవలసింది. దేశంలో సామాజిక రోగ నిరోధక శక్తి సాధించాలంటే మొత్తం వయోజన జనాభాలో 70 శాతానికి, అంటే దేశ జనాభా 135 కోట్లలో 90 కోట్ల మందికి వాక్సిన్లు వేయడం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బాధ్యత. ఇది రాస్తున్న సమయానికి 15 కోట్ల డోసులు, అవీ ప్రధానంగా మొదటి డోసులు మాత్రమే ఇవ్వడం జరిగింది. ఈ వేగంతో సాగితే, లక్ష్యం సాధించడానికి రెండు సంవత్సరాలు పడుతుంది. అంటే నిస్సందేహంగా, మనం మన వాక్సినేషన్ కార్యక్రమాన్ని ఇతోధికంగా పెంచవలసి ఉంది. ప్రస్తుత వాక్సిన్ల, రానున్న వాక్సిన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించవలసి ఉంది.

సీరం ఇన్‌స్టిట్యూట్‌కు ప్రస్తుతం నెలకు ఆరు కోట్ల డోసులు ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. ఈ సామర్థ్యాన్ని నెలకు పది కోట్ల డోసుల ఉత్పత్తి దశకు విస్తరించాలని ఆ కంపెనీ ప్రతిపాదిస్తున్నది. భారత్ బయోటెక్ ఉత్పత్తి సామర్థ్యం నెలకు రెండు కోట్ల డోసులుగా ఉంది, కాని ఏప్రిల్‌లో 80 లక్షల డోసులు కూడా ఇవ్వలేకపోయింది. ఈ ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలనుకోవడం ఆహ్వానించవలసిందే. అలాగే హాఫ్కిన్ బయోఫార్మాసూటికల్ కార్పొరేషన్, ఇండియన్ ఇమ్యూనలాజికల్స్, భారత్ ఇమ్యూనలాజికల్స్ వంటి కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు ఆరు కోట్ల డోసుల స్థాయికి పెంచదలచుకున్నాయి.

దేశంలో స్పుత్నిక్ వాక్సిన్‌ను పంపిణీ చేస్తున్న రష్యన్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ నెలకు అయిదు కోట్ల డోసులు ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు వేసుకున్నది. అలాగే రెండు డోసుల బదులు ఒక్క డోస్ స్పుత్నిక్ వాక్సిన్‌ను కూడా భారత్‌లో ప్రవేశపెడుతున్నారు. అయితే దాని ఉత్పత్తి వివరాలు ఇంకా అందుబాటులోకి రాలేదు.

జాన్సన్ అండ్ జాన్సన్ కూడా ఒకే డోస్ వాక్సిన్‌ను ఉత్పత్తి చేసింది గనుక అది కూడా ముఖ్యమైన కంపెనీనే. ఆ వాక్సిన్‌ను మైనస్ 2 డిగ్రీల నుంచి మైనస్ 8 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో సరఫరా చేయవలసి ఉంటుంది. అది ఒకే డోస్ వాక్సిన్ గనుక ఇతర వాక్సిన్ల కన్నా రెట్టింపు వ్యక్తులకు ఇవ్వడానికి వీలుంది. ఈ కంపెనీ భారత్‌లోని బయోలాజికల్ ఇవాన్స్ కంపెనీతో లైసెన్సింగ్ ఒప్పందం చేసుకుంది. ఈ వాక్సిన్‌కు ఇంకా పరీక్షలు ఏమీ అవసరం లేనప్పటికీ, దీని ఉత్పత్తి సెప్టెంబర్ దాకా ప్రారంభం కాకపోవచ్చు. మొత్తానికి ఈ ఒక్క డోస్ వాక్సిన్‌ను సంవత్సరానికి 50 కోట్ల డోసులు ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

అలాగే నోవోవాక్స్ భారత్‌లో తన వాక్సిన్లు ఉత్పత్తి చేయడానికి సీరం ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో ఇటీవల జరిగిన సవరణల ప్రకారం సీరం ఇన్‌స్టిట్యూట్ వాక్సిన్ సంబంధిత ముడిసరుకులను కూడా ఉత్పత్తి చేస్తుంది.

ఇవన్నీ కలిపితే కూడా, అందరు ఉత్పత్తిదారులూ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే కూడా, నెలకు ఇరవై ఐదు కోట్ల డోసులు మాత్రమే తయారవుతాయి. అంటే రోజుకు 67 లక్షల డోసులు తయారవుతాయి. ఆ లెక్కన, ఈ మొత్తం ఉత్పత్తిని భారత్‌లోనే వాడినప్పటికీ, సామాజిక రోగనిరోధక శక్తి సాధించడానికి ఒక ఏడాది పైనే పట్టవచ్చు.

పేటెంట్లు, వ్యాపార రహస్యాలు, రహస్య సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం సమస్యలు పైన చెప్పిన వాటిలో కొన్ని వాక్సిన్లు, వాక్సిన్ల తయారీకి అవసరమైన సన్నాహకాలు అన్నీ కూడా పేటెంట్ అయి ఉన్నాయి. దురదృష్టవశాత్తూ వాక్సిన్లకు సంబంధించిన మేధో హక్కుల, పేటెంట్ల అవగాహన భారత్‌లో విస్పష్టంగా లేదు. మొట్టమొదట, కొత్త వాక్సిన్ అనువర్తిత ఉపయోగం మీద పెట్టుకునే దరఖాస్తులను 18 నెలల వరకు బహిరంగపరచడానికి వీలు లేదు. ఈ అడ్డంకిని అధిగమించడానికి కోవిడ్-19 సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల దరఖాస్తులన్నిటినీ పద్దెనిమిది నెలలు గడవగానే బహిరంగపరచాలని కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్‌ను ఆదేశించవచ్చు. బ్రెజిల్ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంది. భారత ప్రభుత్వం కూడా ఆ పనే చేయవచ్చు. తద్వారా పేటెంట్ల అవగాహన, లైసెన్సింగ్ అనుమతుల విషయాలలో సౌలభ్యం ఏర్పడుతుంది.

రెండవది, కొన్ని మౌలిక సాంకేతిక పరిజ్ఞానాల విషయంలో ఆ వాక్సిన్ల తయారీని అభివృద్ధి చేయబోతున్నామని ఎప్పుడో పేటెంట్ దరఖాస్తులు పెట్టుకుని ఉన్నందువల్ల ఇప్పటికీ పేటెంట్ అమల వుతున్నది. ఉదాహరణకు కోవిషీల్డ్ వాక్సిన్ విషయంలో ఆస్ట్రా జెనెకా లైసెన్సుతో సీరం ఇన్‌స్టిట్యూట్ ఉత్పత్తి చేస్తున్నది గాని, భారత్‌లో ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకే పేటెంట్ చేయాలని ఎన్నో దరఖాస్తులు ఉన్నాయి.

స్వేచ్ఛా వాణిజ్యం కోరల్లో కరోనా వ్యాక్సిన్లు

***కేంద్రం కరోనాను శాస్త్రీయంగా నియంత్రించకుండా మూఢ విశ్వాసాలను ప్రచారం చేసి, స్వేచ్ఛా మార్కెట్ పేరుతో వ్యాక్సిన్‌ను ప్రైవేటు కంపెనీల చేతుల్లో పెట్టి ప్రజలకు అందుబాటులో లేకుండా చేసిందని అంటున్నారు* కేశవ్**

ఎక్కడో గబ్బిలాల మీద ఉండాల్సిన కరోనా వైరస్ 2019 డిశంబర్ నుండి ప్రపంచం మొత్తం మానవాళి మీద దాడి చెయ్యడానికీ, అంతవరకు వ్యవస్థ కొనసాగిస్తూ వస్తోన్న విధ్వంసక అభివృద్ధికీ, ఆహార ఉత్పత్తుల్లో పెరిగిన ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ పరిశ్రమకీ, ఈ పరిశ్రమ నుండి అంతర్జాతీయంగా విపరీతంగా లాభాలను కొట్టెయ్యాలన్న బహుళజాతి సంస్థల కక్కుర్తికీ, చాలా దగ్గర సంబంధం ఉంది. నేడు భారత ప్రజలతో పాటు ప్రపంచ మానవాళి ఒక చిన్న వైరస్‌తో బాధపడుతోంది. అంటే, ఒక్క వైరస్ మాత్రమే ఈ సమస్యకు కారణం కాదు. అడవుల్నీ, పర్యావరణాన్నీ, పర్వతాల్నీ, నదుల్నీ, స్వచ్ఛమైన, అందమైన ప్రకృతిని గనుల కోసమనీ, పరిశ్రమల కోసమనీ, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల కోసమనీ తమ వ్యాపార ప్రయోజనాల కోసం విధ్వంసం చేసే విధ్వంసకర అభివృద్ధి, దీన్ని ప్రోత్సహిస్తోన్న పెట్టుబడిదారీ వ్యవస్థ ముఖ్య కారణంగా నిలుస్తోంది. వైరస్ విజృంభణకు సరైన, సత్వరమైన పరిష్కారం ఇవ్వలేని నాయకులను ప్రశ్నించడం ఒక్కటే మన కర్తవ్యం కాదు. ఇంతకంటే బలంగా భయంకరమైన వైరస్‌లకు కారణమవుతున్న విధ్వంసక అభివృద్ధినీ, వైరస్ విజృంభణ తర్వాత మనుషుల్ని శవాల గుట్టలుగా మార్చేసే నిష్క్రియాపరమైన వ్యవస్థనీ ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. మరలా ఇదే వ్యవస్థ, ఇదే పాలక వర్గాలు జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ శాస్త్రవేత్తలు అందించిన వ్యాక్సిన్లను ప్రజలకు సకాలంలో అందివ్వడంలో విఫలమవుతున్నారు. ఒకవైపు ప్రజలకు వ్యాక్సిన్లు అందడంలో అంతర్జాతీయ పేటెంట్ చట్టాలు అడ్డుగా నిలుస్తోంటే, మరోవైపు, పాలకవర్గాల నిరాసక్తత, నిర్వహణలోపం, ముందుచూపు కొరవడడం, కరువైన మానవత్వం ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రజలకు సరయిన వైద్యం అందుతుందన్న గ్యారంటీ లేదు. ఆక్సిజన్

వారిలో కొందరికి పేటెంట్లు దక్కాయి కూడా. వీరి లైసెన్సులను స్వచ్ఛందంగా గాని, నిర్బంధంగా గాని తొలగించాలి.

జాన్సన్ అండ్ జాన్సన్, ఫైజర్ - బయో ఎన్‌టెక్, మాడర్నా, నోవోవాక్స్ చేసిన అన్వేషణలు తప్పకుండా పేటెంట్ అవుతాయి. వీటిలో ఫైజర్, మాడర్నా ఎన్-ఆర్ ఎన్ఎ వాడుతున్న సాంకేతిక పరిజ్ఞానాలకు మైనస్ 80 డిగ్రీల సెంటీగ్రేడ్ కోల్డ్ చెయిన్ పరిస్థితులు అవసరం అవుతాయి గనుక, వాటిని భారతదేశంలో పెద్ద ఎత్తున వినియోగిండడం సాధ్యం కాకపోవచ్చు. అవి ఒకరకంగా భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలు. మిగిలిన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించే ఉత్పత్తిదార్లు ఎక్కువ మంది భారతదేశానికి అవసరం.

మూడవది, రష్యన్ కంపెనీ తయారు చేసిన స్పుత్నిక్‌ను ఓపెన్ సోర్స్ ప్లాటి ఫామ్ మీద అభివృద్ధి చేశారు. దాని ఉత్పత్తి లైసెన్సులను చాలా పెద్ద సంఖ్యలో కంపెనీలకు ఇస్తున్నారు. అదే విధంగా కోవాక్సిన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఆసక్తి ఉన్న ఉత్పత్తిదారులందరికీ బహిరంగంగా అందజేయడం గురించి భారత ప్రభుత్వం ఆలోచించాలి.

పేటెంట్ అవరోధాలను అధిగమించడానికి భారత పేటెంట్ చట్టంలోని సెక్షన్ 100 కింద అధికారిక అనుమతి ఇవ్వడం, సెక్షన్ 92 కింద తప్పనిసరి లైసెన్సింగ్ అనుమతించడం, సెక్షన్ 47 కింద కాంట్రాక్టు ఉత్పత్తికి అనుమతించడం వంటి చర్యలకు ప్రభుత్వం పూనుకోవచ్చు. వాక్సిన్ల విషయంలో ట్రిప్స్ (ట్రేడ్ రిలేటెడ్ ఆస్పెక్ట్స్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల ప్రకారం ఏర్పాటయిన పద్ధతి) ను పక్కన పెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది గనుక భారత ప్రభుత్వం తీసుకునే చర్యలు సులభమే అవుతాయి. అయితే ఈ పక్కన పెట్టడం అనేది కేవలం పేటెంట్ హక్కులు పక్కన పెట్టడంతో మాత్రమే సరిపెట్టగూడదు. అందులో సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, రహస్య సమాచారం, వ్యాపార రహస్యాలు వంటి అంశాలు కూడా భాగం కావాలి. వాక్సిన్ల ఉత్పత్తిని త్వరితగతిన పెంచడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని బహిరంగంగా పంచుకునే విషయంలో ప్రభుత్వం, ప్రత్యేకించి డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం సాధ్యమైన అన్ని చర్యలూ చేపట్టాలి.

ముగింపు

కేంద్ర ప్రభుత్వమే వాక్సిన్లను సేకరించి రాష్ట్రాలకు పంపిణీ చేసే జాతీయ రోగనిరోధక పథకం నమూనాకు తిరిగి వెళ్లినప్పుడు మాత్రమే, దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచితంగా వాక్సిన్ వేసినప్పుడు మాత్రమే, భారత పేటెంట్ల చట్టం నిబంధనల కింద అందిన అధికారాన్ని వాడుకుని ఆయా సందర్భాలలో అనుమతులు ఇవ్వడం, తప్పనిసరి లైసెన్సులు ఇవ్వడం, కాంట్రాక్టు ఉత్పత్తి లైసెన్సులు ఇవ్వడం వంటి పనులకు ప్రభుత్వం పూనుకున్నప్పుడు మాత్రమే దేశ ప్రజలందరికీ టీకాలు వేసే కార్యక్రమాన్ని సాఫీగా సాధించగలం. మరొక మహా విపత్తులోకి వెళ్లకుండా ఉండగలం. భారత రాజ్యాంగం 14, 21 అధికారణాల కింద ప్రజలందరి ఆరోగ్య హక్కును వివక్షారహితంగా పరిరక్షించే బాధ్యత తనమీద ఉన్నదని భారత ప్రభుత్వం గుర్తించాలి, ఆ బాధ్యతను నెరవేర్చాలి.

(రచయిత సుప్రసిద్ధ న్యాయవాది)
(https://www.barandbench.com/లో మే 9న రాసిన వ్యాసానికి అనువాదం: ఎన్ వేణుగోపాల్) వీ

సిలిండర్లు సకాలంలో ఏర్పాటుచేసే విధానం లేదు. మహమ్మారులను ఎదుర్కొనే యుద్ధప్రాతిపదికలో సన్నాహాలు లేవు. ఏం చెయ్యాలో అర్థంకాని అస్తవ్యస్త పరిస్థితి. శ్మశాన నిశ్శబ్దం. ప్రైవేటు ఆసుపత్రులను నియంత్రించే పరిస్థితి లేదు. ప్రభుత్వ ఆసుపత్రులను బలపరచే పరిస్థితి లేదు. చుట్టూ నిస్సహాయ స్థితి. మానవజాతి ఎన్నడూ ఎదుర్కోని అత్యంత విషాదకర పరిస్థితి.

పాలక వర్గం – అశాస్త్రీయ భావాలు

సమస్యకు సరయిన పరిష్కారం ఇచ్చి ప్రజలకు కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం, వైరస్‌కి సంబంధించిన సైన్స్‌ని ప్రజలకు యుద్ధప్రాతిపదికతో అందివ్వాల్సిన ప్రభుత్వం, కనీసం రాజ్యాంగం ప్రకారమైనా శాస్త్రీయతను పెంపొందించాల్సిన ప్రభుత్వం కరోనా విషయంలో అలా చెయ్యకపోగా అందుకు విరుద్ధమైన విషయాలను, మూఢ విశ్వాసాలను ప్రచారం చేసింది. ఒక వైరస్ మందులతో అయినా చావాలి. లేదా, వ్యాక్సిన్‌తో అయినా బలహీనం అవ్వాలి. ఈ రెండూ సైన్స్ చదివిన ఎవరికైనా అర్థం అయ్యే ప్రాథమిక విషయాలు. కానీ, నాయకులు ఈ రెండూ పక్కనపెట్టి కొవ్వొత్తులు వెలిగించమనీ, బాజాలు వాయించమనీ, అలా చేస్తే ఏదో కొత్తరకం శక్తి విడుదలై కరోనా పారిపోతుందని 'గో కరోనా గో' అని ప్రజలకు అజ్ఞాన బోధ చేశారు. మూఢ నమ్మకాలకే సైన్స్ పదాలు జోడించి, అర్థం పర్థం లేని కథనాలతో చదువుకున్న వారిని సైతం అయోమయంలో పెట్టేసి కరోనాను మట్టు బెట్టేశారు. కొవ్వొత్తులతో! మధ్యతరగతి ట్యూన్ చేసిన రోబోట్లలా వరండాల్లోకి వెళ్లి కొవ్వొత్తులు వెలిగించారు. కరోనాని ఇలాంటి మాయలతో, గారడీలతో జయించలేరని రెండోవేవ్ మనకు రుజువు చేసింది. అయితే నాయకులు కరోనాను జయించగలిగారో లేదో గాని ప్రజలను మంత్రముగ్ధుల్ని చేసి అందరిచేత అశాస్త్రీయమైన పనుల్ని చేయించగలమా లేదా, ప్రజలందర్నీ ఒక ప్రత్యేక పరిస్థితిలో తమకు అనుకూలంగా నియంత్రించగలమా లేదా అనే విషయంలో మాత్రం విజయవంతం అయ్యారనే తెలుస్తుంది. అయితే, మూఢ భక్తికీ, అంధ విశ్వాసాలకీ చెల్లించాల్సిన మూల్యం ప్రజలు రెండోవేవ్‌లో చెల్లించారు. కరోనా కొవ్వొత్తులకూ, బాజాలకూ, బాంబులకూ, అర్థంపర్థం లేని అతీత శక్తులకూ లొంగదనీ, ఇదంతా హేతుబద్ధత లేని మూఢం అనీ, అది మరింత శక్తిని పుంజుకుని రెండోవేవ్‌గా మనమీద విరుచుకు పడిందనీ అనుభవంతో తెలిసింది. ఈసారి ప్రజలను మభ్యపెట్టి మరో కొవ్వొత్తుల మాయాజాలాన్ని అందివ్వడానికి నాయకుల దగ్గర చిట్కాలు కరువయ్యాయి ఎందుకంటే ప్రజలను ఎల్లవేళలా మభ్యపరచడం సాధ్యం కాదు. ప్రపంచ ప్రఖ్యాత మెడికల్ జర్నల్ లాన్సెట్ ఒకవైపు, అంతర్జాతీయ మీడియా ఒకవైపు దుయ్యబడుతోంటే, ఆక్సిజన్ సిలిండర్లు కూడా సరిగ్గా అందివ్వలేని ప్రభుత్వానికే ఊపిరి కరువైంది.

వ్యాక్సిన్ల తయారీ, పంపిణీలో జాప్యం

వ్యాక్సిన్ల పరిశోధన అతితక్కువ కాలపరిమితిలో ప్రజలకు అందుతున్నందుకు సంతోషించాల్సిన విషయం. ప్రపంచంలో ఇంతవరకు ఏ వ్యాక్సిన్ కూడా ఇంత తొందరగా పరిశోధన కాలేదు. దాదాపు పదేసి సంవత్సరాలు పట్టేసిన వ్యాక్సిన్లు ఉన్నాయి. శాస్త్ర విజ్ఞానాన్నీ, మానవ మేధస్సునీ, నిబద్ధతనీ కొనియాడదగ్గ విషయం. అయితే, సైన్స్ పరిశోధనలో కార్పొరేట్ల కక్కుర్తి, అర్థం పర్థం లేని పేటెంట్ చట్టాలు వీటిని ప్రజల వరకు రాకుండా అడ్డుకట్ట వేస్తున్నాయి. ఒకవైపు మనదేశం తన ప్రజలకోసమే వ్యాక్సిన్లను తయారుచేసుకోలేని పరిస్థితి ఉంటే, మరోవైపు ఇదే దేశంలో సేరం ఇనిస్టిట్యూట్‌లో తయారైన వ్యాక్సిన్లు 6.6 కోట్ల డోసులు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధన ప్రకారం, 93 దేశాలకు మనదేశం నుండి వ్యాక్సిన్ అందితే, అందులోని 88 దేశాల్లో కోవిడ్ కేసుల సంఖ్య మనదేశంతో పోలిస్తే, అత్యంత తక్కువ. 6.6 కోట్ల కోవిషీల్డు వ్యాక్సిన్ సేరం ఇన్‌స్టిట్యూట్ ఎగుమతి చేసింది. అందులో ఒక కోటి గ్రాంట్లుగా, 3.6 కోట్లు కమర్షియల్‌గా పంపించారు. 2 కోట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ కోవాక్స్ పథకం ద్వారా పంపించారు. వ్యాక్సిన్లను దేశం నుండి బయటకు పంపించడంలోని నిబద్ధత, సామాజిక బాధ్యత మనదేశం విషయంలో మృగ్యమయింది.

ఒకే వ్యాక్సిన్ – రకరకాల ధరలు

ఇంతవరకు ఏ వ్యాక్సిన్ అయినా సార్వత్రిక టీకా పథకం కింద కేంద్ర ప్రభుత్వమే అధిక మోతాదులో కొనుగోలు చేస్తుంది. పంపిణీ చేస్తుంది. అత్యంత ప్రణాళికతో ఇలానే నిర్వహిస్తూ పోలియోను నిర్మూలించగలిగాం. 'ఎవరి వ్యాక్సిన్ వాళ్లు కొనుక్కోండి' అని ఇంతకు ముందు కూడా నిర్దేశించి ఉంటే, పోలియోను ఈ రోజుకీ నిర్మూలించలేక పోయి ఉండేవాళ్లం. ఒక్క సైన్స్ మాత్రమే కాదు. సైన్సును ప్రోత్సహించే ప్రజానుకూల ఆర్థిక వ్యవస్థ కూడా తోడయితేనే వ్యాక్సిన్లు ప్రజలకు చేరువవుతాయి. కానీ, కరోనా వ్యాక్సిన్ల విషయంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న వ్యాక్సిన్ల 'స్వేచ్ఛా వాణిజ్యం' వ్యాక్సిన్లు ప్రజలకు అందడంలో గగన కుసుమమవుతోంది. భారతదేశంలో 1997లో మశూచి, 2014లో పోలియో నిర్మూలించగలగడం సార్వత్రిక ఉచిత టీకా పథకం ద్వారానే సాధ్యం అయిందని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ కూడా బల్లగుద్ది చెప్పింది. నేడు, స్వేచ్ఛా వాణిజ్యం ప్రపంచీకరణ పవనాలు – నయా ఉదారవాదం – చివరికి వ్యాక్సిన్ల తయారీ, పంపిణీలో కూడా జొరబడ్డాయి. ప్రజల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలో పెట్టాయి. ప్రఖ్యాత ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ ప్రకారం, వ్యాక్సిన్ల ద్వారా 2021లోనే ఫైజర్ 15 బిలియన్ డాలర్లు, మోడర్నా 18.4 బిలియన్ డాలర్ల రెవెన్యూను సంపాదించుకోగలదు. యింకా మరెన్నో కంపెనీలు స్వేచ్ఛా వాణిజ్యం బేరసారాల్లో మునిగి ఉన్నాయి. రెండోవేవ్ ఉధృతంగా పరిణమించిన విషయాన్ని ముందుగానే ఊహించి నిపుణుల సలహా పాటిస్తూ, కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన వ్యాక్సిన్ల ఉత్పత్తిని కొనసాగించాల్సింది. ఒక కంపెనీయో, రెండు కంపెనీలో దేశం మొత్తం జనాభాకు అవసరమైన వ్యాక్సిన్లను తయారుచెయ్యలేవు. పైగా కోవిడ్ వ్యాక్సిను తయారుచేస్తూనే, ఆయా కంపెనీలు ఇంతకు ముందు పంపిణీలో ఉన్న ఇతర వ్యాక్సిన్లు కూడా తయారు చెయ్యాలి. కోవిడ్ వ్యాక్సిన్ల కోసమని వాటి తయారీ ఆపడం సాధ్యం కాదు. సముచితం కాదు. అయితే, వ్యాక్సిన్ పరిశోధనలో, తయారీలో భారత్ బయోటెక్, సేరం ఇన్‌స్టిట్యూట్ ముందున్నా, తయారుచెయ్యగల

సామర్థ్యం చాలా కంపెనీలకు ఉంది. మహారాష్ట్రలో హాఫ్కిన్స్ బయో ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ కార్పొరేషన్, జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ వారి ఇండియన్ ఇమ్యూనలాజికల్ అండ్ బయోలాజికల్ లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ సంస్థలు వ్యాక్సిన్‌లను తయారుచెయ్యగలవు. అయితే ఆయా కంపెనీలను ముందుగానే సమాయత్తం చెయ్యడం, టెండర్లు పెట్టడం, కేంద్ర ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తామన్న హామీ ఇవ్వడం మొదలైన పనుల్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతతో యుద్ధప్రాతిపదికన నిర్వహించాల్సింది. నేడు పదిశాతం జనాభాకు కూడా వ్యాక్సిన్లు అందని పరిస్థితి. పైగా ఆగస్టుకు ముందు కోవిషీల్డ్ గానీ, కోవాక్సిన్ గానీ అందుతాయన్న గ్యారంటీ లేదు. స్పుత్నిక్-5 వస్తుందన్న మాట అందేవరకూ చెప్పలేం. ఇంత అస్తవ్యస్తమైన పరిస్థితి నిజంగా బాధ్యతారాహిత్యంగానే జరిగిందో లేదా స్వేచ్ఛా వాణిజ్యం సూత్రాలకు న్యాయం చెయ్యాలని ఆరోగ్యాన్ని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్లకు బంగారు పంటలు పండించాలనే ఉద్దేశంతోనే జరిగిందో తెలుసుకోవలసిన అవసరం ఉంది. కేంద్రం డోసు 150 రూపాయలకే కొన్నా, సంబంధిత కంపెనీలకు 19,500 కోట్లు అమ్మకాల వల్ల సమకూరుతాయి. సాధారణ లాభాలు కూడా ఇందులో ఉన్నాయి. మరి, ఇదే పరిశ్రమని స్వేచ్ఛా వాణిజ్యం పేరుమీద విడగొట్టేసి కేంద్రానికి ఒక రేటు, రాష్ట్రాలకు ఒక రేటు, ప్రైవేటు ఆసుపత్రులకు ఒక రేటులో అందజేస్తే, అవే కంపెనీలకు దాదాపు 42,000 కోట్ల రూపాయలు అందుతాయని ఒక అంచనా. ప్రజలు ఒకవైపు వ్యాక్సిన్ల కోసం పడిగాపులు కాస్తుంటే మరోవైపు ధరల నాటకాల పర్వం తెరవెనుక కొనసాగుతుంది. వ్యాక్సిన్లను అత్యంత వేగంగా ప్రజలకు అందించి మహమ్మారుల వివిధ రకాల వేవ్‌ల నుండి ప్రజల్ని విముక్తి చేయడం ప్రభుత్వం బాధ్యత. సార్వత్రిక టీకా పథకం ద్వారానే యిది సాధ్యం. యింతవరకు దేశం యిలానే వైరస్‌లను ఎదుర్కొంది. నిర్మూలించింది. రాష్ట్రాల మీదకు బాధ్యతను విసిరేయడం ఏనాడూ జరగలేదు. 45 సంవత్సరాల పైన ఉన్న ప్రజలకు వ్యాక్సిన్లు వెయ్యడం కేంద్రం బాధ్యత. 18 నుండి 45 సంవత్సరాల లోపలి ప్రజల బాధ్యత రాష్ట్రాలది. ఇది కేంద్రం వ్యాక్సినేషన్ పాలసీ. 'ఒకే దేశం ఒకే పన్ను' అనే నినాదం కింద జిఎస్‌టి అమలు చేశారు. రాష్ట్రాల పన్నుల రెవెన్యూ ఇప్పుడు కేంద్రం చేతుల్లోనే ఉంది. రాష్ట్రాలకు ఇప్పటికిప్పుడు ఇన్ని కోట్ల వ్యాక్సిన్లు కొనాలంటే ఎలా సాధ్యం? ఎక్కడో ప్రపంచ బ్యాంకుల్లో అప్పులు చేసి వ్యాక్సిన్లు సమకూర్చుకోవాలి. లేదా, యితర సంక్షేమ పథకాలకు ఉంచుకున్న రెవెన్యూను తరలించి వ్యాక్సిన్లను కొనుగోలు చెయ్యాలి. రెండూ ప్రజలకు నష్టమే అందులోనూ, బాగా ఆర్థికంగా బలహీనంగా ఉన్న రాష్ట్రాలు ఆర్థిక బలం లేక వ్యాక్సిన్లు కొనుగోలు చెయ్యలేకపోతే అందుకు పరిష్కారం ఏమిటి? దేశం ఫెడరల్ విధానానికే ఇది విరుద్ధం. అది ఆ రాష్ట్రాల బలహీనతగా చూసే పరిస్థితి వస్తుంది. పైగా, ఇప్పుడున్న నిపుణుల నిబంధనల ప్రకారం 18 సంవత్సరాలకు దిగువ ఉన్న జనాభాకు వ్యాక్సిన్లు యివ్వడం లేదు. మరో వేవ్ విజృంభించి వీరికి కూడా వ్యాక్సిన్లు అవసరం అని నిపుణులు సెలవిస్తే, ఆ బాధ్యత కూడా రాష్ట్రాలమీదే వేసేస్తారేమో! ఈ పరిస్థితి ఎక్కడికి దారీ తీస్తుందంటే, కొన్ని రాష్ట్రాలు వ్యాక్సిన్లను ఉచితంగా వేస్తాయి. కొన్ని వెయ్యలేకపోవచ్చు. ప్రైవేటులో చూసుకోండి అని చేతులెత్తేస్తాయి. అశాస్త్రీయత మీద నమ్మకం పెట్టుకున్న ప్రజలు, ఆర్థిక భారం భరించలేని ప్రజలు వ్యాక్సిన్లు వేసుకోకుండా ఊరుకుంటారు. వీరికి నియంత్రించే విధానం ఉండదు. వైరస్ వీరి దగ్గరే మరింత బలపడి మ్యూటేటై మరో రూపం దాల్చి, అందరి మీదా విరుచుకుపడితే అప్పుడు పరిష్కారం ఏమిటి? స్వేచ్ఛా వాణిజ్యంలో లాభాల సంచులు తప్ప ప్రజలకు న్యాయం జరుగుతుందా?

వ్యాక్సిన్లు – పేటెంట్ హక్కులు

దేశంలోని కార్పొరేట్ల వైఖరి, నాయకుల వైఖరి ఇలా ఉంటే, అంతర్జాతీయ పెట్టుబడిదారుల వైఖరి మరింత దారుణంగా ఉంది. పేటెంట్ హక్కులను తాత్కాలికంగా సడలించమని 200 మంది నోబుల్ బహుమతి గ్రహీతలూ 110 మంది యుఎస్ హౌస్ రిప్రజెంటేటివ్స్, 10 మంది యుఎస్ సెనేటర్లు, 400 సివిల్ సొసైటీ గ్రూపులు 400 మంది యూరోపియన్ పార్లమెంటేరియన్లు, ఇటు భారత ప్రభుత్వం, సౌత్ ఆఫ్రికా బైడెన్‌ని అభ్యర్థించగా బైడెన్ తలొగ్గాడు.. సడలింపు వైపు మొగ్గు చూపాడు. అయితే ఒక్క అమెరికా అంగీకరిస్తే ఇది సాధ్యం కాదు. ప్రపంచ వాణిజ్య సంస్థలోని ఇతర బడా దేశాలు అంగీకరించాలి. జర్మనీ అంగీకరించడం లేదు. పెద్ద ఫార్మా కంపెనీలు ఈ సడలింపుకు వ్యతిరేకంగా ఉన్నాయి. విపరీతమైన లాభాలను విస్మరించాలనుకోవడం లేదు. పెటెంట్ హక్కుల్ని సడలించినా సరే వీరికి లాభాలు తగ్గవు. అయినా సరే చట్టాల ముసుగులో గిరిగీసుకొని చర్చల్ని వాయిదా వేస్తున్నాయి. పేటెంట్ చట్టం కింద వ్యాక్సిన్లనీ వీటికి అవసరమైన ముడి సరుకులు పేటెంట్ చట్టాల ఊబిలోకి దించేశాయి. ఎవరు తయారు చేయాలన్నా, ఏ చట్టాల కోరల కింద ఇరుక్కుంటామా అనే సందిగ్ధ పరిస్థితి ఉంది. సైన్స్ అనేది నిరంతరం మనిషి ప్రకృతితో చేస్తున్న పోరాటం వల్ల సాధించుకున్న విజ్ఞానం. ఇది ఏ ఒక్కరి సొత్తు కాదు.

కలర్ టెలివిజన్‌ని కనుగొన్న శాస్త్రవేత్త అంతకుముందు వచ్చిన బ్లాక్ అండ్ వైట్ టెలివిజన్ టెక్నాలజీ మీద ఆధారపడి సంబంధిత సైన్స్ మీద ఆధారపడి తయారు చేస్తాడు. అంతేగానీ శూన్యం నుండి కాదు కదా!! ఎంత ఖరీదైన కారును తయారు చేసినా అది ఎంత పెద్ద ధనికుడు వాడుకున్నా, అంతకు ముందున్న మొదటి మానవుడు కనిబెట్టిన చక్రం మీద ఆధారపడే చేస్తాడు. సైన్స్ ఒక మనిషి సొత్తు కాదు. ఒక దేశం సొత్తు కాదు. ఎన్నో దేశాల శాస్త్రవేత్తల ఉమ్మడి కృషి. ఉమ్మడి ప్రయోజనాలకు మాత్రమే ఇది పనికి రావాలి. పేటెంట్ల సడలించడం మాట అటుంచి అసలు పేటెంట్ చట్టాలే అనైతికమైనవి. సైన్స్‌నీ, పరిశోధననీ గుప్పెట్లో పెట్టుకోవడం అభివృద్ధి ఎలా అవుతుంది?

ప్రపంచం మహమ్మారులతో చిత్రవధ అనుభవిస్తోంటే, పేటెంట్ చట్టాలతో పరిశోధనను ప్రజలకు సకాలంలో అందివ్వకపోవడం సామాజిక, అంతర్జాతీయ న్యాయం ఎలా అవుతుంది?

అందరికీ వ్యాక్సిన్ – అందరికీ సంక్షేమం

వ్యాక్సిన్‌లు ధనిక దేశాలు అవసరానికి మించి ఉంచుకున్నాయి. కానీ, పేద దేశాలు తయారు చెయ్యనూలేవు, దిగుమతి చేసుకోనూలేవు. ఫలితంగా వైరస్‌లు వ్యాక్సిన్లు లేని దేశంలో లేదా పూర్తి జనాభా వ్యాక్సిన్ వేసుకోని దేశాల్లో మ్యూటేషన్ జరిగి మరలా ధనిక దేశాల మీదా, ప్రపంచం మీదా పడతాయి. స్వేచ్ఛా వాణిజ్యం సూత్రాలను వ్యాక్సిన్

మీద అమలు చేస్తే ఫలితం ఎవరికీ దొరకదు. మరలా కరోనా కొత్త కాటుకు గురవ్వాల్సిందే – ధనికులైనా, పేదలైనా!

నయా వలస విధానంలో వ్యాక్సిన్లు

భారతదేశం 1990ల నుండే నయావలస విధానానికి ఆహ్వానం పలికింది. స్వేచ్ఛావాణిజ్యం, ప్రపంచీకరణ అంటూ, ఇంతవరకూ సాధించుకున్న ప్రభుత్వ రంగం మార్కెటీకరణకు గురయింది. పోరాటాలతో, ఉద్యమాలతో సంక్షేమ రాజ్యాల ప్రజానుకూల పథకాలతో కాస్తా కూస్తా ముందుకు వెళుతోన్న దేశం మెల్లమెల్లగా పబ్లిక్ సెక్టార్‌లో పెట్టుబడి ఉపసంహరణను ఆరంభించింది. పబ్లిక్ సెక్టార్ అయితే బలహీనం కావడమో, లేదా మూతపడడమో జరిగింది. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఈ వేటునుండి తప్పించుకోలేకపోయాయి. ఎన్ని సమ్మెలు చేసినా, ఎన్ని పోరాటాలు చేసినా, బ్యాంకుల విలీనం ఆగలేదు. ఇది మరలా ఏ కార్పొరేట్ కౌగిలిలోకో వెళ్లడం కూడా ఆపలేం. విచక్షణారహితంగా కార్పొరేట్‌ల మొండి బాకీలు వసూలు చేసుకునే యంత్రాంగం లేదు. ఇటీవలి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ గాలుల్ని మనం చూస్తున్నాం. గనులు కూడా కార్పొరేట్ల చేతుల్లోకి మెల్లమెల్లగా మరలుతున్నాయి. 2014 నుండి నయావలస విధానం మరింత ఊపందుకుంది. ప్రభుత్వం వ్యాపారం చెయ్యడం లేదు. అని ఇటీవల ఒక కొత్త పాటను పాడుతున్నారు.

వంటనూనె మీద సబ్సిడీ ఇంచుమించుగా లేనట్టే. ఇక విద్య, వైద్యం మాట చెప్పాల్సిన అవసరమే లేదు. వైద్యంలో కార్పొరేటీకరణ కరోనా సమయంలో ఎన్ని విపత్తులను అందించిందో రోగులూ, రోగుల కుటుంబాలు చూశాయి. ప్రభుత్వ రంగంలో ఉన్న ఆసుపత్రులు కూడా మెల్లమెల్లగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ మోడల్‌లోకి వెళ్లడం ఎక్కువ కాలం పట్టదు. ఇటీవలి రైతు చట్టాలు కూడా నయావలస విధానానికి ఆహారధాన్యాలకు అప్పగించాయి. పంటల అమ్మకాలు, వ్యవసాయం స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్లు నియంత్రిస్తారు.

సరిగ్గా ఇదే నేపథ్యంలో వ్యాక్సిన్‌ల వ్యాపారాన్ని కూడా చూడాలి. వ్యాక్సిన్‌లను ప్రజలకు అందించడంలో జాప్యానికి కారణం ఒక్క బాధ్యతారాహిత్యం అని సరిపెట్టుకుంటే విషయాలు స్పష్టం కావు. ప్రభుత్వం తను అన్ని రంగాల్లోనూ కొనసాగిస్తూ వస్తోన్న ప్రజా వ్యతిరేక నయావలసవాద విధానాలే ఇక్కడ కూడా పని చేశాయి. ఫార్మాకార్పొరేట్ రంగం వివిధ రకాల ధరలూ, వివిధ రకాల విధానాలూ, సామర్థ్యం ఉన్న కంపెనీలకు కూడా వ్యాక్సిన్ తయారీ లైసెన్స్‌లు అందకపోవడం, అందుకోసం కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ప్రయత్నించకపోవడానికి వెనుక నిరాసక్తత కంటే ప్రజావ్యతిరేక విధానాలు ఉన్నాయి. కొన్ని కంపెనీలు మాత్రమే మోనోపలీగా మారి ధరల్ని ఇష్టం వచ్చినట్టు డిక్టేట్ చెయ్యగలిగేలా ఉండాలి. ప్రభుత్వం జోక్యం ఉండకూడదు. స్వేచ్ఛా వాణిజ్యం అంటే ఇదే కదా! వ్యాక్సిన్ల రంగంలో కూడా అందుకే ఏనాడు చూడని, వినని మాటలు విన వస్తున్నాయి. ప్రభుత్వం 1990ల నుండీ ప్రతి రంగంలోనూ చేతులు దులుపుకున్నట్టే, వ్యాక్సిన్ల విషయంలోనూ 18 నుండి 45 సంవత్సరాల వయసు ప్రజల విషయంలో చేతులు దులుపుకుంది. రాష్ట్రాలకు అప్పగించింది. 45 పైబడిన వారికోసం కూడా సరయిన పంపిణీ వ్యవస్థ లేదు.

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణలోని స్వేచ్ఛా వాణిజ్యం, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల విలీనంలోని స్వేచ్ఛా వాణిజ్యం, రైతు చట్టాల మార్పుల్లోని స్వేచ్ఛా వాణిజ్యం, పబ్లిక్ సెక్టార్ అంతిమ గీతంలోని స్వేచ్ఛా వాణిజ్యం, ప్రజా వ్యతిరేక, సామాజిక న్యాయం కరువైన స్వేచ్ఛా వాణిజ్యం, ఇదే వరుసలో నేటి కరోనా వ్యాక్సిన్‌లోని స్వేచ్ఛా వాణిజ్యం, ప్రపంచీకరణ బీజాలను అర్థం చేసుకోవడం, చైతన్యం కావడం నేడు అత్యంత అవసరం.

(రచయిత అధ్యాపకులు) వీ

ఎం. రాజేంద్ర మృతి

సీనియర్ పాత్రికేయులు, కథా రచయిత ముత్తిరేవుల రాజేంద్ర (84) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో తన స్వగృహంలో గుండెపోటుతో మే 26న మరణించారు. ఆయన ఇండియాటుడే తెలుగు ఎడిషన్‌కు మొదటి ఎడిటర్‌గా పనిచేశారు. కథా రచయితగానూ పేరు పొందారు. ఈనాడు చీఫ్ ఎడిటర్‌గా, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, జనతా పత్రికలలో కూడా పనిచేశారు. ఇండియాటుడే వార్షిక సాహిత్య సంచిక తొలిసారిగా ఆయనే ప్రవేశపెట్టారు.ఆయన చిత్తూరు జిల్లా అరగొండకు చెందినవారు.

(...4వపేజీ కొనసాగింపు)

శాస్త్రవేత్తలు రాసిన లేఖలో రెండవ దశ కోవిడ్ విజృంభణకు అసలు కారణాలను, కరోనా పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అశాస్త్రీయతను, మూఢ విశ్వాసాలను, తప్పుడు విధానాలను తమ లేఖలో చక్కగా వివరించారు. అలాగే రాఫెల్ విమానాల కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ గురించి ఏమో గాని, వాటి కొనుగోళ్ల ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి, ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడం, దేశ రక్షణ పేరుతో ప్రజల సొమ్మును తమకు అనువుగా ఉన్న బడా బాబుల పరం చేయడం చూస్తుంటే దేశ ప్రజలను ఎంతలా మోసం చేస్తుందో బి. రామకృష్ణ గారు తన వ్యాసంలో ఎంతో లోతుగా వివరించారు. ఇప్పుడు రెండవ దశ కోవిడ్ విజృంభణ సందర్భంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాను కట్టడి చేయాల్సింది పోయి, తమ అధికారం కోసం ఎన్నికలు జరపాలనే సందర్భంగా సభలు, ర్యాలీలు నిర్వహించి, పెద్ద సంఖ్యలో జనం పాల్గొనే కుంభమేళాకు అనుమతిలిచ్చి ఇంకా ఎక్కువ కరోనా వ్యాపించడానికి కారకులయ్యారు. వీక్షణం ఎప్పటికప్పుడు ఇలాంటి తప్పుడు విధానాలను వ్యాసాల రూపంలో తీసుకువస్తున్నందుకు కృతజ్ఞతలు.

– మాధవ్‌కుమార్
జహీరాబాద్

దేశమంతా శవాలు కాలుతున్న వాసన

దేశాధినేతలు కరోనా నివారణలో విఫలమవడంతో ప్రజలు మా ప్రాణాలు పోతున్నాయి ఆదుకోండని సామాజిక మాధ్యమాల్లో రాయడాన్ని దేశ ద్రోహంగా పరిగణిస్తున్న దేశం మనది అంటున్నారు **బైరెడ్డి సతీష్**

కరోనా చైనా సరిహద్దులు దాటి ప్రపంచమంతా చుట్టేస్తున్న మొదటి రోజుల్లో అన్ని దేశాల ప్రభుత్వాలు, 'అధినేత'లు ఆ వైరస్‌ను కట్టడి చెయ్యడం కోసం, ప్రజలను దాని బారి నుండి కాపాడడం కోసం అనివార్యంగా అనేక చర్యలకు ఉపక్రమించారు. సరిహద్దుల మూసివేతలు, లాక్‌డౌన్ విధించడాలు, ఆరోగ్య సబంధ సదుపాయాలను మెరుగుపరచడానికి హడావిడి చర్యలు తీసుకున్నారు. దానికి మన దేశం మినహాయింపేమి కాదు. జనతా కర్ఫ్యూతో మొదలుకుంటే ప్రధాని మోడీ అన్నీ తానై నడిపించాడు. దేశ ప్రజలను ఏ రకంగా సంసిద్ధపర్చకుండానే గంటల వ్యవధిని మాత్రమే ఇస్తూ లాక్‌డౌన్ ప్రకటించాడు.

ట్రంప్‌ను గుజరాత్‌కి ఆహ్వానించి అట్టహాసంగా ఆయనకు తానేంటో చెప్పుకునే, చూపెట్టుకునే మహా ప్రయత్నం చేశాడు. ఆ తర్వాతనే దేశానికి తాళం వేసే పని చేపట్టారు. మునుపెన్నడూ లేని మహోత్పాతం ముంచుకురావడంతో ఎంత తీవ్రమైన చర్యలు తీసుకున్న తమ కోసం, తమ ఆరోగ్యం కోసమే అని దేశ ప్రజలంతా ఆహ్వానించారు, ఆచరించారు. అయితే నాలుగు రోజులు గడవక ముందే ఉసిళ్ల పుట్టల నుండి ఊటలా వచ్చినట్టు వలస కూలీలు పనిచేసే చోట ఉండలేక, తమ ఊర్లకెళ్లేందుకు రవాణా సదుపాయాలు లేక కాలి నడకన లక్షలాది కార్మికులు నట్టెండలో నడుచుకుంటు వెళ్లే దృశ్యాలు ఇప్పటికీ ప్రపంచం మర్చిపోలేదు. మరోవైపున కరోనా కల్లోలం విస్తరిస్తూనే ఉంది. ఒక్కొక్కటిగా మొదలయ్యి లక్షల్లోకి చేరుకున్నారు బాధితులు. అంతంతగానే ఉన్న ఆరోగ్య వ్యవస్థ ఒక్కసారిగా అంత భారాన్ని మోయలేకపోయింది. మొదట్లో పరీక్షలు చేసే పరిస్థితే లేని స్థితి నుండి పరీక్షలను అంతటా చేయగలిగే స్థాయికి మెల్లగా చేరుకున్నది.

యూరప్‌లో ప్రత్యేకించి ఇటలీ, ఇంగ్లాండు, అమెరికా లాంటి దేశాల్లో కరోనా విలయతాండవంతో భీతావహ పరిస్థితులను సృష్టించింది. అగ్ర రాజ్యంగా పేరు పొందిన అమెరికా సైతం చేష్టలుడిగి చేతులెత్తేసే స్థితికి వచ్చింది. అన్ని ఆసుపత్రులు కోవిడ్ ఆస్పత్రులయ్యాయి. సామూహిక శవ దహనాలు. ఏ దేశం ఇంకో దేశం గురించి ఆలోచించే సమయం, అవసరం లేకుండా ఎవడి బతుకు గురించి వాళ్లు పోరాటం చేశారు. ఈ సమయంలోనే భారతదేశంలో మిగతా దేశాలతో పోలిస్తే పరిస్థితి మెరుగ్గా ఉన్నట్టు, కరోనాను ఖతం చేసే దశకు చేసుకుంటున్నదన్నట్టుగా ప్రచారం మొదలైంది. దశల వారిగా లాక్‌డౌన్ ఎత్తేయడం సాధారణ స్థితికి వచ్చేశాం అనేంతగా ప్రజలు చేరుకున్నారు. వలస కార్మికుల స్థితి ఎవడికి పుట్టిన బిడ్డరా ఎక్కెక్కి ఏడుస్తుంది అన్నట్టు తయారయింది. కేంద్రం వాళ్ల కోసం చేసింది శూన్యం. సుప్రీం కోర్టు కూడా వారి కన్నీటి బాధల పట్ల కనికరం చూపలేదు. లక్షల కోట్ల ప్యాకేజీలు అన్నట్టు ఆర్భాట ప్రకటనలే తప్ప నికరంగా వాళ్ల బతుకుల్లోకి వచ్చిందేమి లేదు. వందలాది మంది మృత్యువాత పడ్డారు. ఎలాగోలా ఊర్లు చేరుకున్నారు.

వ్యాక్సిన్ కోసం ప్రపంచమంతా పరిశోధనలు, ప్రయోగాలు యుద్ధ ప్రాతిపదికన ఊపందుకున్నాయి. మనము వెనకపడలేదన్నట్లు ఆగస్టులోనే టీకా వచ్చేస్తుందన్న ప్రచారంతో స్వయంగా ప్రధానే రంగంలోకి దిగి పర్యవేక్షణ మొదలు పెట్టాడు. రాందేవ్ బాబా అయితే వంటింటి పోపు డబ్బా నుండి తీసి ఇచ్చినంత సులభంగా ఏకంగా ఔషధాన్నే ఆవిష్కరించాడు. ప్రపంచమంతా పరేషానయ్యాక, ప్రపంచ ఆరోగ్య సంస్థ కాదన్నాక అది అంతర్ధానం అయింది, అది వేరే విషయం. ఇంతలో గో మూత్ర దివ్య ఔషధం, పెండ, గో కరోనా గో బ్యాచ్ హడావుడి చాలా చేసింది. లక్షల్లో కేసులు, వేలల్లో చావులు దాటాక కుదుటపడుతున్నట్టే అనిపించింది. చైనా కుట్ర సిద్ధాంతాలు, మేథో చర్చలు పుంఖాను పుంఖాలుగా జరిగాయి. కరోనాతో సహజీవనం తప్పదని పాలకులు ప్రకటించారు.

ప్రజల ఆరోగ్యం, కరోనా ఎట్లుంటే ఏంటి అన్నట్టుగా రాజ్యాంగ 'సంక్షోభం' నివారించడానికి కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరిపారు. 2020 కరోనార్పయామి అనుకుంటూనే 2021 అయినా ప్రపంచానికి బాగుంటుందనే విశ్వాసంతో స్వాగతం పలికింది. ఓ రెండు మూడు నెలలు బాగున్నట్టే అనిపించింది. కేంద్ర ఆరోగ్య మంత్రి కరోనాను ఖతం చేసే ఆటలో చివరి దశలో ఉన్నట్టు ప్రకటించాడు. బిజెపి పార్టీ కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఏకంగా దేశంలో కరోనా ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు ప్రధాని మోడీని మాత్రమే అభినందిస్తూ తీర్మాణమే చేశారు. అనేక సంస్థలు, సంఘాలు, వ్యక్తుల కృషి, త్యాగం గురించి మాట్లాడకుంటా ఖ్యాతినంతా ప్రధానికే కట్టబెట్టారు. ప్రధాని కోరుకున్నది అదే కాబట్టి కాదనలేదు. సీను కట్ చేస్తే ఏప్రిల్ నెల మొదటి వారం నుండి ఉప్పెన లాగా విరుచుకుపడుతున్నది కరోనా. రోజు లక్షలాదిగా కేసులు, వేలాది చావులు. మొదటి వేవ్‌లో కోటి కేసులకు చేరుకోవడానికి 10 నెలల కాలం పడితే రెండవ వేవ్‌లో 4 నెలల్లోనే 2 కోట్ల మందికి కరోనా సోకింది. ఈ కరోనా దాడి ఎంత భీకరంగా ఉందంటే ప్రజల వెన్నులో వణుకు పుట్టించిన మొదటి దశలో మరణాలు తక్కువగా ఉన్నా ఇప్పుడు కేసులు, మరణాలు రెండూ అమాంతం పెరిగిపోయాయి. సరిపడ ఆసుపత్రులు లేక, ఉన్నా మంచాలు లేక ప్రాణ వాయువు లేక ప్రజల ప్రాణాలు పిట్టల్లా కాదు ఆకుల్లా రాలిపోతున్నాయి. కరోనా రోగులకు బెడ్స్, ప్రాణవాయువు దొరకక అల్లాడి పోయే స్థితి ఒకటైతే, ప్రాణాలు పోయిన మనుషుల దేహాలను పూడ్చుటకో, కాల్చుటకో ఇంత జాగా దొరకని ఘోరమైన పరిస్థితి. ఆసుపత్రుల ముందు క్యూలు, స్మశాన వాటికల ముందు పొడుగాటి లైన్లు. ఇప్పుడు దేశమంతా శవాలు కాలుతున్న వాసనే. శవాలకు గౌరవంగా అంతిమ క్రియలు చేయలేని నిస్సహాయులు, నిరుపేదలు గంగలోకి విసిరేస్తున్నారు. ఇప్పుడు గంగానది నడుస్తున్న చితిలా ఉన్నది.

ప్రాణ వాయువు కోసం ప్రాణం పోయేదాక ఆ ఆసుపత్రి ఈ ఆసుపత్రి అంటూ రాత్రనక పగలనక తిరుగుతూనే ప్రాణాలు విడుస్తున్నారు. సంపన్నులకు, పదవులున్న వారికి, పలుకుబడి ఉన్నవారికి ముందుగానే గదులు, పడకలు రిజర్వు అవుతున్నాయి.

మొదటి వేవ్ నగరాలను ఉక్కిరిబిక్కిరి చేస్తే, రెండో వేవ్ గ్రామాలను తరుముతున్నది. మళ్లీ లాక్‌డౌన్‌లు, మళ్లీ వలస కార్మికుల ఇంటిబాట. అదే దృశ్యం పునరావృతం అవుతున్నది. కానిప్పుడు పల్లే పడకేసింది. పట్నం వెళ్లగొట్టినా పల్లె రమ్మనే స్థితిలో లేదు. ఈ ఊరు ఆ ఊరు అని లేదు, అన్ని ఊర్లను కలె తిరుగుతుంది కరోనా. అన్నీ తానై అంతా తానే చూసుకున్న పెద్ద మనిషి ముఖం చాటేస్తున్నడు. 21 రోజుల్లో కరోనాపై యుద్ధం చేసి గెలుద్దామన్న ప్రధాని పలుకుతలేదు. మన్‌కీ బాత్ తప్ప జనమ్ బాధలు వినే అలవాటు లేదు ఆయనకి. అసలు మాట్లాడడవే తప్ప వినే అలవాటును మర్చిపోయి చాలా రోజులయినట్టుంది. ఇంతకు ఇప్పుడు జరుగుతున్న ఈ 'మారణ కాండ'కు బాధ్యులెవరు? ఈ షోకాలకు, తీరని దుఃఖాలకు జవాబుదారీ ఎవరు? కరోనా కట్టడిలో ప్రపంచానికి మనమే ఆదర్శం అన్న పెద్దాయన అప్పుడు అంతా తానై ఇప్పుడు అంతా రాష్ట్రాలదే నాకేమి తెల్వదన్నట్టు ఎందుకున్నడు?

తబ్లిగీ జమాతీ ఢిల్లీ మీటింగ్ ద్వారా కరోన జీహాదీ చేస్తున్నదని ముస్లింలను నేరస్తులుగా చూపెట్టిన మెజార్టీ భక్తులెక్కడున్నారు? ఆ రోజు తబ్లిగీ మీటింగ్ నిర్వాహకుల పైన, దాని కోసం విదేశాల నుండి వచ్చిన వాళ్ల పైన అనేక కేసులు బనాయించిన ప్రభుత్వాలు మార్చ్ ఏప్రిల్ నెలల్లోనే 90 లక్షల మందికి పైగా తరలి వచ్చిన హరిద్వార్ కుంభమేళాకు అనుమతులిచ్చిన వారు ఎంతటి నేరానికి పాల్పడినట్టు? కుంభమేళా నుండి దేశంలో ప్రధానంగా ఉత్తరాదిన గ్రామాల్లోకెళ్లి కరోనా కారుచిచ్చు రేపిన వారిపై ఏం ప్రచారం చేయగలరు, ఏ కేసులు పెట్టగలరు? ఆనాడు అంత దుర్మార్గ ప్రచారం చేసిన మీడియా ముఖమెక్కడ పెట్టుకుంటదో? నా జీవితంలో ఇంత పెద్ద జన సమూహాన్ని ఒక చోట ఎప్పుడు చూడలేదని పశ్చిమ బెంగాల్ ఎన్నికల మీటింగ్‌లో మై మరిచిపోయిన, మాస్క్ లేకుండానే పదుల సంఖ్యలో ర్యాలీలు చేసిన ప్రధాని నిర్వాకాన్ని ఏమనాలి? బెంగాల్ ఎన్నికలను 8 విడతలుగా రెండు నెలలుగా సాగతీసి కరోనా కట్టలు తెంచుకోవడానికి కారకులు ఎవరు? మద్రాసు హైకోర్టు ఎన్నికల సంఘాన్ని హంతకిగా అభివర్ణించడాన్ని ఎలా చూడాలి? వీటన్నింటి వెనుక దేశమంతా నా పాలనే కావాలి అనే బిజెపి అధికారోన్మాదం తప్ప మరో కారణం ఎవరైనా చెప్పగలరా? ఓ వైపు కరోనా కమ్ముకొస్తున్నా ఉత్తరప్రదేశ్‌లో స్థానిక ఎన్నికలు పెట్టి ప్రజల, ఉద్యోగుల ప్రాణాలను ప్రమాదపుటంచులకు నెట్టిందెవరు?

తన్నుమాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అన్నట్టు ఓ వైపు ఆత్మనిర్భర్ భారత్ అంటూనే విదేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసి ఇప్పుడు విదేశాలను ఆక్సిజన్ కోసం, వెంటిలేటర్ల కోసం, టీకాల కోసం ప్రాధేయపడే దీన స్థితి ఎందుకొచ్చినట్టు? అప్పుడు ప్రపంచమంతా మనల్నే చూస్తున్నదని అన్నప్పుడు నిజమెంతో గానీ ఇప్పుడు నిజంగానే చూస్తున్నది! శ్వాసించలేకపోతున్న దేశాన్ని, అంతర్జాతీయ పత్రికల పతాక శీర్షికలవుతున్న మన చితి మంటలను. పి.ఎం. కేర్స్ నిధుల జాడలు కనుపడుతలేవు. అన్నీ తానే మాట్లాడిన మోడీ అంతా మీరే మాట్లాడుకోండి అన్నట్టు చోద్యం చూస్తున్నాడు. శవాలు కొట్టుకొస్తున్న దృశ్యాలు, చితుల్ని పేర్చడం, కాల్చడం ఖరీదవుతున్న విషాద అనుభవాలతో ప్రజలు శోకం పెడుతుంటే సెంట్రల్ విస్టా ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనం విలాస భవనాల కోసం యుద్ధ ప్రాతిపదికన ఖర్చవుతున్నాయి.

అంతర్జాతీయ పత్రికలు ప్రధానంగా ఫ్రాన్స్ 'లేమాన్', ది ఆస్ట్రేలియన్, ది వాషింగ్టన్ పోస్ట్ లాంటి పత్రికలు సెకండ్ వేవ్ సందర్భంగా మోడీ వ్యవహరిస్తున్న తీరును తప్పుపడుతూ విమర్శ నాత్మకంగా కథనాలు రాసినందుకు భక్తులు మండిపడుతున్నారు. అవే పత్రికలు పొగిడినప్పుడు మాత్రం భారీగా ఆయన గొప్పదనాన్ని ప్రపంచమంతా కీర్తిస్తుంటే ఈ దేశ ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సహించలేక పోతున్నాయని దుమ్మెత్తిపోసిన వాళ్లే..! ఇప్పుడేమయింది అంతా ఆయనే చెప్పాలి, అంతా ఆయనే చెయ్యాలి అనే స్థితి నుండి ఆయన వల్లనే అంతర్జాతీయంగా నవ్వుల పాలవ్వాల్సి వచ్చింది. సామాజిక మాధ్యమాల ద్వారా 15 కోట్ల మంది ప్రజలు మోడీ రాజీనామా కోరారంటేనే ఆయన పట్ల ఎలాంటి అభిప్రాయం ఏర్పడుతుందో అర్థం చేసుకోవచ్చు. అంతా ఆయన్నే ఎలా బాధ్యున్ని చేస్తాం అనే ప్రశ్న సమంజసమయినదే!! అయితే ఆయన నాయకత్వంలోనే అంతా జరగాలి, జరుగుతుంది, ఆయనే సమర్థుడు అనే భక్తులు అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి.

అసలు సెకండ్ వేవ్ రావడానికి కారణాలు ఏమిటి? వైరస్ ప్రవర్తనను పూర్తిగా అర్థం చేసుకునే అవకాశాన్ని నిపుణులకు ఇవ్వలేదు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను లెక్క పెట్టకుండా కరోనా ఖతం అయింది అనే ధోరణిని ప్రదర్శించి, నిర్లక్ష్యంగా వ్యవహరించి రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడిందెవరు? రెండో దశ ఇంత తీవ్రంగా ఉండడానికి కారణం వైరస్ పరివర్తనను అర్థం చేసుకునే పరిశోధనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టకపోవడం. అంతా అయిపోయిందిలే అనే నిర్లక్ష్యం. నిజానికి ఈ వైరస్‌పై పరిశోధన చేయడానికి కేంద్రం పది పరిశోధనాశాలలకు బాధ్యత అప్పగించింది. ఈ పరిశోధనా శాలలన్ని కలిపి ఇండియన్ సార్స్ కోవిడ్ 2 జినోమిక్ కన్సార్టియంగా ఏర్పడ్డాయి. అయితే ఇవి కలసికట్టుగా పరిశోధనలు చేయడానికి ఒక్క పైసా కూడా కేంద్రం విదిల్చక పోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండి పోయింది.

విలాసవంతమైన ప్రధాని నివాసం, విశాలమైన పార్లమెంట్ హౌజ్ నిర్మాణాల కోసం యుద్ధ ప్రాతిపదికన నిధుల కెటాయింపు, పనులు ప్రారంభం జరిగిపోయినవి. విస్తృత సంప్రదింపులు, భిన్నాభిప్రాయాల సేకరణ, సమిష్టి నిర్ణయాలు అనే ప్రజాస్వామిక ప్రక్రియపై ఏ మాత్రం గౌరవం లేని మోడీ తనకు తోచినట్టు చేయడమే కాకుండా తాను చేసిందే సరైనది అనే ప్రచారాన్ని బలంగా నడిపిస్తున్నాడు. కరోనా కట్టడికి అశాస్త్రీయ పద్ధతులు, ఏకపక్ష ధోరణులు అవలంబించడమే కాకుండా, వాటిని ప్రశ్నించిన వాళ్లందరికీ ముద్రలు వేసే పనిలో మోడీ భక్తులు ఉన్నారు. ప్రజల ఆహాకారాలు, ప్రాణవాయువు కోసం పెడుతున్న కేకలు దేశ ద్రోహమవుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో కరోనా పీడితులు ఆక్సిజన్ కోసం ఆహాకారాలు చేస్తుంటే మరో వైపు దిగుమతి చేసుకున్న ఆక్సిజన్ ట్యాంకర్లకు బిజెపి నాయకులు పూజలు చేస్తూ, ఫొటోలు దిగుతూ చేసినా ఆలస్యానికి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఏకంగా ఆక్సిజన్ దొరకడం లేదని, ప్రాణాలు

దేశ ప్రజలను పట్టి పీడిస్తున్న రెండు మహమ్మారులు

***అప్రజాస్వామిక మూర్ఖ ఆలోచనా సరళి అనే మహమ్మారి పీడిస్తున్న భారత సమాజంపై రెండో మహమ్మారిగా కొవిడ్ విరుచుకు పడిందంటున్నారు* బి.ఎస్.రాజు**

దేశమంటే ఉత్త మట్టని, దేశమంటే మనుషులు కాదని, మనుషులు కేవలం ఓట్లు గుద్దే జీవాలు మాత్రమేనని బలంగా నమ్మేవాళ్ల మానసిక స్థితి, మైండ్సెట్ ఎలా ఉంటుంది? ఎలా ఉంటుందో, ఆ దృశ్యం ఇపుడు మన కళ్ల ముందు విలయతాండవం చేస్తున్నది.

అబద్ధాల పునాదులపై అజ్ఞానపు అధికార సౌధాలను నిర్మించుకున్నవాళ్ల ఘనీభవించిన అహంకార పాషాణ హృదయాలు ఎలా స్పందించవో, లేక ఎలా స్పందించలేవో ఇప్పుడు మనం రోదనా వేదనలతో తిలకిస్తున్నాం. ఊపిరాడక విలవిల్లాడి పోతున్నాం, రాలిపోతున్నాం.

లెక్కలు నమ్మనివాళ్లు, ప్రణాళికలను ఎగతాళి చేసే వాళ్లు, ప్రజాస్వామ్యమంటే ఓట్లతో, కొనుగోళ్లతో రాష్ట్రాల కోటలను కొల్లగొట్టడం అనుకునేవాళ్లు కుంభమేళా సన్యాసులను, బైరాగులను, శాస్త్రజ్ఞులను ఓకేగాట కట్టేవాళ్లు, సకలరోగాలకు, మహా మహమ్మారులకు గోమూత్రం దివ్యౌషధమనే ప్రచారాం చేసే వాళ్లు శవాలకు గంగానది లేదా, తోసేయడానికి, విసిరిపారేయడానికి అనేవాళ్లు పాలకులైతే, ఏం జరుగుతుందో, ఎలా జరుగుతుందో అదే చిత్రం ఇపుడు ప్రదర్శితమవుతోంది.

అంధ మూఢ భక్తులు గ్రహించ నిరాకరించారు గాని, విజ్ఞులు, వైజ్ఞానికులు, ప్రజాపక్ష ఆలోచనాపరులు ముందుగానే ముంచుకొస్తున్న రెండు ఉపద్రవ ప్రమాదాలపై దేశ ప్రజలకు హెచ్చరికలు చేశారు.

ఆరెంటిలో మొదటిది: అప్రజాస్వామిక మూర్ఖత్వపు ఆలోచనా మహమ్మారి, రెండవది: ప్రజారోగ్య వినాశకారి అయిన కోవిడ్ మహమ్మారి. ఈ రెండు మహమ్మారుల గురించి ముందస్తు హెచ్చరికలు చేసిన వారంతా దేశద్రోహులయ్యారు. మూర్ఖ ఫాసిస్టు శిఖామణులందరు పరమ దేశభక్తులుగా చిరకాలం చెలామణీ అయ్యే ఓట్ల వ్యూహాల్లో తలమునకలయ్యారు.

నా జాతి, నా దేశం అని గుండెలు బాదుకునే వాళ్లు, నాలుకలకు సూలాలు గుచ్చుకునే వాళ్లు, మతం దురదతో ఒళ్లంతా బరికేసుకునే వాళ్లు, జాతిని, దేశాన్ని ఎంత అప్రదిష్ట పాలుచేయగలరో అంతా చేసి చూపించారు. విశాల ప్రజారాసులకు నష్టదాయక మైనవన్నీ చేసి, ఇపుడు ముప్పు ముంచుకొస్తే, చేష్టలుడిగి, చేతులెత్తేసి, దేశ ప్రజలను మీ చావు మీరే చావండని గాలి కొదిలేసిన ధీమంతులు వీళ్లు. వీళ్ల వాతపడ్డ ప్రజలు నరకంకాక ఇంకేమి అనుభవిస్తారు?

సూదుంటే మందులేదు. మందుంటే సూది లేదు. పీలుద్దామంటే ప్రాణవాయువు లేదు. పొడిపించు కుందామంటే వేక్సిన్ లేదు. మింగుదామంటే సరైన మందు గోలీ లేదు. ఆస్పత్రుల్లేవు. పడకల్లేవు. చూసే వైద్యుల్లేరు. చూసే వాళ్లే, వైద్యం చేసే వాళ్లే మితి మీరిన భారంతో కుప్ప కూలిపోతున్నారు. ఎక్కడ చూసినా ప్రభుత్వ విధివిధానాల అరాచక అస్తవ్యస్థత, పాలకుల అసమర్ధ నిర్వహణ రాజ్యమేలుతున్నది.

అసలు మనిషిని కాపాడాలనే విలువలే లోపించినపుడు, అలాంటి పోతున్నాయి ఆదుకొండని సామాజిక మాధ్యమాల్లో రాయడాన్ని దేశ ద్రోహంగా పరిగణిస్తున్నాడు. జాతీయ భద్రతా చట్టం కింద కేసులు పెట్టి జైల్లో వేయిస్తున్నాడు. మాణిపూర్ బిజెపి ప్రభుత్వం గోమూత్రం, పెండ, కరోనాకు ఔషధాలు కావని ఫేస్‌బుక్‌లో పెట్టినందుకు ఒక జర్నలిస్టును, ఒక సామాజిక కార్యకర్తను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేయించింది. ఢిల్లీలో ప్రధాని వైఖరిని విమర్శిస్తూ పోస్టర్లు వేయడం పెద్ద నేరమయింది.

ఇక వ్యాక్సిన్‌ల గందరగోళం మామూలుగా లేదు. మొత్తం జనాభా ఎంత, ఎంత పరిమాణంలో టీకాలు అవసరమవుతాయి, ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలి, ఎంత మొత్తం ఉత్పత్తి చేయాలి అనే కసరత్తు ఏమీ లేకుండానే మొదట 60 ఏళ్ల పైబడి అన్నరు, తర్వాత 45 ఏళ్లు దాటినా వారికి అన్నారు, ఆ తర్వాత అందరికి అన్నారు. ఈలోగా ఇక్కడి అవసరాలతో సంబంధం లేకుండా విదేశాలకు ఎగుమతి చేశారు. ఇప్పటి వరకు ఈ దేశ పౌరులకిచ్చిన టీకా మొత్తం కంటే ఎగుమతి చేసిందే ఎక్కువ ఉంది. ఈ ఎగుమతి ద్వారా ప్రపంచ దేశాల దృష్టిలో మోడీ పేరు మోగిపోయింది. అసలు టీకాల పనితనంపై వస్తున్న అనేక సవాళ్లు, సంశయాలను నివృత్తి చేయకుండానే ప్రజా బాహుళ్యానికి ఎలా ఇస్తారు అనే ప్రశ్ననే దేశ ద్రోహమంత నెరమైపోయింది.

అచ్ఛేదిన్ పేరుతో చచ్చే రోజులను దాపురింప చేశారని ప్రజలు మోడీ 'రేటింగ్'ను దించేస్తు 15 కోట్లకు మందికి పైగా ఆయన రాజీనామా కోరారంటే కరోనా కట్టడిలో ఆయన వ్యవహారశైలి, అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజల వ్యతిరేకత ఏమిటో అర్థమవుతుంది. ప్రజల అనుభవాలు ఇలా ఉంటే మన ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు మోడీని ఈ దేశానికి దేవుడిచ్చిన వరం అని ఆకాశానికెత్తుతున్నాడు. వంది మాగాదుల సంస్కృతితో ఈ రీతిగానే వ్యవహరిస్తే, పరిస్థితి మరింత విషమించి రోజువారి కేసులు, మరణాలు మరింత ఉధృతంగా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్రం వివక్షాపూరితంగా వ్యవహరించకుండా రాష్ట్రాలను సమన్వయం చేస్తూ, జన జీవనానికి మరింత నష్టం జరగకుండా వివేకవంతమైన విధానాలను అవలంబించకపోతే మృత్యుఘోషను ఆపడం ఎవరి తరం కాదు. నిష్కారణంగా మనిషి మరణించడం రాజ్య మారణకాండే...

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

ఆలోచనే లేనపుడు, మిగిలేది అవ్యవస్థ, అరాచకతే కదా! ఇలాంటి ప్రణాళికా రహిత పాలనలో కోవిడ్ మహమ్మారిని కట్టడి చేయగల సాధనాలు సరైన సమయంలో కావలసిన రీతిలో ఎలా సమకూరగలవు?

చర్చ కిట్టని వాళ్లు, సలహా సంప్రదింపులనే పేరు వింటేనే వికారం తెచ్చుకునే వాళ్లు, హేతువును, శాస్త్రీయ పద్ధతులను అవహేళన చేసే వాళ్లు, ప్రజాస్వామ్య మనేది అపహాశించడానికి, పరిహసించడానికి, ప్రజలను మోసగించడానికి చివరికి పరిహరించడానికే తప్ప ఇంకెందుకూ పనికి రాదనుకునే వాళ్లు, అధికారం కోసం, అందలం కోసం, ఏకచ్ఛత్రాధిపత్యం కోసం నరమేధం సృష్టించగల ద్రష్టలకు క్రిమినల్ మైండ్, నేరోమేధ తప్ప ప్రజాయోగక్షేమ స్పృహ ఉంటుందని ఎలా అనుకోగలం?

పట్టపగలు నడి వీధిలో ప్రజాస్వామ్యాన్ని నగ్నంగా నిలబెట్టి నిలువునా దహనం చేస్తుంటే చూడగలిగి కనులు మూసుకున్న వాళ్లు, నోరు విప్ప గలిగి విప్పని వాళ్లు, కలాలను కదిలిస్తే, అన్యాయాన్ని అక్షరీకరిస్తే ఎక్కడ తమకోసం జైళ్లు నోళ్లు తెరుచుకుంటాయో అని భయపడిన వాళ్లు ఇప్పుడిప్పుడే నోళ్లు విప్పుతున్నారు. కలాలను కదిలిస్తున్నారు.

వాస్తవాలను వక్రీకరిస్తూ, పాలకుల విధి విధానాలను తప్పొప్పుల బేరీజు వేయకనే పల్లకీ లెక్కించి బాకాలూదుతూ ఊరేగించే ప్రసార మాధ్యమాలు, వార్తా సాధనాలు, కొన్నైనా కీచుగానైనా ఈ కోవిడ్ విస్ఫోటనా సందర్భంలో నిజాలు చెప్పక తప్పని ప్రజా ఒత్తిడికి గురౌతున్నాయి. కళ్లకు కనిపిస్తున్న మానవ కళేబరాల కుప్పలు, మృత్యుహేల, చాలని స్మశానాలు ఇక దాచిపెట్టే అసత్యాల వల్లెవేత, భజనమోత చెల్లదనే అంతరాత్మ ప్రబోధమో, ఏమో మరి!

పేరుకుపోయిన శూన్య చేష్టల, శుష్క వాగ్దానాల, బూటకపు నినాదాల, అశాస్త్రీయ భావ ప్రచార వ్యర్థ మలినాల మేటల నుండి పుట్టి ప్రభలుతున్న ప్రజాపీడిత క్రిమి అసలు కోవిడ్ క్రిమిని మించి ప్రజల ప్రాణాలను బలిగొంటున్నది. యావత్ భారత సమాజాన్ని రోగమయం చేస్తున్నది. సమాజాన్ని వల్లకాడు చేస్తున్న ఈ విషక్రిమిని నిర్మూలించకుండా, కోవిడ్ వంటి మహమ్మారి క్రిముల నుండి దేశ ప్రజలకు శాశ్వత విముక్తి లభించదు.

ఓ సంసారి, ఓ గృహిణి కుటుంబాన్ని నడపడంలో ఓ ప్లాన్, ఓ ప్రణాళిక ఇమిడి ఉంటుంది. ఏ పనికైనా తప్పనిది ప్రణాళిక. 'మేన్ ఎండ్ ప్లాన్', 'మనిషి-ప్రణాళిక' ఒక దానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. బువ్వ వండాలన్నా, ఇల్లు నడవాలన్నా, ఓ ప్రణాళిక ఉంటుంది. తినే బువ్వ తయారు కావాలంటే దానికి అనేక సరుకులు కావాలి, దినుసులు కావాలి. వీటన్నిటినీ ప్రణాళికా బద్ధంగా సమకూర్చుకుని, వండి వారిస్తే గాని, అమరిస్తే గాని బువ్వ తయారు కాదు. పొట్ట నిండదు. పూట గడవదు. పనులు కొనసాగవు. ప్రణాళిక నుండి సిస్టం, పద్ధతి, నడత పుట్టు కొస్తాయి. వీటి నిర్ధారణ, స్థిరీకరణ అనేవి ఆచారణా క్రమంలో జరుగుతాయి. బువ్వ తయారీ విషయంలో అది పాకశాస్త్ర మవుతుంది.

శాస్త్ర మేదైనా అంతే. దీని కంతకు మూలం తర్కబద్ధ ఆలోచన. శాస్త్రీయత. ఈ తాడును తెంచెయాలనుకునే వినాశకర ఆలోచనల విషక్రిములు మన సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. మనం, ప్రజలం, ఇది గుర్తించ నిరాకరిస్తే ఈ దేశం మరింత ప్రమాదపు అంచులకు చేరుకోవడం ఖాయం.

ఈ ప్రపంచం పాదార్థికమైనది. ఈ ప్రపంచంలో ఉత్పన్నమయ్యే ప్రాకృతిక పాదార్థిక సమస్యలకు, ఉపద్రవాలకు, ఉత్పాతాలకు పరిష్కారాలు, అనుబంధిత సాధనాలు పదార్థికంగానే కనుగొన వలసి ఉంటుంది. ఏ అతీత శక్తి, ఏ మహనీయ మహిమాన్విత మయోపాయ యుక్తులు, అలాంటి పరిష్కార సాధనాలను సమకూర్చలేవు.

విశ్వంలో మనం నివశించే ఈ భూగోళంపై ఎన్నో జీవరాసులు పురుడు పోసుకున్నాయి. పుట్టాయి, గిట్టాయి. రూపాలు మార్చుకున్నాయి. ప్రకృతి పరిణామ క్రమంలో ఉద్భవించి, నివసించి, మార్పులకు తట్టుకోగల్గితే, ఆ మార్పుల కనుగుణంగా తాము మారగలిగితే ఉన్నాయి, లేకపోతే నశించి పోయాయి. ఈ పరిణామ క్రమంలోనే మనిషి బుద్ధిజీవిగా మారాడు. ప్రకృతిని అర్థం చేసుకునే శక్తిని, పాదార్థిక జ్ఞానాన్ని సముపార్జించుకుంటూ, తన ఉనికిని నిలబెట్టుకునే శాస్త్ర పరిజ్ఞాన యజ్ఞాన్ని కొనసాగిస్తున్నాడు. వికసించిన బుద్ధితోనే తన పాదార్థిక మూలాలకు చేదోడుగా తనే జోడించుకున్నది ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత అంటే ప్రశ్న. తర్కం. చర్చ.

తెలిసింది పరిమితమైనదే కాబట్టి, తెలియనిది, తెలుసుకోవలసినది అనంతమైనది కాబట్టి ప్రశ్న ద్వారా, తర్కం ద్వారా, చర్చ ద్వారా, ఆచరణ ద్వారా, ఆచరణ సారాన్ని తిరిగి చర్చకు, ప్రశ్నకు మేధో రాపిడికి గురిచేయడం ద్వారా, కొత్త ఆవిష్కరణలకు ద్వారాలు తెరిచి, తన ఉనికిని పాదార్థికంగా ఏ మేరకు నిలబెట్టుకోగలడో ఆ మేరకు నిలబెట్టు కుంటున్నాడు మానవుడు. ఇదంతా పాధార్థిక ప్రయత్నం. దీన్నే తత్వశాస్త్రం అని అంటున్నాం.

భగవంతుడు, సర్వాంతర్యామి, మతం, మత భావనలు మానవుని బుద్ధివికాసానికి వచ్చి చేరిన అడ్డుగోడలు. చీడ పీడలు. మనిషి పురోగతిని ఆటంక పరిచి, అడ్డుకుని, చాలా నష్టం కలగచేసే భావవాదపు చీకటి కోణాలు.

ఈ రోజు ప్రపంచ దేశాలను రాజకీయ, ఆర్థిక, సామజిక, సంస్కృతీ కోణాలనుండి పరిశీలించినట్లైతే మతం, మత భావనలు, భావవాద ధోరణులు ప్రజల దైనందిన జీవనాన్ని శాసించే క్రమం ఏ దేశాల్లో కొనసాగుతున్నదో, అటువంటి దేశాలు, అన్ని రంగాల్లో వెనకబడి ఉండడం స్పష్టంగా కన్పిస్తుంది.

మత భావనలను, ఆలోచనలను, వ్యక్తిగత స్థాయికి పరిమితం చేసి సామజిక జీవనంలో, పాలనా వ్యవహారాల్లో మత ప్రమేయాన్ని ఏ మేరకు కుదించి వేసారో, ఏ మేరకు పాదార్థిక జ్ఞానానికి ప్రాధాన్యత కల్పించారో, ఆయా దేశాల్లో, ప్రజల జీవన నాణ్యతా ప్రమాణాలు పెరగడం మనం చూస్తున్న వాస్తవం. ఇలాంటి వెనుకబాటుతనానికి వలసవాదం, సామ్రాజ్యవాదం కారణమని కూడా మరువకూడని అంశం.

ఏయే దేశాల్లోనైతే విద్యకు, పాదార్థిక జ్ఞాన సముపార్జనకు, శాస్త్రీయ ఆలోచనా విధానానికి, వైద్య-ఆరోగ్యాలకు, ఉద్యోగ కల్పనకు, నైపుణ్యాల పెంపుదలకు, చర్చకు, ప్రజాభిప్రాయ సేకరణకు, ప్రజాస్వామిక పద్ధతులకు ప్రాధాన్యతలు ఇచ్చి సమాజాలను నడిపించుకునే బుద్ధి ప్రదర్శిస్తారో ఆ దేశ ప్రజల జీవన నాణ్యతా స్థాయి మేలుగా ఉండటం కనిపించే వాస్తవం.

ఇప్పుడు వెనుదిరిగి ఆలోచిస్తే, ప్రస్తుతం మన దేశాన్ని పాలిస్తున్న మతతత్వ శక్తులు స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ల నుండీ గనుక పాలనలో ఉండి ఉంటే ఈ దేశం ఎంతటి అధోగతి పాలయ్యేదో, ఈ దేశ ప్రజలను

కరోనా మూడవ వేవ్ అనివార్యం

దేశ వ్యాప్తంగా కరోనాతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నా, మూడో వేవ్ కూడా వచ్చే అవకాశం ఉందంటూ వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం అనుకూల కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని శాస్త్రజ్ఞులు అంటున్నారు

అత్యవసరంగా స్పందించాల్సిన సమయంలో 'సమర్థవంతమయిన సమాచార వితరణ' తో తలమునకలుగా ఉన్న ప్రభుత్వం.

కోవిడ్-19 సృష్టించిన విధ్వంసాన్ని ఎదుర్కొనే క్రమంలో సుప్రీం కోర్టు మరొక్కసారి ముందుకు వచ్చి కరోనా మూడవ ఉత్పాతానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని కేంద్రాన్ని హెచ్చరించింది. మీడియా వార్తల ప్రకారం దాని ప్రభావం నుండి ప్రజలను రక్షించడానికి దేశ వ్యాప్తంగా మెడికల్ ఆక్సీజన్ పంపిణీకి తయారుగా ఉండాలని సూచించింది. ఒక పోర్టల్ ఇచ్చిన సమాచారం ప్రకారం కోవిడ్ మూడవ వేవ్ వస్తుందన్న అంచనాలను దృష్టిలో ఉంచుకొని ఒక వ్యాజ్యం విచారణ సందర్భంగా న్యాయమూర్తి డి. వై. చంద్రచూడ్ "మనం ఈనాటి నుంచే తయారవుతేనే దానిని సమర్థవంతంగా నియంత్రించగలం. సేకరించిన ఆక్సీజన్ నిల్వలను ఆసుపత్రులకు పంపిణీ చెయ్యాలి. రాష్ట్రాలకు కేటాయించడంతో చేతులు దులుపేసుకోకూడదు. వాటిని ఆసుపత్రులకు చేరవేసే సమగ్ర ప్రణాళిక కూడా ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

ఢిల్లీ ఆసుపత్రులకు 700 మెట్రిక్ టన్నుల మెడికల్ ఆక్సీజన్ సరాఫరా చెయ్యమని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేస్తే, ఆ ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం ఖాతరు చెయ్యలేదు. ఆక్సీజన్ సరఫరా వైఫల్యాన్ని నిరసిస్తూ ఆ వ్యాజ్యం విచారణ సందర్భంగా న్యాయమూర్తి పై వ్యాఖ్యలు చేసాడు.

ఈ వ్యాసం రాస్తున్న సమయానికి గడిచిన 24 గంటల్లో మన దేశంలో 4,12,262 మందికి కోవిడ్ సోకింది. 3,980 మందిని ఆ వ్యాధి కబళించి వేసింది. కేరళలో పూర్తి లాక్‌డౌన్ ప్రకటించగా చాలా రాష్ట్రాలు 'కరోనా కర్ఫ్యూ'లు, 'వారాంతపు లాక్‌డౌన్'లు అమలు చేశాయి. (ఈ వ్యాసం రాసే సమయానికి నెలకొని ఉండిన పరిస్థితి అది. ఆ తర్వాత మార్పులు చాలానే వచ్చాయి).

సైన్స్ వ్యవహారాలలో కేంద్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు డా. కె. విజయ రాఘవన్ వ్యక్తపరచిన అభిప్రాయం ప్రకారం "ఉధృతంగా వ్యాప్తిలో ఉన్న వైరస్ పరిస్థితిని పరిశీలిస్తే మూడవ వేవ్ లేదా మూడవ దశ అనివార్యం అని అనిపిస్తుంది. అయితే ఈ మూడవ దశ ఎప్పుడు ఎంతటి దుస్థితికి చేర్చేదో ఊహించుకుంటే భయం ఆవహిస్తుంది.

ఫ్యూడల్ వ్యవస్థ రొంపిలో కూరుకుపోయి, మత భావనాల రొచ్చుగుంటనుండి బయటపడక కొట్టుమిట్టాడే అనేక దేశాలు ఎంతటి దుర్భర స్థితిలో ఉన్నాయో మనం చూస్తున్నాం. ఇలాంటి దేశాల పట్టికలోనే మన ఇండియా కూడా ఉంది. ఏ ఇతర దేశానికీ లేని భయంకర రుగ్మతలు భారతదేశాన్ని ప్రత్యేకంగా పట్టి పీడిస్తున్నాయి. అవే కరుడుగట్టిన కుల సమ్మిళిత మతవాదం, మనువాద బ్రాహ్మణ్యం, కర్మ సిద్ధాంతం వగైరాలు. ఈ మతం, ఆ మతమనే తేడా అక్కర్లేదు. వాటి ప్రమేయం ఉన్న వ్యవస్థలన్నీ పెంట కుప్పలుగానే మిగిలాయి.

ఇప్పుడు ప్రపంచమంతా కోవిడ్ మహమ్మారి విజృంభణ, అది సృష్టిస్తున్న వినాసనం, దాన్ని అరికట్టే విధివిధానాల పైనే చర్చ నడుస్తోంది. అన్ని దేశాలు ఈ మహమ్మారి బారిన పడ్డాయి. అన్నీ ఈ మహమ్మారి విలయ తాండవాన్ని చవి చూశాయి. దాని తాకిడికి గురయ్యాయి. ఏ దేశాలైతే విజ్ఞానంతో, విజ్ఞతతో, ముందుచూపుతో, ప్రణాళికాబద్ధ ఆచరణతో నడిచాయో, ఆ దేశాలు కోవిడ్ బారి నుండి త్వరలోనే కోలుకుని ఓ మేరకైనా గట్టెక్కాయి.

ఇక్కడ మన పరిస్థితి ఎలా ఉందంటే, వాగాడంబరం తప్ప, తడిచేస్తా-పొడిచేస్తా అనే డంబాచారం తప్ప ఏ యుద్ధవ్యూహము లేని ఓ మూర్ఖపు సైన్యాధిపతి తన సైన్యాన్ని శత్రు ఊచకోతకు బలిచేసిన చందంగా ఉంది.

మహమ్మారిలు మానవాళికి కొత్త కాదు. వాటి బారిన పడ్డపుడు ఎలా వాటిని ఎదుర్కొని ప్రాణ నష్టాన్ని నివారించగలమో అన్నది దేశ పాలనా నాయకత్వాల సమర్థతకు కొలమానం అవుతుంది. ఏ ప్రగల్భాల మేటలు పోగేసామన్నది కాదు కొలబద్ధ. నాణ్యమైన చేతలు అవసరం. ముందు చూపు అవసరం. ముందుచూపుతో, శాస్త్రీయ విషయ సేకరణతో, శాస్త్రీయ శక్తుల, వనరుల మేళవింపుతో, సమన్వయంతో, ప్రజల సంప్రదింపులతో, భాగస్వామ్యంతో సమస్యలకు సమాధానాలు దొరుకుతాయి. ఉపద్రవాలను ధీటుగా ఎదుర్కొని ప్రాణ నష్టాన్ని అరికట్టి గట్టెక్కవచ్చు. సమర్ధవంతంగా ప్రజలతో కలిసి పనిచేయడమే, సామూహిక పనివిధానమే గొప్ప నాయకత్వ లక్షణం. త్వరిత గతిన ఫలితాలు రాబట్టగలిగే, ప్రజలకు మేలుచేసే ఏకైక మార్గం. ఇలాంటి నాయకత్వ సత్తానే ప్రజల అవసరం. అదే వారు కోరుకునేది కూడా! ఇలా కానిదంతా ఉత్త ఊకే!

రాచరిక పాలనలో 'యథా రాజా తథా ప్రజా' అనే వారు. రాజు తెలివైన వాడై, ప్రజల మేలుకోరే వాడైతే రాజ్యం సుభిక్షంగా ఉండేది. ప్రజల జీవనం మేలుగా ఉండేది. రాజు, గర్విష్టి, సలహా సంప్రదింపులు కిట్టని మూర్ఖుడైతే రాజ్యం భ్రష్టు పట్టి పోయేది. ప్రజలు కకావికలయ్యేవారు. కష్టాల కొలిమిలో కాలి పోతుండేవారు.

ఇప్పుడు రాజ్యానికి కొత్త పేరు కదా, మనం పెట్టుకున్నాం! అదీ ప్రజాస్వామ్య మనే మధుర నామం కదా! మరి ఇప్పుడు 'యథా ప్రజా తథా రాజా' కదా అమలయ్యేది. అంటే ప్రజలు ఏమి కోరుకుంటే, కావాలనుకుంటే అదే వస్తుంది అని కదా అర్థం. ప్రజలు ఊకను కోరుకుంటే, ఊక నాయకత్వం లేక ఊచకోత నాయకత్వమే కదా ప్రాప్తిస్తుంది. ఊక తట్టలతో ఉపద్రవాలను పారదోలలేం కదా? మరిప్పుడేం చేద్దాం? బూడిదనూది పారేసి నిప్పును వెలికి తీద్దామా? లేక ఊక తట్టలనే నెత్తులకెత్తుకు ఊరేగుదామా?

(శ్రామికనేస్తం సంపాదకులు) వీ

సంభవించవచ్చో స్పష్టత లేదు. ఏది ఏమైనా సరికొత్త పరిణామాలకు మనం సిద్ధంగా ఉండాలి." డా. రాఘవన్ ప్రభుత్వ ప్రతినిధిగా మీడియా వారితో మాట్లాడుతూ చాలా మంది ప్రాణాలను బలిగొన్న, దేశ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను అతలాకుతలం చేసిన కోవిడ్-19 కొత్త కొత్త రూపాలు సంతరించుకుంటుందని, దాని సరికొత్త రూపాలను రూపుమాపడానికి వాక్సిన్‌లను ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లేదా ఆయా పరిస్థితుల కనుగుణంగా మార్పులు చేసుకోవాలని నొక్కి చెప్పారు. అయితే, భయానకంగా ఉండబోతున్న ఈ మూడవ దశ ఎప్పుడు ప్రారంభం కాబోతుందో సరిగా అంచనా వెయ్యలేమని అన్నారు. ఎన్‌డిటివి ఛానల్ నివేదిక ప్రకారం 'అధికారిక లెక్కల కంటే, భారతదేశంలో కోవిడ్ గణాంకాలు అయిదు నుండి పది రెట్లు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెపుతున్నారు.'

అత్యవసరంగా స్పందించాల్సిన సమయంలో ప్రభుత్వం 'సమర్థవంతమైన సమాచార వితరణ' శిక్షణా శిబిరంతోనే తలమునకలై ఉందా?

హిందుస్తాన్ టైమ్స్ పత్రికలో ఈ మధ్య ఒక వార్త వచ్చింది. ఆ వార్త ఒక శిక్షణా శిబిరం గురించి "సమర్థవంతమయిన సమాచార వితరణ" శీర్షికతో ఏర్పాటు చేసిన ఆ వర్క్ షాప్‌లో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 300 మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఆ శిక్షణా శిబిరాన్ని "మైగవ్" ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఇఒ) అభిషేక్ సింగ్ నిర్వహించారు. "ప్రభుత్వానికి ప్రజలలో సానుకూల వాతావరణాన్ని కల్పించే చర్యలు ఎలా తీసుకోవాలో ఆ శిబిరంలో పాల్గొన్న వారికి మార్గ దర్శకత్వం చేయడం" ముఖ్య లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. అంత మాత్రమే కాదు, "అనుకూల కథనాలు, సాధించిన విజయాలు భూతద్దంలో చూపి ప్రజల అవగాహనను ప్రభుత్వానికి అనుకూలంగా మార్చడం, ప్రభుత్వం సునిశితత్వంతో ధైర్యంగా, వేగంగా స్పందిస్తూ, కష్టపడి పని చేస్తున్నదని ప్రజలలో అభిప్రాయం కలిగించడమే" ఈ శిక్షణా శిబిరం ముఖ్య లక్ష్యమని హిందుస్తాన్ టైమ్స్ పత్రిక రాసింది.

అదొక అంతర్జాల శిక్షణా శిబిరం. కోవిడ్‌ను ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో అంత మంది సీనియర్ అధికారులు, కేంద్ర ప్రభుత్వంలో కీలక స్థానాలలో ఉన్న అధికారులు కలిసి ప్రణాళిక సిద్ధం చేయడం గురించి చర్చించి ఉంటే బాగుండేది. కానీ వారంతా ఎలా సమర్థవంతంగా ప్రభుత్వం పట్ల ప్రజల ఆలోచలను మలచాలి అనే విషయంలో శిక్షణ పొందారు. ఆ శిక్షణా శిబిరంలో కేంద్ర ప్రసార, సమాచార శాఖా మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ "అనుకూల వార్తలను నొక్కి చెప్పాల"ని మరీ మరీ చెప్పారు. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారులతో, మంత్రులతో, ముఖ్యమంత్రులతో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాల వివరాలు మాత్రమే మీడియాకు అందుతున్నాయి. కాబట్టి, ప్రసార, సమాచార శాఖా మంత్రి గారిచ్చిన ఆ సందేశం చేరాల్సిన చోటికే చేరినట్టుంది. ఉదాహరణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ట్విట్టర్ సందేశం ఈ విధంగా ఉంది:

నరేంద్ర మోడీ

@నరేంద్రమోడీ

వాక్సినేషన్ ప్రక్రియ, పెరుగుతున్న ఆరోగ్య సామర్థ్యంతో సహా కోవిడ్-19కి సంబంధించిన వివిధ అంశాల పట్ల రాష్ట్రాలలో, జిల్లాలలో స్పందన ఎలా ఉందో సమీక్ష జరిపాను. (ఈ ట్వీట్‌ను 4,400 మంది వీక్షించారు)

మరొక ఉదాహరణ: ఈ కింది అనుకూల అంశం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) వారు మీడియాకు అందజేశారు. "దేశ వ్యాప్తంగా 500 మెడికల్ ఆక్సీజన్‌ను ఉత్పత్తి చేసే పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమయిన నిధులను 'పియం కేర్స్' నుండి కేటాయించారు. ఈ కేంద్రాలను రాబోయే మూడు నెలలలో ఏర్పాటు చెయ్యాలని ప్రణాళిక సిద్ధం చేశారు. మొత్తంగా, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ట్రామా సెంటర్, డా. రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, సఫ్ దార్ జంగ్ హాస్పిటల్, లేడీ హర్ డింగే మెడికల్ కాలేజ్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, గజ్జర్ (హర్యానా) లలో ఎక్కువ స్థాయిలో ఆక్సీజన్ ఉత్పత్తి చేసే కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

కేంద్ర రసాయనాల, ఎరువుల శాఖా మంత్రి డి. వి. సదానంద గౌడ అధ్యక్షతన మరో సమీక్షా సమావేశం జరిగింది. ఆ సమావేశం తర్వాత మరొక అనుకూల వార్తను అధికారులు మీడియాకు అందజేశారు. అది "కోవిడ్ చికిత్సకు అవసరమయిన మందులు, ఇతర అత్యవసర వైద్య సదుపాయాల గురించి మంత్రి గారి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. రెమిడిసివర్ మందును తయారు చేసే ఏడు కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు చేసిన కృషికి ఆ సమావేశంలో వారికి అభినందనలు తెలియజేసారు. ఒక నెల క్రితం నెలకు 38 లక్షల రెమిడిసివర్ మందు సీసాలను తయారు చేసే కంపెనీలు ఇప్పుడు నెలకు 1 కోటి 3 లక్షల వరకు సిద్ధం చేసే విధంగా తమ సామర్థ్యాన్ని పెంచుకున్నాయి." మంత్రి గారు "మే నెల 3-9 తారీకుల మధ్య కాలంలో అన్ని రాష్ట్రాలకు 16.5 లక్షల రెమిడిసివర్ మందు వైల్‌లను కేటాయించాము. ఏప్రిల్ 2021 నుండి 34.5 లక్షల వరకు కేటాయింపులు జరిగాయి" అని ప్రకటించారు.

కాని, సోషల్ మీడియాలో మందుల గురించి, వెంటిలేటర్‌ల గురించి, ఆక్సీజన్ గురించి, మరీ దారుణంగా అంబులెన్స్‌ల గురించి కూడా ఎలుగెత్తిన కేకలు వినిపిస్తున్నాయి. ఈ 'అనుకూల' భారత ప్రభుత్వం సుమారు 17.2 కోట్ల కోవిడ్ టీకా డోసులను (17,02,42,410) రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఉచితంగా సరఫరా చేసిందన్నది 'అనుకూల' వార్తలలో కెల్లా ప్రధానమయిన 'అనుకూల' వార్త. అయితే, ఇతర దేశాలతో పోల్చుకుంటే కోవిడ్-19 వాక్సినేషన్ ప్రక్రియ భారతదేశంలో ఎంతో వేగంగా సాగుతుందని మరీ గొప్పగా చెప్పుకుంది భారత ప్రభుత్వం.

కోవిడ్-19 టీకాల కార్యక్రమం 16 కోట్లకు చేరాలంటే పట్టే సమయం: భారత్-109 రోజులు; అమెరికా-111 రోజులు; చైనా -116 రోజులు.

ప్రభుత్వం చెప్తున్నది ఈ రకంగా ఉంటే, క్షేత్ర స్థాయిలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, హర్యానా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లలో ఈ మహమ్మారి వికృత రూపం కనపరుస్తున్నది. దేశం మొత్తం మీద కోవిడ్ బాధితులు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. కానీ కేంద్రం మాత్రం పాడిందే పాటగా నిత్యం ఈ ప్రకటనను జారీ చేస్తూనే ఉంటుంది: "దేశంలో మరణాల రేటు తగ్గుతూ వస్తున్నది. ప్రస్తుతం అది 1.09 శాతం వద్ద నిలిచి పోయింది. గత 24 గంటలలో 3,780 మరణాలు సంభవించాయి."

(సబ్‌రంగ్ ఇండియా పోర్టల్‌లో వచ్చిన వ్యాసం. అనువాదం: రాజేంద్ర బాబు అర్విణి) వీ

పాలకుల నిర్లక్ష్యమే కరోనా సెకండ్ వేవ్

ప్రభుత్వాలు కరోనా తీవ్రతను గుర్తించకుండా, వైద్య నిపుణుల సలహాలు పట్టించుకోకుండా ఎన్నికలు, కుంభమేళాలు నిర్వహించి ప్రజలను కరోనా సెకండ్ వేవ్‌కు వదిలిపెట్టారని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

కరోనా సునామీ సృష్టించిన రెండవ అల ప్రపంచాన్ని దుఃఖ సముద్రం చేసింది. అది మోగించిన మరణ మృదంగానికి మానవ కోటి ప్రాణాలు విలవిలలాడుతున్నాయి. సంసార సాగరాన్ని ఈదలేని బడుగు బలహీన, మధ్యతరగతి జీవులన్నీ నీటిలో నుండి బయటపడ్డ చేప పిల్లల్లా కొట్టుకుంటున్నాయి. కళ్లముందే బంధు ప్రపంచాన్ని, మిత్రబృందాల్ని అత్యంత నిర్దయగా, కర్కశంగా ఎడబాటును గురిచేయగా, తల్లికి బిడ్డ, తండ్రికి కొడుకు, భర్తకు భార్య కాకుండా చావుదెబ్బ కొడుతుంది. కరోనా విసిరినా బలమైన పంజా దెబ్బకు ప్రతి మనిషి బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న దయనీయ స్థితి నెలకొంది. ఊరూరా, వాడవాడ వరసకట్టిన శవాలతో స్మశానాలు చాలక నదులు, కాలువలు అంతిమ సంస్కార వాహికలైన ఈ దేశంలో కారుమేఘమైన కరోనా ఒకవైపు, కళ్లముందు వాస్తవాన్ని విస్మరించిన ప్రభుత్వ నిర్లక్ష్యపు నీడలో మరొకవైపు జనం పిట్టల్లా రాలుతుండడంతో ప్రపంచంలో పట్టరాని విషాదం నెలకొంది.

కరోనా మొదటి వేవ్ కొంతకాలం మనం ఎరుగని విరామం ఇచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ అనుచిత నిర్లక్ష్య వైఖరి కారణంగా తాజాగా మరో మూడు కొత్త లక్షణాలతో వచ్చిన సెకండ్ వేవ్ భారతదేశంలో ఉధృతి పెంచిందని లాన్సెట్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నివేదికలు తెలిపాయి. మొదటి వేవ్‌లో కోవిడ్-19 సాధారణ లక్షణాలు జ్వరం, శరీర నొప్పులు, వాసన, రుచిని కోల్పోవడం, చలిగా ఉండడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు మాత్రమే కనిపించేవి. ప్రస్తుతం వ్యాపిస్తున్న సెకండ్ వేవ్ వైరస్‌లో కొత్తగా గులాబీ కళ్లు, గ్యాస్ట్రో నిమికల్ ప్రభావం, వినికిడి లోపం, నాలుకపై తెల్ల పొరతో తడి ఆరిపోవడం వంటి లక్షణాలను నిపుణులు గుర్తించారు. ఈ లక్షణాలు మరింత ప్రమాదకరమైనవని.

కుంభమేళా, ప్రచార ర్యాలీలు వైరస్ వ్యాప్తికి కారణం

కరోనా నియంత్రణ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి, దార్శనికత లేని కారణంగా తగిన విధంగా వైద్యరంగాన్ని బలోపేతం చేయలేదు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, పరికరాలు సమకూర్చుకోలేదు. కరోనాని కట్టడి చేయడంలో వ్యాక్సిన్ అత్యంత శక్తివంతమైన ఆయుధం కానీ, పెద్ద ఎత్తున పూర్తి చేయాల్సిన వ్యాక్సిన్ కార్యక్రమం మందకొడిగా ముందుకు తీసుకొచ్చింది. కోవిడ్-19 మొదటి వేవ్ అదుపులోకి రాకముందే ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎన్నికల ర్యాలీలు, సభలు, సమావేశాలు, కుంభమేళా లాంటి మత కార్యక్రమాలకు అనుమతిచ్చింది. ముఖ్యంగా కుంభమేళా మొదట 2022లో షెడ్యూల్ చేయబడింది. కాని జాతీయ బిజెపి నాయకత్వం జ్యోతిష్కుల మాట మీద ఒక సంవత్సరం ముందే నిర్వహించింది. కుంభమేళాకు దేశవ్యాప్తంగా 91 లక్షల మంది హాజరు కావడం, అయిదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంతో కరోనా రెండో ఉధృతి అన్ని రాష్ట్రాలకు చాపకింద నీరులా వ్యాపించింది.

నేటి భారతావని ముఖచిత్రం

రెండో వేవ్‌లో కరోనా ఉప్పెనలా ఎగిసిపడి మహా ఉగ్రరూపం దాల్చుతూ వేలాది మంది ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నది. నేడు భారతదేశం ప్రపంచంలోనే ఎక్కువ కోవిడ్ కేసులు నమోదైన దేశమే కాకుండా, అధిక మరణాలు సంభవించిన దేశంగా ఘనత కెక్కింది. రోజు రోజుకు పెరుగుతున్న కరోనా రోగులకు ఆస్పత్రుల్లో జాగలేక తల్లడిల్లుతున్నారు. ఆక్సిజన్ కోసం ఆర్తనాదాలు, మందుల కోసం ఆక్రందనలు, చావు బతుకుల మధ్య ఆస్పత్రుల ముందు అంబులెన్సుల్లో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. చాలినన్ని ఐసియు వార్డులు, వెంటిలేటర్లు లేవు. ఆస్పత్రుల్లో మంచాలు దొరకడం లేదు. మంచం దొరికిన వారికి ఆక్సిజన్ అందడం లేదు. దీంతో ఊపిరి అందక కండ్ల ముందే వేలాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. స్మశానంలో శవాలను దహనం చేయడానికి భారీ క్యూ లైన్లు. అంతిమ సంస్కారాలకు కూడా డబ్బులు లేని పేదల వందలాది శవాలు నదులలో గుట్టలు గుట్టలుగా తేలుతున్న హృదయ విదారక సంఘటనలు కళ్లముందున్నాయి. ఇదీ వర్తమాన భారతావని ముఖచిత్రం.

ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మార్గ నిర్దేశనం

నిజానికి తొలి దశలో కరోనా వచ్చినప్పుడు వైరస్ మీద అవగాహన రావడానికి కొంత సమయం పట్టింది. కాని రెండవసారి కోవిడ్ మహమ్మారి విరుచుకుపడుతుందన్న విషయాన్ని శాస్త్రవేత్తలు ముందే పసిగట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను ప్రభుత్వానికి తెలియజేశారు. గత సంవత్సరంలో జరిగినంత ప్రాణ నష్టం జరగకూడదని సుప్రీంకోర్టు ప్రభుత్వానికి మార్గనిర్దేశనం చేసింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్వయంగా సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో 2020 డిసెంబర్ 4 నుంచి రెండవ వేవ్ గురించి రాష్ట్రాలకు లేఖలు రాసింది. రాష్ట్రాల్లో రాబోయే కాలంలో పెరిగే కేసులను అంచనావేసి తీసుకోవాల్సిన వైద్య సదుపాయాల కల్పనకు ఆదేశాలు జారీ చేసింది. ఉజ్జాయింపుగా ఆసుపత్రులలో పడకల సామర్థ్యం గురించి, ఐ.సి.యు, అదనపు ఆసుపత్రులు, అక్కడ క్షేత్ర స్థాయి సౌకర్యాలు, ఆక్సిజన్ ఆధారిత పడకలు, ఆక్సిజన్ సరఫరా తప్పనిసరిగా అందే

విధంగా ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. అంటే డిసెంబర్ నుంచే కేంద్ర ప్రభుత్వానికి సెకండ్ వేవ్ గురించి సమగ్రమైన అవగాహన ఉన్నది. మరి ఇంత అవగాహన కలిగిన కేంద్రం తన పరిధిలో ఉన్న 160 ఆక్సిజన్ కేంద్రాలలో కేవలం 56 మాత్రమే పనిచేస్తుంటే మిగిలిన కేంద్రాలను ప్రణాళికా బద్ధంగా ఎందుకు పునరుద్ధరించలేదు? కొత్త కేంద్రాలు ఎందుకు ప్రారంభించలేదు? రాష్ట్ర ప్రభుత్వాలకు ముందుచూపుగా హెచ్చరికలు జారీచేసిన కేంద్రం తాను తీసుకోవాల్సిన చర్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించింది.

కేంద్రానికి కోర్టుల నుండి చివాట్లు

దేశంలో కరోనా మహమ్మారి వలన రోజుకు వేలాది మంది ప్రజలు చనిపోతున్న అమానవీయ పరిస్థితి గమనించి సుప్రీంకోర్టు సుమోటోగా కరోనా పరిస్థితి విచారించాలని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. గతంలో ప్రజా ప్రయోజనాల విషయంలో నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం అయితే అది నేరపూరిత నిర్లక్ష్యం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వయంగా ప్రకటించారు. నేడు కోవిడ్-19 వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఢిల్లీలో పాజిటివిటీ రేటు 3 నుంచి 30 శాతానికి పెరిగిన నేటి తరుణంలో వందలాది మంది కార్మికులను బస్సులలో తీసుకు వస్తూ ప్రజారోగ్య అవసరాలను పట్టించుకోకుండా 'సెంట్రల్ విస్టా' పనులు కొనసాగించడంపై మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు అయింది. ఈ నిర్లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలనీ కూడా కోర్టు అభిప్రాయపడింది.

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు, మద్రాస్ హైకోర్టు మొదలైన న్యాయస్థానాలు ప్రభుత్వానికి సూచనలు ఇస్తూ ఉంటే వాటిని జోక్యం చేసుకోవద్దంటూ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయడం మోడీ నిరంకుశ స్వభావానికి నిదర్శనం. భారత రాజ్యాంగంలో పేర్కొనబడినట్టుగా ప్రజల ప్రాథమిక హక్కులను, ప్రభుత్వాలు అనుసరించవలసిన ఆదేశిక సూత్రాలను అమలయ్యేలా చూడవలసిన బాధ్యత ఉన్నత న్యాయస్థానాలపైన ఉండడం వల్లనే మద్రాస్ కోర్టు, సుప్రీంకోర్టులు సుమోటోగా విచారణ చేపట్టాయన్నది వాస్తవం. దీన్ని అర్థం చేసుకొని సరిదిద్దుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని జోక్యం చేసుకోవద్దని కోరడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి అద్దం పడుతోంది.

వైరస్ ఉధృతిని ముందే నివేదించిన - ఇన్సాకాగ్

మార్చి నెలలోనే వైరస్ ఉధృతంగా వ్యాపించే ముప్పును గ్రహించిన ఎన్‌సిడిసి (నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్) డైరెక్టర్ తమ ఆందోళనను తీవ్రతను నేరుగా కేంద్ర ఆరోగ్య కార్యదర్శికి వివరించారు. ఇన్సాకాగ్ అనేది దేశవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన పది ప్రభుత్వ ల్యాబొరేటరీలతో కూడిన కన్సార్షియం. దానికి నోడల్ ల్యాబ్ ఎన్‌సిడిసి. అది ఆరోగ్య శాఖకు సంబంధించింది. ఈ కన్సార్షియానికి నిధులు అందిస్తున్నది బయోటెక్నాలజీ విభాగం. అంటే ఇది పూర్తిగా ప్రభుత్వ వ్యవహారమే. రోజు విడిచి రోజు ఉన్నతాధికారుల బృందం సమావేశమై దేశంలో కరోనా పరిణామాలపై చర్చించి నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమర్పించినారు. ఆ సమావేశాలకు బయోటెక్నాలజీ విభాగం ప్రతినిధులు, ఎన్‌సిడిసి ప్రతినిధులు, పది ల్యాబ్‌ల ప్రతినిధులు అంతా కలిపి 20 నుండి 30 మంది శాస్త్రవేత్తల బృందం హాజరై జరుగుతున్న పరిణామాలన్నీ శాస్త్రీయంగా చర్చించి సారాంశమంతా ఎన్‌సిడిసి డైరెక్టర్ ద్వారా కేంద్ర ఆరోగ్య శాఖకు అందించేవారు. ప్రతి దశలోనూ ఉధృతి సమాచారం ఇన్సాకాగ్ నుంచి ప్రభుత్వానికి అందింది. కొత్త వేరియంట్లను గుర్తించగానే దానిపై ఇన్సాకాగ్ బృందం తమ స్పష్టమైన ఆందోళనను ప్రభుత్వానికి తెలియజేసింది. అయినప్పటికీ ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదు. అత్యున్నత స్థాయి శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు మార్చి మొదటి వారంలో కొత్త వేరియంట్ల తీవ్రతను గుర్తించి సెకండ్ వేవ్ ముప్పు భయంకరంగా ఉండబోతోందని, ప్రమాదం దిశగా వెళ్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహమ్మారి లక్షల మందిని బలిగొనే ప్రమాదం ఉందని కేంద్రాన్ని హెచ్చరించారు.

అధికారం కోసం పాలకుల ఉన్మాద చర్యలు

సాధారణ సమయాల్లో నాయకులు ఎలా పరిపాలన సాగించినా కష్టకాలంలో తమకు అండగా ఉన్న వ్యక్తినే ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజల ప్రాణాలను కాపాడి, వారిలో ధైర్యం నిల్పగలిగేవాడే నిజమైన నాయకుడు. కరోనా విపత్తు నుంచి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాల్సిన పాలకులు రాజకీయ ప్రయోజనాల వేటలో బిజీగా ఉన్నారు. రెండవ వేవ్ వస్తుందని నిపుణులు హెచ్చరించినప్పటికీ ప్రజల ఆరోగ్యం మీద శ్రద్ధ లేకుండా కేంద్ర ప్రభుత్వ ప్రేరేపణతో ఎన్నికల కమిషన్ అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించింది. సెకండ్ వేవ్ గురించి అవగాహన ఉన్న కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేయకుండా అధికారం కోసం అర్రులు చాస్తూ బెంగాల్‌తో సహా అయిదు రాష్ట్రాల్లో అనేక దశలలో ఏప్రిల్ 29 వరకు ఎన్నికలు జరిపింది. కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీలు పలు దశల్లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీ, సభలు, సమావేశాలు కరోనా వ్యాప్తికి కారణమైనవి. అనంతరం ఈ రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు విపరీతంగా పెరిగినాయి. ఎన్నికలు, పండుగలు, కుంభమేళాలే ఈ కొత్త కరోనా వేరియంట్ రావడానికి కారణమైందన్న శాస్త్రవేత్తల విమర్శలకు నేడు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నది.

అభ్యంతరకరమైన పాలకుల వ్యాఖ్యలు

కరోనా కట్టడికి ప్రజా ప్రతినిధులు కోవిడ్ నిబంధనలు అమలు పట్ల ఆదర్శంగా ఉండాలి. ప్రజలకు జాగ్రత్తల పట్ల సందేశాత్మకమైన సలహాలను, సూచనలను ఇవ్వాలి. కానీ కోవిడ్ నిబంధనలకు భిన్నంగా చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటు. అసోం ప్రజలు మాస్కులు ధరించాల్సిన అవసరం లేదంటూ ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి హిమంత బిశ్వశర్మ బహిరంగంగా చేసిన అనుచిత వ్యాఖ్యలు, దేవుడిపై విశ్వాసం, గంగామాత శక్తి షాహీస్నానాలు భక్తులను కాపాడుతాయి అంటూ ఉత్తరాఖండ్ సిఎం చేసిన ప్రకటనలు రాజ్యాంగంలోని శాస్త్రీయ స్ఫూర్తికి విరుద్ధం.

అన్నింటికీ మించి ఏప్రిల్ 17నుండి సగటున రోజుకు 2,60,000 పైగా కేసులు నమోదవుతున్న దశలో పశ్చిమబెంగాల్‌లో తాను పాల్గొన్న ఎన్నికల సభకు ప్రజలు భారీగా రావడం ఆనందం కలిగిస్తోంది అంటూ స్వయంగా ప్రధాని మోడా మాట్లాడడం తీవ్ర విచారకరం, అత్యంత అభ్యంతరకరం. ఈ పరిస్థితిలో అసలు అలాంటి సభలను ఎవరు నిర్వహించినా ప్రభుత్వాధినేతగా రద్దు చేయాలి. ఎన్నికల భారీ బహిరంగ

సభలకు, వైరస్ వ్యాప్తికి సంబంధం లేదంటూ సాక్షాత్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెంగాల్ ఎన్నికల ప్రచార సమయంలో చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఎట్లా అర్థం చేసుకోవాలి. లోక్‌సభలో భోపాల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకురాలు ఒకరు మరొక విచిత్ర విషయాన్ని వెల్లడించారు. తాను రోజూ గో మూత్రాన్ని సేవిస్తున్నందువల్లే కోవిడ్ భారిన పడలేదని ఆమె నొక్కి చెప్పారు. సుదీర్ఘకాలంగా బిజెపి పాలనలో ఉన్న గుజరాత్‌లో సాధువులు కొంత మంది తాము రోజూ ఆవు పేడను దేహానికి పూసుకోవడం వల్లే కరోనా భారిన పడలేదని విశ్వసిస్తున్నామని చెప్పడం అశాస్త్రీయం.

నిజానికి ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ(హెచ్)లో ప్రతి పౌరుడిలో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడం కర్తవ్యంగా పేర్కొంటుంది. లౌకికవాదం, మానవతావాదం, సంస్కరణ స్ఫూర్తిని అభివృద్ధి చేయడానికి శాస్త్రీయ దృక్పథం సహాయపడుతుంది. దీని ప్రకారం అశాస్త్రీయ భావాలను ప్రచారం చేస్తున్నవారిని చట్ట ప్రకారం శిక్షించాలి. స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల సంఘం ఇలాంటి వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎన్నికల సంఘం వెన్నెముక లేకుండా కొనసాగుతున్నట్లు రూఢీ అవుతుంది.

ప్రధానమంత్రికి పలువురు విజ్ఞుల లేఖలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలు ఇంత నిస్సహాయ స్థితిలో ఎప్పుడూ లేరు. దేశంలో కరోనా మహమ్మారితో కనీవినీ ఎరుగని రీతిలో మానవ విపత్తు చోటుచేసుకుంది. ఈ సంక్షుభిత పరిస్థితులు ఎదుర్కొనడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాన ప్రతిపక్షాల నేతలు ప్రధాని మోడీకి లేఖ రాశారు. మనదేశానికి పనిచేసే ప్రభుత్వం కావాలని ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ తన ఆవేదనను దేశ ప్రజలతో పంచుకున్నారు. ప్రధానమంత్రి అసమర్థత వలన దేశ ప్రజల ఊపిరాడడం లేదు. ప్రాణాలు కొడిగట్టి పోతున్నాయని, అందుబాటులో ఉన్న సహాయమైనా అందుకోవడానికి ఏం చేయాలో చెప్పే వ్యవస్థలేవీ పనిచెయ్యడం లేదని ఆమె తీవ్రంగా తన ప్రకటన ద్వారా హెచ్చరించింది. దేశంలో సామాజిక కార్యకర్తలు మొదలుకొని మీడియా ప్రతినిధులు, సైంటిస్టులు, డాక్టర్ల బృందం, ఆర్థికవేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, అధ్యాపకుల సంఘం, పౌరహక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు మాత్రమే కాదు ఈ దేశ సగటు పౌరుడు కూడా ప్రస్తుతం ఇదే అభిప్రాయంతో గొంతు కలుపుతున్నారు.

ప్రజలందరికి ఉచిత వ్యాక్సినేషన్ ప్రభుత్వ బాధ్యత

భౌగోళికంగా మనదేశంలో వ్యాక్సిన్ ఉత్పత్తికి విశేషమైన అవకాశాలున్నాయి. గతంలో కోట్లాది మంది భారతీయులు పోలియో, టిబి మున్నగు వాటికి వ్యాక్సిన్ ఉచితంగా ప్రభుత్వం అందజేసింది. భారీ స్థాయిలో వీటిని ఉత్పత్తి చేయగల సామర్థ్యం నేడు కొన్ని సంస్థలకు మాత్రమే ఉంది. ఈ సంస్థలు ప్రస్తుతం నెలకు 10 మిలియన్ల డోసుల వాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ ఉత్పత్తిని రాబోయే ఎనిమిది నుంచి పది మాసాల వ్యవధిలో 100 మిలియన్ డోసులకు పెంచేందుకు 200 కోట్లు సహాయం చేయాలని తాజాగా కేంద్రం నిర్ణయం తీసుకొంది. కానీ ఇది దాహం అయినప్పుడు బావిని తవ్వినట్లుంది. ఇవేకాక వ్యాక్సిన్ తయారు చేసే అనుభవం, సామర్థ్యం ఉన్న 8 సంస్థలు వ్యాక్సిన్ ఉత్పత్తి – పరీక్షల ప్రాథమిక దశలో ఉన్నాయి. వీటికి కూడా ఆర్థిక సహకారాన్ని అందించి ఉత్పత్తి కార్యక్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకుపోవాలి. ప్రపంచ దేశాలలో ఏ ఇతర వ్యాక్సిన్ ఉత్పత్తి సంస్థ నుండైనా మనం ఉత్పత్తి చేయించుకోవచ్చు. పాలకులు ఈ నిర్ణయం ఏడెనిమిది నెలల క్రితమే తీసుకొని ఉంటే ప్రస్తుతం దేశం వ్యాక్సిన్ విషయంలో ఇంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొని ఉండేది కాదు.

కోవిడ్ నియంత్రణలో ఆలస్యంగా మేల్కొన్న అమెరికా తన దేశ జనాభా కంటే రెట్టింపు వాక్సిన్ డోసులు భద్రపరుచుకుంది. జులై 4 వరకు 100 శాతం జనాభాకు వ్యాక్సినేషన్ పూర్తి లక్ష్యంగా అమెరికా ముందుకు పోతుంది. అంతకంటే నాలుగు రేట్ల జనాభా అధికంగా ఉన్న భారతదేశం ఎంతో అప్రమత్తంగా ఉండాలి. మొదట వ్యాక్సిన్ ఉత్పత్తి మొదలుపెట్టి ప్రపంచానికే ఆదర్శమని ప్రగల్బాలు పలికారు. అంతర్జాతీయంగా ప్రచార పటాటోపాలుకు పోయి మనదేశానికి చాలినన్ని డోసులు లేకున్నా ఇతర దేశాలకు ఎగుమతి చేసింది.

ఇప్పటికే ప్రభుత్వం ప్రజలకు సరిపడా వ్యాక్సిన్లు ఇవ్వడానికి నిర్ణీత సమయంలో కొనుగోలు చేయడంలో, ఆర్డర్ ఇవ్వడంలో పూర్తిగా విఫలమైంది. ప్రజా శ్రేయస్సును నిర్లక్ష్యం చేస్తూ ప్రజోపయోగం లేని ప్రాజెక్టులకు డబ్బులు కేటాయిస్తోంది. ఈ సంక్షోభంలో కూడా మెడికల్ మాఫియా రెచ్చిపోతున్నది. చాలా తక్కువ సంఖ్యలో కోవ్యాక్సిన్, కోవీషీల్డ్ వ్యాక్సిన్లను ఇస్తున్నారు. ఇప్పుడు ఈ రెండూ కూడా కొరతలో ఉన్నవి. మొదటి డోసు వేసుకున్నవారికి రెండో డోసు దొరకని పరిస్థితి ఉన్నది. వ్యాక్సిన్ల కొరకు వెళ్లి కోవిడ్ బాధితులుగా తిరిగివస్తున్న వైనం కూడా ఉన్నది. రోగ నిర్ధారణ కేంద్రాలూ, టీకా ఇచ్చే కేంద్రాలూ రెండూ ఒకేచోట ఉండడం దీనికి ప్రధాన కారణం. ప్రభుత్వాలు ప్రజల పట్ల తమ ప్రాథమిక బాధ్యతలను, విధులను గాలికి వదిలేసి వారి బాధలను తగ్గించడానికి ఏ మాత్రం కృషి చెయ్యట్లేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజలకు సరిపడా వ్యాక్సిన్లను కొనుగోలు చేయాలి. బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిని చట్ట ప్రకారం శిక్షించాలి. పౌరులందరికీ ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వాలి.

అంతర్జాతీయ ప్రతిష్ట కోసం కేసులు దాచిపెట్టారు

కరోనా మహమ్మారిని నియంత్రించుటలో కచ్చితమైన డేటా గుండెకాయలాంటిది. అదిలేకపోవడం వలన సెకండ్ వేవ్ నియంత్రణ చాలా అధ్వానంగా ఉంది. అధికారిక లెక్కల ప్రకారం దేశంలో సగటున రోజుకు నాలుగు లక్షల మందికి పైగా కరోనా భారినపడుతూ ఉండగా, నాలుగు వేల మంది వరకూ చనిపోతున్నారు. వాస్తవ గణాంకాలు ఈ లెక్కలకు అనేక రెట్లు ఎక్కువగా ఉంటాయని అంతర్జాతీయ మీడియా చెబుతోంది. భారత్‌లో కేసులు ప్రమాదకర స్థితికి చేరుకుంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ మీడియా గగ్గోలు పెడుతోంది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమోదైన కేసులను తగ్గిస్తూ చూపిస్తున్నాయి.

పారదర్శకతతో కూడిన డేటా విడుదల చేయాలి

ప్రభుత్వానికి మరణాల సంఖ్య కూడా లెక్కించాలని కోర్టులు, మీడియా సంస్థలు నివేదించాయి. కానీ వాటిని ప్రభుత్వం దాచిపెడుతుంది. ఇటీవల పాట్నా హైకోర్టు, బీహార్ అధికారిక కోవిడ్-19 డేటా లొసుగులను ఎత్తి చూపింది. ఇక గుజరాత్ ప్రభుత్వం 2021 మార్చి 1, 2021 మే 10 మధ్య కోవిడ్-19 మరణాలు 4,218 మాత్రమేనని రికార్డు చేసింది. కాని రాష్ట్రంలో 1.23 లక్షల మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేయబడ్డాయి. ఈ లెక్కలకన్నా వాస్తవ గణాంకాలు అనేక రెట్లు ఎక్కువగా ఉంటాయని అంతర్జాతీయ మీడియా చెబుతోంది. అన్నిటికి గుజరాత్ నమూనాను ఆదర్శంగా చెప్పిన

పాలకులు ఈ తప్పుడు లెక్కల విషయంలో కూడా గుజరాత్ నమూనాను మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి.

గ్రామాలకు వేగంగా విస్తరించిన రెండో వేవ్

మొదటి వేవ్ కంటే రెండవ వేవ్‌లో గ్రామాల్లో కరోనా వ్యాప్తి బాగా పెరిగింది. ఈ దేశ జనాభాలో 65 శాతం మంది గ్రామాల్లో జీవిస్తున్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇప్పటికీ ప్రజారోగ్యం ప్రాథమిక సంరక్షణ సౌకర్యాల కొరత అధికంగా ఎదురుకుంటున్నారు. ఇక్కడి వైరస్ కట్టడి చేయాలంటే స్థానిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం కలిపించాలి. వ్యాధి ముదిరితే ఎక్కువ మంది గ్రామాల నుంచి పట్టణాలకు వైద్యం కోసం తిరిగే కొద్దీ, వారి ద్వారా గ్రామాలకు మరింతగా కరోనా పాకడం పెరుగుతుంది. ఎందుకంటే ఒక పేషంట్‌తో ఒకరు మాత్రమే రారు. గ్రామాల నుంచి కేసులు పెరిగేకొద్దీ ఆక్సిజన్, బెడ్లు, పడకలూ, వెంటిలేటర్ల కొరత పెరుగుతుంది. ఈ కారణంగా సకాలంలో వైద్యం అందని వారి సంఖ్య పెరుగుతుంది. అందుకే పట్టణాలతో పోలిస్తే జనసాంద్రత తక్కువగా ఉన్న గ్రామాల్లో వెంటనే కట్టడి చేయగలిగితే, మన దేశ జనాభాను అధికంగా కరోనా నుంచి రక్షించుకోగలుగుతాం. కావున గ్రామాల్లో కరోనాని యుద్ధ ప్రాతిపదికన నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. అందుకు ప్రధానంగా గ్రామ ప్రజలందరికీ వ్యాక్సిన్ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలి.

కరోనా కట్టడికి వ్యూహాలే ముఖ్యం

కోవిడ్ ఉప్పెనలో కొట్టుమిట్టాడుతున్న భారత్ ఇప్పుడు ద్విముఖ వ్యూహాన్ని అనుసరించాలి. తొలుత వ్యాక్సిన్ ప్రచారాన్ని హేతుబద్ధీకరించి వేగంగా అమలు చేయాలి. వ్యాక్సిన్ సరఫరాను పెంచాలి. పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రజలను సహితం వ్యాక్సిన్ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలి. ఇప్పుడు రూపాంతరం చెందిన కరోనా సెకండ్ వేవ్ జూలై నాటికి అంతమైపోవచ్చునని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ పరిధిలోని సైన్స్, టెక్నాలజీ విభాగం సైంటిస్టుల 'సూత్ర' (ససెప్టబుల్, అన్‌డిటెక్టెడ్, టెస్టెడ్ (పాజిటివ్) అండ్ రిమూవ్డ్ అప్రోచ్) అనే మోడల్ ద్వారా అంచనా వేసింది. కానీ, కరోనా థర్డ్ వేవ్ విజృంభించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అది కూడా సెకండ్ వేవ్ అంతమైన 6 నుంచి 8 నెలల తర్వాత వ్యాపించే ముప్పు ఉందని అంటున్నారు.

'సూత్ర' మోడల్ ప్రకారం దేశంలో అక్టోబర్ వరకు కరోనా మూడో ఉధృతి ఉండకపోవచ్చని అంటున్నారు. వ్యాక్సినేషన్ పెంచడం ద్వారా వైరస్ ప్రభావితం తక్కువగా ఉండొచ్చునని అంచనా వేస్తున్నారు. కోవిడ్‌తో అల్లాడుతున్న భారతదేశానికి బ్లాక్ ఫంగస్ కొత్త సమస్యగా తయారైంది. మొదట్లో ఢిల్లీ, మహారాష్ట్రకే పరిమితమైన కేసులు క్రమంగా అన్ని రాష్ట్రాల్లోనూ కనిపిస్తున్నాయి. బ్లాక్ ఫంగస్‌ను అంటువ్యాధుల చట్టం కింద 'నోటిఫయబుల్' వ్యాధిగా గుర్తించాలని రాష్ట్రాలకు సూచించింది. కేంద్రం దీనిపై ఆగమేఘాల మీద కదులుతూ బ్లాక్ ఫంగస్‌కు చెక్‌పెట్టే యాంఫోటెరిసిన్ ఇంజెక్షన్ ఉత్పత్తిని పెంచడానికి కొత్తగా 5 కంపెనీలకు అనుమతులిచ్చింది. ఈ రకంగా ఎన్ని వేవ్‌లొచ్చినా తట్టుకోవడానికి ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి, ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసి 100 శాతం వ్యాక్సిన్ అందించడం పరిష్కారం.

ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి

జనారోగ్యమే జాతి మహాభాగ్యం దేశ ప్రజల ఆర్థికాభివృద్ధి పరిపూర్ణ ఆరోగ్యాభివృద్ధి మీద ఆధారపడింది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశబ్దాలు దాటిపోయినా నేటికీ అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైనాయి. ప్రజారోగ్యంపై వ్యాధుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కల్పనలో చొరవ చూపకపోవడంతో ప్రభుత్వ వైద్య రంగం కునారిల్లింది. ప్రపంచంలోని పలు దేశాలు వైద్య రంగానికి 7, 8 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. కానీ మనదేశంలో వార్షిక బడ్జెట్‌లో ప్రస్తుతం వైద్యానికి కేటాయించే 1.5 శాతం నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదు. కావున కనీసం 3 శాతం నిధులైన కేటాయించాలి.

ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయడమంటే మొత్తం వైద్య రంగాన్ని ప్రభుత్వ పరిధిలో నిర్వహించాలి. విద్య, వైద్యం ఏ దేశంలో అయితే ప్రభుత్వ రంగంలో ఉంటుందో ఆ దేశం ఆర్థికాభివృద్ధిలో ముందుంటుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో దేశంలో అధికంగా ఉన్న పేదలు, మధ్యతరగతి ప్రజలను ప్రభుత్వ వైద్య రంగం మాత్రమే కాపాడుతున్నది. ఈ దేశ జనాభాకు సరిపోయే ఆసుపత్రులు లేవు. నేడున్నా ప్రభుత్వ వైద్య రంగంలో మెడికల్ చార్ట్ ప్రకారం వైద్య సిబ్బంది, మౌలిక వసతులు లేవు. తక్షణమే వైద్య సిబ్బంది నియామకం చేపట్టాలి. భవిష్యత్తులో ఇలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినపుడు పేదవారిని కాపాడడానికి ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడం ఎంతో అవసరం. ప్రభుత్వ దవాఖానల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంతైనా వ్యయం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలి. దీనికి అభివృద్ధి చెందిన దేశాల మాదిరి బడ్జెట్ కేటాయింపులు ఉండాలి.

ముగింపు

దేశంలో దేవాలయాలు, విగ్రహాల నిర్మాణానికి జోలె పట్టిన పాలకులు, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడుటకు వాణిజ్య వ్యాపార సంస్థలు, రాజకీయ నాయకులను, ప్రజా ప్రతినిధులను, సినిమా రంగ ప్రముఖులను ప్రేరేపించే, ఈ ఉప్పెనను అధిగమించుటకు ఆక్సిజన్ సిలిండర్లను, వెంటిలేటర్ల లాంటి మౌలిక వసతుల కొరకు ప్రయత్నం చేస్తే బాగుండు. రాజకీయ పార్టీలకు విరాళాలు వసూలు చేసుకొనుటకు చట్టం చేశారు. కానీ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల మీద చిత్తశుద్ధి లేకపోవడం దివాలాకోరుతనానికి నిదర్శనం.

మనదేశంలో కోవిడ్–19 రెండో ప్రళయాన్ని అధిగమించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కరోనా సెకండ్ వేవ్ ముప్పు తీవ్రంగా ఉండబోతోందని మార్చిలోనే పలువురు శాస్త్రవేత్తలు హెచ్చరించినా ప్రభుత్వానికి చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లయింది. మూఢత్వానికి పరాకాష్టగా ఉన్న మన పాలకులు నాటికైనా జరిగిన పొరపాటును విశ్లేషించుకోవాలి. ఇప్పటికే మన ఆరోగ్య రంగంపై ఒత్తిడి ఎక్కువ. నిజానికి బెడ్లు, వైద్యులు, నర్సులు, అవసరమున్న దానికంటే చాలా తక్కువ ఉండడంతో మొదటి దశలోనే వైద్య రంగం తీవ్ర ఒత్తిడికి లోనైంది. ప్రస్తుత పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కావున ఈ

దారుణ మారణహోమానికి బాధ్యత ఎవరిది?

ప్రజారోగ్య వ్యవస్థ మొత్తం ప్రభుత్వ అధీనంలో లేకపోవడం వల్ల జరుగుతున్న ఈ మారణహోమానికి బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు **డా. కొల్లా రాజమోహన్**

కరోనా మొదటి వేవ్‌తోనే విలవిల్లాడిన ప్రజలు రెండవసారి వచ్చిన కరోనా వేవ్‌ను తట్టుకోలేకపోతున్నారు. తీవ్రమైన భయం, ఆందోళనతో జీవిస్తున్నారు. హాస్పిటల్‌లో బెడ్స్ దొరకక, ఆక్సిజన్ లేక, మందులు అందుబాటులో లేక, హాస్పిటల్ ఖర్చులు, మందుల ధరలు భరించలేక సగం చచ్చిపోతున్నారు. మరణించినవారికి శ్మశానంలో కూడా చోటు దొరకడం లేదు. శ్మశాన వాటికలో ఖర్చులు కూడా పెరిగి, బ్రోకర్లు చేరి ప్యాకేజీలు ప్రవేశపెట్టారు.

కరోనా వ్యాక్సిన్ తయారీకి సంబంధించిన కీలకమైన ముడిపదార్థాల ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తి వేయమని కోరిన సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అభ్యర్థనను అమెరికా ప్రభుత్వం నిరాకరించింది. 'మా ప్రయోజనాలే మాకు ముఖ్యం. అమెరికా ప్రజల ప్రాణాలను కాపాడుకోవలసిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. అమెరికా కంపెనీలు దేశీయ వినియోగానికి ప్రాధాన్యతనివ్వాలనేదే ఇక్కడి చట్టం' అని అమెరికా ప్రభుత్వ ప్రతినిధి మీడియాతో చెప్పాడు.

తమకు హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలు పంపకపోతే ప్రతీకారం తీర్చుకుంటామని ఆనాటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించిన కొద్దిసేపటికే తీవ్ర ప్రభావిత దేశాలకు ఇన్ఫెక్షన్ నివారణ కోసం మాత్రలను అందచేస్తామని భారత్ ప్రకటించింది. మన దేశాన్ని బెదిరించి హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలను తీసుకు వెళ్లిన అమెరికా, మనకవసరమైన కరోనా వ్యాక్సిన్ ముడిపదార్థాలు ఇవ్వడానికి నిరాకరించింది. డెమోక్రాటిక్ పార్టీలోని ఇండియన్ అమెరికన్ల ఒత్తిడివలన, ప్రపంచ ప్రజాభిప్రాయం తరువాత వ్యాక్సిన్ ముడిపదార్థాలను ఇవ్వడానికి అంగీకరించారు. కోవిడ్-19 వైరస్ సకల మానవాళికి ఉమ్మడి శత్రువు. ఈ విపత్తును ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సంఘీభావం, పరస్పర సహకారం అవసరం. ఇందుమూలంగా అమెరికా ప్రభుత్వ నైజం అర్థమౌతుంది. అమెరికా స్వార్థపూరిత వైఖరిని దాచుకుందామన్నా దాగడం లేదు. జర్మనీ, బ్రిటన్, రష్యా, చైనా అన్ని దేశాలతో పాటుగా సహాయాన్ని అందించక తప్పలేదు.

దేశంలో ఆరోగ్యం అత్యవసర పరిస్థితిని అధిగమించడానికి సార్వత్రిక, సామూహిక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలి. మసూచి, బిసిజి, అన్ని టీకాలూ అందరికీ ఉచితంగా ఇవ్వడం ఇప్పటిదాకా అనుసరించిన సాంప్రదాయం. పోలియో, ఎంఎంఆర్, పెంటావేలెంట్ వ్యాక్సిన్ వరకూ అన్ని కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా ఇచ్చేది. ఈ సంప్రదాయన్ని విచ్చిన్నం చేసి వ్యాక్సిన్‌ను అమ్మడం నీచ ప్రయత్నం సర్వదా గర్హనీయం.

విశాఖ ఉక్కును ప్రైవేట్‌కు కట్టబెట్టి ఉంటే ఆక్సిజన్‌కు అంతులేని ధరలు పెట్టేవారు. కొనుక్కుంటే కొనుక్కోండి లేకపోతే చావండి అనేవారు. తెలుగు ప్రజలు త్యాగంతో సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఔదార్యంతో ఆక్సిజన్ ఇచ్చి అనేక రాష్ట్రాల్లోని ప్రజల ప్రాణాలను నిలుపుతున్నది. ప్రాణాలను నిలిపేది సమాజ శ్రేయస్సు కోరే ప్రభుత్వ సంస్థలేనని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించాలి. ప్రభుత్వ మందుల కంపెనీలు, ఐడిపిఎల్ ఉంటే రెండేసివీర్ ఇంజక్షన్ అతి తక్కువ ధరకు లభ్యమయ్యేది. వేల రూపాయల్లో బ్లాక్ మార్కెట్ సాగే అవకాశం ఉండేదా?

కొత్త ఔషధాలను, టీకాలను సైంటిస్టులు ప్రజల ప్రయోజనాల కోసం కనిపెడతారు. ఆ ఖర్చులు భరించిన కంపెనీలు ఆ ఔషధాన్ని మరే కంపెనీ తయారు చేయకుండా ప్రభుత్వం దగ్గర పేటెంట్ ఆర్డరు వేయించుకుని అంతులేని ధనార్జనకు పూనుకుంటున్నారు. అంటే పేటెంట్ తీసుకుంటారు. 20 సంవత్సరాలు ఆ మందును తమ ఇష్టమొచ్చిన ధరకి ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకొంటున్నారు.

సంక్షోభాన్ని మానవ విపత్తుగా పరిగణించి, యుద్ధ ప్రాతిపదికన హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి అన్ని ఆసుపత్రులు జాతీయం చేయాలి. దేశంలో 718 జిల్లాల్లో ప్రజారోగ్యం కోసం ప్రత్యేక అధికారులను నియమించాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే పబ్లిక్ హెల్త్ డివిజన్‌ను ఏర్పాటు చేసి యూనివర్సల్ హెల్త్ కేర్‌కు జిడిపిలో మూడు శాతం, పబ్లిక్ హెల్త్‌కు నాలుగు శాతం నిధులు కేటాయించాలి. కోవిడ్ పాండెమిక్ లాంటి విపత్తులకు ప్రత్యేకంగా అవసరమైన నిధులను తక్షణం విడుదల చేయాలి. కార్పొరేట్ మాఫియాను అరికట్టి ప్రతి మండలానికి జనాభా దామాషా ప్రకారం అన్ని వసతులతో ఆసుపత్రులు నిర్మించాలి. ప్రభుత్వ ఖర్చులతోనే అంబులెన్సు సర్వీసులను కొనసాగించాలి. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టాలి. కరోనా బాధితులతో పాటుగా ఇతర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యం అందించాలి. కోవిడ్-19 రెండవ వేవ్‌ను నియంత్రిస్తూ, దేశాన్ని మూడో వేవ్‌లోకి వెళ్లకుండా శాస్త్రీయమైన చర్యల ద్వారా ప్రజల ప్రాణాలను రక్షించాలి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన కోవిడ్-19 చికిత్సకు, వ్యాప్తి నిరోధానికి సమర్థవంతమైన, శాస్త్రీయమైన చర్యలు తీసుకోవాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

కంపల్సరీ లైసెన్సింగ్ ఇవ్వాలి

డబ్లుటిఒ నిబంధనలను తయారు చేసేటప్పుడు తెలిసో తెలియకో ఒక చిన్న వెసులుబాటును పేద దేశాలు కల్పించుకున్నాయి. ఆ ప్రకారం ఒక దేశంలో ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడినపుడు కంపల్సరీ లైసెన్సింగ్ ఇవ్వడానికి అవకాశం ఉన్నది. 1970 పేటెంట్ చట్టం సెక్షన్ 84 ప్రకారం ప్రజల అవసరాలను తీర్చలేనపుడు మందు అందుబాటులో లేకపోతే, మందు ఖరీదును ప్రజలు భరించలేకపోతే, స్థానిక మార్కెట్‌లో అందుబాటులో లేకపోతే పేటెంట్ ఆఫీసర్ స్థానిక ఉత్పత్తిదారునికి తప్పనిసరిగా లైసెన్స్ ఇవ్వవచ్చు. చాలా తక్కువ ధరకు ప్రాణాలను నిలిపే మందుల తయారీకి అనుమతించవచ్చు. పేటెంట్ చట్టాన్ని పక్కన పెట్టవచ్చు. కానీ శక్తివంతమైన, దుర్మార్గమైన, బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకు ఎదురొడ్డి నిలిచేదెవరు.

మార్చ్ 2012న ఇండియన్ పేటెంట్ ఆఫీసర్ పి.ఎచ్. కురియన్ ధైర్యంగా ప్రజలకు అనుకూలంగా తీర్పును ఇచ్చారు. మొదటి సారీ ఆఖరు సారీ ప్రజలకు అనుకూలంగా కంపల్సరీ లైసెన్సింగ్ ఆర్డరును ఇచ్చి పి.ఎచ్. కురియన్ చరిత్రలో నిలిచారు. భారతదేశంలో నెలకు సరిపోయే నెక్సావార్ మందును రు. 8,800కు అమ్మేటట్లు గానూ బేయర్ కంపెనీకి అమ్మకాలలో 6 శాతం ఇచ్చేటట్లుగా ఇండియన్ పేటెంట్ యాక్ట్ కింద పేటెంట్ ఆఫీస్ చారిత్రాత్మక ఆర్డరును ఇచ్చింది.

సోరాఫెనిబ్ (బ్రాండ్ నేమ్ నెక్సావార్) అనే లివర్, కిడ్నీ కేన్సర్ మందును బేయర్ కంపెనీ తయారు చేసి మనదేశంలో అమ్ముతున్నది. అందుకు బేయర్ కంపెనీకి 1970 పేటెంట్ చట్టం ప్రకారం హక్కులున్నాయి. ఆ కేన్సర్ మందును వేరెవరూ తయారు చేయకూడదు. అమ్మకూడదు. నెలకు సరిపోయే ఆ మందును రు. 2 లక్షల 80 వేలకు అమ్ముతున్నది. పేటెంట్ చట్టం పేరున ప్రపంచ ప్రజలను పీక్కుతింటున్నారు. రీసర్చ్ ఖర్చులు ఒకటి, రెండు సంవత్సరాలలోనే వసూలు చేసుకొంటున్నారు. మందు తయారీ ఖర్చుకు కొన్ని వేల రెట్లు అధికంగా 20 సంవత్సరాలు వసూలు చేస్తున్నారు. ఒక టన్ను ముడిసరుకును కొని మిల్లీ గ్రాముల పరిమాణంతో బిళ్లలు, ఇంజక్షన్లు తయారు చేసి ఇష్టమొచ్చిన ధరకి అమ్ముకుంటున్నారు.

రు. 2 లక్షల 80 వేల మందును రు. 8,800కు అమ్మేటట్లుగా కంపల్సరీ లైసెన్సింగ్ మొదటి సారిగా ఇండియన్ పేటెంట్ ఆఫీసు, సెక్షన్ 84(1) ప్రకారం నాట్కో కంపెనీకి అనుమతించింది. 50 ఏళ్ల పేటెంట్ చట్టం చరిత్రలో ప్రజల మేలు కోసం ఇచ్చిన తీర్పు ఇదే. అత్యవసర పరిస్థితులలో 'కంపల్సరీ లైసెన్సు' ఇవ్వవచ్చు. కరోనా మహమ్మారికి మించి అత్యవసర పరిస్థితి ఏమున్నది? ప్రభుత్వం, మందుల కంపెనీలు కంపల్సరీ లైసెన్సును తీసుకోవచ్చు కదా. పేటెంట్ చట్టం ముఖ్యమా? ప్రజల ప్రాణాలు ముఖ్యమా? రెండేసివర్ మందును, కోవ్యాక్సిన్, కోవిషిల్డ్ వ్యాక్సిన్‌లను కంపల్సరీ లైసెన్స్ కిందకు తీసుకురావచ్చు. కరోనా బాధితులందరికీ కరోనా మందులను, వ్యాక్సిన్లను అందించి ప్రాణాలను కాపాడవచ్చు. ఈ అవకాశాన్ని మందుల కంపెనీలు, ప్రభుత్వం ఉపయోగించుకుని ప్రజలను కరోనా నుండి కాపాడే అవకాశాన్ని వినియోగించుకోవాలి.

రెమిడెస్‌విఆర్

అమెరికాకు చెందిన గిలియాడ్ - బయోఫార్మస్యూటికల్స్ కంపెనీలకు రెమిడెస్‌విఆర్‌పై పేటెంట్ హక్కులున్నాయి. ఒక దశాబ్దం క్రితం కనిపెట్టిన రెమిడెసివిర్ అనే మందును మొదట హెపటైటిస్ చికిత్సకు అభివృద్ధి చేశారు. ఆఫ్రికాలో ఎబోలా వ్యాధిని నియంత్రించడానికి మందుగా ప్రయోగించారు. ఎబోలా వ్యాధిని తగ్గించడంలో మందుగా ఉపయోగపడలేదు. అయినా ట్రయల్స్‌లో దుష్ఫలితాలేమీ కలగనందున కోవిడ్-19 చికిత్సలో క్లినికల్ ట్రయల్స్ మొదలెట్టారు.

ఎబోలా వ్యాధి తగ్గకపోయినా, మందు పనిచేసినా చేయకపోయినా గిలియడ్‌కి ఉన్న పేటెంట్ హక్కు పోలేదు. వీలైన చోట తయారు చేయించుకోవడానికి, ఇష్టమొచ్చిన రేటుకి ఎక్కడైనా అమ్ముకోవడానికి పేటెంట్ చట్టం అవకాశమిచ్చింది. రెమిడెస్‌విఆర్ జనరిక్ మందును తయారు చేయడానికి డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) అనుమతిని ఇచ్చారు.

ఆ మందును తయారు చేయడానికి హైదరాబాద్‌కు చెందిన హెటిరో, సిప్లా, జుబిలెంట్ లైఫ్ సైన్సెస్, డాక్టర్ రెడ్డీస్, జైడస్ కాడిలా కంపెనీలతో గిలియాడ్ ఒప్పందాలు కుదుర్చుకున్నది. కోవిఫర్ బ్రాండ్ పేరున 100 మి.గ్రా. ఇంజెక్షన్లను విడుదల చేశారు. దీని ప్రకారం ఈ ఔషదాన్ని తయారు చేసి మనదేశంతో పాటు, 127 దేశాలలో విక్రయించుకోవడానికి ఈ కంపెనీలకు అనుమతి లభించింది.

రెమిడెస్‌విఆర్ అందుబాటులోకి వచ్చిన తరువాత కూడా మరణాల రేటు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. అయితే రోగి శరీరంలోని వైరస్ లోడ్ తగ్గటం ప్రోత్సాహకరంగా ఉంది. కరోనాకి మేజిక్ మందు కాకపోయినా, మృత్యువు నుండి కాపాడలేకపోయినా కొంత ప్రయోజనాన్ని సైంటిస్టులు గుర్తించారు. కోలుకోవడానికి సమయం తగ్గించడంలో స్పష్టమైన ప్రభావం చూపింది.

స్పానిష్ ఫ్లూ వచ్చినపుడు మాస్క్ కాపాడింది

వంద సంవత్సరాల క్రితం స్పానిష్ ఫ్లూ వచ్చినపుడు 1 కోటి 70 లక్షల మంది భారత ప్రజలు మరణించారు. భారత ప్రజలలో 6 శాతం మంది మరణించారు. ప్రపంచంలో 3వ వంతు ప్రజలకు సోకి 10 కోట్ల మంది చనిపోయారని అంచనా. గంగా నది శవాలతో ఉప్పొంగిందంటారు. అమెరికాలో మూతికి మాస్క్ ధరించని వ్యక్తులకు 100 డాలర్ల జరిమానాను వంద సంవత్సరాల నాడే విధించారు. కానీ నేటి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నేను మాస్క్ ధరించనన్నాడు.

మాస్క్ ధరించడం కంపల్సరీ చేయనన్నాడు. ప్రపంచంలో కరోనా కేసుల లెక్కలలో 3,647,715 కేసులతో అమెరికాకు ప్రథమ స్థానాన్ని సాధించాడు. బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సొనోరొ కూడా మాస్క్ ధరించనన్నాడు. ప్రపంచంలో కరోనా కేసుల లెక్కలలో 2,046,328 కేసులతో బ్రెజిల్‌కు ద్వితీయ స్థానాన్ని తేవడమే కాకుండా, తాను కరోనా జబ్బు బారిన పడ్డాడు. కొత్తగా రోజుకి 3 లక్షల 79 వేల కేసులతో భారత్ కూడా రికార్డ్‌ని స్థాపించింది.

అందరికీ వైద్యం, అందరికీ టీకాలు

స్పానిష్ ఫ్లూ తరువాత అధికారంలోకి వచ్చిన శ్రామికవర్గ సోవియట్ సోషలిస్టు కమ్యూనిస్టు ప్రభుత్వం, ప్రపంచంలో మొదటిసారిగా ప్రజలందరికీ వైద్యం (యూనివర్సల్ హెల్త్) అనే ఆలోచనను ఆచరణలోకి తెచ్చింది. ప్రపంచ ప్రజలందరికీ ఆదర్శమైంది. అందరికీ విద్యనందించి, ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సూత్రాలను నేర్పి చైతన్యపరచింది. దేశంలో 'లుముంబా' యూనివర్సిటీని స్థాపించి ప్రపంచ పేద విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దింది. ఆ ఒరవడిలో పయనిస్తూ ఇఎల్ఏఎం లాటిన్ అమెరికన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ 1999లో క్యూబా స్థాపించింది.

ప్రపంచ పేద విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దుతున్నది. ప్రపంచ ప్రజలందరి ఆరోగ్యం తన ధ్యేయంగా ఎక్కడ వైద్య కార్యకర్తలు అవసరమైతే అక్కడికి డాక్టర్లను పంపుతుంది. క్యూబా లాంటి సోషలిస్ట్ దేశాల్లో పరిశోధలనకు ప్రభుత్వమే నిధులను సమకూరుస్తుంది. బయో టెక్నాలజీలో అద్భుత విజయాలను సాధించి ప్రపంచంలో మొదటి సారిగా మెనింజిటిస్-బి, మెదడు జబ్బుకి వ్యాక్సిన్ తయారు చేసింది. ఎంఎంఆర్ వ్యాక్సిన్‌ను క్యూబా తయారు చేసి భారతదేశంతో సహా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు అతి చౌకగా అందించిన ఘనత కాస్ట్రో ప్రభుత్వానికే దక్కింది. హవానాలోని ఫినిలే ఇన్‌స్టిట్యూట్‌లో 5 కరోనా వ్యాక్సిన్‌ల అభివృద్ధిలో పురోగతిని సాధించారు. అందులో రెండు వ్యాక్సిన్‌లు మూడవ దశ పరిశోధనలో ఉన్నాయి. 44 వేల మంది వాళంటీర్లు చివరి దశ పరిశోధనలలో పాల్గొంటున్నారు. 1,24,000 ఆరోగ్య కార్యకర్తలకు ఈ వ్యాక్సిన్‌ని ఇచ్చారు. వ్యాక్సిన్ విజయవంతమైందని, ఎండాకాలం లోపల దేశ ప్రజలందరికీ వ్యాక్సిన్ వేస్తామని ఫినిలే ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ దగ్మార్ గారిసియా రివేరా చెప్పారు. ఇరాన్, వెనిజులా దేశాల్లో కూడా క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. వ్యాక్సిన్ అతి చౌకగా ఉంటుందనీ, 46.4 డిగ్రీలు వేడిలోనైనా రిఫ్రిజిరేటర్ లేకుండా ఉంచవచ్చని క్యూబన్ అధికారులు తెలిపారు.

పేరులో కూడా ప్రతాపం

'సోబేరణ' అనే రెండు వాక్సిన్‌ల క్లినికల్ ట్రయల్స్ చివరి దశలో ఉన్నాయి.'సోబేరణ' అంటే అర్థం 'సార్వభౌమాధికారత'. మూడవ వ్యాక్సిన్ పేరును క్యూబా విప్లవ వీరుడు జోసె మార్తి రాసిన గేయం పేరున 'అబ్దాలా' అని పెట్టారు. మాంబిసా అని, ముక్కులో స్ప్రే ద్వారా ఇచ్చే వాక్సిన్‌కు స్వాతంత్రం కోసం పోరాడిన గెరిల్లా పేరును పెట్టి వారి స్వాతంత్ర అభిలాషను, విప్లవ స్ఫూర్తిని చాటుకున్నారు. మెక్సికో, అర్జెంటీనా లాంటి లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు వ్యాక్సిన్ పట్ల ఆసక్తిని చూపుతున్నాయి. వందల మిలియన్ డోస్‌లకు ఆర్డర్లు ఇస్తున్నాయి.

ఒక చిన్న దేశం తమ ప్రజల ప్రాణాలను కాపాడుకుంటూ ప్రపంచ ప్రజల ఆరోగ్యం కోసం అత్యంత ప్రేమతో, దీక్షతో కృషి చేస్తుంది. అమెరికా ఆంక్షల వలన క్యూబా ఆదాయం పూర్తిగా పడిపోయింది. ప్రధాన పంట అయిన చక్కెరను ఎవరూ కొనకుండా ఆంక్షలు విధించి ఎగుమతి చేయనీయడం లేదు. మరొక ఆదాయ వనరు టూరిజం. టూరిస్టులు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించి క్యూబా ఆదాయాన్ని దెబ్బతీస్తున్నది. అయినా ప్రజల ప్రాణాలను కాపాడడంలో క్యూబా ముందుంది.

ప్రాణం విలువ ఏమిటో నిర్వచించారు

'ప్రపంచంలోని అత్యంత ధనవంతుని మొత్తం ఆస్తికన్నా మానవుని ప్రాణం విలువైనది' అని క్యూబా వైద్య విధానాన్ని రూపొందించిన చేగువేరా అన్నారు. ప్రజల కోసం ప్రాణాలిచ్చే నాయకులు, సైంటిస్టులు ప్రపంచానికి కావాలి. వైరస్ వలన వ్యాప్తి చెంది వేలాది మంది పసిపిల్లలను పక్షవాతానికి గురిచేసే పోలియో జబ్బుకి వ్యాధి నిరోధక మందును డాక్టర్ జోనాస్ సాల్క్ 1955లో కనుగొన్నారు. తన పరిశోధనకు పేటెంట్ అడగలేదు. 1955 ఏప్రిల్ 12న పత్రికా విలేఖరి ముర్రో 'పోలియో వ్యాక్సిన్‌పై పేటెంట్ ఎవరిది' అని డాక్టర్ సాల్క్‌ని అడిగితే 'ప్రజలది' అని చెప్తూ 'సూర్యుని పేటెంట్ చేయగలమా' అన్నారు. పేటెంట్ పేరున ధనం కోసం ప్రజల ప్రాణాలను తీస్తున్న కార్పొరేట్ మందుల కంపెనీలు, బ్లాక్ మార్కెట్‌లో మందులను అమ్మేవారు లేని వ్యవస్థ కావాలి. అటువంటి వ్యవస్థ లేనప్పుడు పేటెంట్ చట్టంలో ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలి.

అందరికీ ఆరోగ్యం (యూనివర్సల్ హెల్త్) ఆచరించే దేశాలే కరోనా కట్టడిలో ముందున్నాయి. క్యూబా, వియత్నాం, చైనా, న్యూజిలాండ్, కేరళ లాంటి చోట్ల ప్రజలను చైతన్యపరిచారు. రోగం గురించి ప్రజలకు తెలియచేశారు. ప్రభుత్వం ఏం చేస్తున్నదో, ప్రజలేమి చేయాలో చెప్పారు. చెప్పింది చేశారు. ప్రభుత్వ నాయకులు- ప్రజలు సైంటిస్టుల మాటలను విన్నారు. తూచా తప్పకుండా పాటించారు. ప్రజారోగ్యం పట్ల బాధ్యతతో వ్యవహరించారు. అందువలననే ఆ దేశాలలో ప్రభుత్వం-ప్రజలు ఒకటై మహమ్మారిని అదుపులో ఉంచారు.

కోవిడ్-19 గురించి 2019 డిసెంబర్ 30న చైనా ప్రపంచ ఆరోగ్య సంస్థ, పది రోజులలో కరోనా జెనిటిక్ మ్యాప్ (జన్యు పటం) ని వ్యాక్సిన్ పరిశోధన కొరకు ప్రపంచ సైంటిస్టులకు అందించింది. ఆ రోజు నుండీ సైంటిస్టులు వ్యాక్సిన్ కనిపెట్టడానికి అహోరాత్రులు కష్టపడి అమెరికా, చైనా, రష్యాలలో వ్యాక్సిన్ కనుగొన్నారు. ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ రానున్న మహా విపత్తును గూర్చి అన్ని దేశాలనూ హెచ్చరించింది. విదేశీ ప్రయాణికుల నియంత్రణ, క్వారంటైన్, వైద్య పరికరాలు, వైద్యులకు ఆధునిక రీతులపై శిక్షణలపై దృష్టి సారించమంది. సమయం వృథా అయింది.

2020 ఫిబ్రవరి 24, 25 తేదీలలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ని భారత ప్రభుత్వం ఆహ్వానించి లక్షలాది మంది ప్రజలను ఒకచోట చేర్చి భారీ సభను నిర్వహించారు. కరోనాని ఆహ్వానించారు. ప్రజా వ్యతిరేక చట్టాలను గుట్టుచప్పుడు కాకుండా చేసుకుంటూ 2020 మార్చ్ 22న ప్రజా కర్ఫ్యూ విధించి, పళ్లాలు మోగించి, కొవ్వొత్తులు వెలిగించి కరోనాని శపించారు. నాలుగు గంటల వ్యవధినిచ్చి, మార్చ్ 24 నుండీ లాక్‌డౌన్ విధించారు. వలస కార్మికులు నిరుద్యోగులై, తిండీ తిప్పలు లేకుండా కొన్ని వేల మైళ్లు నడిచి, ఆప్త బంధువులను కోల్పోయి

ఉపాధ్యాయుల ప్రాణాలు తీసిన ఎన్నికలు

కరోనా రెండో దశ ఉధృతి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నికలు నిర్వహించి ఉపాధ్యాయుల ప్రాణాలు తీశాయని అంటున్నారు **డి. శ్రీనివాసులు**

నవంబర్ 2019లో ఉనికిలోకి వచ్చిన కరోనా వైరస్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. భూగ్రహం మీద మానవుని అసమగ్ర అభివృద్ధిని ఎత్తిచూపింది. అభివృద్ధిలో ఉన్న డొల్లతనాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేసింది. ప్రకృతి విధ్వంసం స్వయంకృతాపరాధం అని గుర్తు చేసింది. పాలకుల కొడగట్టిన ముందుచూపును బహిర్గతం చేసింది. ప్రపంచ దేశాల వైద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధిని సవాలు చేసింది. భారతదేశంలో 2020 జనవరిలో కరోనా వైరస్ ప్రవేశించినప్పటికీ, ఫిబ్రవరిలో నమస్తే ట్రంప్ కార్యక్రమంలో తలమునకలైన మోడీ ప్రభుత్వం కరోనా వైరస్‌ను పట్టించుకోలేదు. చైనాలో పుట్టి ఇతరేతర దేశాలకు వ్యాపించి, అటునుండి విమాన ప్రయాణికుల ద్వారా వైరస్ ఇండియాను చేరుకుంటూ ఉన్న సమయంలో విమానయానాలను కట్టడి చేయకుండా నమస్తే ట్రంప్ సంబరాలలో మునిగి తేలుతూ, భారతీయ పేదల జీవితాలు ట్రంప్ కంటపడకుండా గోడల నిర్మాణంలో తీరికలేకుండా ఉన్న ప్రధాన మంత్రి, వైరస్ తీవ్రరూపం దాల్చిన తరువాత ఆ నెపాన్ని మర్కజ్ కుట్రగా అభివర్ణించి తనదైన శైలిలో మత రాజకీయం చేశారు. ముందు చూపు లేకుండా, ఏకపక్షంగా లాక్‌డౌన్ ప్రకటించి, నెలల తరబడి పొడిగించి వలస కార్మికుల, దినసరి కూలీల ఉసురుపోసుకున్నారు.

కరోనా రెండో దశ ఉధృతి (సెకండ్ వేవ్) గూర్చి ప్రపంచ ఆరోగ్య సంస్థ, శాస్త్రవేత్తలు, వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం అంధ విశ్వాసాలకే పెద్దపీట వేస్తూ లక్షల మంది సామూహిక స్నానాలు, సామూహిక ప్రార్థనలు చేసే కుంభమేళాకు అనాలోచితంగా అనుమతినిచ్చింది. గంగా నదిలో కుంభమేళా ఫలితంగా ఉత్తరాఖండ్ కరోనాతో విలవిలలాడుతోంది. ఆ రాష్ట్రంలో ఫిబ్రవరి చివరి రెండు వారాల్లో 172 కేసులు నమోదు కాగా, కుంభమేళా అనంతరం ఏప్రిల్ నెల మొదటి రెండు వారాల్లో ఆ సంఖ్య 15 వేలకు చేరింది. అంటే ఏకంగా 88 శాతం కేసులు పెరిగాయి. వైరస్ వ్యాప్తి ఒక ఉత్తరాఖండ్‌కే పరిమితం కాలేదు. దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులు, సాధువులు, సన్యాసులు కరోనా వైరస్‌తో దేశం నలుమూలలా విస్తరించారు. కుంభమేళా 'వైరస్ సూపర్ స్ప్రెడర్'గా పని చేసిందనడంలో సందేహం లేదు. కరోనా రెండో ఉధృతి పెరుగుతున్న సమయంలోనే కేంద్ర ఎన్నికల సంఘం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలు నిర్వహించగా, ఉత్తరప్రదేశ్ పంచాయితీ ఎన్నికలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘాలు ముందుచూపు లేకుండా తెరలేపాయి. పర్యవసానంగా ఆయా రాష్ట్రాల్లో

పుట్టిన ఊరుకు జీవచ్ఛవాలుగా చేరారు. ఎన్నికలు, పదవులు, కుంభమేళాలు ప్రజల ప్రాణాలకన్నా ముఖ్యమయ్యాయి. కరోనా వ్యాధిని అడ్డం పెట్టుకుని రైతువ్యతిరేక చట్టాలను ఆమోదింపచేసుకున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు పూనుకున్నారు.

కరోనా రహస్యం

ఎబోలా, హెచ్ఐవీ, ఏవియన్ ఫ్లూ, నిఫా, స్వైన్ ఫ్లూ, సార్స్, మెర్స్, ఈ వ్యాధులన్నిటికీ మూలం పూసలో దారంలాగా ఉన్న రహస్యాన్ని గమనించాలి.

వన్యజీవుల నుండి మానవులకు సంక్రమిస్తున్న జూనోటిక్ వ్యాధుల్లో ఈ రహస్యం దాగి ఉన్నది. ఈ రకమైన వైరస్ వ్యాధులతో 1981 నుండి 3 కోట్ల మంది మరణించారు. అభివృధి పేరున జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వలన వైరస్‌లు, వన్యజీవులు స్థానభ్రంశం చెంది మరొక నివాసాన్ని ఏర్పరుచుకుంటున్నాయి. ఈ క్రమంలో మనిషిలో చేరిన వైరస్‌లు అల్లకల్లోలం సృష్టించి మానవ వినాశనానికి కారణమవుతున్నాయి.

విలువలు లేని వ్యవస్థ

ధనం-లాభం-పెట్టుబడి-ధనం తప్ప మరే విలువలూ లేని పెట్టుబడిదారీ వ్యవస్థలో భూమాత ముడిపదార్థాల గనిగా, మనుషులు వినియోగదారులుగా, కార్మికుడు ఉత్పత్తి శక్తిగా మారారు. ప్రకృతిని నాశనం చేసిన కార్పొరేట్ శక్తులు అంటువ్యాధి అంటకుండా దూరంగా ఉండగలరు. ఆధునాతన వైద్యాన్ని అందుకోగలరు. ఎంత ఖరీదైనా మందులు వాడుకోగలరు. వ్యాక్సిన్ రాగానే కొనుక్కోగలరు. జనాభాలో సగం పైగా ఉన్న పేద ప్రజలకు వైద్యం, మందులు, టీకాలు అందుతాయా? రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజల ఉనికికే ప్రమాదం తెచ్చిన ఈ కరోనాని ఎదుర్కోవడానికి ప్రజలు, మీడియా పూనుకోవాలి. డబ్బులు లేకపోతే మందులు లేవు, బెడ్ లేదు, ఆక్సిజన్ లేదు, వ్యాక్సిన్ లేదు అనే వ్యవస్థ మార్పు కోసం పోరాడాలి. తక్షణ కర్తవ్యంగా కరోనా మందులను, వ్యాక్సిన్‌లను కంపల్సరీ లైసెన్సు కిందకు తేవాలి.

యూనివర్సల్ హెల్త్, యూనివర్సల్ ఇమ్యునిశేషన్ కావాలి. ప్రజలందరికీ వైద్యం, వ్యాక్సిన్‌లు అందుబాటులోకి తేవడం కోసం ఆందోళన చేయాలి. సైన్సు ఫలితాలు అందరికీ అందేవరకూ పోరాడాలి.

(రచయిత నల్లమడ రైతు సంఘం, గుంటూరు)

కరోనా విలయతాండవం చేస్తోంది. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది వేలాదిగా కరోనా బారిన పడి చనిపోతున్నారు. మొదటి దశ కరోనా సృష్టించిన విలయం అందరికీ విదితమే. ఆ పీడకల మరువక ముందే శాస్త్రబద్ద ప్రణాళిక లేని వాగాడంబర కేంద్ర ప్రభుత్వం రెండవ విలయాన్ని ఆహ్వానించి దేశాన్ని కరోనా చితి మంటలలోకి నెట్టి వేసింది.

కరోనా సెకండ్ వేవ్ తీవ్రమౌతున్న సమయంలో ప్రజల ప్రాణాలు ఫణంగా పెట్టి ఉత్తరప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు పచ్చ జెండా ఊపి 1,621 మంది ఉపాధ్యాయుల మరణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం కారణం అయింది. ఉత్తరప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ (గ్రామ సభ), గ్రామ ప్రధాన్, బ్లాక్ పంచాయతీ, జిల్లా పంచాయతీలకు ఏప్రిల్ 15 నుండి 29 వరకు నాలుగు దశలలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. 75 జిల్లాలలో నిర్వహించిన 60 వేల గ్రామ సభలు, మిగతా మూడు స్థాయిల ఎన్నికలలో మొత్తం 13 లక్షల అభ్యర్థులు పోటీ పడ్డారు. ఎన్నికల పరిధిలో 13 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అతిపెద్ద ఎన్నికలను ఏమాత్రం ముందు చూపు లేకుండా కోవిడ్ సెకండ్ వేవ్ ముంచుకొస్తున్న తరుణంలో నిర్వహించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారు. ఎన్నికల మొదటి దశ శిక్షణలోనే చాలా మంది ఉపాధ్యాయులు కోవిడ్ తీవ్రతను గమనించి తమను ఎన్నికల విధుల నుండి మినహాయించ వలసిందిగా అభ్యర్థించారు. కానీ 'మీరు విధిగా ఎన్నికల డ్యూటీ చేయవలసిందే. లేని ఎడల మీపై క్రిమినల్ కేసులు పెడతాం. అంతేకాకుండా మిమ్మల్ని ఉద్యోగాల నుండి డిస్మిస్ చేస్తాం' అని అధికారులు బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి బలవంతంగా ఎన్నికల విధులకు పంపారు.

ఏప్రిల్ 15న మొదటి దశ ఎన్నికల అనంతరం ఉపాధ్యాయులు ఒక్కొక్కరుగా కోవిడ్‌తో ఆస్పత్రులలో చేరడం మొదలు అయింది. వారం గడిచేసరికి వందల మంది ఉపాధ్యాయులు కోవిడ్‌తో మరణించడం మొదలయ్యింది. ఏప్రిల్ 28 నాటికి 706 మంది ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ఉపాధ్యాయులు కరోనాతో మరణించారు. అప్పటికే జరిగిన నష్టాన్ని, ముంచుకొస్తున్న ఉపద్రవాన్ని గుర్తు చేస్తూ మరణించిన 706 ఉపాధ్యాయుల జాబితాలను సమర్పిస్తూ, కోవిడ్ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మే 2న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియను వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఉత్తరప్రదేశ్ ప్రాథమిక శిక్షక్ సంఘ్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షక్ మహాసంఘ్ నాయకులు ఆర్.ఆర్. త్రిపాఠి, దినేష్ చంద్ర శర్మలు వేర్వేరుగా ఏప్రిల్ 28న రాష్ట్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. కానీ ఎన్నికల సంఘం, యోగి ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. తమిళనాడులో వేలాది మందితో ఎన్నికల ర్యాలీలు, కోవిడ్ నిబంధనల ఉల్లంఘనపై స్పందిస్తూ ఏప్రిల్ 26న మద్రాస్ హైకోర్టు ఎన్నికల కమిషన్ పైన హత్య కేసు నమోదు చేయాలని వ్యాఖ్యానించింది. అదే క్రమంలో అలహాబాద్ కోర్టు ఎన్నికలలో కోవిడ్ ప్రోటోకాల్ ఉల్లంఘనపై వివరణ కోరుతూ ఏప్రిల్ 27న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం కోవిడ్ ప్రోటోకాల్ మేరకు అన్ని జాగ్రత్తలతో ఎన్నికలు నిర్వహించామని, అంతే జాగ్రత్తలతో కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపింది. కానీ కోవిడ్ ప్రోటోకాల్ ఏమాత్రం ఎక్కడా పాటించలేదు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయుల కరోనా మరణాలపై మే 1న సుప్రీంకోర్టు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ నిబంధనల ఉల్లంఘనను తప్పుబట్టింది. అంత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు మరణిస్తే యోగి ప్రభుత్వం ఎక్కడ విచారం వ్యక్తం చేయలేదు, సానుభూతి ప్రకటించలేదు. ఉపాధ్యాయుల మరణాలపై యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ ఎన్నికలు లేని ఢిల్లీ, ముంబై లాంటి చోట్ల కూడా కరోనా మరణాలు పెరుగుతున్నాయి. ఇక్కడ ఉపాధ్యాయుల మరణాలు కేవలం ఎన్నికల వల్లనే అని చెప్పలేమని బుకాయించారు. ఇది పూర్తిగా అసత్యమని గణాంకాలే చెబుతున్నాయి. రాష్ట్రంలో 2020 జనవరి 30 నుండి 2021 ఏప్రిల్ 4 వరకు 15 నెలల్లో 6 లక్షల 50 వేల కేసులు నమోదు కాగా, ఏప్రిల్ 24 నుండి నెల రోజుల్లో 8 లక్షల కొత్త కేసులు నమోదు అయ్యాయి. మే 17 వరకు రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 16 లక్షల 90 వేలకు చేరుకోగా, ఎన్నికల విధులు నిర్వహించి కోవిడ్‌తో మరణించిన ఉపాధ్యాయుల సంఖ్య 1,621కి చేరింది. మరో సందర్భంలో యోగి మాట్లాడుతూ అలహాబాద్ కోర్టు సూచన మేరకే ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఇది పూర్తిగా అబద్ధం. యోగి ప్రభుత్వం ఎన్నికల వాయిదా కొరకు ఎన్నికల సంఘాన్ని గాని, కోర్టును గాని సంప్రదించనే లేదు. ఆ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సతీశ్‌చంద్ర పత్రికా విలేఖరులకు సమాధానమిస్తూ ఉపాధ్యాయులకు ఎన్నికల ద్వారానే కరోనా వచ్చిందనడానికి ఆధారాలు లేవని, వారికి ఎన్నికలకు ముందే కరోనా వచ్చి ఉండవచ్చు కదా అంటూ బాధ్యతా రాహిత్యంగా మాట్లాడారు.

ఉపాధ్యాయుల మరణాలకు కారణమై రాష్ట్ర ప్రభుత్వం చనిపోయిన కుటుంబాలకు సానుభూతి తెలిపి ఆదుకోవాల్సింది పోయి, వారిని అవమాన పరుస్తూ వ్యాఖ్యలు చేయడం యోగి ప్రభుత్వానికే చెల్లింది. ఒకవేళ ఉపాధ్యాయులకు ముందే కరోనా వచ్చి ఉంటే వారు కోరగానే ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలి కదా! అలా ఇవ్వకుండా కరోనా సోకిన వారిని బెదిరించి విధులు నిర్వర్తింపజేసే కరోనా వ్యాప్తికి కారణమైన నేరం కూడా ప్రభుత్వానిదే అవుతుంది కదా! ఏ కోణంలో చూసినా ప్రభుత్వానిది ముమ్మాటికీ తప్పే.

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉమ్మడి నిర్లక్ష్యం మూలంగా వేల మంది ప్రాణాలు గాల్లో కలిశాయి. లక్షలాది మంది హాస్పిటల్స్‌లో మగ్గుతున్నారు. ఉపాధ్యాయులు ప్రమాదాన్ని గుర్తించి ఎన్నికల విధులు నిర్వహించలేమని వేడుకున్నా కూడా వారిని బలవంతం చేసి, మరణశయ్య మీదికి పంపి, వారి కుటుంబాలను అనాథలను చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కరోనా తీవ్రతను ఎన్నికల సంఘానికి తెలిపి పంచాయతీ ఎన్నికలను వాయిదా కోరవలసిన బాధ్యతను విస్మరించి, ఉపాధ్యాయ సంఘాల, సామాజిక సంస్థల సూచనలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, శవాల మధ్య పంచాయితీ ఎన్నికలను భుజానికెత్తుకున్నది. ఉపాధ్యాయులను బలవంతంగా ఎన్నికలకు పురమాయించి వారి మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం అని, అందుకు తగిన నష్టపరిహారం చెల్లించాలని అలహాబాద్ కోర్టులో వ్యాజ్యం నమోదు అయింది. వారిని బలవంతంగా ఎన్నికల విధులకు

రప్పించడాన్ని కోర్టు తప్పుపట్టింది. మరణించిన వారి కుటుంబాలకు 30 లక్షలు చొప్పున చెల్లిస్తామన్న ప్రభుత్వ వాదనపై మండిపడుతూ ఆ మొత్తం చాలా తక్కువ అంటూ ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని మే 12న అలహాబాద్ కోర్టు తీర్పునిచ్చింది.

2022లో జరగవలసిన కుంభమేళా సంవత్సరం ముందుగా నిర్వహించడం, పంచాయితీ ఎన్నికలు వాయిదా కొరకు ప్రయత్నించక పోవడం వెనుక యోగి ప్రభుత్వ రాజకీయ ఎత్తుగడ ఉంది. 2022 మార్చ్‌లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ప్రస్తుత పంచాయితీ ఎన్నికలు వాయిదా కోరలేదు. ఒకవేళ వాయిదా వేస్తే అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు పంచాయితీ ఎన్నికలు నిర్వహించి, ఆశించిన ఫలితాలు రాకపోతే దీని ప్రభావం అసెంబ్లీ ఎన్నికల మీద పడుతుందన్న కారణంతోనే కరోనా విజృంభిస్తున్నా ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి కుంభమేళా అనుమతిచ్చి, పంచాయితీ ఎన్నికలు కూడా నిర్వహించారన్న చర్చ కూడా నడుస్తోంది.

కరోనా సెకండ్ వేవ్ విలయతాండవం చేస్తున్న సమయంలోనే కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 27 నుండి ఏప్రిల్ 29 మధ్య 5 రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అసోం శాసన సభలకు, వివిధ కారణాలతో ఖాళీ అయిన వేర్వేరు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వం ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నిర్వహణకు ఆయా రాష్ట్రాలలో పరిస్థితులు అనువుగా లేవని, కొద్దికాలం ఎన్నికలు వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరవలసి ఉంది. కానీ అధికారమే పరమావధి అయిన కేంద్ర ప్రభుత్వం ఆ పని చేయకుండా ఎన్నికలకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి ప్రజల జీవితాలను బలిపీఠం ఎక్కించింది.

'అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకండి, ఒకవేళ వెళ్లినా భౌతిక దూరం పాటించండి, మాస్కులు తప్పక ధరించండి' అంటూ మన్ కీ బాత్‌లో కబుర్లు చెప్పే ప్రధానమంత్రి వేలాది మందితో, భౌతిక దూరం లేకుండా, మాస్కులు లేకుండా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించి కరోనా ఉధృతికి కారకులయ్యారు. సెకండ్ వేవ్ కరోనాను పెంచి పెద్దది చేశారు. ఎన్నికల ప్రచార ర్యాలీలపై మద్రాస్ హైకోర్టు తీవ్రంగా స్పందిస్తూ ఎన్నికల ద్వారా కరోనా వ్యాప్తిని తీవ్రంగా పెంచి ప్రజల మరణానికి కారణమవుతున్న ఎన్నికల సంఘం మీద హత్య కేసు నమోదు చేయాలని వ్యాఖ్యానించినప్పటికీ, ప్రచార హోరులో ఏమి తేడా రాలేదు. ఫలితంగా ఎన్నికలు జరిగిన 5 రాష్ట్రాల్లో కరోనా కరాళ నృత్యం చేస్తుంది. దేశం ఎటు పోయినా పర్లేదు బెంగాల్ దక్కితే చాలు అనుకున్నారు మోదీ, షా ద్వయం. ఇప్పుడు బెంగాల్ దక్కలేదు. దేశం ఎటు పోతుందో తెలియడం లేదు. భూటాన్ లాంటి చిన్న పేద దేశం ముందు కూడా ఆక్సిజన్ అడుక్కోవాల్సిన దుస్థితి తలెత్తింది. ప్రపంచ దేశాల ముందు భారతదేశ పరిస్థితి దయనీయంగా మారిపోయింది. ముందుచూపు లేని, ప్రజా శ్రేయస్సు పట్టని, మూర్ఖపు, అసమర్థ ప్రధానిగా మోడీ నిజ స్వరూపాన్ని అంతర్జాతీయ మీడియా ఎండగట్టింది.

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మొదటి వేవ్ ప్రారంభంలో ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ ప్రసాద్ కోవిడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 2020లో జరుగవలసిన పంచాయితీ ఎన్నికలు వాయిదా వేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఫిబ్రవరి 2021లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల వాయిదా వెనుక రాజకీయ కుట్ర ఉందంటూ ఆరోపణలు వచ్చినప్పటికీ, కరోనా కోణంలో చూస్తే ఎన్నికల వాయిదా సరైనదే. కరోనా సెకండ్ వేవ్ తిరిగి మొదలైన క్రమంలోనే తిరుపతి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలకు మార్చ్ 23న నోటిఫికేషన్ ఇచ్చి ఏప్రిల్ 17న పోలింగ్ నిర్వహించారు. ఒకవైపు కరోనాతో ప్రజలు పిట్టల్లా రాలిపోతుంటే ప్రజల జీవితాల కంటే ఎన్నికలే ప్రధానం అయినట్లు పాలకులు, ఎన్నికల సంఘం ప్రవర్తించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా తీవ్రతను, ఎన్నికల సాధ్యా సాధ్యాలు ఎన్నికల సంఘానికి వివరించి వాయిదా వేయాలని కోరలేదు. వేల మందితో ప్రచార ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి కరోనా వేగంగా వ్యాపించడానికి కారకులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి ఉప ఎన్నిక ప్రచారంలో కోవిడ్ నిబంధనలు పాతరేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రెండు నెలల (సెకండ్ వేవ్) కాలంలో 391 మంది ఉపాధ్యాయులు కోవిడ్‌తో మరణించగా, అందులో సగం మంది ఎన్నికలు జరిగిన తిరుపతి నియోజకవర్గ పరిధిలోని వారు కావడం గమనార్హం.

తెలంగాణలో నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక పోలింగ్ కూడా ఏప్రిల్ 17న జరిగింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, కెటిఆర్‌కు, పోటీచేసిన సగం మంది అభ్యర్థులకు, వారి సన్నిహితులకు, కుటుంబ సభ్యులకు కరోనా పాసిటివ్‌గా తేలింది. ఎన్నికల అనంతరం వేలాది కేసులు నమోదయ్యాయి. ఎన్నికల విధులలో పాల్గొన్న అనేక మంది ఉపాధ్యాయులకు కరోనా సోకి మృత్యువాత పడ్డారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు ముగియక ముందే వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు, సిద్దిపేట, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీల ఎన్నికల నగారా మోగించారు. కరోనా కేసులు పెరుగుతున్నప్పటికినీ 2 కార్పొరేషన్లు, 5 మున్సిపాలిటీలకు షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. కరోనా ఉధృతిని వివరించి ఎన్నికల వాయిదా కోరవలసిన రాష్ట్ర ప్రభుత్వమే కోవిడ్ నిబంధనలు అమలు చేస్తామని, అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకుంటామని ఎన్నికల సంఘానికి స్పష్టం చేస్తూ ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని కోరింది. ఎన్నికల విధుల నిర్వహణకు ఉపాధ్యాయులను బెదిరించి, బలవంతంగా విధులు అప్పగించి ఇటు ఉపాధ్యాయులను అటు ప్రజలను కోవిడ్ మృత్యు కౌగిలిలోకి నెట్టి వేసింది. ఎన్నికలు జరిగిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇబ్బడి ముబ్బడిగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఎన్నికల్లో పాల్గొన్న వేలాది మంది ఉపాధ్యాయులు కరోనా బారిన పడ్డారు. క్రమంగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. అనేక మంది కార్పొరేటర్లు, కౌన్సిల్ సభ్యులు కూడా కరోనా పాజిటివ్‌గా తేలారు. తెలంగాణలో గడిచిన నెల రోజుల్లో 220 మంది ఉపాధ్యాయులు కోవిడ్‌తో మరణించగా,

మేడే, ప్యారిస్ కమ్యూన్, శ్రామికోద్యమ నవ నిర్మాణం

***మే డే చారిత్రక ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేస్తూ, కొత్త శ్రామికోద్యమాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తుజేస్తున్నారు* భూసారం శివన్న**

మేడే పూర్వరంగం:

'గల్లీ సిన్నదీ గరీబోల్ల కథ పెద్దది' అన్నాడు ఓ సహజ కవి. అవును, సంఘటిత శ్రామికుల్లో ఏ గుప్పెడు మందో తప్ప అసంఘటిత శ్రామికులంతా గరీబులే కదా! వారి కథ పెద్దదే కాదు, అంతులేనిది కూడా. విడిగా శ్రామికుడు ఓ అసహాయుడు. బలహీనుడు. అందుకే దోపిడీ పీడనలకు గురౌతూ ఉంటాడు. గల్లీల్లోనే బ్రతుకు బండిని ఈడిస్తూ ఉంటాడు. ఏపూట కాపూట పొట్ట నింపుకునే పెనుగులాటలో ఉంటాడు. రేపటి సంగతేమిటనే వేదనలో ఉంటాడు. శ్రమశక్తిని అమ్ముకుంటేగాని పొట్టనింపుకోలేని నిస్సహాయుడు 'అసంఘటిత' శ్రామికుడు.

అదే శ్రామికుడు, సంఘటితుడైతే బహు బలాఢ్యుడౌతాడు. పోరాట పథం పడతాడు. పెట్టుబడితో సంఘర్షణకు దిగుతాడు. పోరాటమే అతని సుదీర్ఘ చరిత్ర. పడుతూ, లేస్తూ, పోరాడుతూ, నిలబడుతూ, మెట్టు మెట్టుగా చైతన్యవంతమవుతూ, రక్తతర్పణ చేస్తూ, కొత్త చరిత్రను సృష్టిస్తూ ఉంటాడు. బానిస నుండి శ్రామికునిగా, కార్మికునిగా ఎదగడానికి ఎంతటి పెనుగులాట? ఎంతటి సుదీర్ఘ పోరాట చరిత్ర? విరామమే లేని రేయింబవళ్ల నిరంతర శ్రమనుండి ఎనిమిది గంటల పని దినం సాధన, లేక శ్రామికుల మేడే, ఈ పోరాటాల నుండి పుట్టినదే కదా!

'పొలాలనన్నీ హలాలదున్నీ, ఇలాతలంలో హేమంపిండగ, జగానికంతా సౌఖ్యం నిండగ, విరామ మెరుగక పరిశ్రమించే, బలం ధరిత్రికి బలికావించే, కర్షక వీరుల కాయంనిండా కాలువకట్టే ఘర్మ జలానికి, ధర్మ జలానికి, ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్! నరాల బిగువూ, కరాల సత్తువ వరాల వర్షం కురిపించాలని, ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని గనిలో, వనిలో, ఖార్ఖానాలో పరిక్లమిస్తూ, పరిప్లవిస్తూ ధనికస్వామికి దాస్యం చేసే, యంత్ర భూతముల కోరలుతోమే, కార్మిక వీరుల కన్నుల నిండా కణకణ మండే, గలగల తొణికే, విలాపాగ్నులకు, విషాదాశ్రులకు, ఖరీదుకట్టే షరాబు లేడోయ్' అన్నాడో మహాకవి.

అవును, శ్రామికుల ఘర్మ జలానికి, ధర్మ జలానికి ఖరీదుకట్టే షరాబు లేడు. కార్మిక కర్షక శక్తికి ఖరీదు ఎవరు కట్టాలి? అలా ఖరీదు కట్టే శక్తి శ్రామికులకే తప్ప ఇంకెవరికుంటుంది? అయినా, పెట్టుబడి అనే షరాబు, శ్రమశక్తికి, తన ఇష్టానుసారం ఖరీదు కడుతుంటుంది. దాన్నే 'శ్రమ దోపిడీ' అన్నాడు పెట్టుబడి గ్రంథ రచయిత 'కార్ల్ మార్క్స్'. పెట్టుబడి అనే షరాబు చేతిలో లాభాలు గడించే ఆయుధమే ఈ శ్రమ దోపిడీ.

శ్రామికుడు ఓ వ్యక్తిగా, విడిగా ఉన్నప్పటి కురచైన వ్యక్తిగత ఆలోచనా స్థాయి, సామూహికమైనప్పుడు వికసిస్తుంది, విస్తరిస్తుంది. అతను సంఘటిత చైతన్యాన్ని పొందేవరకు తాను దోపిడీకి గురౌతున్నానని, ఆ

అందులో సగానికి పైగా ఎన్నికల విధులలో పాల్గొన్నవారు ఉన్నారు.

ప్రపంచమంతా కరోనా సెకండ్ వేవ్‌తో పోరాడుతున్న సమయంలో శాస్త్రీయ ఆలోచన కొరవడి, అజ్ఞానాంధకారంలో, అధికార దాహంతో కరోనా శవాల మధ్యన ఓట్ల వేటకు బయలుదేరింది మన కేంద్ర ప్రభుత్వం. చితి మంటలతో చలి కాచుకున్నట్లుగా, ప్రజల రోదనల మధ్య ఎన్నికలు నిర్వహించింది. దాని ఫలితమే ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో కరోనా కల్లోలం. దాని పర్యవసానమే వేలాది మంది ఉపాధ్యాయుల కరోనా మరణాలు. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలలో ఆగస్టు నుండి పాఠశాలలను తెరువడం ప్రారంభించారు. నిత్యం విద్యార్థులతో మమేకమై ఉండే ఉపాధ్యాయులకు పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఇతరత్రా బోధనాభ్యసన కృత్యాల ద్వారా, పరోక్ష స్పర్శ ద్వారా కరోనా వ్యాప్తికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. కావున ఉపాధ్యాయులకు వ్యాక్సినేషన్ మొదటి దశలోనే చేయాల్సి ఉండింది. కానీ కేంద్రం ఎలాంటి సూచనా చేయలేదు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ముందుచూపు లేదు. ఫలితంగా పాఠశాలలు తెరిచిన కొద్ది రోజుల్లోనే చాలా రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులలో కరోనా వ్యాపించడం మొదలైంది. కనీసం ఎన్నికల విధులు అప్పగించిన ఉపాధ్యాయులకైనా ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయాల్సి ఉండే. కానీ ఆ దిశలో ప్రభుత్వాలు ఆలోచన చేయలేదు. పోలీసులకు మాత్రం ముందుగానే మొదటి శ్రేణి యోధులుగా గుర్తించి వ్యాక్సిన్ వేశారు. పాలకులకు పోలీసుల ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధ, జాతి నిర్మాతలైన ఉపాధ్యాయుల ఆరోగ్యం మీద లేకపోవడం ఈ దేశంలోని ఉపాధ్యాయుల దౌర్భాగ్యం. హైదరాబాద్ హైకోర్టు ఎన్నికల విధులలో కరోనా సోకిన ఉపాధ్యాయుల గూర్చి ప్రస్తావిస్తూ ఉపాధ్యాయులను కరోనా వారియర్స్‌గా గుర్తించి వ్యాక్సినేషన్ చేయాలని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇప్పటికైనా విద్యా వ్యాసంగంలో ఉన్న వారందరికీ ముందుగా వ్యాక్సినేషన్ చేయాలి. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించి కారోనాతో చనిపోయిన ఉపాధ్యాయుల మరణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలి. మృతుల కుటుంబాలకు అలహాబాద్ కోర్టు తీర్పు చెప్పినట్లుగా కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలి. వారి కుటుంబంలో ఒకరిని అదే ఉద్యోగంలో నియమించాలి.

(రచయిత టిపిటిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు) వీ

దోపిడీ కేవలం తనవరకే లేదని, అది సామూహికమైన, చాలా లోతైన, విస్తృతమైన ప్రక్రియ అనే జ్ఞానం పొందలేడు. ఈ ప్రక్రియ ఓ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థకు పునాది అనే పూర్తి అవగాహన కలిగే అవకాశం ఉండదు.

అటువంటి చైతన్యయుతమైన సంఘటిత, సామూహిక శ్రామిక శక్తి తన మేధో స్థాయిని, పోరాట పటిమను పెంచుకుని, పెట్టుబడి అనే షరాబుకు బలమైన ప్రత్యర్థిగా నిలుస్తుంది. ఇది వర్గ సంఘర్షణ రూపం తీసుకుంటుంది. రెండు ప్రత్యర్థి వర్గాలు ఇరువైపులా మోహరిస్తాయి. శ్రామిక శక్తికి ఖరీదుకట్టే 'పెట్టుబడి' షరాబులు ఓ వర్గంగా, శ్రమశక్తిని అమ్ముకునే ఉత్పత్తి సమూహం మరో వర్గంగా, వర్గ పోరాట రణరంగంలో ప్రత్యర్థులుగా మోహరిస్తారు. అలలు అలలుగా ఈ పోరు జరుగుతుంటుంది. షరాబు వర్గం రద్దయ్యే వరకు ఈ వర్గయుద్ధం ఆటుపోట్లతో కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటి భారతంలో ఈ వర్గాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇక్కడే కాదు, ప్రపంచమంతా, భూగోళమంతా, తీరులు వేరైనా ఇదే యుద్ధం కొనసాగుతోంది.

కార్మిక వర్గ పోరాటాల గత చరిత్రలోనికి తొంగి చూస్తే, అప్పటి కార్మిక వర్గం, భావజాల రంగంలోనూ, క్షేత్రస్థాయి ఉద్యమాలలోనూ ప్రదర్శించిన పోరాట పటిమను, మిలిటెన్సీని గమనిస్తే ఇప్పుడు అబ్బురం, ఆశ్చర్యం కలగక మానదు. 19వ శతాబ్దంలో అమెరికా, యూరోప్ దేశాల్లో అణకువ, సత్ప్రవర్తన, మత ప్రార్థన, సాంప్రదాయతా విలువలపై పాలక వర్గాలు పుంఖాను పుంఖంగా సాహిత్యం, కళలు సృష్టించి ప్రజలపై గుమ్మరిస్తున్న కాలంలోనే ఉద్వేగ భరితమైన అసమ్మతి, నిరసన, ప్రతిఘటనాత్మక సాహిత్యం కూడా ఉద్భవించింది. అటువంటి సాహిత్యం నుండి మచ్చుకు కొంత సమాచారం: అమెరికాలోని ఫిలడల్ఫియాకు చెందిన హెన్రీ జార్జ్ అనే ఓ కార్మికుడు, స్వశక్తితో, సొంత అధ్యయనంతో విద్యాధికుడై, పత్రికా ముద్రకుడై తరువాత ఆర్థికవేత్తగా కూడా ఎదిగాడు. అతను 1879లో 'అభివృద్ధి, పేదరికం'(ప్రోగ్రెస్ ఎండ్ పావర్టీ) అనే పుస్తకం రాసి ప్రచురించాడు. అమెరికాలోనేకాక ప్రపంచమంతా లక్షల సంఖ్యలో ఈ పుస్తకం అమ్ముడు పోయింది. అప్పట్లో ఆయన వెల్లడించిన విశ్లేషణను ఎందరు స్వీకరించారో తెలియదు కానీ ఇప్పుడు ఆ విశ్లేషణలో ప్రతి పదం అక్షర సత్యమై, మన ముందు పరుచుకుందని 'హోవార్డ్ జిన్' తన 'అమెరికా ప్రజల చరిత్ర' అనే పుస్తకంలో ఉటకించాడు: 'అవును, సంపద, సౌఖ్యం, విరామం, జ్ఞానం పెరిగిన మాట నిజమే, కాదనలేం; అయితే ఈ సౌలభ్యాలు కింది నుండి పైవరకు సమంగా లేవు. కింది తరగతి ప్రజలు వీటికి బహుదూరంలో ఉన్నారనేది అసలు వాస్తవం. పేదరికంతో కూడుకున్న అభివృద్ధి మనకాలపు చిక్కు సమస్య. శ్రామికుల్లో ఓ అస్పష్ట అసంతృప్తి, నిరాశ ఆవరించి ఉన్నాయి. విప్లవ భావాలు వ్యాపిస్తున్నాయి. నాగరికం అనుకుంటున్న మర్యాదస్తుల సమాజం ఈ పరిణామాలతో గజగజ వణుకుతోంది. అది ఓ పైస్థాయికి, ఒక ఊహించ లేని, అనూహ్యమైన అభివృద్ధి స్థాయికి ఎగబాకడమో లేక ఆటవికత వైపు నెట్టబడటమో తప్ప దానికి వేరే మార్గం లేదు'.

అలానే 'జోయెల్ స్ప్రింగ్' అనే మరో అమెరికన్ రచయిత, అమెరికాలో అప్పటి ధనస్వామ్య దిగ్గజాల విద్యాదాతృత్వాన్ని విశ్లేషిస్తూ 'విద్య, కార్పొరేట్ రాజ్య ఎదుగుదల' (ఎడ్యుకేషన్ అండ్ రైజ్ ఆఫ్ కార్పొరేట్ స్టేట్) అనే పుస్తకంలో విద్య ధనస్వామ్య అవసరాల కనుగుణంగా ఎలా మలచబడిందో, వారి సేవలో ఎలా ఒదిగి పోయిందో అద్భుతంగా బహిర్గత పరచాడు.

మరొక రచన 'వెనుదిరిగి చూస్తే' (లుకింగ్ బాక్వర్డ్) అనే ఊహాత్మక నవల. ఎడ్వర్డ్ బెల్లామీ అనే ఈ అమెరికన్ నవలా రచయిత ఓ న్యాయవాది. ఇందులో రచయిత గాఢ నిద్రలోకి వెళ్లి 2000వ సంవత్సరంలో కళ్లు తెరుస్తాడు. అప్పుడు అతని ఎదుట ప్రజలు ఓ సోషలిస్టు సమాజంలో, అందరూ కలిసికట్టుగా పని చేసుకుంటున్న దృశ్యం కనిపిస్తుంది. ఆయన ఈ నవలలో సోషలిజం గురించి హృద్యంగాను, మనోరంజకంగాను చిత్రీకరించనట్లు 'హోవార్డ్ జిన్' తన అమెరికా ప్రజల చరిత్ర అనే పుస్తకంలో ఉదహరించాడు.

1830-1877 మధ్యకాలంలో చెదురు మదురుగా చోటుచేసుకున్న అనేక సమ్మెలు, కౌలురైతుల ఆందోళనలు, 1880-1890ల నాటికి మరింత ఉధృతమై ఒక నూతన ఆలోచనా వెల్లువ అమెరికా ప్రజలను ముంచెత్తిందని, ఈ వెల్లువ కార్మిక శక్తులు మరింతగా సంఘటితమయ్యేందుకు దోహదపడిందని, 8 గంటల పనిదిన పోరాటాలు విస్తృతమై 'హే మార్కెట్' ఉదంతానికి దారి తీశాయని అమెరికా ప్రజల చరిత్ర సోదాహరణంగా వివరిస్తుంది. 1883లో పిట్సబర్గ్ నగరంలో పెట్టుబడిదార్లను తీవ్రంగా వ్యతిరేకించే అమెరికా ఎనార్కిస్ట్ బృందాల కాంగ్రెస్ జరిగింది. అందులో వారు ఓ మ్యానిఫెస్టోను, తమ సొంత ప్రణాళికను ప్రకటించారు. ఈ ఆందోళనకారుల నాయకత్వమే '8 గంటల పనిదిన' సాధనకు, తదనంతరం మేడేగా శ్రామిక జనావళికి అంది వచ్చింది.

ప్రశ్నించ వచ్చిన 2021 మేడే:

కోవిడ్ కష్టకాలంలో, కరోన విలయంలో, ప్రపంచ మానవాళి విషాదపు ఛాయాల్లో కూరుకుపోయిన వేళ, 2021 సంవత్సరపు మేడే ఇలా వచ్చి అలా మౌనంగా వెళ్లిపోయింది. భారత కార్మిక వర్గమేగాక యావత్ శ్రామిక ప్రజారాసులు చాలా సవాళ్ల నెదుర్కుంటున్న ఈ సందర్భంగా, మేడే ఓ శ్రామిక దినోత్సవంలా గాక, శ్రామికులారా! ఈ కోవిడ్ ఉపద్రవ శరాఘాతంనుండి తేరుకోండి! మళ్లొస్తా అని ఒకింత మలాము రాసి, బాంపూసి వెళ్లిపోయింది.

ప్రజావ్యతిరేక పెట్టుబడి పలు రూపాల్లో ప్రజల సకల మూలాలను, సర్వ శక్తియుక్తులను భక్షించివేస్తున్న సమయంలో ఈ మేడే వచ్చి, ముక్కు సూటిగా కొన్ని ప్రశ్నలు మనపై సంధించి, మీ జవాబులు వినడానికి త్వరలో వస్తానని వీపుతట్టి మరీ వెళ్లింది.

మీరంతా ఏమి చేయదల్చుకున్నారు? మేడే స్ఫూర్తిని పూర్తిగా పెట్టుబడి పాదాక్రాంతం చేయదల్చుకున్నా రా? గత తరాల ప్రపంచ శ్రామిక జనావళి త్యాగాలతో, చిందించిన రక్తంతో, ఎరుపెక్కిన కేతనాన్ని సమున్నతంగా ఎత్తిపట్టి సింహగర్జనతో జూలు విదిల్చి పోరాడదల్చుకున్నారా? లేక 'మ్యాంమ్యాం మేడే' శుష్క నినాదాలతో పెట్టుబడి పెంపుడు పిల్లులుగా మిగిలిపోదల్చుకున్నారా? తేల్చుకొమ్మని

ఈ సారి మేడే తీవ్రంగా ప్రశ్నించి, మరీ వెళ్లింది. కేవలం భారతదేశ శ్రామికులనే కాదు, సకల ప్రపంచ శ్రామికావళిని నిలదీయడానికే ఈ మేడే యుద్ధ క్షేత్రపు బరిగీసి, పెట్టుబడిపై జరపాల్సిన యుద్ధాన్ని మరవద్దని, అది అసంపూర్ణంగా మిగిలే ఉందని, గుర్తుచేసి,హెచ్చరించి మరీ వెళ్లింది.

150 ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఓ ఆదర్శంగానే మిగిలి ఉన్న ప్యారిస్ కమ్యూన్:

ఈ 2021 'మేడే', మహత్తర 'పారిస్ కమ్యూన్'కు 150 ఏళ్లు నిండిన సందర్భంలో రావడం ఓ ప్రత్యేకత. 1871 మార్చ్ నెల 18వ తేదీ నుండి మే నెల 28వ తేదీ వరకు కొనసాగిన మహత్తర ప్యారిస్ కమ్యూన్; 'మేడే'గా చరిత్రకెక్కిన 8 గంటల పనిసాధనా పోరాటం; రష్యా, చైనా విప్లవాలకు, ఇంకా అనేకానేక జాతీయ విముక్తి పోరాటాలకు అపార ప్రేరణ నందించాయి. ఈ రెండు మహోజ్వల చారిత్రిక సంఘటనలు జరిగిన నాటి నుండి, ఈ నాటి వరకు శ్రామికోద్యమాలకు ఇవి ఓ కొత్త చూపును అందిస్తూనే ఉన్నాయి.

శ్రామిక రాజ్యాధికార సాధనా ఆవశ్యకత, దానికి కావలసిన క్షేత్రస్థాయి ఆచరణ, ఉనికిలో ఉన్న దోపిడీ బూర్జువా రాజ్యాన్ని సమూలంగా నిర్మూలించి, దాని స్థానంలో నూతన శ్రామిక కమ్యూన్(రాజ్య) స్థాపన, శ్రామిక కమ్యూన్ పాలనా పద్ధతిని అమలు చేయడం అనే భావనలకు మూలకం, ప్రేరణ... మేడే, ప్యారిస్ కమ్యూన్లు, అవి అందించిన కొత్త చూపు.

మేడే చరిత్రను, ప్యారిస్ కమ్యూన్ చరిత్రను కూలంకషంగా చదివి ఇప్పటి యువతరానికి పలు రూపాల్లో, పలు భాషల్లో, పలు మాధ్యమాల ద్వారా అందించడం ఎంతైనా అవసరం. దోపిడీ పీడనాభరిత పెట్టుబడిపై సుదీర్ఘ పోరాటాలకై కార్మికులకు కర్తవ్యబోధ చేయడం, కార్మికోద్యమ నూతన శక్తులకు నిరంతర దినచర్యగా మారాల్సి ఉంది. వారితో మమేకమై వారిని కార్యోన్ముఖుల్ని చేయడం, కార్మికోద్యమ నవ నిర్మాణాలను చేపట్టడం, కార్మిక అగ్రగామి శక్తులకు, శ్రామికవర్గ పక్షపాత మేధావులకు, ఇప్పటి తక్షణ కర్తవ్యం.

శ్రమ దోపిడీపై ఎదిగిన గుత్త పెట్టుబడి కొసవిసుర్లకు లోబడి ఈ శక్తులు అసలు కర్తవ్యాన్ని మరవడం, దానికి దూరమవడం శామిక వర్గానికి ఎంత నష్టదాయకమో ఇప్పుడు సర్వత్రా, ప్రపంచమంతా కనిపిస్తున్న దృశ్యం. శ్రామిక రాసులకు అవగాహన కల్పించడంలో కార్మిక అగ్రగాములు నిరంతర కృషి కొనసాగించలేకపోవడం ఈ నాటి కార్మికోద్యమ వెనకపట్టుకు ఒక కారణం. శ్రామిక అగ్రగామి శక్తులకు, ఎప్పటికన్నా ఇప్పుడు ఇటువంటి కృషి జరపాల్సిన, చేపట్టాల్సిన అవసరం పదిరెట్లు పెరిగింది.

గుత్తపెట్టుబడితో రాజీ మార్గాన్ని ఎన్నుకున్న శ్రామిక నాయకత్వాలు, క్రమేణా శ్రామిక ప్రజారాసుల్లో తమకున్న స్థానాన్ని, ప్రాబల్యాన్ని కోల్పోతున్నస్థితి మన దేశంలో, ఇతర ప్రపంచ దేశాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఫాసిజం వేళ్లూనుకునేందుకు ఇది దోహదపడుతోంది. ఈ విషపరిణామాల నుండి బయటపడాలంటే శ్రామిక వ్యతిరేక పెట్టుబడిని కూలదొయ్యాలనే ఏకైక కేంద్ర బిందువుతో మొత్తం శ్రామిక శక్తులను కూడగట్టి, పోరాట పథంలో నడిపించడం మినహా మరో మార్గం లేదు. ఇందుకై కార్మికోద్యమ నవనిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించ వలసిన అగత్యమెంతైనా ఉంది. 'మేడే' అయినా, 'ప్యారిస్ కమ్యూన్' అయినా, కేవలం గత చరిత్ర ఘటనలుగా ఆరాధనతో గుర్తుపెట్టుకుని సరిపెట్టుకోవడంకాక పెట్టుబడి బంధనాల నుండి, సామ్రాజ్యవాద అరాచక భీభత్సం నుండి, అనేకానేక వైరస్ మహమ్మారులకు కారణ భూతమైన పర్యావరణ హననం నుండి, సమస్త మానవాళికి దోపిడీ పెట్టుబడి నుండి, విముక్తి చేకూరాలంటే శ్రామికవర్గ చైతన్యం, శ్రామికవర్గ పెట్టుబడి విముక్త పోరాటం మొదటి మెట్టు.

(రచయిత రైతు నేస్తం సంపాదకులు)

వీ

రచయితలకు సూచన :

తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.

వచ్చే సంచికలలో...

- **కరోనా కల్లోలమా - కనక వర్షమా - చుంచు శ్రీశైలం**
- **కొన్ని కోనాల్లో గాంధీ... లెనిన్! - దివి కుమార్**
- **విప్లవ హింస - ఒక విశ్లేషణ - యానిస్ ఇక్బాల్**

తత్వశాస్త్ర ప్రాథమిక ప్రశ్నలు

***మతం ప్రాతిపదికగా ఉండే ప్రాపంచిక దృక్పథానికి, తత్వశాస్త్ర ప్రాపంచిక దృక్పథానికి చాలా వ్యత్యాసం ఉంటుందంటున్నారు* యు.ఎ. ఖారిన్**

(...గత సంచిక తరువాయి భాగం)

ఈ ప్రపంచం ఎట్లా ప్రారంభమయింది, దీని మూలమేమిటి, సారమేమిటి, మనుష్య జాతి ఆరంభం ఎట్లా జరిగింది, మనిషి జీవితం మూలం ఏమిటీ, మానవుని చైతన్యం, జీవిత సారం ఏమిటీ, మానవుని జీవితానికి అర్థం ఏమిటీ అన్నవి ఏ తత్వశాస్త్రానికయినా సాధారణంగా ఎదురయ్యే ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నం చేశారు తత్వవేత్తలు. తత్వ శాస్త్రాన్ని ఇంగ్లిష్‌లో 'ఫిలాసఫీ' అని అంటారని మనందరికీ తెలుసు. ఫిలాసఫీ అన్న పదాన్ని మొట్టమొదటి సారి గ్రీకు తత్వవేత్త పైథాగరస్ వాడాడు. ఆ పదానికి అర్థం 'వివేచనా శక్తిపట్ల ప్రేమ" అని చెపుతారు. తత్వశాస్త్ర సిద్ధాంతాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు భారతీయ భాషలలో 'దర్శనం' అన్న పదం తరుచు గా వాడబడుతూ ఉంటుంది. ఈ 'దర్శనం' అన్న పదం 'దృష్టి' అన్న పదం నుండి వచ్చింది. 'దృష్టి' అంటే చూపు. కాబట్టి, ప్రపంచాన్ని చూసే దృష్టి కోణం, ప్రపంచం అంటే ఏమిటో, అందులో మానవ ఉనికి అర్థం వెతకడం – వీటిని తత్వశాస్త్రం అనవచ్చు.

తత్వశాస్త్రం వేసే ప్రశ్నలకు వివరణ అంతా బాహ్య ప్రపంచం తో మనిషికి ఉన్న సంభందం, వస్తుగత వాస్తవాలతో కూడిన మానవుని చైతన్యాన్ని వివరించడం లోనే ఉంటుంది. ఈ విషయమే తత్వ శాస్త్రానికి ప్రాథమికమయినది. వేల సంవత్సరాల క్రితం ప్రజలకు వారి శరీర నిర్మాణం గురించి ఏమీ తెలియదు, ముఖ్యంగా వారికి వచ్చే కలల గురించి ఏ వివరణా వారికి తోచేది కాదు. అయినప్పటికీ, మనిషి శరీరంలో ఒక నిర్దుష్టమయిన ఆత్మ ఉంటుందని, మనిషి మరణంతో అది ఆ శరీరాన్ని విడిచి వెళ్లిపోతుందని ఒక భావన వారిలో ఉద్భవించింది. మనిషి ఆలోచన, ఇంద్రియ జ్ఞానము శరీర భాగాలు చేసే కార్యకలాపాల వల్ల కాక ఆత్మ జరిపే చర్యల వల్లనే రూపుదిద్దు కుంటాయని కూడా ఒక భావన వారిలో మొలకెత్తింది. ఈ ఆత్మకు బాహ్య ప్రపంచంతో ఉన్న సంబంధం గురించి కూడా ఆ కాలంలో ప్రజలు తప్పనిసరిగా ఆలోచించి ఉంటారు. సంక్షిప్తంగా ఫిలాసఫి అంటే పదార్థానికి చైతన్యానికి మధ్య ఉన్న సంబంధం గురించి స్పషంగా నిర్వచించబడిన భావం ఆధారం చేసుకొని సిద్ధాంత పరంగా క్రమబద్ధీకరించబడిన ప్రాపంచిక దృక్పథం. ప్రథమ ప్రాధాన్యత కలిగినది ఏది, ఆలోచనా లేక అస్తిత్వమా? తత్వశాస్త్రానికి సంభందించి ప్రాథమికమైన ప్రశ్నకు ఇది సాధారణ సూత్రీకరణ. దీనికి కొంత సంకుచితంగా, అదే సమయంలో కొంత ఎక్కువగా ఈ విధంగా సూత్రీకరణ చేయవచ్చు: ఈ ప్రపంచాన్ని భగవంతుడు సృష్టించాడా, లేక ఈ ప్రపంచం ఎప్పట్నుంచో ఉనికిలో ఉందా? అదే సమయం లో, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించిన మన భావాలకు, ఆ ప్రపంచానికి (అంటే దేవుడు సృష్టించాడు అని అనుకుంటున్న ప్రపంచానికి) సంబంధం ఏమయినా ఉందా, లేదా మరొక విధంగా చెప్పాలంటే 'అసలు ఈ ప్రపంచం మనకు అర్థమవుతుందా? ఇది ఉనికికి ఆలోచనకు మధ్య ఉన్న సంబంధానికి మరొక కోణం.

ఫిలాసఫికి సంబంధించి ప్రాథమిక ప్రశ్న:

ఆలోచనకు, ఉనికికి మధ్య సంబంధం – చైతన్యానికి ప్రకృతికి మధ్య సంబంధం.

	మొదటి అంశం	రెండవ అంశం
దేనికి ప్రథమ ప్రాధాన్యత:	పదార్థమా లేక చైతన్యమా?	ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమా?

మనిషి దృక్పథానికి ఉన్న ప్రత్యేకతలు, తన ఉద్దేశ్యంలో తన ఉనికికి అర్థం, సామాజిక ప్రక్రియతో తన సంబంధం, తాను చేసే పనుల లక్ష్యం–తత్వశాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక ప్రశ్నకు సమాధానాలుగా ఇవన్నీ ముందే నిర్ణయింపబడతాయి. తత్వశాస్త్రం ఏ విధంగా ఉపయోగపడుతుందో తన అభిప్రాయంగా పురాతన భారతీయ రాజకీయ పరిశీలనాత్మక సిద్ధాంత గ్రంథం 'అర్థశాస్త్ర' ఈ విధంగా చెపుతుంది: "తత్వశాస్త్రం కష్టసమయాల్లో చైతన్యాన్ని పటిష్టపరుస్తుంది, సంతోషాన్నికలగచేస్తుంది, అలాగే తార్కికంగా ఆలోచించడానికి, మాట్లాడడానికి, కార్యాచరణకు సిద్ధం కావడానికి తగు శక్తినిస్తుంది." దీనికి భిన్నంగా తత్వశాస్త్రం అసలు సమస్యకు మరో రకంగా సమాధానం చెప్పిన సిద్ధాంతాలు కూడా ఉన్నాయి. అవి జీవితంలో మనిషి స్థానాన్ని మరొక కోణంలో సూత్రీకరించాయి. ఆత్మ వలననే అన్ని విషయాలు స్ఫూర్తి పొందుతాయని భావించేవారు సహజంగానే ఈ ప్రపంచంలోని చెడును, బాధలను, అవస్థలను నిర్మూలించాలంటే నైతిక ప్రవర్తన సరిగా ఉండడమే ఏకైక మార్గం అని భావిస్తారు, అలాగే కర్మ సిద్ధాంతాన్ని నమ్మడమే శాశ్వతమయిన నైతిక నియమమం అని కూడా నమ్ముతారు. తన గురించి తాను అన్వేషించడం, తన గురించి తెలుసుకోవడమే మనిషి ఉనికికి అర్థం అనీ, మోక్షం పొందడం ప్రధానమని, ఆ విధమయిన తత్వశాస్త్రం కట్టడి చేస్తుంది. సామాజిక చర్యలను అంగీకరించదు.

దీనికి భిన్నంగా, అసమానతలకు, అణిచివేతకు సామాజిక కారణాలను ప్రజలు తెలుసుకొని కొత్త సామాజిక సంబంధాలు నెలకొల్పే దిశగా నిర్ణయాత్మక పోరాటం చేపట్టడం జరగాలంటే మానవుని ఉనికియే ప్రాథమికమని, మానవుని ఉనికిలో సంభవించే మార్పులను కనుగొనే అవకాశాలను గుర్తించడం ప్రధానంగా ఉన్న తత్వ విచారం మనుగడలో ఉంది. మనిషి తన ఉనికికి నిజమయిన అర్థం సామజిక అసంబద్ధతలకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం కొనసాగించడం, సమాజ ప్రగతికి అవసరమయిన ఆలోచనలను, ఆదర్శాలను అవగతం చేసుకొని వాటిని ఆచరించడం అనే అంశం కూడా దీనిలో అంతర్లీనంగా ఉంది.

అదృష్ట దీపక్ మృతి

అభ్యుదయ కవి, సినీ గేయ రచయిత, సాహితీ వేత్త అదృష్ట దీపక్ (70) మరణించారు. ఆయనకు కరోనా సోకడంతో ఎపిలోని కాకినాడలో చికిత్స పొందుతూ మే 16న మృతిచెందారు. ఆయన 1950 జనవరి 18న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జన్మించారు. 1979 నుండి 2008 వరకు ద్రాక్షారామ పివిఆర్ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పనిచేశారు. దీపక్‌కు చిన్నతనం నుంచే నాటకాలపై ఆసక్తి ఉండేది. 1967లో ఆంధ్రప్రభ వార పత్రికలో ఆయన తొలి గేయం ప్రచురితమయింది. దీపక్ రాసిన 'ప్రాణం' కవితా సంపుటి వెలువరించారు. దీన్ని చదివిన మాదాల రంగారావు 1990లో 'యువతరం కదిలింది' సినిమాలో ఆయనకు పాటల రచయితగా అవకాశం కల్పించారు. ఆ తర్వాత నేటి భారతం, విప్లవ శంఖం, నవోదయం, దేశంలో దొంగలు పడ్డారు, వందేమాతరం తదితర సినిమాలకు పాటలు రాశారు. మాట తప్పకు, అంతరం, ఆశయాలకు సంకెళ్లు, మంచుతెర మొదలైన నాటకాల్లో ఆయన నటించారు. ప్రజానాట్య మండలి నేతృత్వంలో మాభూమి నాటకంతో ప్రజలను చైతన్యపరిచారు.

చల్లా నరసింహారెడ్డి మృతి

సీనియర్ న్యాయవాది, పౌరహక్కుల పరిరక్షణ కోసం పరితపించిన చల్లా నరసింహారెడ్డి (93) ఇకలేరు. కరోనాతో బాధపడుతూ ఆయన కాచిగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మే 19న గుండెపోటుతో మరణించారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా రెడ్డిపాలెం. ఆయన అలహాబాద్ యూనివర్సిటీలో న్యాయ శాస్త్రం, ఎంఎ ఇంగ్లిష్ చదివారు. ఆయన విద్యార్థి దశలోనే సామ్యవాద సిద్ధాంతం పట్ల ఆకర్షితుడై స్వాతంత్ర్యోద్యమంలోను, అనంతరం జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలోను పరోక్షంగా పనిచేశారు. ఆయన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీల్లో పనిచేస్తూ సిద్దిపేట్ నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ తరఫున ఎంఎల్ఏగా పోటీ చేసి ఓడిపోయారు. ఎమర్జెన్సీ సమయంలో గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన కీలక సాక్ష్యాలను సేకరించి భార్గవ కమిషన్ ముందు ఉంచడంలో ముఖ్య పాత్ర పోషించారు. బెంగుళూరు, రాంనగర్ కుట్ర కేసులను వాదించారు. ప్రముఖ న్యాయవాది కె.జి.కన్నబిరాన్‌తో కలిసి పౌరహక్కుల పరిరక్షణ కోసం పనిచేశారు. పేదల తరఫున కొన్ని వందల కేసులు వాదించి న్యాయాన్ని పరిరక్షించారు.

సుందర్‌లాల్ బహుగుణ మృతి

ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, చిప్కో ఉద్యమానికి ఊపిరిపోసిన సుందర్‌లాల్ బహుగుణ(94) ఇకలేరు. కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో చేర్పించినా పరిస్థితి విషమించి మే 21న మరణించారు. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో 1927 జనవరి 9న జన్మించారు. 13 ఏళ్ల వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ అహింసా వాదాన్ని జీవితాంతం ఆచరించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడి, గంగోత్రి, యమునోత్రి ఆలయాల్లో దళితులకు ప్రవేశాన్ని కల్పించారు. తెహ్రీలో హాస్టల్ ఏర్పాటు చేసి అందులో అన్ని కులాల విద్యార్థులను ఉంచారు. తెహ్రీ సంస్థాన రాచరికానికి వ్యతిరేకంగా పోరాడారు. ఉత్తరాంచల్ పర్వత సానువుల్లో విస్తృతంగా పర్యటించి పల్లెల్లో నాటుసారా విషాదాలను చూసి ఆదివాసి గిరిజన మహిళలతో కలిసి ఏళ్లపాటు ఉద్యమించిన ఫలితంగా ప్రభుత్వం పలు పర్వత ప్రాంత జిల్లాల్లో మద్యాన్ని నిషేధించింది. 1974లో హిమాలయ ఘర్వాల్ ప్రాంతంలో చెట్ల నరికివేతను అడ్డుకొనేందుకు శాంతియుత నిరసన ఉద్యమం చిప్కోను ప్రారంభించారు. ఇలా వృక్షాలను రక్షించే ఉద్యమంగా ప్రారంభమై పర్యావరణ పరిరక్షణ ఉద్యమంగా రూపుదిద్దుకుని ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ ఉద్యమాలకు ప్రేరణగా నిలిచారు.

నర్సిములు మృతి

తెలంగాణ విద్యావంతుల వేదిక మక్తల్ కన్వీనర్, అమ్మ స్మారక గ్రంథాలయ చైర్మన్ ఎం. నర్సిములు (43) కన్నుమూశారు. కరోనా సోకడంతో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మే 20న మృతిచెందారు. రెండు దశాబ్దాలకు పైగా ఉద్యమ జీవితం గడిపిన ఆయన తెలంగాణ జనసభ మొదలుకొని, తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్‌లో నాయకత్వాన్ని చేపట్టి ఉద్యమాలు నిర్వహించాడు. పౌరహక్కుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి, అనేక రాజ్య నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. దళిత బహుజన ఉద్యమాలతో కలిసి పనిచేశాడు. పది మందికి జ్ఞానం పంచాలనే పట్టుదలతో 2009లో నర్సిములు తల్లి అనంతమ్మ మృతిచెందడంతో అమ్మ స్మారక గ్రంథాలయాన్ని స్వచ్ఛందంగా మక్తల్‌లోని అంబేద్కర్‌నగర్‌లో 2011లో నెలకొల్పారు. 2014లో సావిత్రిబాయి పూలే జయంతిన నాగనూర్ మండల కేంద్రంలో గ్రంథాలయ శాఖను ఏర్పాటు చేశారు. ఆయన మరణించే వరకు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు.

చిత్రకారుడు గోపి మృతి

ప్రముఖ చిత్రకారుడు కళారంగానికి గోపిగా సుపరిచితుడైన లగుసాని గోపాల్ గౌడ్(69) ఇకలేరు. గత కొద్ది రోజులుగా కరోనాతో బాధపడుతున్న ఆయన గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మే 21న మృతిచెందారు. 1952, జూన్ 6న మహబూబ్‌నగర్ జిల్లా యనమెట్లలో జన్మించారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల నుంచి 1975లో బిఎఫ్ఏ పట్టా పొందారు. ప్రఖ్యాత సినీ దర్శకుడు బాపు అభిమానించే చిత్రకారుడిగా పేరొందారు. గోపి నాలుగు దశాబ్దాల పాటు పలు మ్యాగజైన్లు, ప్రముఖ పత్రికలకు బొమ్మలు వేశారు. పలు తెలుగు పత్రికలకు లోగోలు రూపొందించారు. ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావు దర్శకత్వంలోని 'మా భూమి', 'రంగులకల', 'దొంగల దోపిడీ' తదితర సినిమాలకు పబ్లిసిటీ డిజైనర్‌గా పనిచేశారు. తెలుగు సాహిత్యంలో కొన్ని వందల పుస్తకాలకు బొమ్మలు గీసారు.

ఈ రకంగా తత్వశాస్త్రం యొక్క ప్రాథమిక సమస్యను సమగ్రంగా విశ్లేషించినప్పుడు తత్వశాస్త్రంలోని కొన్ని ధోరణులు సమాజంలోని వర్గ సంఘర్షణపట్ల ఏ విధంగా పక్షపాత వైఖరి అవలంబిస్తున్నాయో తేటతెల్లం అవుతుంది.

('గతితార్కిక మౌలిక సూత్రాలు' పుస్తకం నుండి)

(అనువాదం : రాజేంద్రబాబు అర్విణి)

వీ

నేపాల్: రాజకీయ సంక్షోభంలో ఓలి ప్రభుత్వం

నేపాల్ లోని ప్రస్తుత రాజకీయ పరిణామాలను, వాటి వెనుకనున్న భారత్, అమెరికా అవకాశవాద ఒత్తిళ్ళను సమీక్షిస్తున్నారు **ఎస్. కృష్ణమూర్తి**

'నేపాల్‌లో భారత విస్తరణవాదం – ఇటీవలి పరిణామాలు' శీర్షికతో (వీక్షణం ఏప్రిల్) వ్యాసం ప్రచురణ తర్వాత కాలంలో అక్కడి రాజకీయ సంక్షోభం ఇంకా ముదిరింది. అనేక నాటకీయ మలుపులు తిరిగింది. మే 10 నాడు విశ్వాస ఓటింగులో ఓడిన కె.పి. శర్మ ఓలి మే 14 నాడే మళ్లీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. వివరాలివీ: ఓటింగు తేదీని మే 2 నాడే ప్రకటించిన ఓలీ ఈలోగా నెరపిన రాజీ చర్చలు విఫలమైనాయి. తమ మద్దతుని ఉపసంహరించుకుంటున్నామని ప్రచండ వర్గం మే 5నాడు ప్రకటించింది. ఓలీ రాజీనామా చేశారు. ఓలీ, ప్రచండల పూర్వరంగంతో పాటు నేపాల్ రాజకీయాల క్లుప్త సమీక్ష ఇది. దీనిలోనే అర్విణి రాజేంద్రబాబు గారు మే సంచికలో చేసిన విమర్శలోని కొన్ని అంశాల వివరణ కూడా ఇమిడి ఉంది.

నేపాల్ రాజకీయాల పూర్వరంగం

ఓలీ సీనియర్ కమ్యూనిస్టు నేత. 1973లో అరెస్టయి, 14 ఏళ్ల జైలు తర్వాత 1987లో విడుదలయ్యారు. కొత్త రాజ్యాంగం తర్వాత అత్యధిక సీట్లుగల ఓలీ 2015లో – మావోయిస్టు పార్టీ మద్దతుతో – మిశ్రమ ప్రభుత్వ ప్రధాని అయ్యారు. 2018 మేలో యుఎంఎల్, మావోయిస్టు పార్టీలు రాజీ చర్చలతో విలీనమై మళ్లీ నే.క.పా.గా ఏర్పడినాయి. ఓలీ ఆ పార్టీ కో- చైర్మన్ గాను, ప్రధాని గాను ఎన్నికయ్యారు. రెండో కో-చైర్మన్‌గా ఉన్న ప్రచండ రెండో సగంలో ప్రధానిగా ఉంటారని ఒప్పందం. కానీ ఓలీ దాన్ని పడనివ్వలేదు. ప్రస్తుత సంక్షోభానికి అదొక కారణం. బయటిశక్తుల జోక్యం రెండోది.

నేపాల్ మావోయిస్టు పార్టీ కూడా అనేక గ్రూపులుగా చీలిపోయింది. సాయుధ పోరాటాలు కొత్త వ్యవస్థ ఏర్పాటులో విఫలమైనాయని, రష్యా, చైనాలలో వలె ఏకపార్టీ పాలన ప్రయత్నం తప్పని, దాని స్థానంలో 21వ శతాబ్దిలో బహుళ పార్టీ ప్రజాస్వామ్యమూ, దానిపై ఆధారపడిన సోషలిజమూ సరైనవని ఆ పార్టీ చాలా ఏళ్ల క్రితమే సిద్ధాంతీకరించింది. ఆ దిశలోనే ప్రచండ 'మార్క్స్ ద్విశతాబ్ది' కార్యక్రమంలో మరోసారి ప్రకటించారు (పిటిఐ 2019 మార్చి6). ప్రచండ కూడా రెండుసార్లు (2008లో, 2016లో) నేపాల్ ప్రధాని అయ్యారు. మరో ముఖ్య మావోయిస్టు నాయకుడైన బాబూరామ్ భట్టారాయి (2011లో ప్రధాని) 2015లో పార్టీని వీడి, జనతా సమాజవాది పార్టీ (జెఎస్‌పి) అనే కొత్త పార్టీ నాయకుడైనారు. ఆ ఇద్దరూ అవకాశవాద నాయకులైనారని, ఇండియా చెప్పుచేతల్లో ఉన్నారని భావించే గ్రూపులు కొన్ని ఉన్నాయి. పై పూర్వ రంగంలో ప్రస్తుత ఘటనలను అర్థం చేసుకోవచ్చును.

ఈ కాలంలోనే భారత్‌తో సరిహద్దు వివాదం, మ్యాపుల తగాదా, ఓలి జాతీయవాద ప్రకటనలు ముందుకొచ్చాయి. అవి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోడానికి తోడ్పడినాయి గానీ, తాత్కాలికంగానే తగాదాలు ముదిరి, 2020 డిసెంబర్ 20నాడు పార్లమెంట్‌ని రద్దుచేస్తున్నట్టు, ఏప్రిల్-మే నెలల్లో మధ్యంతర ఎన్నికలని ఓలి ప్రకటించారు. దాన్ని ప్రచండవర్గం, ప్రతిపక్ష నేపాలీ కాంగ్రెస్ ఖండించి, రాజ్యాంగ విరుద్ధం అని కోర్టులో సవాలు చేశాయి. పార్లమెంట్ రద్దు చెల్లదని, 2020 మార్చ్ 7న సమావేశం జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సమావేశం జరగడానికి ముందురోజే మరో కేసు తీర్పులో భాగంగా (2018 మే నాటి) పార్టీ విలీనం రద్దయి, ముందటి యుఎంఎల్, మావోయిస్టు పార్టీ పునరుద్ధరించబడినాయి. ఈ విలీనంని మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న యుఎంఎల్‌లోని ఒక భాగం (మాధవకుమార్ – జాలానాథ ఖనాల్ వర్గం) వైఖరి కోర్టులో నెగ్గింది. ఐతే ఓలీ వ్యతిరేక వర్గాలకు అవకాశం చిక్కినట్టే కన్పించినా, అది అక్షరాలా మూన్నాళ్ల ముచ్చటే అయింది.

'ప్రజాస్వామ్య' తంతు

నేపాలీ కాంగ్రెస్ (మాజీ ప్రధాని షేర్ బహదూర్ ద్యూబా) నేతృత్వంలో కొత్త సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకై ప్రెసిడెంట్ ఆహ్వానించారు. నేపాలీ కాంగ్రెస్ (షేర్ బహదూర్ ద్యూబా – 61 సీట్లు) – మావోయిస్టు పార్టీ (49 సీట్లు), జెఎస్‌పి (32 సీట్లు), మొత్తం 142 మంది మద్దతునాశించారు ద్యూబా. మొత్తం సీట్లు 271. యుఎంఎల్‌లోని ఓలీ వ్యతిరేకమైన మాధవ్ నేపాల్ వర్గం(20 సీట్లు) ఓటింగుకి దూరం కావడంతో మెజారిటీకి 126 సీట్లు చాలు. మే 13 రాత్రి 9 గంటలకు ఓటింగు కాగా మే 10 అర్ధరాత్రి 32 సీట్లు గల జెఎస్‌పిలో చీలిక. కొత్త సంకీర్ణాన్ని తాము బలపరచబోమని అందులోని ఒక (మహంత ఠాకూర్ – రాజేంద్రమహతో – 17 సీట్లు) మే 11నాడు ప్రకటించింది. మిగిలిన 15 మంది గల ఉపేంద్రయాదవ్ వర్గం సంకీర్ణాన్ని బలపరుస్తాం అని చెప్పింది. కానీ యుఎంఎల్‌లోని మాధవ్ నేపాల్ వర్గం ఓటింగు రోజునే ఓలీతో రాజీపడి, రాజీనామా చేస్తామన్నవారు తటస్థంగా (అబ్ స్టెన్) ఉంటామని ప్రకటించారు. ఈ పరిణామాలన్నిటితో నిరాశచెంది, కొత్త సంకీర్ణాన్ని ఏర్పాటు చేయలేమని ద్యూబా ప్రెసిడెంటుకి 13 రాత్రి తెలిపారు. దానితో అత్యధిక సీట్లు గల ఓలీతో మళ్లీ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రెసిడెంట్ విద్యాదేవి ఓలీ వర్గానికి చెందిన వారే.

కరోనా: పాలకవర్గ రాజకీయాలు, కోర్టులు, వాక్సీన్ దౌత్యం

కరోనా 'కొత్త' కేసుల సంఖ్య నేపాల్లో మార్చి 7న 66 ఉంటే, మే 17 నాటికి 9,200 దాకా పెరిగి చెలరేగిన 10 వారాల్లోనే, వాటిని పట్టించుకోకుండా ఇవన్నీ జరుగుతుంటే, ప్రజలు తమకి కొంత కొత్త అయిన ఈ 'ప్రజాస్వామ్య' నాటకాన్ని కళ్లారా చూశారు. మనమూ ఎన్నికల జాతర చూశాం కదా. నెల రోజుల తర్వాత ఇంకా ఏమేమి జరుగనున్నదో అని చూస్తున్నారు.

2020లో కాలాపానీ – మ్యాపుల తగాదా తర్వాత, దౌత్యంలో

భాగంగా, వేడిని తగ్గించడానికి ఇరువైపుల నుంచీ కొన్ని ప్రయత్నాలు సాగినాయి. గత ఏడాది చివరలో ఇరుదేశాల ఆర్మీ, ప్రధాన అధికారులూ కలిసి 'మాట్లాడుకున్నారు.' ఇండియాకు కోపం తెప్పించిన రక్షణ మంత్రిని ఓలీ తప్పించారు. నేపాల్ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావలి ఈ జనవరి సంక్రాంతికి వచ్చి మూడు రోజులు ఢిల్లీలోనే ఉన్నారు. మారిన మ్యాపులను పాఠ్య పుస్తకాలలో చేరుస్తాం అన్న నిర్ణయాన్ని ఆపి, చర్చలు అని స్వరం తగ్గించారు. ఆ తర్వాతే కరోనా వ్యాక్సిన్ దౌత్యం మొదలైంది.

మన దేశంలో తీవ్ర కొరత ఉన్నా, మోదీ ప్రభుత్వం కోవిడ్ వ్యాక్సిన్ ఎగుమతులను భారీ (664 లక్షల డోసులు) సంఖ్యలో మే 17 నాటికి అనుమతించింది. కొన్ని వ్యాపారంలో భాగమైతే, మరికొన్ని దౌత్య ప్రయోజనాలతో విరాళాలుగా సాగాయి. ఉదాహరణకి మూడు కోట్ల జనాభా గల నేపాల్‌కి 24.5 లక్షల డోసులు (అందులో 11 విరాళాలుగా) పంపారు. (భారత విదేశాంగ శాఖ వివరాలు) జనవరిలోనే 10 లక్షల డోసులు ఇవ్వడంతో ఆ నెలలోనే వ్యాక్సినేషన్ మొదలైంది. మరికొన్ని మార్చిలో చేరాయి.

ఐతే ఆ పక్కనే ఉన్న ఉత్తరాఖండ్‌లో మే 17 నాటికి 6.8 లక్షల మందికి మాత్రమే వ్యాక్సినేషన్ పూర్తయింది. 20 లక్షల డోసులు దిగుమతి చేసుకోవాలని ఆ రాష్ట్రం నిర్ణయించుకున్నది (పిటిఐ మే 12). మనకే లేనప్పుడు ఎగుమతులేమిటి? అని నిరసన వ్యక్తమైంది. మొదటి డోసును స్వయంగా ఓలీ తీసుకొని, ప్రశంసించారు. వ్యాక్సిన్లతో ఓలీ తన పరపతినీ, ఇండియా పేరునీ కాపాడుకున్నారు. ఓలీ మళ్లీ రావడానికి ఇవన్నీ పునాదులే. ఈసారి ఇండియా పాత్ర అంతగా బైటపడకుండా చూశారు.

నేపాల్ ఆంతరిక రాజకీయాల్లో భారత్ పట్ల విస్తృత వ్యతిరేకత

నేపాల్ ఆంతరిక రాజకీయాల్లో జోక్యం చేసుకున్న భారత్ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని, దాన్ని తగ్గించటానికి ఓలీ సాయానికి వ్యాక్సిన్ దౌత్యం అని నేపాల్ ప్రముఖ వ్యాఖ్యాత యువరాజ్ ఘిమిరే అన్నారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మే 10-12). ఘిమిరేయే కాదు, అనేకులు చాలా సార్లు రాశారు. విస్తరణవాద ప్రయోజనాలకై, రాజరికంని వ్యతిరేకించే పేరిట, ఇండియా – చివరకు బిజెపి వాజపేయి పాలనలో కూడా – మావోయిస్టు సాయుధ పోరాటానికి సైతం ఎలా సాయం చేశారో వెలుగులోకి వచ్చింది (కనకమణి దీక్షిత్ మొదలగు). ఇండియాలో వేలాది ఎన్‌కౌంటర్లు చేస్తూనే, మరోవైపు మావోయిస్టు నేతలు ప్రచండ, భట్టారాయిలను 'రా' (ఇండియాకి సీఐఏ లాంటిది) రహస్యంగా ఇండియాలో ఎక్కడెక్కడ, ఎలా దాచిందీ, తిప్పిందీ వెల్లడయింది.

ప్రధాని మోడీ 2014 ఆగస్టులో 17 ఏళ్ల అనంతరం తర్వాత నేపాల్లో పర్యటించినప్పుడు, పాత పెత్తందారీ విధానాలు ఇకనైనా మారుతాయేమోనని దక్షిణాశియాలో ఆశలు రేకెత్తాయి. కానీ ఇండియన్ ముద్రగల (పశుపతినాథ గుడికి మోడీ వెళ్లి) హిందుత్వ, మాధేసియుల ద్వారా కుల, ప్రాంతీయ రాజకీయాలను ఎగుమతి చేసి బైటపడిపోయారు. రాజ్యాంగ రచనా కాలంలో సెక్యులరిజం వద్దని, హిందూ రాజ్యంగా ఉండాలని, భారత సరిహద్దుల్లోని మాధేశీ సంతతికి ప్రత్యేక అధికారాలుండాలని, ఇంకా ఇతరత్రా బాహాటంగానే ఒత్తిడి చేశారు. రాచరికం కాలంలోనే లేని హిందూమైత్రి ఈ దశలో ఏమిటి అని కమ్యూనిస్టులే కాక ఇతరులూ వ్యతిరేకించారు. అంతిమంగా 2015 సెప్టెంబరు19న నేపాల్ రాజ్యాంగం ఆమోదించబడింది. అది తమకు సమ్మతం కాదని ఇండియా బాహాటంగా ఖండించి, 7 అంశాలను తిరగదోడాలని అధికారికంగా ఒత్తిడి చేసింది. అలా కుదరదని, అది తమ సార్వభౌమ హక్కు సమస్య అనీ నిరసన తెలిపారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2015 సెప్టెంబరు 23-24). సరిహద్దుల్లో ఇండియా మాధేశిలతో నిరసనలు ఆర్గనైజ్ చేసింది. అయినా నేపాల్ లొంగనందున 70 రోజుల పాటు అష్టదిగ్బంధనం – గ్యాసు మందులూ కూడా లేకుండా చేసారు. వీటితో భారత్ పట్ల వ్యతిరేకత పతాక స్థాయికి చేరింది. 2018 మేలో రెండోసారి మోడీ వెళ్లేనాటికీ చల్లారలేదు. కాగా, దిగ్బంధనం ఘోరనేరం అని తీవ్ర నిరసనలు ఎదురైనాయి. ఈ పర్యటనవల్ల ఇరుదేశాల సంబంధాలకు మేలుకన్నా కీడే ఎక్కువ జరిగింది అని ఒక భారతీయ వ్యాఖ్యాత రాశారు (2015 మేలో).

నేపాల్ రాజు బీరేంద్ర, రాణి ఐశ్వర్యలతో పాటు 9 మంది తమ కోటలోనే హత్యకు గురైనారు. 2001 జూన్‌లో జరిగిన ఆ హత్య వెనుక, అంతకుముందు 1993లో కమ్యూనిస్టు వ్యవస్థాపక సభ్యుడు మదన్ భండారీ హత్య వెనుక కూడా ఇండియా హస్తం ఉందని ప్రచండ (తమ పత్రిక జన దిశలో 2010 జనవరి 10), ఇతరులు అనేకులూ ఆరోపించారు. ఇండియా ఒత్తిడిని కాదని, చైనా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయబోయినందుకే బీరేంద్ర హతులైనారని ఆరోపించారు.

అమెరికా – భారత్‌ల జోక్యంతో తాను పదవి కోల్పోయానని ఓలీ గతంలోనూ ప్రకటించారు. 2016 జూలైలో ప్రచండ వర్గం మూలంగా వైదొలిగినప్పుడూ ఇండియా 'రిమోట్ కంట్రోల్' ఉందని ఓలీ ఆరోపించారు. (జూలై 18, 2016 స్క్రోల్.కామ్) ఆ ఇద్దరినీ ఇండియా ఆయా సందర్భాల్లో వాడుకున్నదనడానికి ఆధారాలున్నాయి. ఒక దశలో ప్రచండను ఆర్మీ పదవి నుంచి తొలగించడంలోనూ ఇండియా పాత్ర ఉంది. ఇద్దరూ గతంలో తమ సాయం పొందినప్పటికీ, తర్వాత కమ్యూనిస్టులుగా చైనా వైపు మొగ్గుతున్నారని ఇండియా ఆరోపణ! 'ప్రజాస్వామిక అమెరికా తమ సహజ మిత్రుడ'ని చెప్పుకొనే ఇండియా కమ్యూనిస్టు పార్టీల మైత్రిని చైనా జోక్యంగా అభివర్ణించడం విడ్డూరం. ఎప్పుడైనా ధిక్కారంను సైతునా అన్నది భారత వైఖరి. ఇది సరికాదనీ, 'ఇండియా ఇకనైనా అభివృద్ధి రాజకీయాలపై దృష్టిపెట్టి, ఆంతరిక రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా, నేపాల్ సార్వభౌమత్వాన్ని గౌరవించడంలో చైనాని అనుసరిస్తే పోయిన పేరుని కొంత తిరిగి సంపాదించుకోగలుగుతుంద'ని ఇతరులతో పాటు ఘిమిరే, ఇప్పుడేకాక ఇంతకు ముందూ రాశారు (2019 జూలై 3).

నేపాల్‌పై అమెరికా ఒత్తిడి – ఇండియాతో కుమ్మక్కు

కాగా మోడీ ప్రభుత్వం అమెరికాతో చేతులు కలిపి, చైనాకి వ్యతిరేకంగా కుట్రలు చేసిందని నేపాల్లో బట్టబయలైంది. లోగడ దలైలామా అనుచరులను ఇండియా నేపాల్లో వాడుకొన్నదని, ఇటీవలి కాలాపానీ-రోడ్డు నిర్మాణమూ చైనా వ్యతిరేక వ్యూహంలో భాగమేననీ వ్యూహ నిపుణులు వివరించారు. నేపాల్ రాజకీయ వైరుధ్యాలలో తర్వాతి దశలో ఇదొక ముఖ్యాంశమైంది. నేపాల్ ఇండో – పసిఫిక్ వ్యూహంలో భాగంగా ఉండాలని అమెరికా ఒత్తిడి చేస్తూ వచ్చింది. ఫలితంగా నేపాల్ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావలి అమెరికా పర్యటన సందర్భంగా నేపాల్ అందులో కీలక పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. 2002 బుష్ ప్రకటనతో మొదలైన ఎంసిసి ప్రక్రియ 2016లో నేపాల్ సంతకంతో రూపుదాల్చిందని గ్యావలి ప్రకటించారు. 50 కోట్ల డాలర్లతో (నేపాల్ కరెన్సీలో 6,000 కోట్లు) మిలీనియం చాలెంజ్ కార్పొరేషన్ – నేపాల్ కంపాక్ట్ – ఎంసిసి – ఎన్‌సిలో చేరినట్టు గానూ, నేపాల్ పార్లమెంట్‌లో దానికి ఆమోద ముద్ర వేస్తారని, నేపాల్ సీనియర్ నాయకులు కొందరికి విభేదమున్నా అది ఆగదని నేపాల్ అధికారులు బాహాటంగా

ప్రకటించారు. (ఖాట్మండ్ పోస్ట్ 2018 డిసెంబర్ 20). 50 కోట్ల డాలర్లు నేపాల్ వంటి చిన్న దేశానికి ఎంతో అవసరమని ఓలీ వాదన.

ఆ రోజుల్లోనూ, ఆ తర్వాతా జరిగిన పార్టీ కమిటీ సమావేశాల్లో అది తీవ్ర చర్చనీయాంశం అయింది. ఆ వ్యూహాన్ని అంగీకరించబోం అని నేకపా నాయకులు నొక్కిచెప్పారు. 2017లో ఇండో - పసిఫిక్ వ్యూహంతో నేపాల్‌ని అమెరికా బాహాటంగా ముడిపెట్టటంతో పార్టీ కమిటీలోని మెజారిటీ ఈ ముడిని 'అమెరికా సామ్రాజ్యవాద చైనా వ్యతిరేక వ్యూహంలోకి', నేపాల్‌ని దించడమేనని, అందులో మిలిటరీ అంశమూ ఉందని చెప్పి, బలంగా వ్యతిరేకించింది (నేపాలీ జర్నలిస్టు బిస్వాస్ బరాల్, వైర్ 2020 జూలై 13). ప్రభుత్వంలో, పార్టీ కమిటీలో, (రెంటిపైనా ఒప్పందాలకు వ్యతిరేకంగా ఓలీ పెత్తనం చేస్తున్నారని ఆరోపణా ఉంది) ఇది అనేకసార్లు తీవ్ర చర్చకు, ఓటింగుకు, చీలికలకు దారితీసింది (ఖాట్మండ్ పోస్ట్ 2019 సెప్టెంబర్ 11, డిసెంబర్ 22 మొదలగు). ఓలి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోడానికి 2020 చివరిదాకా అనేక రాజీలతో నెట్టుకొచ్చారు.

నేపాల్ చైనా బీఆర్ఐలో చేరడానికి 2017 లోనే సంతకం చేసినా, 2018లో ఓలీ ప్రధాని అయ్యాక ఆచరణ మందగించింది. 2019 అక్టోబర్‌లో చైనా నేత జీపింగ్ నేపాల్ సందర్శించారు. 20 సహాయ-సహకార ఒప్పందాలపై సంతకాలు చేశారు. 6,000 కోట్ల సాయాన్ని, నేపాల్ దిగ్బంధనాన్ని ఛేదించే రవాణా - కమ్యూనికేషన్ స్కీములనూ బిఆర్ఐలో భాగంగా ప్రకటించారు. ఐనా ఆగకుండా అమెరికా - భారత్‌ల ఒత్తిడికి ఓలి లొంగుతున్నారని పార్టీ కమిటీలో మెజారిటీ ఆరోపించారు. ముఠా తగాదాలతో పాటు పార్టీ చీలికకు వీరిద్దరి పాత్ర అనేక సార్లు దారితీసింది. సోదర చైనా పార్టీ ప్రయత్నించి, చీలికను ఆపిందని భారత మీడియా ఆక్షేపణ! దాంతో నాపేరిట నే.క. పార్టీ రిజిష్టరైందని, 2018 విలీనం నాకు ఇష్టం లేదని ఒక వ్యక్తి (రిషికట్టెల్) వేసిన ఒక పాత కేసుని తవ్వితీసి, సుప్రీంకోర్టు పార్టీ విలీనం చెల్లదని ఈ ఏడు మార్చిలో ఒక ఉత్తర్వునిచ్చింది! దానితో చట్టపరంగా రెండు పార్టీలుగా (యుఎంఎల్, మావోయిస్టు) చీలింది.

అమెరికా వ్యూహాన్ని వమ్ముచేసే 'చైనా ఒక్కటే (వన్ చైనా)' అన్న పాలసీని నేపాల్ పునరుద్ఘాటించింది. కమ్యూనిస్టులే కాదు, ద్యూబాతో సహా తమకు నేపాల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా అభ్యంతరం లేదని, అది పూర్తిగా నేపాల్ ఆంతరిక వ్యవహారమని చైనా ప్రకటించింది. చైనా జోక్యం నిరాధారం. నేపాల్లో నిరసనలు అనేక సార్లు ఇండియా విషయంలోనే జరిగాయి. వీటితో అమెరికా ఎత్తుగడలు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి. కానీ తెరవెనుక ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి.

ప్రజా చైనాకి 14 దేశాలతో సరిహద్దులున్నాయి. ఇండియాతో తప్ప అందరితోనూ, నేపాలుతోనూ సరిహద్దు వివాదాలను వారు పరిష్కరించుకున్నారు. ఇండియాకి 6 దేశాలతో సరిహద్దులున్నాయి. భూటాన్‌తో తప్ప మిగతా అందరితో సరిహద్దు వివాదాలు అలాగే ఉన్నాయి. ఈ మాటలు అన్నది సుబ్రహ్మణ్యం స్వామి. బిజెపి నాయకుడు, చైనా నిపుణుడు. ఈ మధ్య ఒక భారత సైన్య ప్రముఖుడూ ఇదే చెప్పారు. ఎల్ఏసి పెర్సెప్షన్‌లో తేడా తప్ప దురాక్రమణ కాదని ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించారు. అమెరికా అనుకూల శక్తులు, మీడియా ప్రభుత్వాన్ని మించి చైనా వ్యతిరేక దుమారాన్ని లేపుతున్నారు. ఆ మేరకు ఇండియా అధికారిక ప్రకటనలూ ఉన్నాయి. కాకపోతే మనదేశంలోనూ, అమెరికాలోనూ మీడియాలోనూ కొద్దిమంది 'అతివాదులు' తమ పిడివాద సిద్ధాంతాలతో చైనాని నిందిస్తుంటారు. ఆక్రమంలో అమెరికా సామ్రాజ్యవాదాన్ని మర్చిపోతున్నారు కూడా. మూడవ ప్రపంచ దేశాల్లో చైనాపట్ల నెగెటివ్ భావన లేదు. బిఆర్ఐతోనూ, ఇప్పుడు కరోనా సమయంలోనూ చైనా సహకారాన్ని వారు ప్రశంసిస్తున్నారు.

కరోనా సందర్భంగా అమెరికా నీచ సామ్రాజ్యవాద ప్రవర్తనను మరోసారి ప్రపంచమంతా, ఇండియా కూడా చూసింది. ఎంత తగాదా ఉన్నా చైనా ఈ ఏప్రిల్‌లోనే పలు దఫాలుగా ఇండియాకు భారీ సాయం అందించింది. చైనాలో కార్మికులు, ఇతరులు తమ 'మేడే వారం' సెలవులు వదులుకొని ఈ పని చేశారు. మన మీడియాలో ఇది మరుగుపరచబడినా, భారత విదేశాంగ మంత్రి ధన్యవాదాలు తెలిపారు. కాగా ఈ స్థితిలో తమ అపకీర్తి నుంచి బైటపడడానికి బైడెన్ కొన్ని అరకొర చర్యలు తీసుకోవాల్సి వచ్చింది.

నేపాల్‌లో భారత - చైనాల పాత్రను ఒకే గాటన కట్టి చూపెట్టడం తప్పు. ఆ పని చేసిన అర్విణి గారు ('సంపాదకీయ కలెక్టివ్') తమ విమర్శలో విస్తరణవాదం సాధ్యం కాదన్నట్టుగా తమిళనాడుని ప్రస్తావించారు. అక్కడ బిజెపి ఐరన్ లెగ్ వల్ల ఏడిఎంకెకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. వాస్తవంలో ఎన్‌డిఎ వారికి 33.5 శాతం ఓట్లు, 75 సీట్లు వచ్చాయి. తమిళనాడు వంటిదే అయిన పుదుచ్చేరిలో అధికారం బోనస్! ఇది కూడా నేపాలు - చైనాల విషయంలో లాగే వాస్తవాల ఆధారంగా కాక తమ 'సిద్ధాంత' కళ్ల జోడుతో చూడడం వల్లనే రాశారు. వాస్తవాల ఆధారంగా సిద్ధాంతాలుండాలి, మారాలి. అంతేకానీ సిద్ధాంతాలని బట్టి వాస్తవాలు మారవు. అమెరికాని 'పల్లెత్తుమాట' అనకుండా ఫిబ్రవరి సంపాదకీయంలో చైనాని నిందించడం తప్పని చెప్పి, విమర్శచేస్తే దాన్ని తిరస్కరించి, మళ్లీ అదేపని చేశారు అర్విణి మే లో సంపాదకులు, పాఠకులు దీనిని గమనించాలని మనవి. చర్చకు వీలు కల్పించిన సంపాదకులకు మరోసారి ధన్యవాదాలు.

తాజాకలం: పార్లమెంటు రద్దు - మధ్యంతర ఎన్నికలు అంటూ నేపాలు ప్రెసిడెంటు ఉత్తర్వులు జారీ చేసారని మే 22 ఉదయాన్నే పిటిఐ రిపోర్ట్ చేసింది. "అర్ధరాత్రి నాటకం" అంటూ ఖాట్మండూ పోస్టు కొన్ని వివరాలు ప్రచురించింది: విశ్వాసతీర్మానం ఓటింగులో గెలిచే స్థితి లేదని, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకి మార్గం సుగమం చేస్తానని ఓలీ ప్రకటించారు. దానిని "లైవ్" గా చూపించారుకూడా. దరిమిలా మే 21 సాయంత్రం 5లోగా ఎవరైనా తమ క్లెయిముని సమర్పించవచ్చునని ప్రెసిడెంటు ఆహ్వానించారు. అనుకోని అవకాశం రావటంతో తమకు 149 మంది మద్దతుందని చెప్పి, జాబితాతో ప్రెసిడెంటు భవనానికి సా. 4కల్లా చేరారు. తమకు 153 మంది మద్దతుందని "రెండు నిముషాల" ముందే ఓలీ క్లెయిము చేసారని అక్కడ ఆఫీసులో చెప్పారు. 271 మందిగల హౌస్‌లో 302 మంది ఉన్నట్లున్న ఈ లెక్కలతో గందర గోళం. మే 21 అర్ధరాత్రి మంత్రివర్గం సమావేశంలో "పార్లమెంటు రద్దు - నవంబరు 12-19ల్లో మధ్యంతర ఎన్నికలు" అని సూచించారని, దానిమేరకు జారీచేసామని మే 21 అర్ధరాత్రి దాటాక, మే 22 తెల్లవారు జాము 2 గంటలకు ఉత్తరువులని ప్రకటించారు. దానినే పిటిఐ రిపోర్ట్ చేసింది. ఈ "అర్ధరాత్రి నాటకం"లో ప్రెసిడెంటు విద్యాదేవి తమపార్టీకే చెందిన ప్రధాని ఓలీతో కుమ్మక్కు అయ్యారని, రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించారని, ప్రతిపక్షాలు (ఓలీ పార్టీలోని మాధవ్ నేపాలు వర్గంతో పాటు) 22 ఉదయం ప్రకటించాయి. ఓలీకి వ్యతిరేకంగా ఓటింగు, ప్రెసిడెంటు అభిశంసన తీర్మానాలు ప్రతిపాదిస్తున్నామని ప్రకటించారు. ఈ "అర్ధరాత్రి నాటకం" సూత్రధారి ఎవరో, ఎందువల్ల ఎవరికోసం ఇన్ని మలుపులు తిప్పారో ప్రస్తుతానికి బయటపడలేదు.

(రచయిత రాజకీయ శాస్త్ర విద్యార్థి) వీ

అఫ్ఘన్ నుంచి అమెరికా సైన్యం నిష్క్రమణ

అమెరికా సైనికులు అఫ్ఘనిస్థాన్ సాయుధ సంస్థల దాడుల్లో పెద్దఎత్తున మృతిచెందడంతో స్వదేశంలో ప్రజల నిరసనలు, ఆర్థిక భారం పెరగడంతో తన సైన్యాన్ని విరమించుకుంటోందని అంటున్నారు సంతోష్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అఫ్ఘాన్ నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించుకోనున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని ఏప్రిల్ 14న అధికారికంగా ప్రకటించారు. దీంతో నాలుగు దశాబ్దాల నెత్తుటి చరిత్ర తర్వాత అఫ్ఘనిస్థాన్‌లో ప్రారంభం కానున్న కొత్త అధ్యాయం ఎలా ఉంటుంది? దానికి శాశ్వత శాంతిని, ప్రజాస్వామిక సుస్థిరతను తీసుకువస్తుందా? కొత్త రక్త చరిత్ర మొదలవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 1979లో అక్కడి ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని కాపాడడం కోసం సోవియట్ సేనలు అడుగు పెట్టినప్పటి నుంచి అఫ్ఘనిస్థాన్ గడ్డ హింసోన్మత్తతకు బలి అవుతూనే ఉంది. 1979 నుంచి 1989 వరకు సోవియట్ సేనల ఉనికి కారణంగానూ, అది పూర్తిగా తొలిగిపోయిన తర్వాత 1989 నుంచి 1992 వరకు అక్కడి ప్రభుత్వానికి స్థానిక తిరుగుబాటుదార్లకు మధ్య పోరాటం వల్లనూ, 1992 నుంచి 1996 వరకు, ఆ తర్వాత 2001 వరకు సాగిన అంతర్యుద్ధం మూలంగానూ, 2001 అక్టోబర్ 7 నుంచి నేటి వరకు అమెరికా సేనల జోక్యం వల్లనూ అఫ్ఘనిస్థాన్ నిత్య యుద్ధ క్షేత్రంగా మనుగడ సాగిస్తోంది.

బైడెన్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే నాటికి సుమారు 3 వేల అమెరికా బలగాలు అఫ్ఘనిస్థాన్‌లో ఉన్నాయి. అక్కడి పరిస్థితులు మెరుగుపడే వరకు, భిన్నమైన ఫలితం వచ్చేవరకు అంటూ కాలాన్ని పొడిగిస్తూ సైనికులను కొనసాగించడం కుదరదని పేర్కొంటూ 2021 మే 1 నుంచి బలగాల ఉపసంహరణ ప్రారంభమవుతుందని ప్రకటించారు. 2001 సెప్టెంబర్ 11న అమెరికాపై జరిగిన దాడికి ఇరవై ఏళ్లయ్యే నాటి (2021 సెప్టెంబర్ 11)కి అమెరికా, నాటో దళాలు, ఇతర భాగస్వాములు అఫ్ఘనిస్థాన్ నుంచి వైదొలుగుతాయని బైడెన్ స్పష్టం చేశారు. గత రెండు దశాబ్దాలలో అమెరికా 2400 మంది సైనికులను కోల్పోయింది. అలాగే రెండు ట్రిలియన్ డాలర్లు (150 లక్షల కోట్లు) యుద్ధ వ్యయం భరించవల్సి వచ్చింది. అందుకు అమెరికా ప్రజలపై పన్నులు విధించి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది.

అమెరికాలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) పై దాడికి కీలకం అని భావించిన ఆల్‌ఖైదా నేత బిన్‌లాడెన్‌ను 2011 మేలో హత్య చేసింది. అలాగే ఆల్‌ఖైదా సంస్థను కూడా చిన్నాభిన్నం చేయడంలో అమెరికా విజయం సాధించింది. కానీ ఆ సంస్థకు మించిన భయంకరమైన ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థ ఆవిర్భవించింది. అనేకానేక ముఠాలుగా విడిపోయిన ఉగ్రవాదులు దేశవ్యాప్తంగా ఆధిపత్యం కోసం సాగించిన హింసాకాండ అంత ఇంతా కాదు. మహిళలదైతే దుర్భరమైన స్థితి. అఫ్ఘాన్‌లో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పామని, మహిళల హక్కులకు రక్షణ ఏర్పడిందని అమెరికా చెప్పుకుంటోంది. కానీ అవన్నీ కాబూల్ వంటి కొన్ని చోట్లకే పరిమితం. పేరుకు ప్రభుత్వమంటూ ఉన్నా దాని ఏలుబడిలో ఉన్న ప్రాంతం అతి తక్కువ. ఉగ్రవాద ముఠాల్లో తాలిబన్‌లది ప్రస్తుతానికి పైచేయి. వారి మాటే శాసనం.

గత కొన్నేళ్లుగా గ్రీన్‌జోన్ పేరిట పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసుకుని అమెరికా, నాటో దళాలు దానికే పరిమితమవుతుండగా, వారి దగ్గర శిక్షణ పొందిన అఫ్ఘాన్ పోలీసులు, సైనికులు శాంతి భద్రతలు చూస్తున్నారు. గ్రీన్‌జోన్‌పై సైతం పలుమార్లు దాడులు జరిగాయంటే అఫ్ఘాన్ పోలీసులు, సైనికుల దుస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అన్ని విధాలా భంగపడ్డ అమెరికా తమ గడ్డపై ఉగ్రవాదులు బీభత్సం సృష్టించిన రోజైన సెప్టెంబర్ 11 నాడే అక్కడి నుంచి పూర్తిగా వైదొలుగుతామని అంటున్నది. తాలిబన్లపై యుద్ధం ప్రారంభించిన అమెరికా చివరికి తాలిబన్లతో శాంతి ఒప్పందం చేసుకుంది. వియత్నాం యుద్ధంలో పరాజయం పొందినట్లు, తాలిబన్ల దూకుడుకు అమెరికా తలవంచక తప్పలేదు. ఈ 20 ఏళ్లలో తాలిబన్లను కట్టడి చేయలేకపోయింది. అఫ్ఘాన్‌లో శాంతిని సాధించలేక పోయిందన్నది యథార్థం.

అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్లకు పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులకు మధ్య సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. గంజాయి, నల్లమందు వ్యాపారాలు వీటి మధ్య మైత్రిని పటిష్టం చేస్తున్నాయి. ఉగ్రవాద సంస్థలన్నింటిలో అత్యంత ప్రమాదకరమైన సంస్థగా పేరు మోసిన ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) సంస్థ కూడా తాలిబన్ల సహకారంతోనే పుట్టి పెరిగింది. వీటికి అప్పట్లో అంతర్జాతీయ ఉగ్రవాదిగా పేరు మోసిన బిన్‌లాడెన్ సహాయ సహకారాలు అందించేవారు. ఐసీస్ వ్యవస్థాపకుడు అల్ బాగ్దాదీ లాడెన్ శిష్యుడే. ఈ సంస్థ మిలిటెంట్ల చేతిలో వేలాది మంది హతమయ్యారు. వీరిలో అమెరికన్ జర్నలిస్టులు, దౌత్యవేత్తలు కూడా ఉన్నారు. అఫ్ఘాన్‌లో ఈ ఉగ్రమూకకు స్థావరాలు ఉన్నాయి. అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ దళాలకు ఇవి తాలిబన్ల కన్నా పెను సవాల్‌గా తయారయ్యాయి. వీటి దాడిలో కూడా అమెరికన్ సైనికులు అనేక మంది మరణించారు. ఈ నేపథ్యంలో సైనికులను కొనసాగించడం వల్ల అమెరికాకు నష్టమే ఎక్కువ అని అది భావిస్తోంది.

ఆఫ్ఘన్ చరిత్ర నిండా యుద్ధాలు, తిరుగుబాట్లే

1818లో దుర్రానీ వంశ పాలన ముగిసింది. 1826లో దోస్త్ మహమ్మద్ పాలకుడయ్యాడు. అతని పాలనలో అఫ్ఘాన్ స్థితి అంతర్జాతీయ సమస్యగా మారింది. 1839 నుంచి ఈ దేశంపై పెత్తనం చెలాయించడానికి బ్రిటన్, రష్యాల మధ్య ఏర్పడిన వైషమ్యాల ఫలితంగా అనేక యుద్ధాలు జరిగాయి. బ్రిటిష్ – అఫ్ఘాన్ యుద్ధాలు (1838 – 42, 1978 – 80, 1919 – 21) మూడవ బ్రిటిష్ – అఫ్ఘాన్ యుద్ధంలో బ్రిటన్ ఓడిపోయింది. అఫ్ఘాన్ 1919 నుంచి స్వతంత్ర దేశంగా మారింది. 1926లో అమీర్ అమానుల్లాఖాన్ అఫ్ఘాన్ రాజై

కొన్ని అధునాతన (లౌకిక) విధానాలను అమలు పరిచినందున హబిబుల్లా నేతృత్వంలో జరిగిన మతోన్మాదుల తిరుగుబాటు ఆయనను అధికారం నుంచి 1929లో పారిపోయేలా చేసింది. అమానుల్లా దేశం విడిచి వెళ్లాడు. అతని వారసుడు నాదిర్ షా పాత విధానాలనే కొనసాగించినందుకు 1933 నవంబర్‌లో హత్య గావించబడినాడు. అతని కుమారుడు మహ్మద్ జహిర్ షా రాజు అయ్యాడు. దాదాపు 40 సంవత్సరాలు అఫ్ఘాన్‌ను పాలించాడు.

1953లో జహిర్ షా బంధువు సోవియట్ అనుకూల జనరల్ మొహమ్మద్ దావూద్ ఖాన్ ప్రధాన మంత్రి అయ్యాడు. సోవియట్ రష్యా నుంచి ఆర్థిక, సైనిక సహకారం పొందాడు. అనేక సామాజిక అనుకూల సంస్కరణలు అమలు చేశాడు. మహిళలు ఉన్నత విద్య పొందే అవకాశం కల్పించాడు. 1963లో దావూద్ ఖాన్ ప్రధానిగా రాజీనామా చేసేలా సంప్రదాయవాదులు ఒత్తిడి తెచ్చారు. ఆ తర్వాత 1964లో రాజ్యాంగబద్ధ రాచరిక ప్రభుత్వం ఏర్పడింది. 1965లో రహస్యంగా అఫ్ఘాన్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడింది. దీనికి బాబ్రాక్ కర్మల్, నూర్ మహ్మద్ తారకి నాయకులుగా ఉన్నారు. 1973లో జరిగిన సైనిక తిరుగుబాటులో మహ్మద్ జహిర్ షాను దించి మహ్మద్ దావూద్ ఖాన్ అధికారంలోకి వచ్చాడు. రాచరికం రద్దుచేసి తనను తాను రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. 1975 – 76 మధ్య కాలంలో కొత్త రాజ్యాంగాన్ని ప్రతిపాదించాడు. ప్రత్యర్థులపై విరుచుకుపడ్డాడు. అనేక సామాజిక సంస్కరణలను ప్రవేశ పెట్టాడు.

1978 కమ్యూనిస్టుల తిరుగుబాటులో దావూద్‌ఖాన్ చంపబడ్డాడు. అఫ్ఘాన్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన నూర్ మహ్మద్ తారకి దేశ అధ్యక్షునిగా, బాబ్రల్ కర్మల్‌ను ప్రధానిగా ఎంపిక చేశారు. వీరు సోవియట్ ప్రభావం నుండి స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. వీరు తమ విధానాలను ఇస్లామిక్ సూత్రాలు, జాతీయవాదం, సామాజిక, ఆర్థిక న్యాయంగా ప్రకటించారు. దేశాధ్యక్షుడు తారకీకి మరొక ప్రభావవంతమైన కమ్యూనిస్టు నాయకుడు ఉప ప్రధాని హఫీజుల్లా హమీన్ మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉండేవి. అదే సమయంలో మహ్మద్ దావూద్ ఖాన్ ప్రవేశపెట్టిన సంస్కరణలకు వ్యతిరేకంగా సాంప్రదాయక ఇస్లాం నాయకులు గ్రామీణ ప్రాంతాల్లో సాయుధ తిరుగుబాటును ప్రారంభించారు. 1979 సెప్టెంబర్‌లో ఉప ప్రధాని హఫీజుల్లా హమీన్ మద్దతుదారులు దేశ అధ్యక్షుడు తారకిని హత్య చేశారు. 1979లో జరిగిన తిరుగుబాటు మూలంగా సోవియట్ అనుకూల వామపక్ష నజీబుల్లా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

1979 డిసెంబర్ 24న సోవియట్ యూనియన్ సైన్యం అఫ్ఘాన్‌పై దాడి చేసింది. డిసెంబర్ 27న హఫీజుల్లా హమీన్, అతని అనుచరులని ఉరి తీసింది. నాటి నుండే అఫ్ఘాన్‌లో అమెరికా జోక్యం ప్రారంభమైంది. 1980లో అమెరికా గూఢచార సంస్థ (సిఐఎ), పాకిస్తాన్ గూఢచార సంస్థ (ఐఎస్ఐ) లు కలిసి ప్రభుత్వ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించడం, సహకరించడం ప్రారంభించాయి. సోవియట్ యూనియన్ అనుకూల ప్రభుత్వాన్ని పడగొట్టడానికి 'మతోన్మాదం' తగిన ఆయుధంగా అమెరికా ఎంచుకొని పవిత్ర యుద్ధం (జిహాదీ) సాగించడానికి ముజాహిద్దీన్ (పవిత్ర వీరులు) లను తయారు చేసింది. వీరిలో 40 దేశాల నుంచి ఒక లక్ష మందిని నియమించింది. కావల్సిన శిక్షణ, ఆయుధాల సరఫరా, ఏటా వేల కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం చేసింది.

సోవియట్ అనుకూల ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం తీవ్రం చేయడానికి అమెరికా, పాకిస్తాన్, చైనా, ఇరాన్, సౌదీ అరేబియా దేశాలు ఆయుధాలు, ఆర్థికాన్ని తిరుగుబాటు దారులకు సమకూర్చాయి. అమెరికా ముజాహిద్దీన్‌లకు రష్యా విమానాలు కూల్చడానికి స్టింగర్ మిసైల్స్ అందజేసింది. 1986లో బాబ్రాక్ కర్మల్ స్థానంలో నజీబుల్లా అఫ్ఘాన్ నేతగా అధికారంలోకి వచ్చాడు. 1988 జెనీవా ఒప్పందం ప్రకారం సోవియట్ సైన్యం అఫ్ఘాన్ నుంచి వైదొలిగింది. సోవియట్ సైన్యాలు వైదొలగడంతో అంతర్యుద్ధం మొదలైంది. ఫలితంగా వామపక్ష నజీబుల్లా ప్రభుత్వం పడిపోయింది.

అధికారం కోసం అఫ్ఘాన్‌లోని గెరిల్లా దళాల మధ్య పోరు ప్రారంభమైంది. అమెరికా మద్దతుతో అఫ్ఘాన్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడింది. 1996లో అమెరికా అనుకూల ప్రభుత్వం పడిపోయింది. తాలిబన్‌లు అధికారంలోకి వచ్చారు. ఆసియాలో అఫ్ఘాన్ ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో అత్యంత కీలక ప్రాంతం. చమురు నిల్వలపై ఆధిపత్యం ఉంటే ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించొచ్చని అమెరికా భావిస్తోంది. అందువల్లనే ఉత్తర ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మధ్య ప్రాచ్య దేశాలపై దురాక్రమణ యుద్ధాలు చేసింది. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచాధిపత్యం కోసం ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో కమ్యూనిజం బూచిగా, ఆ తర్వాత ఇస్లామిక్ తీవ్రవాదం బూచిగా తన యుద్ధోన్మాదాన్ని కొనసాగిస్తోంది.

అఫ్ఘాన్ విషయానికొస్తే రెండు అగ్ర రాజ్యాలైన అమెరికా, రష్యా చమురు రాజకీయాల్లో ఇరుక్కున్నాయి. అగ్ర రాజ్యాల ఆసక్తులకు పావుగా మారడం అఫ్ఘాన్‌కు కొత్తకాదు. 20వ శతాబ్దం ఆరంభంలో అప్పటి జారు చక్రవర్తుల సామ్రాజ్యం, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల మధ్య 'అడకత్తెరలో పోక'గా నలిగిపోవడం నుండి అమెరికా – రష్యా కూటముల ఒత్తిడి నుండి, నేటి చమురు రాజకీయాల ఒత్తిడిల వరకు ఒకే పరంపర కొనసాగుతుంది. గత వంద సంవత్సరాలుగా ముస్లిం ఛాందసవాదం – ఆధునిక లౌకిక ప్రజాస్వామ్య శక్తుల మధ్య సంఘర్షణ కొనసాగుతూనే ఉంది. విస్తృత ప్రజా ప్రాతినిధ్యంతో కూడిన ప్రభుత్వం ఏర్పడి పలు ముస్లిం ఛాందస గ్రూపుల నిరాయుధీకరణ జరగలేదు. అంటే జెనీవా ఒప్పందాన్ని అమెరికా సామ్రాజ్యవాదం తూట్లు పొడిచింది. అఫ్ఘాన్ శాంతి కొరకు ఏనాడు అమెరికా ప్రయత్నించలేదు.

అమెరికా దురాక్రమణ యుద్ధం

న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంపై 2001 సెప్టెంబర్ 11న జరిగిన దాడికి ఒసామా బిన్‌లాడెన్ నేతృత్వంలోని అల్‌ఖైదా కారణమని, దానికి అఫ్ఘనిస్థాన్ మద్దతు ఇచ్చిందన్న సాకుతో 2 దశాబ్దాల క్రితం 2001 అక్టోబర్ 7న అఫ్ఘాన్‌పై అమెరికా, నాటో దేశాల సైన్యం యుద్ధాన్ని ప్రారంభించాయి. న్యూయార్క్‌పై అల్‌ఖైదా దాడులు జరిపిందని ఆరోపణే గాని, ఇప్పటివరకు రుజువులు చూపలేదు. అల్‌ఖైదాకు అఫ్ఘాన్ మద్దతు కూడా రుజువు కాలేదు. భద్రతా మండలి 4385వ సమావేశం ఆమోదించిన తీర్మాణంలో ఎక్కడా అఫ్ఘాన్‌పై సైనిక చర్య తీసుకోవాలని పేర్కొనలేదు. అయినా భూగోళంలో తీవ్రవాదం ఎక్కడ ఉన్నా అంతం చేస్తామని 2001 అక్టోబర్ 7న జార్జ్ బుష్ తన సైన్యంతో పాటు మిత్ర దేశాల నాటో సైన్యాలతో కలిసి అఫ్ఘాన్‌పై యుద్ధం ప్రారంభించాడు. జార్జ్ బుష్ అనంతరం బరాక్ ఒబామా – డొనాల్డ్ ట్రంప్ కాలంలో ఆ యుద్ధం కొనసాగింది. అఫ్ఘాన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచి, తీవ్రవాదాన్ని తుదముట్టిస్తామంటూ యుద్ధం కొనసాగించింది. చివరికి ఎవరి పైనా యుద్ధం ప్రకటించిందో వారితోనే శాంతి ఒప్పందం కుదుర్చుకోవాల్సిన దుస్థితి అమెరికాకు వచ్చింది.

అఫ్ఘాన్ నుంచి అమెరికా సైన్యాన్ని వెనక్కి రప్పించాలని జో బైడెన్ ముందు నుంచి కోరుకుంటున్నారు. ప్రెసిడెంట్ బరాక్ ఒబామాకు ఉపాధ్యక్షుడుగా ఉన్నప్పుడే 2009లో ఆయన ఈ అభిప్రాయాన్ని ప్రకటించాడు. అయితే అది అప్పుడు జరగలేదు. అందుకు విరుద్ధంగా 2010లో అఫ్ఘనిస్థాన్‌లోని అమెరికా బలగాలను 36,000 మంది నుంచి లక్షకు పెంచాడు. 2012లో పాకిస్థాన్‌లోని అబోట్టాబాద్‌లో ఒసామా బిన్ లాడెన్‌ను ఒక రహస్య వ్యూహం ప్రకారం అమెరికా ప్రత్యేక సైనిక బృందం హతమార్చిన తర్వాతనే అఫ్ఘనిస్థాన్‌లోని తన సైన్యం సంఖ్యను అది తగ్గిస్తూ వచ్చింది. అక్కడి అల్‌ఖైదా తదితర ఉగ్రవాద సంస్థలు బలహీన పడ్డాయని అక్కడి నుంచి అమెరికా మీద దాడి జరపగలిగే శక్తి వాటికి లేదని గూఢచార నివేదికలు అందిన తర్వాతనే ఉపసంహరణ నిర్ణయాన్ని అమెరికా ప్రభుత్వం తీసుకున్నట్టు సమాచారం.

అఫ్ఘనిస్థాన్‌లో రెండు దశాబ్దాల క్రితం తాలిబన్ల ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆనాటి అమెరికా అధ్యక్షుడు, రిపబ్లిక్ పార్టీ నాయకుడు జార్జ్ బుష్ జరిపించిన దాడిలో వేలాది మంది అమెరికన్ సైనికులు, లక్షల మంది పౌరులు మరణించారు. అమెరికా మిత్ర దేశాలన్నీ నాటో దళంలో చేరి అఫ్ఘనిస్థాన్ యుద్ధంలో పాల్గొన్నాయి. ఈ యుద్ధంలో పాల్గొనడం వల్ల బ్రిటిష్ సైనికులు అనేక మంది మరణించడంతో అప్పట్లో బ్రిటన్‌లో నిరసనలు వెల్లువెత్తాయి.

ఆనాటి బ్రిటన్ ప్రధాని టోని బ్లేయర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆయనపై విచారణకు కమిటీని అక్కడి ప్రభుత్వం నియమించింది. ఇటు అమెరికాలో కూడా అఫ్ఘనిస్థాన్‌లో అమెరికా దళాలను కొనసాగించడం పట్ల ప్రధాన నగరాల్లో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న డెమోక్రాటిక్ పార్టీ తాము అధికారంలోకి వస్తే అఫ్ఘాన్ నుంచి దశల వారిగా సంకీర్ణ దళాలను ఉపసంహరిస్తామని వాగ్దానం చేసింది. ఇప్పుడు అదే వాగ్దానాన్ని అమలు చేయాలని బైడెన్ నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. అఫ్ఘాన్‌లో సంకీర్ణ దళాలు ప్రవేశించి సెప్టెంబర్ 11వ తేదీకి ఇరవై ఏళ్లు పూర్తి అవుతుంది. ఆనాటికి మొత్తం దళాలన్నింటినీ ఉపసంహరించుకుంటామని బైడెన్ పేర్కొన్నారు.

అఫ్ఘనిస్థాన్‌లో రెండు దశాబ్దాలుగా అమెరికా, నాటో సైన్యాలు సాగిస్తున్న 'ఖరీదైన' యుద్ధానికి ముగింపు సముచితమే. కానీ అక్కడ మిగిల్చిందల్లా శిథిల ప్రాయమైన దేశాన్ని అణ్వస్త్రం తప్ప మన అమ్ములపొదిలో ఉన్న సమస్త ఆయుధాలను అమెరికా అక్కడ కుమ్మరించింది. క్షిపణి దాడులతో అఫ్ఘాన్ చిగురుటాకులా వణికింది. నలుగురు గుమిగూడితే వాళ్లను తీవ్రవాదులుగా భావించి వైమానిక దాడుల్లో హతమార్చడం చాలా సందర్భాల్లో జరిగింది. ఈ పాపాలకు సంబంధించి జూలియన్ అసాంజ్ బయట పెట్టిన ఎన్నో పత్రాలు, వీడియోలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో పడేశాయి. తీవ్రవాదుల మాటేమో గాని, వేల మంది సాధారణ పౌరులు మరణించారు. ఫలితంగా అక్కడ తీవ్రవాదం మరింత ముదిరింది. అయినా తాజా ప్రకటనలో బైడెన్ స్వోత్కర్ష మానుకోలేదు. 'స్పష్టమైన లక్ష్యాలతో అక్కడికెళ్లాం – వాటిని సాధించాం' అని ఆయన చెప్పుకున్నారు.

ఏ దేశమైనా మరో దేశాన్ని దురాక్రమించడం, పెత్తనం సాగించడం, అక్కడి పౌరుల జీవితాన్ని అల్లకల్లోలం చేయడం అనాగరికం. ఒక దేశ అంతర్గత విషయాలు ఆ దేశ ప్రజలే పరిష్కరించుకోవాలి. లేదా అంతర్జాతీయ సంస్థలు విభేదాలతో పోరాడుతున్న గ్రూపులతో చర్చలు జరిపి సామరస్యంగా విభేదాలను పరిష్కరించవచ్చు. బయటి దేశాల జోక్యం అంతర్జాతీయ సూత్రాలకు వ్యతిరేకం. 2014 నాటికల్లా అమెరికా దళాలు అక్కడి నుంచి వైదొలుగుతాయని ఒబామా అప్పట్లో చెప్పారు. కానీ అదేమీ జరగలేదు. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ దీనిపై విశేషంగా ప్రచారం చేశారు. తాను వచ్చిన వెంటనే దళాలన్నీ వెనక్కి రప్పిస్తామని ప్రకటించారు. కానీ అదేమీ జరగలేదు. ఆ దిశగా మాత్రం ఆయన ప్రయత్నాలు చేశారు. పాకిస్థాన్ ప్రాపకంలో తాలిబన్‌లతో చర్చోప చర్చలు జరిపి మొత్తానికి ఈ ఏడాది మే 1 నుంచి మొదలుపెట్టి దశల వారీగా సైనిక దళాలను వెనక్కి తీసుకొస్తామని మొన్న అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ప్రకటించారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి చెందారు. ఆయన స్థానంలో బైడెన్ తాలిబన్లతో ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందం అమలుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఏదో ఒక సాకుతో దేశాలను దురాక్రమించడం నేరమే. ఆ కోణంలో అమెరికా దళాల ఉపసంహరణ సరైందే కూడా. దాన్ని తనకూ, తాలిబన్‌లకూ మధ్య నడిచే లడాయిగా పరిగణించకుండా ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వేదిక సారథ్యంలో ఒక సామరస్య పూర్వకమైన పరిష్కారానికి ప్రయత్నించి వైదొలగి ఉంటే అది ఆ దేశ పౌరులకు మాత్రమే కాదు... భారత్ సహా ఆసియా ప్రాంత దేశాలన్నింటికీ ఉపయోగకరంగా ఉండేది. ఒకసారంటూ అమెరికా దళాలు వైదొలగి, తాలిబన్‌ల ఏలుబడి మొదలైతే ఎలాంటి అరాచకాలు తలెత్తుతాయోనన్న భయాందోళనలు ఆ దేశంలోని మైనారిటీలకూ, మహిళలకూ, ఇరుగుపొరుగు దేశాలకూ ఉంది. తాలిబన్‌ల రాకను ఆహ్వానిస్తున్నది ఒక్క పాకిస్తాన్ మాత్రమే. అమెరికా వైదొలగిన వెంటనే అఫ్ఘాన్ భౌగోళిక రాజకీయాలు మారిపోతాయనేది స్పష్టం. రష్యా, చైనా, పాక్, ఇరాన్ మొదలైన దేశాలు ఇప్పటికే పావులు కదుపుతున్నాయి.

నగరాలు, పట్టణాలు అఫ్ఘాన్ ప్రభుత్వ పాలనలో ఉంటే, వాటి చుట్టూ ఉన్న అత్యధిక గ్రామీణ భూ భాగాలు ఇప్పటికీ తాలిబన్ ఆధీనంలోనే ఉన్నాయి. యుద్ధంలో అమెరికా ఘోరంగా ఓడిపోయింది. ఇంకెన్ని దశాబ్దాలు ఇక్కడ ఉన్నా గెలిచేది లేదని దానికి అర్థమైంది. అందుకే ఈ నిష్క్రమణ అని తాలిబన్ కమాండర్లు అంటున్నారు. అమెరికాతో ఒప్పందం తర్వాత తాలిబన్లు విదేశీ సైనికుల మీద దాడులు దాదాపు ఆపేశారు. కానీ అఫ్ఘాన్ బలగాల మీద, పాఠశాలల మీద, జనవాసాల పైన మాత్రం విరుచుకుపడుతూనే ఉన్నారు. భారీ విధ్వంసాలు, విస్ఫోటనలు కొనసాగిస్తూనే ఉన్నారు. తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడానికి తాలిబన్ నిరీక్షిస్తున్న తరుణం ఇది. శాంతి చర్చలు ఫలితాన్నివ్వవనీ, అమెరికా నిష్క్రమణ తర్వాత తాలిబన్‌లు ఒక్కసారిగా రెచ్చిపోతారనీ, అష్రాఫ్ ఘనీ ప్రభుత్వం వెంటనే కూలిపోతుందని అమెరికా నిఘా వర్గాలు అంటున్నాయి.

ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలతో అనవసర యుద్ధాలకు దిగి అమెరికా ఆర్థికంగా బాగా నష్టపోయింది. వేలాది మంది సైనికులు చనిపోయారు. 2008 నుంచి అది ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుంచి ఈనాటికి బయటపడలేదు. అమెరికా అప్పు భారీగా పెరిగింది. అగ్రరాజ్య హోదాను కోల్పోయింది. చాలా గందరగోళ పరిస్థితుల్లో అమెరికా పాలకులు ఉన్నారు. అమెరికాను మించిన సాంకేతిక శక్తితో, రాజకీయార్థిక ఎత్తుగడలతో చైనా దూసుకుపోతోంది. చైనా ఎదుగుదలను అడ్డుకోకపోతే అమెరికా డాలర్ పెత్తనం ఎక్కువ కాలం నిలువదు అని అమెరికా బయపడుతోంది. తమ దేశంలోని ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ యుద్ధ క్షేత్రాల నుంచి అది తప్పుకోవడం

నేపాల్ పై చర్చ - కొన్ని గమనించాల్సిన అంశాలు

- ఎం. కృష్ణ ఆదిత్య

'నేపాల్‌లో భారత విస్తరణవాదం - ఇటీవల పరిణామాలు' అన్న శీర్షికతో (వీక్షణం ఏప్రిల్ 2021) వ్యాసాన్ని ప్రచురించినందుకు అభినందనలు. 1950 అసమాన ఒడంబడిక నుంచి నేటివరకు భారత విస్తరణవాదం ఎన్ని విధాలుగా నేపాల్‌పై రుద్దబడిందో అనేక సంఘటనలతో, ఉదాహరణలతో సమగ్రంగా అందులో వివరించారు. భారత విదేశాంగ విధానాన్ని ఇంత లోతుగా విశ్లేషించిన వ్యాసం తెలుగులో రావడం, దానికి వీక్షణం వేదిక కావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. తెలుగులోనేకాదు ఇంగ్లిష్‌లో కూడా ఇటీవలి కాలంలో రాలేదు అని ఇంగ్లిష్ పత్రికలు చదివే మిత్రుడొకరు నాతో అన్నారు. నేపాల్ గురించిన సంపాదకీయ వ్యాఖ్యలో, 'వీక్షణం', భారత విస్తరణవాదాన్ని విస్మరించడం ఒక మౌలిక లోపమని, దాన్ని ఎత్తిచూపెడుతూ రాసిన ఇలాంటి చర్చా వ్యాసాన్ని ప్రచురించి పత్రికస్థాయిని, హుందాతనాన్ని సంపాదకులు పెంచారని చిరకాలంగా వీక్షణంను అభిమానించే ఆయన నాతో అన్నారు.

కాగా పై వ్యాసాన్ని తప్పుపడుతూ 'వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్'కి చెందిన రాజేంద్రబాబు అర్విణిగారి లేఖని 'మే' సంచికలో చూసి ఆశ్చర్యపోయాను. అందువల్లనే ఈ చిరు చర్చ. 'భారత విస్తరణవాద తత్వాన్ని నిరూపించడానికి వ్యాసకర్త ఉదహరించిన ఉదంతం మాత్రం హాస్యాస్పదం' అని ఆయన వ్యాఖ్యానించారు. నేపాల్, శ్రీలంకలలో బిజెపి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తామని హోం మంత్రి అమిత్ షా అనడం, దాన్ని బిజెపికి చెందిన ఒక ముఖ్యమంత్రి మళ్లీ ఈ మధ్య ఉటంకించడం చిన్న 'ఉదంతం' ఏమీ కాదు. ఈ ఒక్క ఉదంతం మీదనే రచయిత ఆధారపడినారేమో అన్నట్లుగా చిత్రించారు అర్విణి. అది సరికాదు. నిజానికి వ్యాసకర్త దశాబ్దాలుగా సాగిన అనేకానేక సంఘటనలను ఉదహరించారని వ్యాసం చదివిన వారెవరైనా గ్రహిస్తారు.

అమిత్ షా మాటలు 'సాధ్యమేనా అన్నది ఆలోచించాలి' అన్నారు అర్విణి. ఆధిపత్యవాదుల బెదిరింపులు కూడా విస్తరణవాదంలో భాగమేనని గుర్తించాలి. నిజానికి 'సాధ్యాసాధ్యాల మాట ఎలా ఉన్నా, భారత విస్తరణవాద తత్వం ఎంతదూరం పోతున్నదో ఈ ఉదంతం స్పష్టం చేస్తున్నది' అని వ్యాసకర్తే స్వయంగా విశ్లేషించారు.

నేపాల్, శ్రీలంకలు కాదు, కనీసం తమిళనాడులో బిజెపి ప్రభుత్వం సాధ్యమేనా? అని అర్విణి ప్రశ్నించారు: మోడి, అమిత్ షాలు ప్రచారం చేస్తే మాకు డిపాజిట్లు కూడా రావు అని అన్నాడిఎంకె భావిస్తున్నది- అంటూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలో సగభాగం ఈ వాదనే. అన్నాడిఎంకె బిజెపి కూటమి 33.5 శాతం ఓట్లు, 75 సీట్లు గెలుచుకున్నది. ఆయనవి అవాస్తవిక ఊహాగానాలేనని ఈ ఫలితాలు చూపెడుతున్నాయి. మోడి (నాగర్ కోయిల్), ఆదిత్యనాథ్ (కోయంబత్తూర్), అమిత్ షా (తిరునల్వేలి) ప్రచారం చేసిన చోట్ల 4 సీట్లు బిజెపి గెల్చుకున్నది; ఓట్లు పెంచుకున్నది. కన్యాకుమారి లోక్‌సభ సీటులో ఓట్లను (5 శాతం) పెంచుకొని 40 శాతానికి చేరింది. అవే పార్టీలు, రాజకీయాలు ఉన్న పుదుచ్చేరిలో 9 చోట్ల పోటీచేసి, 6 సీట్లు గెల్చుకున్నది.

సిద్ధాంతాలతో సంబంధం లేకుండా పార్టీలు, నాయకులు ఫిరాయించే నేటి రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చునని ఈ ఎన్నికలు మరోసారి చూపెట్టాయి. మూడున్నర దశాబ్దాలు బెంగాల్లో అధికారం నెరపిన సిపిఎం (కాంగ్రెస్‌తో కూటమి ఉన్నా) 5 శాతం ఓట్లు కూడా తెచ్చుకోలేకపోయింది; సున్నా సీట్లు! కాగా, బిజెపి 38 శాతం ఓట్లు సాధించింది.

నేపాల్ అనిశ్చితికి కారణం భారత్ 'మాత్రమే' అనడం 'పాక్షిక సత్యమే' అవుతుంది అని రాశారు అర్విణి. సంపాదకీయంలో ఆమాత్రం గుర్తింపు కూడా లేదు. అందులో భారత్ పాత్రను మర్చిపోయారని వ్యాసకర్త 'ఆవేదన' చెందారన్నారు అర్విణి. ఇప్పటి వ్యాఖ్యలో కూడా అంతే. భారత ప్రజలకు భారత ప్రభుత్వ విస్తరణవాదం కీలకాంశం అవుతుంది. నేపాల్ పార్టీలు, ప్రజాభిప్రాయం కూడా భారత పెత్తనాన్నే ప్రధాన అడ్డంకిగా భావించాయి; ఆ మేరకు అనేకసార్లు ప్రకటించారు. భారత ఆధిపత్యవాదంతో కూడిన భారత-నేపాల్ అసమాన ఒడంబడికను రద్దు చేయాలని వారందరూ దశాబ్దాలుగా కోరుతున్నారు. ఆ డిమాండ్‌ని అప్పుడూ, ఈ వ్యాఖ్యలోనూ కూడా విస్మరించడం మౌలికలోపం అని అర్విణి ఇప్పటికీ గుర్తించలేదు.

'అగ్ర రాజ్యాలు-నేడు ప్రత్యేకించి అమెరికా-ఈ విస్తరణవాదాన్ని, చైనా వ్యతిరేకతను ప్రోత్సహించి వాడుకుంటున్నాయి', అని రాశారు వ్యాసకర్త. ప్రపంచ ప్రజలందరికీ ప్రధాన శత్రువుగా కొనసాగుతున్న అమెరికా సామ్రాజ్యవాదం గురించి సంపాదకీయ వ్యాఖ్యలో ఒక్క ప్రస్తావన కూడా లేదు. ఇప్పటి అర్విణిగారి వ్యాఖ్యలోనూ లేదు. కాగా రెండింటా చైనా గురించే రాశారు - అదీ ఎడిటోరియల్ కలెక్టివ్ పక్షాన! అమెరికా పట్ల ఇదే తమ విధానమా? కాదని, పొరపాటేనని అంటారేమో అనుకుంటే, ఇలా బల్లగుద్దారు అర్విణి! ఏమని నిర్ధారించుకోవాలి?

'భారత భూభాగాలైన' కాలాపానీని నేపాల్ మ్యాపుల్లో చూపుతూ నేపాల్ జాతీయ మనోభావాన్ని ఓలీ వాడుకొంటున్నారని రాశారు సంపాదకీయ వ్యాఖ్యలో. అవి వివాదస్పద భూభాగాలేనని రాత పూర్వకంగా గత ప్రభుత్వాలే కాక, వాజపేయి, మోడీ ప్రభుత్వాలు కూడా అంగీకరించాయి. కాగా రాజుని మించిన రాజభక్తి, జాతీయోన్మాదం సంపాదకీయ వ్యాఖ్యలో ప్రదర్శితమైనాయి. ఈ వివాదాన్ని వ్యాసకర్త అనేక వాస్తవాధారాలతో విశ్లేషించారు. ఆ వివాదాన్ని,

---

ప్రారంభించింది. ఆ వరుసలో అఫ్ఘనిస్థాన్ నుంచి జరుగనున్న ఉపసంహరణ ఒక కీలక ఘట్టం కానున్నది.

బైడెన్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆ ప్రాంతంలో సంక్షోభాన్ని పెంచుతుందని వాషింగ్టన్ పోస్ట్ సంపాదకీయ వాఖ్య చేసింది. ఈ ఉపసంహరణ పర్యవసానాలు బీభత్సంగా ఉండగలవని హెచ్చరించింది. దీనివల్ల అమెరికా ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ అభిప్రాయపడింది. అమెరికా సేనలను ఉపసంహరించుకున్న తర్వాత అక్కడ శాశ్వత శాంతి స్థాపనకు తోడ్పడతామని తాలిబన్లు హామీ ఇచ్చారు. అయితే దానికి వారు గాని, ఇతర తీవ్రవాద సంస్థలు గాని కట్టుబడి ఉంటాయని ఆశించడానికి బొత్తిగా అవకాశం కనిపించడం లేదు. అఫ్ఘాన్‌లో శాంతి ఎండమావిగా మిగలనుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

రైతు బిడ్డడు కార్మిక వర్గ నాయకునిగా

- లంకా పాపిరెడ్డి



రైతు బిడ్డడు గెరిల్లాగా...
కొండపల్లి సీతారామయ్య జీవితం
కె. అనురాధ
హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ
ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్ - 500006
ఫోన్ : 040-23521849
వెల రు. 250
పేజీలు 192

'రైతు బిడ్డడు గెరిల్లాగా' అనే పేరుతో కొండపల్లి సీతారామయ్య జీవిత చరిత్ర పైన మొదటిసారి ఒక పుస్తకం వెలుగు చూసింది. కొండపల్లి సీతారామయ్య గారి మనుమరాలు కావూరి అనురాధ గారు ఈ పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకంలో సీతారామయ్య జీవిత చరిత్ర మూడు దశలుగా కనిపిస్తుంది. ఒకటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఉన్న కాలం. రెండవది తానే స్వయంగా నాయకత్వం వహించిన వామపక్ష విప్లవోద్యమ కాలం. మూడవది తాను స్థాపించిన పార్టీ నుండే బహిష్కరణకు గురైన తరువాతి కాలం. ఇందులో తన నాయకత్వంలో సాగిన ఉద్యమ కాలమే ముఖ్యమైనది, పెద్దది కూడా. అనురాధ గారికి ఉన్న అనుకూల విషయం ఏమిటంటే కొండపల్లి సీతారామయ్య కుటుంబ నేపథ్యం గురించి, కుటుంబ చరిత్ర గురించి ఆ కుటుంబ సభ్యురాలిగా ఇతరుల కంటే ఎక్కువగా తెలిసి ఉండడం. అందుకే సాధారణంగా అందరికీ తెలవని సీతారామయ్య కుటుంబ వివరాలు, ఏ నేపథ్యంలో ఎలా వామపక్ష ఉద్యమంలోకి కొండపల్లి సీతారామయ్య వచ్చిందీ ఈ పుస్తకంలో మనకు వివరంగా కనిపిస్తాయి. ఆ కాలంలో కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయత్వంలో సాగిన ఉద్యమం, దాని ప్రారంభ రోజులకు చెందిన ఎన్నో ఆసక్తికర విషయాలు వివరాలు ఉన్నాయి. నేటి తరానికి తెలియని విషయాలు, తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. సీతారామయ్య చరిత్రతో పాటు ఆ నాటి ఉద్యమం గురించి, సామాజిక రాజకీయ పరిస్థితులను కూడా సమాంతరంగా చక్కగా వివరించారు అనురాధ గారు. పుస్తకం చివరి వరకు కూడా ఇదే పద్ధతిని అనుసరించారు. నిజానికి ఏ ఉద్యమ నాయకునికైనా, వృత్తి విప్లవకారులకు ఎవరికైనా వ్యక్తిగత చరిత్ర అంటూ ఏమీ ఉండదు. ఉద్యమ చరిత్రే వారి జీవిత చరిత్రగా ఉంటుంది. అలాగే పీపుల్స్ వార్ పార్టీ నుండి బహిష్కరణకు గురైన తరువాతి కాలం గురించి కూడా ఈ పుస్తకంలో వివరంగా ఉంది. ఆ కాలంలో బహుశా సీతారామయ్య ఎక్కువ కాలం అనురాధ, సుధ కుటుంబంతోనే ఉన్నట్లుంది.

అనురాధ గారికి ఉన్న అననుకూల విషయం ఏమిటంటే కొండపల్లి సీతారామయ్య నాయకత్వం వహించిన ఉద్యమంతో లోతైన సంబంధం లేకపోవడం. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఉన్న కాలానికి సంబంధించినంత వరకు ఉద్యమ చరిత్ర, అందులో కొండపల్లి జీవితం వివరంగానే ఉంది. సీతారామయ్య విప్లవోద్యమానికి నాయకత్వం వహించిన కాలానికి చెందిన జీవిత చరిత్ర వివరాలు కూడా సరిగ్గానే పేర్కొన్నారు. అయితే ఉద్యమ అభివృద్ధి క్రమంలో ప్రతి మలుపులో సీతారామయ్య సైద్ధాంతిక కృషి, అంతర్గత పోరాటం గురించి సంక్షిప్తంగా మాత్రమే ఉంది. అయితే ఇది అనురాధ గారి లోపం కాదు. కొండపల్లి జీవిత చరిత్రను ఎవరూ రాయడానికి పూనుకోకపోవడం వల్లనే అనురాధ గారు పూనుకున్నారు సాహసం చేశారు. తనకు ఉన్న పరిమితుల గురించి, మరోవైపు పుస్తకం ఆవశ్యకత గురించి ముందు మాటలో అనురాధ గారు సరిగ్గానే చెప్పారు. 'ఇన్ని పరిమితుల మధ్య నేను తాతయ్య జీవిత కథను రాసే పనికి ఉపక్రమించాను. ఇంకా ఆలస్యం చేస్తే ఈ పాటి ప్రయత్నం కూడా చేయలేనేని ముందుకు సాగాను' అని రాశారు. అవును ఇంకా ఆలస్యం అయితే అసలు కొండపల్లి సీతారామయ్య జీవిత చరిత్ర పైన ఒక పుస్తకమే చూసేవాళ్లం కాదేమో. అనురాధ గారు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. ఒక మిత్రుడు అన్నట్లు ఈ పుస్తకంలోని ఒక్కో అధ్యాయం పైన్నే ఒక పుస్తకం

దానికి సంబంధించిన అనేక వాస్తవాలని మళ్లీ మొత్తంగా విస్మరించి, తమిళనాడు 'ఉదంతం మాత్రం' అంటూ ఆక్షేపించారు అర్విణి. వక్రీకరణపై ఆధారపడిన ఈ విమర్శ సబబా?

భారత విస్తరణవాదం ఒక భౌతిక వాస్తవం, నిర్వివాదాంశం. నేపాల్ సార్వభౌమత్వానికి అది ప్రధాన అడ్డంకి అని నేపాలీయులు భావిస్తున్నారు కూడా. 'వీక్షణం' సంపాదకీయంలో దాన్ని విస్మరించడం మౌలికలోపం. ఆ లోపాన్ని తాము అంగీకరించడం లేదని అర్విణి చెప్తున్నారా? కాగా చైనా ఆధిపత్యవాదం వివాదస్పదమైన సైద్ధాంతిక విషయం. దాని గురించి వ్యాసకర్త పల్లెత్తుమాట కూడా అనలేదని ఆక్షేపించారు అర్విణి. భారత పాలకవర్గాలు, మీడియా చైనా గురించి నిత్యం దుమ్మెత్తిపోస్తున్నాయి. కానీ, కొద్ది భారత ప్రభుత్వ, అమెరికా అనుకూల ముఠాలు తప్ప, నేపాల్‌కి చెందిన మెజారిటీ పార్టీలు, మీడియా, ప్రజాభిప్రాయం కూడా చైనా గురించి అలా భావించడం లేదు. నేపాల్‌లో ఉన్న అమెరికా, ఇండియాల పెత్తందారీ ప్రయత్నాలను విస్మరించి, దానితో అక్కడలేని చైనా ఆధిపత్యవాదాన్ని సమానం చేసి, 'అంతే ఎండగట్టాలి' అంటున్నారు అర్విణి! కేవలం తమ సిద్ధాంత నేత్రంతో కాక, నేపాల్ పరిస్థితిని వాస్తవికంగా నిర్దిష్టంగా పరిశీలించి చూస్తే బాగుంటుంది. చైనా గురించి వీక్షణంలో చర్చ సాగింది, సాగుతుంది. ప్రస్తుత చర్చనీయాంశం అది కాదు. వ్యాసం శీర్షికలోనే విషయం స్పష్టంగా ఉంది. ఈ నా అభిప్రాయాలు పాఠకులు గమనించి, ఏప్రిల్ వ్యాసాన్ని మరోసారి చదువుతారని ఆశిస్తున్నాను. చర్చకు తావునిస్తున్న వీక్షణంకి మరోసారి ధన్యవాదాలు.

(రచయిత పాత్రికేయులు) వీ

రాయవచ్చు. అంత పెద్ద చరిత్ర సీతారామయ్యది. ఏది ఏమైనా అనురాధ గారు, సీతారామయ్య గారి సముద్రమంత చరిత్రను సారాంశం దెబ్బతినకుండా మర చెంబులో పట్టించగలిగారు. మొత్తంగా వామపక్ష ఉద్యమం ప్రారంభం, అభివృద్ధి, చీలికలు, ఆ నాటి నుండి నేటి వరకు మారుతూ వచ్చిన సామాజిక రాజకీయ పరిస్థితులు అన్నింటిని చక్కగా సంక్షిప్తంగా రాశారు. వామపక్ష ఉద్యమాల గురించి తెలుసుకోవాలనుకునే వారికి ఎంతో ఉపయోగపడే పుస్తకం ఇది. రచనా శైలి కూడా చాలా బాగుంది. ఎక్కడా విసుగు కలగకుండా ఏకబిగిన పుస్తకం చదివేలా రాశారు.

1919లో కొండపల్లి సీతారామయ్య కృష్ణా జిల్లాలో జన్మించారు. అమ్మమ్మ ఊరు జొన్నపాడులో 5వ తెరగతి వరకే ఉండిన ఊరు బడిలో, ఆయన అంతవరకే చదువుకున్నారు. కాని సీతారామయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్లకు రాజకీయ పాఠాలు చెప్పాడని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. సీతారామయ్య కాలేజీ చదువులు చదవలేదు కానీ మార్క్సిజాన్ని లోతుగా అధ్యయనం చేశాడు. ఆ దృష్టినుండి భారతదేశ సమాజాన్ని అధ్యయనం చేశాడు. వర్గ పోరాటంలో భారత దేశాన్ని అర్థం చేసుకున్నాడు. అయితే హిందీ భాషలో విశారద వరకు చదివాడు. ఆ అర్హతతోనే వరంగల్ గాబ్రియల్ స్కూలులో హిందీ టీచర్గా పని చేశాడు. సీతారామయ్య 1936 ప్రాంతంలో కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితం అయినట్లు కనిపిస్తోంది. కొండపల్లి సీతారామయ్యను కమ్యూనిస్టు ఉద్యమంలోకి తీసుకురావడంలో చంద్ర రాజేశ్వరరావు ముఖ్యమైన పాత్ర వహించాడు. చివరి వరకు చంద్ర రాజేశ్వరరావు, సీతారామయ్యతో స్నేహంగానే ఉన్నాడు. అయితే సీతారామయ్య మాత్రం ఎప్పుడూ కార్మికవర్గ దృక్పథానికే కట్టుబడి ఉన్నాడు. 1938లో మొదటిసారి కొండపల్లి సీతారామయ్య కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రాజకీయ తరగతులకు హాజరయ్యాడు. 1939 చివరి నాటికి సీతారామయ్య కమ్యూనిస్టు పార్టీ కృష్ణా జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. అప్పుడే రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. దాని తరువాత 1946లో తెలంగాణ సాయుధ పోరాటం మొదలైంది. నిర్బంధాలు, నిషేధాలు, అజ్ఞాత జీవితాలు అన్ని చూశాడు. 1951 చివరిలో కమ్యూనిస్టు పార్టీ కృష్ణా జిల్లా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. 1958లో కమ్యూనిస్టు పార్టీ నుండి సీతారామయ్యను బహిష్కరించారు. 'కోటేశ్వరమ్మ సీతారామయ్య విడిపోయినా చట్టబద్దంగా విడాకులు తీసుకోలేదు. భార్యతో విడాకులు తీసుకోకుండా మరొక స్త్రీతో కలిసి ఉండడాన్ని పార్టీ తప్పు పట్టి, పార్టీ నుండి సీతారామయ్యను బహిష్కరించింది' (44వ పేజి). బహిష్కరణ తరువాత 1958 నుండి 1968 వరకు సీతారామయ్య ఏ పార్టీలోనూ పనిచెయ్యలేదు. 1964లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలిపోయి, సి.పి.ఐ., సి.పి.ఐ. (ఎం) పార్టీలుగా ఏర్పడినాయి. 1969 లో సి.పి.ఐ. (ఎం) నుండి విడిపోయినవారు చారుమజుందార్ నాయకత్వంలో సి.పి.ఐ. (ఎం.ఎల్.) పార్టీగా ఏర్పడినారు. సీతారామయ్య చారు నాయకత్వంలో జరిగిన నక్సల్బరీ ఉద్యమం వైపు మొగ్గు చూపాడు. వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న సీతారామయ్య కొడుకు చందు, శ్రీకాకుళ ఉద్యమంతో ప్రభావితమయ్యి ఉద్యమాలలో పాల్గొనడం మొదలు పెట్టాడు. 1969 ఫిబ్రవరిలో చారుమజుందార్ హాజరైన గుత్తికొండ బిలం సమావేశానికి చందు కూడా వెళ్లాడు. ఈ సమావేశంలో చర్చ జరిగిన తరువాత చారుమజుందార్ సూచనమేరకు సీతారామయ్యను రాష్ట్ర కమిటిలోకి తీసుకున్నారు. తరువాత చందును పోలీసులు అరెస్టు చేసి పార్వతీపురం కుట్రకేసులో ఇరికించారు. చివరి సారిగా 1972లో చందును పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. తరువాత చందు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెప్పారు. శవాన్ని కూడా ఇవ్వలేదు. అసలేం జరిగిందో ఇప్పటికీ తెలవదు.

త్వరలోనే నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు దెబ్బతిని వెనక పట్టు పట్టాయి. 1972లో చారుమజుందార్ చనిపోయిన తరువాత సి.పి.ఐ. (ఎం.ఎల్.) పార్టీ చిన్నాభిన్నం అయింది. చీలికలు జరిగాయి. అప్పుడు సీతారామయ్య ఆంధ్రప్రదేశ్లో మళ్లీ పార్టీ నిర్మాణానికి పూనుకోవడమే కాదు, అతివాద దుందుడుకువాద ఎత్తుగడలలో కొట్టుకుపోతున్న పార్టీని సరైన మార్గంలోకి తీసుకువచ్చాడు. ఒక బలమైన పార్టీని ఉద్యమాన్ని నిర్మించాడు. చివరికి అదే పార్టీ నుండి బహిష్కరణకు గురయ్యాడు. మళ్లీ పార్టీ నిర్మించాలనుకున్నాడు కాని వయసు, మనసు సహకరించని పరిస్థితికి చేరుకోవడంతో ఏమి చేయలేకపోయాడు. చివరికి జీవిత కాలమంతా కలలు కన్న విప్లవం గురించే కలవరించుకుంటూ 2002 ఏప్రిల్ 12న కన్ను మూశాడు. ఈ పుస్తకానికి ముందుమాట బేలా భాటియా గారు రాశారు. అయితే బేలా భాటియా గారికి తెలుగు రాష్ట్రాల వామపక్ష ఉద్యమాలతో లోతైన సంబంధం లేదు. అవగాహనా తక్కువే అని చెప్పవచ్చు. పౌరహక్కుల ఉద్యమాల తోటి సంబంధం ఉండవచ్చు కానీ, వామపక్ష ఉద్యమాలతో సంబంధాలు తక్కువే. వామపక్ష ఉద్యమాలలో ఉన్న వారితో ముందు మాట రాయించితే బాగుండేది. వారైతే తాము విన్నది కన్నది కూడా ఈ పుస్తకంలోని చరిత్రకు మరికొంత కలిపి ఉండేవారు. బేలా భాటియాకు అటువంటి అవకాశం లేదు. అందుకే వారు కొండపల్లి జీవిత చరిత్ర గురించి తక్కువ, వామపక్ష ఉద్యమానికి సంబంధించిన సమస్యల గురించి ఎక్కువగా రాశారు ముందు మాటలో. అవి కూడా సరిగ్గా రాయలేదు. 'వర్గ శత్రువు నిర్మూలనే ఏకైక మార్గం అనే అభిప్రాయాన్ని 1978లో మార్చుకున్నారు. సాయుధ పోరాటంతో పాటు ప్రజా ఉద్యమాలు కూడా అవసరమని గుర్తించారు' అని రాశారు. కాని పార్టీ 1970లోనే ప్రజా సంఘాల నిర్మాణానికి పూనుకున్నది. 1974లోనే ఆత్మవిమర్శనా రిపోర్టులో పార్టీ తన లోపాలు సరిదిద్దుకుంటూ రాసుకున్నది. 1974లో విద్యార్థి సంఘం నిర్మాణం మొదలు పెట్టింది. 1975లో విద్యార్థి ఉద్యమం ఊపందుకున్నది. ఎమర్జెన్సీ కారణంగా ఆ ఉద్యమం లీగల్ కార్యకలాపాలు ఆగిపోయాయి. లీగల్ కార్యకలాపాలకు అవకాశం లేకుంటే ఉద్యమాలు మరో రూపంలో సాగుతాయి. ఏ రూపంలోనూ ఉద్యమం సాగనప్పుడే వెనుకపట్టు పట్టింది అని చెపుతారు. ఒక పార్టీ గురించి కనీస అవగాహన లేకుండానే ఆ పార్టీలో నియంతృత్వం ఉన్నదని, అసలు విషయాలు ఎన్నటికీ బయటికి రావని బాధ్యతారాహిత్యంగా రాశారు. కొండపల్లి సీతారామయ్యను బహిష్కరించినందుకు పార్టీలో నియంతృత్వం ఏర్పడినట్లుగా గుర్తించారు భాటియా గారు. మరి కెజి సత్యమూర్తిగారిని బహిష్కరించినప్పుడు పార్టీలో ఏమున్నది? అప్పుడు పార్టీ నాయకుడుగా ఎవరు ఉన్నారు? బేలా భాటియా గారికి తెలుసా? ఈ లెక్కన ఎవరినైన బహిష్కరిస్తే నియంతృత్వం ఉన్నట్లు, ఎవరినీ బహిష్కరించకుంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఉన్నట్లు అనుకోవాల్సి వస్తుంది.

ఈ పుస్తకంలో కొన్ని విషయాలు సరిచేయాల్సి ఉందని నా అభిప్రాయం. ఈ పుస్తకం ప్రకారం, సీతారామయ్య కూతురు కరుణ, అల్లుడు రమేశ్ బాబు ఉద్యోగ రీత్యా బస్తర్ జిల్లా కొండగాంవ్‌లో పనిచేశారు. వారి వద్దకు ఒకసారి సీతారామయ్య వెళ్లాడు. అప్పుడే ఆ ప్రాంతం చూసి ఉత్తర తెలంగాణ నుండి బస్తర్ వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వచ్చినట్లుగా రాశారు. ఇక్కడ మొత్తం వివరించడం సాధ్యం కాదు కాని సీతారామయ్య రాసిన 'గెరిల్లా జోన్ పర్‌స్పెక్టివ్" డాక్యుమెంట్ చదివితే ఆ ప్రాంతాన్ని ఎందుకు వెనకతట్టు ప్రాంతంగానూ, విముక్తి ప్రాంతంగానూ ఎంచుకున్నది తెలుస్తుంది.

బస్తర్‌కు గెరిల్లా దళాలను తెలంగాణ సాయుధ పోరాట కాలంలోనే పంపించారు. ఆ విషయం ఈ పుస్తకంలో కూడా ఉంది. అయితే అప్పుడు ఒక స్పాంటేనిటితో పంపించారు. సీతారామయ్య ఒక ప్రణాళిక ప్రకారం పంపించాడు. తెలంగాణ సాయుధ పోరాటం అనుభవం నుండే పంపించాడు. ఇక మరో చోట... సీతారామయ్య పోలీసుల కస్టడి నుండి తప్పించుకుని వచ్చిన సందర్భంలో ఈ పుస్తకంలో ఇలా రాశారు. సత్యమూర్తిగారు ' కె.ఎస్. బయటికి వచ్చేవరకు ఆ బాధ్యతను నిర్వహించి, ఆయన బయటికి రాగానే తిరిగి కె.ఎస్.కు కార్యదర్శి బాధ్యతలు అప్పగించాలనే అవగాహన ఉంది'. కాని అలాంటి అవగాహన ఏది లేదు. కమ్యూనిస్టు పార్టీలలో ఉండదు. నిజానికి సీతారామయ్య బయటికి రాగానే సత్యమూర్తి గారు తను కార్యదర్శిగా తప్పుకుంటానని, సీతారామయ్యను కార్యదర్శిగా ఉండమని కోరినాడు. దీనిని సీతారామయ్య అంగీకరించలేదు. కార్యదర్శి పదవి నా ఆస్తి కాదు. నేను బయటికి రాగానే నాది నాకు ఇచ్చేయడానికి అని చెప్పి ఒప్పుకోలేదు. మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే కాన్ఫరెన్స్‌లలోనే జరుగుతాయనేది కె.ఎస్. అవగాహన. సత్యమూర్తి సంక్షోభం అనేది పార్టీలో తప్పులు సరిదిద్దే క్యాంపేయిన్ నడుస్తున్న క్రమంలో ముందుకు వచ్చింది. పీపుల్స్‌వార్ పార్టీలో తరువాత కూడా ఇటువంటి పరిస్థితి వచ్చింది. శ్యాం (నల్లా ఆదిరెడ్డి) ఆదిలాబాద్ సబ్ జైల్ నుండి తప్పించుకుని వచ్చినప్పుడు కూడా, అప్పుడు కార్యదర్శిగా ఉన్న గణపతి తాను తప్పుకుంటానని శ్యాంను కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొమ్మని కోరినాడు. కాని శ్యాం కూడా సీతారామయ్య లాగానే అంగీకరించ లేదు.

17వ పేజీలో 'ఆ పార్టీ ప్రజా ఉద్యమాలే కేంద్రంగా నడిచిన కాలం ఉంది. తుపాకియే వారి రాజకీయాల పై ఆధిపత్యం వహించిన కాలమూ ఉంది' అని ఉంది. ఒక ఉద్యమం తన లక్ష్యానికి అనుగుణంగా వ్యూహం ఎత్తుగడలు రూపొందించుకుంటుంది. అందులో భాగంగా నిర్మాణ రూపాలు, పోరాట రూపాలు మారుతూ ఉంటాయి. ఇటువంటి మార్పులను రాజకీయాల మీద తుపాకి ఆధిపత్యం అనుకోవడం అంటే ఆ పార్టీ వ్యూహం ఎత్తుగడల గురించిన అవగాహన లేకపోవడమే. 59వ పేజీలో 'అయితే చారుమజుందార్ ప్రతిపాదిస్తున్న వర్గ శత్రు నిర్మూలన పంథాతో విభేదిస్తూ కేవలం 5 నెలల కాలంలోనే అఖిల భారత కమిటీ నుండి తరిమెల నాగిరెడ్డి వర్గం వైదొలగింది'. అని ఉంది.

నిజానికి విభేదించే విషయాలలో ఎన్నికలలో పాల్గొనడమా లేదా లాంటి మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. అయితే వారు వైదొలగ లేదు. వారిని చారుమజుందార్ వర్గమే కమిటీ నుండి తీసివేసింది. పీపుల్స్‌వార్ నాయకులలో కొందరికి, ఇలా చేయకుండా ఉండాల్సింది అనే అభిప్రాయం కుడా ఉంది. 79వ పేజీలో సిఓసి నిర్మాణంలో ఎవరెవరు ఉన్నది రాస్తూ యుపికి చెందిన శివకుమార్ మిశ్రా సిఓసిలో ఉన్నట్లుగా రాశారు. ఒకసారి చెక్ చేసుకోవాలి. అదే సమయంలో అసలు రాంనాథ్ పేరు పేర్కొనలేదు. సిఓసిలో రాంనాథ్ గారు ఉన్నారు. ఎన్నికలు ఎత్తుగడలా, వ్యూహమా అని చర్చ చేసి, మిగతావారు వ్యూహం అంటే ఆ సాకుతో సిఓసి నుండి బయటికి వెళ్లాలని చూశాదని కె.ఎస్. రాశాడు. అయితే సీతారామయ్య ఎన్నికలు ఎత్తుగడల విషయమే అని చెప్పినా రాంనాథ్ గారు సిఓసి నుండి వెళ్లిపోయారు. తరువాత ఈయన కమ్యూనిస్టు లీగ్ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు లెనినిస్టు) అనే పార్టీని 1978లో నిర్మించాడు. 60వ పేజీలో 'గుత్తికొండ బిలం సమావేశానికి ముందే నేరుగా చారుమజుందార్‌ను కలవడానికి (కొల్లిపర) వెళ్లాడు. కొండపల్లిని కలవమని చారుమజుందార్ సలహా ఇవ్వడంతో వరంగల్‌లో ఆయనను కలిశాడు' అని ఉంది. కాని గుత్తికొండ బిలం సమావేశం తరువాతనే కొండపల్లి సీతారామయ్యను పార్టీలోకి తీసుకున్నట్లుగా ఈ పుస్తకంలోనే ఉంది. 104వ పేజీలో 'క్లాస్ జరుగుతున్న రోజే ఓంకార్ మనుషులు జన్ను చిన్నాలును చంపేశారని వార్త వచ్చింది'. అని ఉంది. కాని జన్ను చిన్నాలును వై.ఎస్. మూర్తి మనుషులు చంపారు.

అనురాధ గారు ముందుమాటలో ఈ పుస్తకానికి ఉన్న పరిమితుల గురించి, భవిష్యత్తు ఆశ గురించి స్పష్టంగానూ, సరిగ్గానూ రాశారు. 'పార్టీ స్థాపనలో, విస్తృతిలో ప్రధాన భూమిక పోషించిన ఆయన చరిత్రను సహచర ఉద్యమకారులు రాసి ఉంటే దానికి ఒక సమగ్రత వచ్చిఉండేది'. 'ఆయన చరిత్ర రేఖా మాత్రంగానైనా సరే అందరికి తెలియాలన్న తలంపే నన్ను ఈ పనికి పూనుకునేలా చేసింది'. 'నిజానికి నాకు ఆ సామర్థ్యం కూడా లేదు. అయితే ఆయనతో ఉన్న బాంధవ్యం, ఆయన నిర్మించిన ఉద్యమంలో కొంత కాలం పాల్గొన్న అనుభవమే నాకున్న ఏకైక అర్హత'. 'అలాగే ఇది సమగ్రమైన చరిత్ర అని కూడా నేను భావించడం లేదు. ఎందుకంటే అందుబాటులో ఉన్న కొంత మంది ఉద్యమ కార్యకర్తల జ్ఞాపకాల ఆధారంగా మాత్రమే నేను దీన్ని పేర్చాల్సి వచ్చింది'. 'ఎక్కడో ఒక దగ్గర మొదలు పెడితే భవిష్యత్తులో ఈ చరిత్రకు మరింత సమగ్రత చేకూర్చే పనిని ఎవరో ఒకరు చేపడతారనే నమ్మకం నాకుంది'.

అనురాధ గారి ఈ ముందు మాట నేపథ్యంలోనే ఈ పుస్తకాన్ని ఈ పుస్తకం చివరలో అనుబంధంగా సీతారామయ్య తన కూతురు కరుణకు రాసిన లేఖలు, ఇతర వ్యాసాలు కూడా ఉన్నాయి. ఇందులో సీతారామయ్య రాసిన 'ప్రజానాట్య మండలి జ్ఞాపకాలు' అనే వ్యాసం వామపక్షాల వారందరు తప్పకుండా చదవాల్సిన వ్యాసం. ఈ పుస్తకంతో పాటు కొండపల్లి కోటేశ్వరమ్మ రాసిన 'నిర్జన వారధి' అనే పుస్తకాన్ని చదివితే సీతారామయ్య జీవితం గురించి మరికొంత ఎక్కువగా తెలుసుకోవచ్చు. కాని సీతారామయ్యతో పాటు ఉద్యమంలో పాల్గొన్న వారు లేదా ఇప్పుడు ఆ ఉద్యమంలో ఉన్నవారు కాని సీతారామయ్య జీవిత చరిత్రను నిష్పక్షపాతంగా రాసినప్పుడే, సీతారామయ్య జీవిత చరిత్రను సమగ్రంగా తెలుసుకో గలుగుతాం. అర్థం చేసుకోగలం. ఏది ఏమైనా అనురాధ గారి ఈ ప్రయత్నం అభినందనీయం.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

ఉపాధి కల్పించాలని భూ నిర్వాసితుల ఆందోళన

ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని భూ నిర్వాసితులు కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ ఎదుట మే 4న ఆందోళన చేపట్టారు. దుబ్బగూడెం శివారులోని కళ్యాణి ఖని ఓపెన్‌కాస్ట్‌లో భూములు కోల్పోయి 5 ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎలాంటి ఉపాధి కల్పించలేదు. దాంతో సోమగూడెం(కె) గ్రామస్థులు ఓపెన్‌కాస్ట్‌కు చెందిన లారీలను అడ్డుకొని బైటాయించి నిరసన తెలిపారు. రేపు మాపంటూ.. ఏదో ఒక సాకు చెపుతూ స్థానికులను మోసంచేస్తూ భూ నిర్వాసితులకు ఉపాధి చూపకుండా స్థానికేతరులకు ఉపాధి కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నిరుద్యోగ, భూ నిర్వాసితులకు వెంటనే ఉపాధి కల్పించాలిని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దళితుల భూములు కబ్జా చేసిన అధికార పక్షం నేతలు

దళితుల భూములను కబ్జాచేసి అడిగినందుకు దళిత మహిళలపై దాడి చేసిన వారిని ఇప్పటికీ అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ పార్టీకి చెందిన అగ్రవర్ణాల వారు తమ భూములను కబ్జా చేసి పట్టాలు చేసుకున్నారని, వాటిని తిరిగి తమకే పట్టాలు చేయాలని నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం దత్తాపూర్ దళితులు డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం గత 73 రోజులుగా ఆందోళన చేపడుతున్నా, స్థానిక ఎంఎల్ఏ గానీ, కలెక్టర్ గానీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారి చిత్రపటాలకు మే 11న పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు దత్తాపూర్ దళితులకు చెందిన 496, 494 సర్వే నెంబర్‌లో గల భూమిని టిఆర్ఎస్ నాయకులు అక్రమంగా చేసుకున్న పట్టాలను రద్దుచేసి బాధితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాలమూరు నిర్వాసితుల ఆందోళన

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇందులో భాగంగా నిర్మిస్తున్న జలాశయం పూర్తి కావొచ్చింది. నిర్వాసితులకు ఇంకా పరిహారం అందలేదు. దీంతో ఆగ్రహించిన వారంతా ఆందోళనకు దిగారు. ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో మే 16న జరిగింది. ఎల్లూరు సమీపంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద అనేక మంది భూములు కోల్పోయి పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు టిప్పర్లను అడ్డుకున్నారు. పరిహారం ఇచ్చేంతవరకు పనులు కొనసాగనివ్వమన్నారు. అంజనగిరి జలాశయం పనులు పూర్తయ్యే దశకు వచ్చినా, పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌ఆర్ పథకం పరిహారంతో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో కొనసాగుతున్న లాక్‌డౌన్

కరోనా రెండో దశ తీవ్రంగా ఉండడంతో నియంత్రణ కోసం మొదట రాత్రి పూట కర్ఫ్యూ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మే 12 ఉదయం 10 గంటల నుంచి లాక్‌డౌన్ విధించింది. ఇది మే 21 వరకు అమల్లో ఉంటుందని ప్రకటించింది. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు వెసులుబాటు ఆ సమయంలో మెట్రో, ఆర్‌టిసి బస్సులు నడపవచ్చు. సినిమాహాళ్ళు, క్లబ్బులు, జిమ్‌లు, పార్కులు, ఈత కొలనులు, క్రీడా మైదానాల మూసివేతకు నిర్ణయించింది. సాగు, ఉపాధి, ధాన్యం కొనుగోళ్లు, బ్యాంకులు, ఎటిఎంలు, రేషన్ షాపులు యథాతథంగా నడపవచ్చు. 33 శాతం సిబ్బందితో ప్రభుత్వ ఆఫీసులు పనిచేస్తాయి. అంతర్‌రాష్ట్ర, ప్రైవేట్ బస్సుల రాకపోకలపై నిషేధం విదించారు. కరోనా కేసులు పెరుగుతున్నందువల్ల అమల్లో ఉన్న లాక్‌డౌన్‌ను జూన్ 9 వరకు పొడ ముఖ్యమంత్రి మే 30న ఉత్తర్వులు జారీచేశారు.

ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' స్ఫూర్తిగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు ఎపి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి తెలిపారు. మే 20న ఒక్క రోజు అసెంబ్లీలో 2021-2022 వార్షిక బడ్జెట్‌ను ఆయన సభకు సమర్పించారు. మొత్తం రు. 2,29,77,927 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రంగాల వారిగా కేటాయింపుల వివరాలు వైఎస్ఆర్ రైతు భరోసా ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా ఈ ఏడాది రు. 7400 కోట్లు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. పేదలకు ఉచిత వైద్యంకోసం రు. 2258 కోట్లు కేటాయించారు. కరోనా నివారణకు రు. 2246 కోట్లు ఖర్చు చేశామన్నారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కోసం ఈ ఏడాదికి రు. 13,830 కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రు. 18580 కోట్లు, పట్టణాభివృద్ధికి రు. 8727 కోట్లు కేటాయిస్తున్నామన్నారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె

తెలంగాణలో జూనియర్ డాక్టర్లు మత డిమాండ్లు పరిష్కరించాలంటూ మే 26న సమ్మెకు దిగారు. ఎమర్జెన్సీ సేవలు మినహా కరోనాయేతర విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా మెడికల్ కాలేజీ, ఉస్మానియా ఆస్పత్రి, టిమ్స్, ఎంఎన్‌జె, నిలోఫర్, కింగ్‌కోఠి, ఎర్రగడ్డలోని ఛాతీ ఆస్పత్రుల్లో జూనియర్ డాక్టర్లు సమ్మె నిర్వహించారు. ఉపకార వేతనాల పెంపును 2020 నుంచి అమలు చేయాలని, విధుల్లో ఉండి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కరోనా బారిన పడిన సిబ్బంది కుటుంబ సభ్యులకు నిమ్స్‌లో ఉచితంగా వైద్యం అందించాలని, 15 శాతం వేతన పెంపు, కొవిడ్ సేవలకు 15 శాతం ఇన్సెంటివ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే మే 27 నుంచి అత్యవసర సేవలను కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకూ పోరాటం ఆగదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ కార్మిక, ప్రజాసంఘాల అధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు మే 26 నాటికి 55 రోజులకు చేరినవి. కార్మిక నాయకులు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కరోనా క్లిష్ట సమయంలో స్టీల్‌ప్లాంట్ ఆక్సిజన్ అందించి బాధితులను ఆదుకుంటోందని, ప్రభుత్వ రంగంలో ఈ పరిశ్రమ ఉన్నందునే ఇది సాధ్యమైందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో కూర్మన్నపాలెంలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 104వ రోజుకు చేరుకున్నాయి.

నెల్లిమర్ల జూట్‌మిల్లు లాకౌట్

విజయనగరం జిల్లా నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించి కార్మికులకు ఉపాధి లేకుండా చేసింది. మే 27న జూట్‌మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటిస్తూ నోటీస్ ఇచ్చింది. ముడి సరుకు కొరత, అమ్మకాలు జరగకపోవడం తదితర కారణాల వల్ల మిల్లును లాకౌట్ చేస్తున్నట్లు యాజమాన్యం నోటీసులో పేర్కొంది. యాజమాన్యం గత రెండు నెలలుగా సి-షిఫ్ట్‌ను ఎత్తివేసి వారానికి ఒక్కొక్క కార్మికుడికి మూడు నుంచి నాలుగు రోజులు పని కల్పించింది. అంతంత మాత్రంగా పని కల్పిస్తున్న యాజమాన్యం ఎటువంటి సమాచారం లేకుండా లాకౌట్ ప్రకటించడంతో సుమారు రెండు వేల మంది కార్మికులు రోడ్డునపడ్డారు. వీ

సిఆర్‌పిఎఫ్ క్యాంపు ఎత్తివేయాలన్నందుకు ఆదివాసుల కాల్చివేత

సుక్మా-బీజాపూర్ సరిహద్దులోని సిల్గేర్ సిఆర్‌పిఎఫ్ క్యాంప్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చుట్టుపక్కల సుమారు 25 గ్రామాలకు చెందిన 5,000 మందికి పైగా ఆదివాసులు మూడు రోజులుగా నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల బెదిరింపులతో మే 16న రాత్రి వెనక్కి వెళ్లి మే 17న మళ్లీ శిబిరానికి వచ్చి ధర్నా ప్రారంభించారు. ధర్నా శిబిరంపై పోలీసులు కాల్పులు జరపడంతో ముగ్గురు ఆదివాసీలు మృతి చెందారని పోలీసులు తెలిపారు. 16 మందికి పైగా గిరిజనులు గాయపడ్డారన్నారు. ఘటనలో పోలీసులే ఆదివాసీలపై కాల్పులు జరిపి మావోయిస్టులు ఉన్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని పమీడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోటలాపూర్ - పాలగూడెం గ్రామాల మధ్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏప్రిల్ 19న తెల్లవారుజామున 3 గంటలకు, ఆకాశం నుండి డ్రోన్ల ద్వారా బాంబు దాడులను చేశాయని ఈ దాడులు ఆపివేయాలని ఆదివాసీలు నిరసన తెలిపారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

మార్చ్ 27 నుండి ఏప్రిల్ 29 వరకు సాగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు మే 2న వెల్లడయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో మొత్తం 294 స్థానాలకు తృణమూల్ కాంగ్రెస్ 215 స్థానాలతో పూర్తి మెజారిటీ సాధించి ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ బాధ్యతలు చేపట్టారు. కేరళలో మొత్తం 140 స్థానాలకు ఎల్‌డిఎఫ్ కూటమి 99 స్థానాలతో మెజారిటీ సాధించి సిపిఎం నేత పినరయి విజయన్ రెండవసారి ముఖ్యమంత్రిగా మే 21న ప్రమాణ స్వీకారం చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు డిఎంకె-కాంగ్రెస్ కూటమి 157 స్థానాల్లో నెగ్గి పూర్తి మెజారిటీ సాధించి డిఎంకె అభ్యర్థి స్టాలిన్ 17వ ముఖ్యమంత్రిగా మే 7న గవర్నర్ భన్వరీలాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. అసోంలోని మొత్తం 126 స్థానాలకు ఈశాన్య రాష్ట్రాల డెమోక్రటిక్ కూటమి 75 స్థానాలతో పూర్తి మెజారిటీ సాధించి హిమంత బిశ్వ శర్మ ముఖ్యమంత్రిగా మే 10న బాధ్యతలు చేపట్టారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి మొత్తం 30 స్థానాల్లో బిజెపి కూటమి 16 స్థానాలతో పూర్తి మెజారిటీ సాధించి ఎన్. రంగస్వామిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు.

ఛత్తీస్‌గఢ్, గడ్చిరోలి, అసోంలలో ఎన్‌కౌంటర్లు

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కుట్రూ పరిధిలోని అటవీ ప్రాంతంలో మే 17న మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లలో ఒకరు మావోయిస్టులు అమర్చిన ఐఇడి పేలి ఒక జవాను మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు మృతిచెందగా అందులో ఏడుగురు మహిళలున్నారని గడ్చిరోలి డిప్యూటి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సందీప్ పాటిల్ తెలిపారు. ఈ ఘటన గడ్చిరోలి జిల్లా ఏటపల్లి డివిజన్‌లోని కొటామి-పాయెడి ఆర్మ్‌డ్ అవుట్ పోస్టు అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబిగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురు కాల్పులు జరిగాయని అందులో మావోయిస్టులు మృతిచెందారని పోలీసు అధికారి తెలిపారు. అసోంలో మే 23న నాగాలాండ్ సరిహద్దుల్లోని పశ్చిమ కర్బి అంగ్‌లాండ్ జిల్లాలో దిమాసా నేషనల్ లిబరేషన్ ఆర్మి మిలిటెంట్లకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన కాల్పుల్లో 8 మంది దిమాసా మిలిటెంట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

'తౌక్తే' తుఫాను విధ్వంసం

కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లోను పెను తుఫాను 'తౌక్తే' సృష్టించిన విధ్వంసం లెక్కకు అందనిది. ఇళ్లు, రహదారులు, వ్యవసాయ పంటలు ధ్వంసమయ్యాయి. పడమటి తీర రాష్ట్రాలను ఈ తుఫాను వణికించింది. విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినడం వల్ల కోవిడ్ ఆస్పత్రుల్లో చికిత్సకు ఆటంకం ఏర్పడింది. తౌక్తే తుఫాను ప్రారంభమైన మూడు, నాలుగు రోజుల్లోనే తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. మే 16, 17 కేరళ నుంచి గుజరాత్ వరకు ఉన్న రాష్ట్రాలను చుట్టుముట్టి పదుల సంఖ్యలోను, పరోక్షంగా వందల మందిని బలితీసుకున్న ఈ తుఫాను కోట్లాది రూపాయల నష్టాన్ని కలగజేయడమే కాక, లక్షల మందిని నిరాశ్రయులను చేసింది. గత ఐదేళ్లలో తుఫానుల సంఖ్య 30 శాతం హెచ్చిందని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

మోదీ.. దిగిపోండి! అరుంధతీ రాయ్

'మోదీ మాకు ఊపిరాడదం లేదు. ప్రాణాలు కొడిగట్టి పోతున్నాయి. సహాయం అవసరమైన సమయంలో వ్యవస్థలేమీ పనిచేయడం లేదు. దయచేసి ఇక దిగిపోండి, కనీసం తాత్కాలికంగానైనా' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి ఆంగ్ల వెబ్‌సైట్‌లో ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ విజ్ఞప్తిని లేఖ రూపంలో రాశారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడం నీ చేతుల్లో లేదు. ఇంత భయానకమైన ఉత్పాతం నెలకొన్న సమయంలోనే ఎదుటివారి నుంచి ప్రశ్నను స్వీకరించలేని ప్రధాని ఉన్నప్పుడు వైరస్ మరింతగా పెరుగుతుంది. మీరు ఇప్పుడు దిగకపోతే మాలో లక్షలాది మంది అనవసరంగా చనిపోతాం. అందువల్ల దిగిపోండి. మీ స్థానాన్ని తీసుకోవడానికి మీ పార్టీలోనే చాలా మంది ఉన్నారు. మీ అసమర్థత, ఇతర దేశాలు మన దేశ వ్యవహారాలలో జోక్యం చేసుకునేందుకు ఒక సాధికార కారణమవుతున్నది. మనం కష్టించి సాధించుకున్న సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతుంది. కనుక దిగిపోండి.

స్టాన్ స్వామికి మధ్యంతర బెయిల్‌కు నిరాకరించిన కోర్టు

ఎనిమిది నెలలుగా తన ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణించిందని ఎల్గార్-పరిషద్ కేసులో అరెస్టై తలోజా జైలులో చికిత్స పొందుతున్న స్టాన్ స్వామి ముంబై కోర్టుకు మే 21న తెలిపారు. ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జస్టిస్ ఎస్‌జె కతావల్లా, ఎస్‌పి తవడే ధర్మాసనం ఎదుట అధికారులు హాజరుపరిచారు. ముంబై జెజె ఆసుపత్రి మెడికల్ నివేదికలను సమర్పించారు. ఈ నివేదికలను కోర్టు పరిశీలించి ఆయన రెండు చెవులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వినికిడి లోపంతో బాధపడుతున్నారని, ఆయన అవయవాలు దెబ్బతిన్నాయని ఉంది. జైలుకు వచ్చాకనే నా అవయవాలు పనిచేయడం మానేశాయి అని స్టాన్‌స్వామి తెలిపారు. ఇప్పుడు నాకు ఒకరి సహాయం లేకుండా ఏ పని చేసుకోలేకపోతున్నానన్నారు. తాను ఆసుపత్రిలో ఉండనని రాంచీలో తన స్నేహితులతో ఉండేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరగా కోర్టు నిరాకరించింది.

సెంట్రల్ విస్టాను తక్షణం ఆపాలి

దేశంలో కరోనా మహమ్మారి కల్లోలం సృష్టిస్తున్న సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో తలపెట్టిన సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ నిర్మాణ పనులను తక్షణం నిలుపు చేయాలని పలు దేశీయ, అంతర్జాతీయ యూనివర్సిటీల అధ్యాపకులు, చరిత్రకారులు, కళాకారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మే 21న ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్ట్ పనులను నిలిపివేసి కారోనాపై సమర్థవంతమైన పోరు చేసేందుకు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్ట్ పనులను కొనసాగించడం కార్మికుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుందని పేర్కొన్నారు.

మే 26న బ్లాక్ డేగా పాటించిన రైతులు

మూడు కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న ఆందోళనకు ఆరు నెలలు అవుతున్న సందర్భంగా మే 26న బ్లాక్ డేగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు రైతులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తమ డిమాండ్ల పట్ల మోడీ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఇండ్లపైన, కార్యాలయాలపైన, వాహనాలకు నల్ల జెండాలు కట్టి ఎగురవేశారు. సింఘు బోర్డర్‌తోపాటు ఘాజీపూర్, తిక్రి, పంజాబ్, హర్యానాల్లో గ్రామాల్లో ఇల్లపై నల్ల జెండాలు ఎగురవేశారు. చట్టాలను రద్దు చేసేంతవరకు ఢిల్లీ సరిహద్దుల నుంచి వెళ్లేదిలేదని తేల్చిచెప్పారు. వీ

ఫ్రాన్స్‌లో మే డే నిరసనలు

సామాజిక, ఆర్థిక న్యాయం కోసం ఫ్రాన్స్‌లో కార్మికులు మే 1 కార్మిక దినోత్సవం సందర్భంగా పారిస్ సహా పలు నగరాలు నిరసన ర్యాలీలు చేపట్టారు. కొవిడ్ – 19 నిబంధనలు పాటిస్తూ దేశవ్యాప్తంగా పారిస్, లియాన్, నాంటెస్, లిల్లి, టోలోయూస్ నగరాల్లో మూడు వందలకు పైగా నిరసన ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా మెక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేశారు. నిరుద్యోగ ప్రయోజనాల్లో ప్రభుత్వం మార్పులు చేయడాన్ని వ్యతిరేకించారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని, 'న్యూ సెక్యూరిటీ బిల్లు'ను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

మాలీలో అధికారంలోకి వచ్చిన తిరుగుబాటు నేత

మాలి తాత్కాలిక ఉపాధ్యక్షుడు కల్నల్ అస్సిమా గొయిటా అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. మాజీ తిరుగుబాటు నేతగా ఉన్న గోయిటా తన తిరుగుబాటుతో అధ్యక్షుడిని అరెస్టు చేసిన తరువాత ప్రస్తుతం ప్రధాని, అధ్యక్షుడు కొత్త ప్రభుత్వం ఏర్పాటులో తనను సంప్రదించడంలో విఫలం అయినందున అధికారం తన చేతుల్లోనే ఉంటుందని ప్రకటించారు. వచ్చే ఏడాది ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామిక ప్రభుత్వ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. అధ్యక్షుడు బా ఎన్‌డా, ప్రధాని మోక్టార్ ఒవానేలను అరెస్టు చేసి రాజధాని వెలుపల ఒక మిలిటరీ బేస్‌కు తరలించారు. ఇద్దరు సహచర తిరుగుబాటు నాయకులను కూడా వారి ప్రభుత్వ పదవుల నుంచి తొలగించారు.

మాస్కోలో కాల్పులు 9 మంది విద్యార్థులు మృతి

టాటర్‌స్తాన్ రిపబ్లిక్ రాజధాని కజన్‌లో ఒక పాఠశాలలో మే 11న ఉదయం జరిగిన కాల్పుల్లో తొమ్మిది మంది మరణించగా 16 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8వ తరగతి చదువుతున్న పిల్లలను, ఒక టీచర్‌ను కోల్పోయామని టాటర్‌స్తాన్ అధ్యక్షుడు రుస్తుం మిన్నిఖనొవ్ మీడియాకు తెలిపారు. కాల్పులకు ఒడిగట్టింది 19 ఏళ్ల యువకుడని మిగిలిన వారిని ఎవరిని గుర్తించలేదని తెలిపారు.

కొలంబియాలో పెల్లుబికిన ప్రజాగ్రహం

కొలంబియాలో ఇవాన్ డ్యూక్ ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. ఎక్కడికక్కడ ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించినప్పటికీ ఏ మాత్రం లెక్కచేయకుండా దేశ వ్యాపిత బంద్‌కు దిగారు. ఈ సందర్భంగా ఆందోళనకారులపై పోలీసులు క్రూరమైన నిర్బంధకాండకు దిగారు. ఈ దాడులను కొలంబియా సామాజిక, పౌర సంస్థలు తీవ్రంగా ఖండించాయి. పోలీసులు అణచివేత చర్యలు మానుకొని ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సంస్థలు గొంతెత్తాయి. నిరసన సందర్భంగా దాదాపు 24 చోట్ల దాడులు జరిగాయని ఈ ప్రదర్శనల్లో 11 మంది చనిపోయారని అటార్నీ జనరల్ కార్యాలయం తెలిపింది.

చైనా-ఇయు ఒప్పందం నిలిపివేత

చైనా–ఇయు సమగ్ర పెట్టుబడుల ఒప్పందాన్ని (సిఎఐ) స్తంభింపజేస్తూ యురోపియన్ పార్లమెంట్ మే 20న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ చర్య వల్ల ఇయుకు ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి చైనా, రష్యాలను వేరు చేసి, దాని ఆర్థిక ఎదుగుదలను అడ్డుకోవడానికి ఇటీవల లండన్‌లో జరిగిన జి–7 విదేశాంగ మంత్రుల సమావేశం నిర్ణయించింది. 2028 నాటికి చైనా అమెరికాను దాటి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నదని ఐఎంఎఫ్ వంటి సంస్థలు ప్రకటించడంతో చైనాను ఆర్థికంగా ఎదగనీయకుండా చేయాలని అమెరికా ప్రయత్నిస్తోంది. జి–7, నాటో కూటమిలోని సభ్య దేశాలపై మరీ ముఖ్యంగా యూరోపియన్ దేశాలపై అది ఒత్తిడి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇయు పార్లమెంట్ చైనా పెట్టుబడుల ఒప్పందం నిలిపివేత నిర్ణయం తీసుకుంది.

నేపాల్ పార్లమెంట్ రద్దు

నేపాల్ పార్లమెంట్ మే 22న రద్దయింది. అయిదు నెలల కాలంలో పార్లమెంట్ రద్దు కావడం ఇది రెండోసారి. మే 21 అర్ధరాత్రి తరువాత దేశ అధ్యక్షురాలు విదాదేవి భండారి పార్లమెంట్‌ను రద్దుచేసి నవంబర్ 12, 19 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మే 21తో ముగిసిన నిర్దేశిత గడువులోగా ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత మెజార్టీ తమకు ఉన్నట్లు తాత్కాలిక ప్రధాని కెపి శర్మ ఓలి, ప్రతిపక్ష నేపాల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేర్ బహదూర్ దూబా నిరూపించుకోలేదని, అందువల్లనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. విద్యాదేవి ప్రకటనపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. అధ్యక్షురాలిగా ఆమెకు అటువంటి అధికారం లేదని, అధ్యక్షునికి రాజ్యాంగం నామమాత్రపు అధికారాలు మాత్రమే ఇచ్చిందని వారు పేర్కొన్నారు.

గాజాపై దాడులకు వ్యతిరేకంగా కెనడాలో నిరసన

గాజాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా యూదు యుద్ధ వ్యతిరేక కార్యకర్తలు కెనడాలో వినూత్నరీతిలో నిరసన తెలిపారు. టొరంటోలోని ఇజ్రాయిల్ కాన్సులేట్ కార్యాలయం మెట్లకు ఎరుపు రంగు పెయింట్ వేశారు. ఇజ్రాయిల్ చేతులకు రక్తమంటిందన్న భావనకు గుర్తుగా ఇలా చేసినట్లు వారు తెలిపారు. ఇండిపెండెంట్ జూయిష్ వాయిసెస్ (ఐజెవి) సభ్యులు, వరల్డ్ బియాండ్ వార్, ఇతర శాంతి కార్యకర్తలు మే 21న ఇజ్రాయిల్ కాన్సులేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇజ్రాయిల్ చేతులకు నెత్తురు అంటిందని, అందువల్లనే ఆ కార్యాలయం తలుపు నుండి రక్తం మెట్ల మీదకు ప్రవహించిందనడానికి ప్రతీకగా ఇలా పెయింట్ వేశామని ఐజెవి సభ్యుడు రబ్బి డేవిడ్ తెలిపారు.

అమెరికాలో కాల్పులు - ఐదుగురి మృతి

అమెరికాలోని ఒహాయోలోని యాంగ్‌స్టౌన్‌లో టార్చ్ క్లబ్ బార్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరుపడంతో ముగ్గురు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మే 23న రాత్రి న్యూజెర్సీలో ఓ పార్టీలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా 12 మంది గాయాలపాలయ్యారు.

గాజాలో కాల్పుల విరమణ

గాజాలో కాల్పుల విరమణకు ఇజ్రాయిల్, హమస్ అంగీకరించాయి. ఈ మేరకు మే 20న ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదం తెలియజేయగా, హమస్ సీనియర్ అధికారి దీనిని ధ్రువీకరించారు. ఇది పరస్పర ఆమోదయోగ్యమైన, ఏకకాల ఒప్పందంగా పేర్కొన్నారు. మే 21 మధ్యాహ్నం 2 గంటల నుండి కాల్పుల విరమణ అమల్లో వచ్చింది. గాజాలో 11 రోజుల పాటు జరిగిన హింసాత్మక దాడుల తరువాత ఈ ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయంగా ఈ ఒప్పందాన్ని అందరూ స్వాగతించారు. ఇప్పటివరకు జరిగిన పరస్పర దాడుల్లో 232 మంది పాలస్తీనియన్లు, 12 మంది ఇజ్రాయిలీలు మరణించారు. 2014 తరువాత ఇంత స్థాయిలో హింస జరగడం ఇదే. ఈజిప్ట్ చొరవతో కుదిరిన ఈ ఒప్పందాన్ని ఏకగ్రీవంగా ఇజ్రాయిల్ మంత్రివర్గం ఆమోదించింది. పాలస్తీనా గ్రూపులు హమాస్, ఇస్లామిక్ జిహాద్‌లు కూడా ధృవీకరిస్తూ ప్రకటన జారీ చేశాయి. వీ

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 236 - June 2021 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/05/2021 • Postal Regn. No. HD/1100/2020-22

వీక్షణంను ఆదుకోండి

నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక పద్దెనిమిది సంవత్సరాలుగా తెలుగు సమాజానికి చేస్తున్న సేవ మీకు తెలుసు. విద్యావంతులలో, బుద్ధిజీవులలో, సామాజిక కార్యకర్తలలో ఈ పత్రికకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయత, వారి మేధో, ఆలోచనా అవసరాలకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడడం మీరు చూస్తూనే ఉన్నారు. అయితే ఇంతటి ఆదరాభిమానాలు సంపాదించుకున్నప్పటికీ వీక్షణం ఆర్థిక పరిస్థితి ఎన్నడూ ఈ విశేష జనాదరణకు తగినట్టుగా లేదు. వీక్షణం పాఠకులకు, అభిమానులకు, ఉపయోగించుకునేవారికి వీక్షణంకు సహాయం చేసేంత ఆర్థిక స్తోమత లేదు. ఎందరో తమకు తోచిన, చేయగలిగిన సహాయం చేస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. వ్యవసాయాదాయం తప్ప మరే ఆదాయవనరూ లేని డెబ్బై సంవత్సరాలు దాటిన వృద్ధ దంపతులు, రోజుకూలీ చేసుకునే శ్రామికులు, ఎనబయవ పడిలో పెన్షన్ మీద మాత్రమే బతుకుతున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు వంటి వారెందరో ఇబ్బందులు పడుతూ కూడా వీక్షణంకు విరాళం ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆ ఆదరాభిమానాలకు మా కళ్లు చెమరుస్తున్నాయి. అటువంటి వందలాది మంది చేస్తున్న చిన్న చిన్న సహాయాలే వీక్షణం ఎప్పటికప్పుడు ఆగిపోకుండా కాపాడుతున్నాయి. సాలీనా ఐదు లక్షల రూపాయల లోటుతో, ఎప్పటికప్పుడు అప్పు చేస్తూ, ఏడాదికొకసారి దాతల దగ్గరికి వెళ్లి ఆ అప్పు తీర్చే మార్గాలు వెతుకుతూ వీక్షణం నడుపుతూ వస్తున్నాం. ఇలా దినదిన గండంగా ఎన్నాళ్లు బండి లాగగలమో తెలియదు. చందాలు, విరాళాలతో పాటు సొంత ప్రచురణల అమ్మకాలు, ఇతర ప్రచురణల అమ్మకాలపై కమిషన్లతో బండి నడుస్తూ ఉండేది. గోరుచుట్టుపై రోకటిపోటు లాగ కొవిడ్ లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచీ చందాల పునరుద్ధరణ ఆగిపోయింది. కొత్త చందాలు రావడం తగ్గిపోయింది. పుస్తకాల అమ్మకాలు దాదాపుగా ఆగిపోయాయి. విరాళాల ధార ఎండాకాలపు వాగులాగ పల్చబడుతున్నది. అందువల్ల మరొకసారి అభిమానులకూ, పాఠకులకూ, దాతలకూ సవినయ విజ్ఞప్తి చేయక తప్పడం లేదు. ఇప్పుడున్న స్థితి యథాతథంగా కొనసాగితే వీక్షణంను ఇంక ఎక్కువ కాలం నడపడం సాధ్యం కాదు. పద్దెనిమిది సంవత్సరాలుగా దృఢంగా ప్రజల పక్షాన నిలిచిన అతి తక్కువ పత్రికలలో వీక్షణం ఒకటి. దేశంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్న ఆధిపత్య సంస్కృతిలో, ప్రశ్నించే గొంతులను, ప్రజా స్వరాలను మూసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో వీక్షణంను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం అయినందువల్ల ఐఎఫ్ఎస్‌సి నంబర్ మారింది.

ఇక నుంచి అకౌంట్ నెంబర్ – **013911011002175**

యూనియన్ బ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి నం **UBIN0801399**

ఈ అకౌంట్ నంబర్‌తో ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు
గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల ద్వారా కూడా చెల్లించవచ్చు.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao